
అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
గురువారం 06-02-2025 సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 11 సంచిక : 37 Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar 14 పేజీలు వెల : 6.50



వామపక్ష వేదిక ఏర్పాటుకు కృషిచేస్తాం

ప్రజాఉద్యమాలతో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతాం

స్థానిక ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ | వామపక్ష పార్టీలున్న చోట పరస్పర సహకారం | మోడీ సర్కార్‌ది ముమ్మాటికీ పేదల వ్యతిరేక బడ్జెట్

ఉచిత విద్య, వైద్యాన్ని మేం కోరుకుంటుంటే వాళ్లు కార్పొరేటీకరిస్తున్నారు

ధనం, మద్యం ప్రలోభ రాజకీయాలను తిప్పికొడతాం : టీడబ్ల్యూజేఎఫ్, హెచ్‌యూజే మీట్ ది మీడియాలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

వివరాలు 3వ పేజీ

ప్రజల్లో రాజకీయ చైతన్యం తీసుకొస్తాం



ఢిల్లీ కింగ్ ఎవరు..?

- అసెంబ్లీ ఎన్నికల్లో 57.70 శాతం పోలింగ్
- ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ప్రధాన పార్టీలన్నీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సాయంత్రం 5 గంటల వరకూ 57.70 శాతం పోలింగ్ నమోదైనట్టు అధికారులు వెల్లడించారు. ఈశాన్య ఢిల్లీలో అత్యధికంగా ...13లో



హెచ్1బీ ఆటోరెన్యూవల్ రద్దు?

- తీర్మానం పెట్టిన రిపబ్లికన్ సెనెటర్లు
- భారతీయులపైనే అధిక ప్రభావం

ఆ దిశగా ట్రంప్ చర్యలు

శ్వేతసౌధం: హెచ్-1బీ, ఎల్ 1 వంటి వర్క్ వీసాల పొడిగింపును ట్రంప్ సర్కార్ త్వరలో రద్దు చేసే అవకాశం వుంది. అమెరికాలో ఉద్యోగాలు చేసుకోవడానికి అవకాశం కల్పించే ఈ వీసాల ఆటోమేటిక్ రెన్యువల్ కాలాన్ని అప్పటికి వున్న 180 రోజుల నుంచి 540 రోజులకు పెంచుతూ బైడెన్ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఆ నిర్ణయాన్ని రద్దు చేయాలని కోరుతూ ఇద్దరు రిపబ్లికన్ సెనెటర్లు తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఇమ్మిగ్రేషన్‌పై, కఠినమైన వర్క్ వీసా నిబంధనలపై ట్రంప్ సర్కార్ తీవ్రమైన చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో బైడెన్ కాలం నాటి ఈ నిర్ణయాన్ని రద్దు చేయాలని సెనెటర్లు కోరారు. జనవరి 31న సెనెటర్లు జాన్ కెన్నడీ, రిక్ స్కాట్‌లు కాంగ్రెస్ సమీక్షా చట్టం కింద తీర్మానం ప్రవేశపెట్టారు. ఆ నిబంధనను సవరించాలని వారు కోరారు. కఠినంగా ఇమ్మిగ్రేషన్ చట్టాన్ని అమలు చేయడాన్ని ఈ ప్రమాదకరమైన నిబంధన దెబ్బ తీస్తుందని జాన్ కెన్నడీ పేర్కొన్నారు. ఇమ్మిగ్రెంట్ల వర్క్ పర్మిట్లను ఆటోమేటిక్‌గా 540 రోజులకు పొడిగిస్తూ బైడెన్ ప్రభుత్వం ఈ నిబంధన తీసుకువచ్చిందని చెప్పారు. దీనివల్ల అమెరికన్ల భద్రత విషయంలో రాజీ పడినట్లవుతుందని, ఇమ్మిగ్రేషన్ చట్టాల అమలు ప్రయత్నాలకు ఆటంకం కలుగుతుందని పేర్కొన్నారు. స్కాట్ కూడా ఈచర్యను ఖండించారు. ఈ నిబంధనను సవరించకపోతే అమెరికాలో అక్రమంగా నివసించే వారిని గుర్తించడం చాలా కష్టమైపోతుందని వారు పేర్కొనారు. ఈ ఏడాది జనవరి 13న హోం ల్యాండ్ భద్రతా వ్యవహారాల ...6లో

జాబ్ కార్డుల జారీ బంద్

'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' షురూ కాగానే ఆగిన వైనం
ఆన్‌లైన్‌లో లాక్ చేసిన సర్కార్
కొత్త దరఖాస్తులకు బ్రేక్
పెరిగిన పనిదినాల డిమాండ్
పల్లెల్లో పనుల్లేవ్!
పట్టణ పేదలు ఏం పాపం చేశారు..?

"తెల్లకాగితంపై దరఖాస్తు చేసిన 15 రోజుల్లోపే వెరిఫికేషన్ పూర్తి చేయాలి. ధృవీకరణ పూర్తవ్వగానే అర్హులైన వారికి గ్రామ పంచాయతీ ఎన్ఆర్ఈజీఏ జాబ్‌కార్డు జారీ చేయాలి. ఏడాదిలో ఎప్పుడైనా దరఖాస్తు చేసుకునే వీలుండేది" ఇదంతా గతం. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం షురూ కాగానే ఉపాధి హామీ చట్టంలో జాబ్‌కార్డుల జారీని బంద్ చేశారు. ఆన్‌లైన్‌లో ప్రభుత్వం లాక్ చేయించింది. పల్లెల్లో జాబ్‌కార్డుల కోసం దరఖాస్తు చేస్తే తీసుకోవట్లేదు. భూమిలేని పేదలు పని దినాలు చూపాలని అడిగితే ఇప్పుడేం పనుల్లేవని చెబుతున్నారు. దీంతో జాబ్‌కార్డు, పని కోసం పేదలు తిరుగుతున్నారు. మున్సిపాలిటీల్లో కలిపిన పల్లె పేదలూ తమకు భరోసా ఇవ్వాలని కోరుతున్నారు.



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

జాతీయ ఉపాధి హామీ చట్టం అమల్లో భాగంగా శారీరకంగా శ్రమ చేసేందుకు ఆసక్తి ఉన్న వయోజనులకు విధిగా జాబ్‌కార్డు జారీ చేయాలి. తెల్లకాగితంపై దరఖాస్తు చేసిన 15 రోజుల్లో విచారించి అర్హులకు జాబ్‌కార్డు అందజేయాలి. ఇది గ్రామ పంచాయతీ పరిధిలో నిరంతరం జరిగే ప్రక్రియగా కొనసాగాలి. ఆధార్, ఓటర్ ఐడీ, బ్యాంకు బుక్, రేషన్‌కార్డు, పాస్‌ఫొటోలు ఇస్తే చాలు వెంటనే జాబ్‌కార్డులిస్తారు. ఆ జాబ్‌కార్డును చూపితే ఐదు కిలో మీటర్ల పరిధిలో ఎక్కడైనా ఉపాధి హామీ పని పొందొచ్చు. ఇదంతా ఇప్పటి వరకు సాగిన ప్రక్రియ మాత్రమే. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పేరిట భూమిలేని గ్రామీణ పేదలు ఉపాధి హామీలో కనీసం 20 రోజుల పాటు పని చేసినట్టయితే వారికి ఏడాదికి రూ.12 వేలు ఇస్తామంటుంది. ఇప్పటికే రిపబ్లిక్ డే సందర్భంగా రాష్ట్రంలో 563 గ్రామాల్లో లబ్దిదారుల ఖాతాల్లో రూ.6 వేల చొప్పున తొలి విడత పేమెంట్ జమ చేశారు. అప్పటి నుంచి రాష్ట్రంలో కొత్తగా జాబ్‌కార్డుల జారీ ప్రక్రియను ప్రభుత్వం బంద్ చేసింది. కొత్తగా ఎవరికీ ఉపాధి హామీ జాబ్‌కార్డులివ్వకుండా ఆన్‌లైన్‌లోనే ...6లో

పనుల కోసం కూలీల డిమాండ్

ఈజీఎస్‌లో పని కోసం కూలీలు డిమాండ్ చేస్తున్నారు. రబీ సీజన్ వ్యవసాయ పనులు పూర్తయ్యాయి. వరి కోతల వరకు ఎలాంటి పనులుండవు. దాంతో జాబ్‌కార్డు దారులంతా పని చూపాలంటున్నారు. ఇందిరమ్మ ఆత్మీయ పథకంలో కనీసం 20 రోజులు పని చేయాల్సి ఉన్నందున కార్డు ఉండి పనిచేయని వాళ్లంతా పనులు చూపాలని కోరుతున్నారు.

జాబ్ కార్డులిచ్చి పనులు చూపాలి

గొల్లపల్లి జయరాజు, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి, సంగారెడ్డి

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పేదలందరికీ ఉపాధి జాబ్‌కార్డులివ్వాలి. గతం మాదిరే జాబ్‌కార్డుల జారీ నిరంతరం కొనసాగాలి. ఉపాధి పనుల కోసం అడిగిన వారందరికీ పని కల్పించాలి. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద సాయం చేయాల్సి వస్తదని ప్రభుత్వం జాబ్‌కార్డులివ్వకుండా పని చూపకుండా అడ్డుకోవడం సరికాదు. రికార్డుల ఆధారంగా కాకుండా క్షేత్ర స్థాయిలో విచారించి నిజమైన అర్హులందరికీ రూ.12 వేలివ్వాలి.

గాజాను స్వాధీనం చేసుకుంటాం

ఇజ్రాయెల్ ప్రధానితో భేటీ అనంతరం ట్రంప్ వివాదాస్పద ప్రకటన

13వ పేజీ





క్రికెటర్ గొంగడి త్రిషకు రూ.కోటి నజరానా

అభినందించిన సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అండర్-19 మహిళా టీ20 క్రికెట్ వరల్డ్ కప్‌లో రాణించిన భద్రాచలానికి చెందిన క్రికెటర్ గొంగడి త్రిషను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందించారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సీఎంను త్రిష మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా సీఎం ఆమెన శాలువాతో సత్కరించి రూ..కోటి నజరానాను ప్రకటించారు. భవిష్యత్‌లో భారత్ తరఫున మరిన్ని టోర్నీల్లో పాల్గొని ఆడాలని సీఎం ఆకాంక్షించారు. టీ20 ప్రపంచకప్ సభ్యురాలైన ధృతి కేసరితో పాటు టీమ్ హెడ్‌కోచ్ నౌషీన్, ట్రైనర్ షాలినికి రూ.10లక్షల చొప్పున నజరానాను సీఎం రేవంత్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, తెలంగాణ క్రీడా చైర్మెన్ శివ సేనారెడ్డి, ముఖ్యమంత్రి కార్యదర్శి షహనవాజ్ ఖాసీం, సోని బాలా దేవి తదితరులు పాల్గొన్నారు.

17.03 లక్షల మందికి లబ్ది

రైతు భరోసాపై మంత్రి తుమ్మల



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు బుధవారం నుంచి ఎకరా వరకు సాగులో ఉన్న భూములకు రైతుభరోసా జమ చేయడం ప్రారంభమైందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు వెల్లడించారు. 17.03 లక్షల మంది రైతుల అకౌంట్లలో డబ్బులు జమ కానున్నట్టు తెలిపారు. ఈ నిధులను నిర్ణీత కాల వ్యవధిలో చెల్లించుటకు రేవంత్ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నట్టు మంత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతు భరోసా ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకు మొత్తం రూ.1126.54 కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు. ఇప్పటికే రైతుబంధుకు రూ. 7625 కోట్లు, రుణమాఫీకి రూ.20,616.89 కోట్లు, రైతు బీమాకు రూ.3000 కోట్లు విడుదల చేసినట్టు పేర్కొన్నారు. పంటలకు గిట్టుబాటు ధరల కోసం ప్రత్యేక చర్యలు చేపట్టామని తెలిపారు. రూ. 14,893 కోట్లతో 20,11,954 మెట్రిక్ టన్నుల పత్తిని మద్దతు ధరకు సేకరించినట్టు వివరించారు. పత్తి పంటను పూర్తిగా సేకరించేందుకు గడువు కోరామని తెలిపారు. రూ.406.24 కోట్లతో సోయాబీన్, పెసర్లు, కందులను మార్క్‌ఫెడ్ ద్వారా రైతుల వద్ద నుంచి మద్దతు ధరకు కొనుగోలు ...5లో

కార్పొరేట్ అనుకూల కేంద్ర బడ్జెట్‌ను సవరించే వరకూ పోరాడుదాం



ధర్నాలో రైతు, కార్మిక సంఘాల నాయకులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కార్పొరేట్ అనుకూల కేంద్ర బడ్జెట్‌ను సవరించే వరకూ ఐక్యంగా ఉద్యమిద్దామని రైతు, కార్మిక సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల జాతీయ పిలుపులో భాగంగా కార్పొరేట్ అనుకూల కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ దేశవ్యాప్తంగా, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాల్లో జరిగే నిరసనల్లో భాగంగా బుధవారం హైదరాబాద్ లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో రైతు సంఘాలు, కార్మిక సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పాల్గొని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్పొరేట్ అనుకూల కేంద్ర బడ్జెట్‌ను సవరించాలనీ, ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మొద్దనీ, ఎరువులకు ఇస్తున్న ...13లో



టెట్‌లో తగ్గిన ఉత్తీర్ణత

పేపర్-1లో 59.48 శాతం, పేపర్-2లో 31.21 శాతం అర్హత

గతసారి కంటే పేపర్-1లో 7.65 శాతం, పేపర్-2లో 2.97 శాతం మంది తగ్గుదల

ఫలితాలు విడుదల చేసిన విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా

5వ పేజీ



దశాబ్దాల ఎదురుచూపులకు తెరదించాం

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కులగణన, ఎస్సీ వర్గీకరణపై ప్రజలు దశాబ్దాలుగా చూస్తున్న ఎదురు చూపులకు తెరదించామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గతంలో ...5లో

కులగణన సర్వే తప్పులతడక

- శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అసెంబ్లీ, శాసన మండలిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కులగణన సర్వే తప్పులతడకగా ఉందని శాసన మండలిలో ప్రతిపక్షనేత మధుసూదనాచారి విమర్శించారు. బుధవారం హైదరాబాద్ లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల ...13లో

'రక్షణ'కే అధిక నిధులు

నిధుల కేటాయింపులో నిర్లక్ష్యం | సిబ్బంది, మౌలిక వసతుల కొరత

విద్య, ఆరోగ్య రంగాలను పట్టించుకోని మోడీ ప్రభుత్వం

న్యూఢిల్లీ : కేంద్ర బడ్జెట్‌పై విశ్లేషణలు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రధాన స్రవంతి మీడియా సంస్థలు ఈ బడ్జెట్‌ను ఎంతో గొప్పగా అభివర్ణిస్తున్నప్పటికీ గణాంకాలను లోతుగా పరిశీలిస్తే కీలకమైన అంశాలు వెలుగు చూస్తున్నాయి. గత పది సంవత్సరాల కాలంలో భారత రక్షణ బడ్జెట్ రెట్టింపు అయింది. ఇటీవల ప్రకటించిన బడ్జెట్‌లో కేటాయింపులు రూ.6.8 లక్షల కోట్లు దాటాయి. అయినప్పటికీ రక్షణ సిబ్బందిలో అసంతృప్తి కన్పిస్తూనే ఉంది. దానికి కారణాలు అనేకం. ఆయుధాలు కొనుగోలు చేస్తున్నప్పటికీ అవి ఆలస్యంగా చేరుతున్నాయి. కీలకమైన ఆధునీకరణ ప్రాజెక్టులు సంవత్సరాల తరబడి నత్తనడక నడుస్తున్నాయి. బడ్జెట్‌లో సుమారు నాలుగో వంతు పెన్షన్లకే పోతోంది. రికార్డు స్థాయిలో ఖర్చు చేస్తున్నా సైన్యాన్ని నిస్తేజం వీడడం లేదు.

రక్షణ రంగానికి చేస్తున్న అధిక కేటాయింపుల కారణంగా విద్య, ఆరోగ్యం వంటి కీలక రంగాలు దెబ్బతింటున్నాయి. వీటిని పాలకులు నిర్లక్ష్యం చేస్తూనే ఉన్నారు. దేశంలోని అనేక పాఠశాలలు నిధుల కొరతతో కూనారిల్లిపోతున్నాయి. చాలా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు సైతం లేవు. ఆందోళన కలిగించే విషయమేమంటే విద్యార్థుల్లో ఆత్మహత్యల రేటు అన్నదాతల ఆత్మహత్యల రేటును దాటిపోయింది.



విద్యా రంగంపై పడుతున్న ఒత్తిడిదానిని నిర్లక్ష్యం చేస్తున్న తీరుకు ఇది అద్దం పడుతోంది. ఆరోగ్య రంగం పనితీరు కూడా ఏ మాత్రం ఆశాజనకంగా లేదు. దేశ జనాభా ప్రకారం చూస్తే ఆస్పత్రుల్లో ఇంకా 24 లక్షల పడకలు అవసరమవుతాయి. అంటే లక్షలాది మందికి అవసరమైన వైద్య సేవలు అందడం లేదు.

విద్యా రంగంపై అలసత్వం

దేశ సరిహద్దులను పటిష్టపరచడం అవసరమే. అయితే కీలక రంగాల విషయంలోనూ ప్రభుత్వం తగినంత శ్రద్ధ కనబరచాల్సిన అవసరం ఉంది. విద్యా రంగానికి బడ్జెట్ కేటాయింపులు అరకొరగానే ఉంటున్నాయి. గత సంవత్సరం విద్యపై ప్రభుత్వ వ్యయం జీడీపీలో కేవలం 2.9 శాతంగా మాత్రమే ఉంది. కోఠారీ కమిషన్ సిఫార్సు చేసిన ఆరు శాతం కంటే ఇది చాలా తక్కువ. 2015-16 నుండి నిధుల కేటాయింపు పెరిగినప్పటికీ విద్యా రంగం తీవ్రమైన మౌలిక సదుపాయాలు, సిబ్బంది కొరతను ఎదుర్కొంటూనే ఉంది. ముఖ్యంగా అర్హత కలిగిన అధ్యాపకుల కొరత అధికంగా ఉంది. దేశంలో 12 లక్షలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పాఠశాలల్లోని తరగతి గదులు విద్యార్థులతో కిక్కిరిసిపోతున్నాయి. అనేక ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల దామాషా 50:1 దాటిపోయింది. అన్నింటి కంటే దారుణమైన విషయమేమంటే ప్రభుత్వం నియమించిన ఉపాధ్యాయుల్లో 40 శాతం మందికి తగిన అర్హతలు లేవు. ఫలితంగా విద్యార్థుల అభ్యాసంపై ప్రతికూల ప్రభావం ...13లో

విద్యార్థుల ఉసురు తీస్తున్నారు

విద్యా వ్యవస్థలో లోపాలు అనేక రూపాలుగా కన్పిస్తున్నాయి. యువత అత్యధిక సంఖ్యలో ఆత్మహత్యలు చేసుకుంటున్న దేశాల జాబితాలో భారత్ కూడా ఉంది. 2020 లో ప్రతి 42 నిమి షాలకు ఒక విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఆ ఏడాది 11,396 మంది విద్యార్థులు బలవంతంగా తనువు చాలించారు. ఒత్తిడి, తల్లిదండ్రుల ఆకాంక్షలు, ఆందో ళన... ఇవన్నీ వారి ఉసురు తీశాయి. అయినప్పటికీ విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాల్సిన విద్యా సంస్థలు ఆ పని చేయడం లేదు. బడ్జెట్ కేటాయింపుల్లో అసమానతలు, వైరుధ్యాలు ఒక విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ప్రభుత్వ ప్రాధాన్యతల్లో విద్యా రంగం లేదు. ప్రతి సంవత్సరం రక్షణ బడ్జెట్ నిలకడగా పెరుగుతూనే ఉంది. విద్య మాత్రం వెనక్కి పోతోంది.

పెన్షన్లకే సరి

గత దశాబ్ద కాలంలో రక్షణ రంగానికి కేటాయింపులు ఏకంగా 152 శాతం పెరిగాయి. 2015-16లో రూ.2.46 లక్షల కోట్లుగా ఉన్న రక్షణ బడ్జెట్ 2025-26లో రూ.6.8 లక్షల కోట్లకు చేరింది. అయితే ఇక్కడ ఓ కీలక అంశాన్ని గమనించాల్సి ఉంది. 2020-21లో రక్షణ రంగానికి రూ.3.37 లక్షల కోట్లు కేటాయించగా అందులో సుమారు రూ.1.34 లక్షల కోట్లు (29 శాతం) పెన్షన్లకే పోయాయి. బడ్జెట్‌లో అధిక భాగం ఆధునీకరణ, సేకరణ, మౌలిక సదుపాయాల కోసం ఖర్చు కావడం లేదని దీనిని బట్టి అర్థమవుతోంది.

యూజీసీ కొత్త నిబంధనలను ఉపసంహరించాలి

- వీసీల నియామకం అధికారాలు రాష్ట్ర ప్రభుత్వాలకే ఉండాలి : మంత్రుల సమావేశం డిమాండ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) రూపొందించిన కొత్త నిబంధనలను వెంటనే ఉపసంహరించుకోవాలని మంత్రుల సమావేశం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. బుధవారం బెంగుళూరులో రాష్ట్ర ఉన్నత విద్య మంత్రులు-2025 సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో కర్నాటక ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్, తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి శ్రీధర్‌బాబు, ఉన్నత విద్యామండలి చైర్మెన్ వి బాలకిష్టారెడ్డి, సాంకేతిక, కళాశాల విద్యాశాఖ కమిషనర్ ఏ శ్రీదేవసేనతోపాటు హిమాచల్‌ప్రదేశ్, జార్ఖండ్, కేరళ, తమిళనాడు ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. యూజీసీ రూపొందించిన ఉపాధ్యాయుల నియామకం, పదోన్నతుల కనీస అర్హతలు, జాతీయ నూతన విద్యావిధానం(ఎన్ఈపీ-2020) అమలుతోపాటు ఉన్నత విద్యాసంస్థల గ్రేడింగ్ ప్రమాణాల గురించి చర్చించారు. సంయుక్తంగా తీర్మానాన్ని ఆమోదించారు. రాష్ట్ర ప్రభుత్వాలు వైస్ చాన్సలర్ (వీసీ)లను నియమించే పూర్తి అధికారాలను కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల నియామక నిబంధనలను పున:సమీక్షించాలని కోరారు. అకడమిక్ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ (ఏపీఐ) విధానం తొలగింపును తిరిగి సమీక్షించాలని సూచించారు. ప్రయివేటు విద్యాసంస్థలకు అనుకూలంగా ఉండే విధంగా ఉన్న ప్రతిపాదనలను సమతుల్యం చేయాలని తెలిపారు. రాష్ట్రాల స్వయంప్రతిపత్తిని కాపాడాలని కోరారు. యూజీసీ సహకార స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదింపులు జరిపి నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ కుల సర్వే పారదర్శకం

- సర్వే సమచారాన్ని త్వరలో పబ్లిక్‌డొమైన్‌లో పెడతాం
- నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

స్వాతంత్ర్యానంతరం తెలంగాణలో తమ ప్రభుత్వం నిర్వహించిన కుల ఆధారిత సామాజిక-ఆర్థిక సర్వే అత్యంత శాస్త్రీయంగా, పారదర్శకంగా జరిగిందని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ కమిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2011 జనాభా లెక్కల తర్వాత క్షేత్రస్థాయి ఆధారిత కులాల సర్వే ఇదేనని గుర్తు చేశారు. ప్రతిపక్ష పార్టీలు పేర్కొన్న గణాంకాలన్నీ అవాస్తవమని కొట్టి పారేశారు. "సర్వే కోసం దాదాపు లక్ష మంది శిక్షణ పొందిన సిబ్బందిని, డేటా నమోదుకు 76వేల మందిని నియమించాం. రాష్ట్రాన్ని 94,261 ఎన్యుమరేషన్ బ్లాక్‌లుగా విభజించి ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా 55 రోజుల్లో సర్వే పూర్తి చేశాం" అని ఉత్తమ్ స్పష్టం చేశారు. సర్వేలో 3 శాతం మందికి పైగా పాల్గొనలేదనీ, వారి వివరాలకు సంబంధించి త్వరలో తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. బీసీ జనాభా తగ్గిందనేది అపోహేనని మంత్రి పేర్కొన్నారు. వ్యక్తిగత సమాచారాన్ని మినహాయించి, కులాల వారీగా వివరాలను త్వరలో పబ్లిక్ డొమైన్‌లో పెడతామని తెలిపారు రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలుకు సర్వేనే ప్రామాణికంగా తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్, నాగర్‌కర్నూల్ ఎంపి మల్లురవి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

జిబ్రానిక్స్ నుంచి సరికొత్త ఇయర్ బడ్స్



చెన్నై : ప్రముఖ ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ జిబ్రానిక్స్ తొలిసారి ఓపెన్ ఇయర్ వైర్‌లెస్ స్టీరియో (ఒడబ్ల్యుఎస్) ఇయర్ బడ్స్‌ను ఆవిష్కరించినట్లు తెలిపింది. 'జిబ్-పాడ్స్ ఓ' పేరుతో వీటిని మార్కెట్లోకి విడుదల చేసినట్టు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొంది. బ్లాక్, గ్రీన్ రంగుల్లో లభించనున్న జిబ్-పాడ్స్ ఓ ధరను రూ.1699గా నిర్ణయించినట్టు వెల్లడించింది. ఇవి సంగీత ప్రియులు, గేమర్‌లు, నిపుణుల అవసరాలను తీర్చనున్నాయని జిబ్రానిక్స్ కో-ఫౌండర్ ప్రదీప్ దోషి పేర్కొన్నారు. క్వాడ్ మైక్రోఫోన్‌లు, ఎన్విరాన్‌మెంటల్ నాయిస్ క్యాన్సిలేషన్‌తో డిజైన్ చేసిన ఈ ఇయర్‌బడ్స్ ఇతర ధ్వని వాతావరణంలోనూ స్పష్టంగా పని చేస్తాయన్నారు. స్పష్టమైన గరిష్ట స్థాయిలతో అసాధారణమైన ఆడియో అనుభవాన్ని అందిస్తాయన్నారు. 40 గంటల బ్యాటరీ బ్యాకప్ కలిగి ఉంటాయని.. కేవలం 10 నిమిషాల చార్జితో 90 నిమిషాల ప్లేబ్యాక్‌ను

ఆశాల సమస్యలు పరిష్కరించాలి

- ఆరోగ్యశాఖ కమిషనర్‌కు ఆశా యూనియన్ వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆశాల సమస్యలను పరిష్కరించాలని ఆశా యూనియన్ (సీఐటీయూ అనుబంధం) డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని కోఠిలో ఆరోగ్యశాఖ కమిషనర్‌ను యూనియన్ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. రాబోయే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఫిక్స్ వేతనం రూ.18 వేలుగా నిర్ణయించాలనీ, ఇతర డిమాండ్లన్నింటినీ పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశా యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.జయలక్ష్మి, రాష్ట్ర కోశాధికారి పి.గంగమణి పాల్గొన్నారు.

నేడు ఎడ్‌సెట్, పీఈసెట్ కమిటీల సమావేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో బీఎడ్ కోర్సులో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే ఎడ్‌సెట్, బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే పీఈసెట్ కమిటీల సమావేశం గురువారం హైదరాబాద్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో జరగనుంది. ఈ సమావేశంలో ఉన్నత విద్యామండలి చైర్మెన్ వి బాలకిష్టారెడ్డి, వైస్ చైర్మెన్లు ఈ పురుషోత్తం, ఎస్కే మహమూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, ఎడ్‌సెట్ కన్వీనర్ బి వెంకట్రామ్‌రెడ్డి, పీఈసెట్ కన్వీనర్ ఎన్ఎస్ దిలీప్ తదితరులు పాల్గొంటారు. అనంతరం ఎడ్‌సెట్, పీఈసెట్ షెడ్యూల్‌ను విడుదల చేస్తారు.

డ్రగ్స్ సరఫరాదారుల అరెస్ట్

- అక్రమంగా నివాసముంటున్న వారిపై ప్రత్యేక నిఘా
- వివిధ ప్రాంతాల్లో ముగ్గురు నైజీరియన్ల అరెస్ట్



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్‌లో అక్రమంగా నివాసముంటూనే డ్రగ్స్ సరఫరా చేస్తున్న విదేశీయులపై నార్కొటెక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్-ఎన్ఇడబ్ల్యూ) ప్రత్యేక నిఘా వేసింది. ఇందులో భాగంగా ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 1300 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.1.60కోటి ఉంటుందని పోలీసులు తెలిపారు. బుధవారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని హైదరాబాద్ సీసీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టాస్క్‌ఫోర్సు డీసీపీ వైవీఎస్.సుధీంద్ర వివరాలు వెల్లడించారు.

నైజీరియాకు చెందిన ఆలివర్ అలియాజ్ జాన్సన్ 2008లో బట్టలు, కాస్మొటిక్ వ్యాపారం వీసాపై న్యూఢిల్లీకి వచ్చాడు. అందులో ఆశించినంతగా లాభాలు రాకపోవడంతో సులువుగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకుని ఆ దేశానికి చెందిన కొంతమందితో స్నేహం చేశాడు. ఈ క్రమంలో న్యూఢిల్లీలో డ్రగ్స్ సరఫరా చేయడం ప్రారంభించారు. 2009లో అతనికి వీసా గడువు, 2013లో పాస్‌పోర్టు గడువు పూర్తి కావడంతో ఢిల్లీ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. 5 ఏండ్లకుపైగా జైలుశిక్ష అనుభవించిన నిందితుడు.. బయటకు వచ్చాక ముంబయికి మకాం మార్చాడు. తర్వాత ఢిల్లీ, ముంబయి, బెంగళూర్‌లో నైజీరియన్స్‌కు రెండు, మూడు కిలోల చొప్పున ఎండీఎంఏ డ్రగ్స్ సరఫరా చేయడం ప్రారంభించాడు. గ్రాముకు రూ.600 నుంచి రూ.1000 వరకు వసూలు చేసేవాడు. హైదరాబాద్‌లో కూడా సరఫరా చేయాలని నిర్ణయించుకున్న నిందితుడు 1300గ్రాముల డ్రగ్స్‌ను నగరానికి తీసుకొచ్చాడు. సమాచారం అందుకున్న నార్కొటెక్ బృందాలు లంగ్‌హౌజ్ పోలీసులతో కలిసి నిందితుడిని అరెస్టు చేశారు.

తప్పించుకుని తిరుగుతున్న నిందితులు

తప్పించుకుని తిరుగుతున్న పాత నేరస్థున్ని కూడా పోలీసులు గుర్తించారు. నైజీరియాకు చెందిన మౌసా కమరా అలియాజ్ రోమియోను అదుపులోకి తీసుకున్నారు. 2020, అక్టోబర్ 24న మెడికల్ వీసాపై ముంబయి ఎయిర్‌పోర్టుకు చేరుకున్న రోమియో వద్ద డ్రగ్స్ ఉన్నట్టు అనుమానించిన ఇమ్మిగ్రేషన్ అధికారులు తనిఖీ చేశారు. కోకైన్‌ను స్వాధీనం చేసుకుని ముంబయి పోలీసులకు అప్పగించారు. జైలు నుంచి బయటకొచ్చాక పోలీసుల కండ్లు గప్పి ముంబయిలోనే ఓ స్నేహితుని వద్ద ఏడాదిపాటు నివాసమున్నాడు. అతని స్నేహితుడు తిరిగి నైజీరియాకు వెళ్లడంతో అదే దేశానికి చెందిన మరికొంత మందితో స్నేహం చేశాడు. డ్రగ్స్ సప్లయ్ చేయడం ప్రారంభించాడు. అయితే పోలీసుల నిఘా అధికం కావడంతో అక్కడి నుంచి బెంగళూర్‌కు మకాం మార్చాడు. హైదరాబాద్‌లోనూ డ్రగ్స్ సరఫరా చేయాలని నిర్ణయించుకున్న నిందితుడు టోలీచౌకికి వచ్చాడు. సమాచారం అందుకున్న నార్కొటెక్ బృందాలు నిఘా పెట్టి నిందితుడిని అరెస్టు చేసి హుమాయూన్ పోలీసులకు అప్పగించాయి. ఇదిలావుండగా, బట్టల వ్యాపారం చేస్తానంటూ నైజీరియా నుంచి 2012లో ముంబయి వచ్చిన మరో నిందితుడు వీసా గడువు తీరినా పోలీసుల కండ్లు గప్పితప్పించుకుని తిరుగుతున్నాడు. చట్టవ్యతిరేక పనులు చేస్తున్నాడని 2019లో ముంబయి పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపించారు. బయటకొచ్చాక ముంబయిలో డ్రగ్స్ సప్లయ్ చేస్తూ స్నేహితుల వద్ద నివాసముంటున్నాడు. కొద్దిరోజుల కిందట నిందితుడు హైదరాబాద్ వచ్చినట్టు సమాచారం అందుకున్న నార్కొటెక్ పోలీసులు హుమాయూన్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు వీసా లేకుండానే నగరంలో అక్రమంగా నివాసముంటున్నాడని గుర్తించారు. నిందితుడిని తిరిగి నైజీరియాకు పంపిస్తామని డీసీపీ తెలిపారు.

ఆగాఖాన్ మరణం మానవాళికి తీరని లోటు

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రపంచ ఇస్మాయిలీ ముస్లింల ఆధ్యాత్మిక గురువు ఆగాఖాన్ మరణం పట్ల ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సంతాపం ప్రకటించారు. ఇస్మాయిలీ ముస్లింల వాం˝సుడిగా, ఆధ్యాత్మిక గురువుగా నియమితులైన కరీం అల్-హుస్సేనీ ఆగాఖాన్ మృతి మానవాళికి తీరని లోటని సీఎం అన్నారు. సామాజిక వేత్తగా, మానవతావాదిగా ఆయన ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపును అందుకు న్నారని గుర్తు చేశారు.

ఆగాఖాన్ నెట్ వర్క్ ద్వారా వివిధ దేశాల్లో ఆస్పత్రులు, విద్య సాంస్కృతిక సంస్థలను నెల కొల్పి సేవలను అందించారని గుర్తు చేశారు.పేదరిక నిర్మూ లన,వారసత్వ సంపద పరిరక్షణకు ఆయన అందించిన సేవలు మరిచిపోలేనివని పేర్కొన్నారు.

హైదరాబాద్ కేంద్రంగా ఆగాఖాన్ సంస్థలు నిర్వహిస్తున్న కార్యక్రమాలు ఎంతో గొప్పవని ముఖ్యమంత్రి అభిప్రాయ పడ్డారు. వారి వారసులకు ,కుటుంబసభ్యులకు సీఎం ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అంగన్‌వాడీల జనవరి వేతనం వెంటనే చెల్లించాలి

- ఎనిమిది నెలల పెండింగ్ వేతనాలివ్వాలి
- ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలి : తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ డిమాండ్
- మహిళా శిశుసంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి, ఐసీడీఎస్ డైరెక్టర్‌కి వినతి

నవతెలంగాణ-సిటీబ్యూరో

అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్స్‌కు జనవరి నెల వేతనం వెంటనే చెల్లించాలని, ప్రతినెలా ఒకటో తేదీనే వేతనాలను ఖాతాల్లో జమ చేయాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) డిమాండ్ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా మినీ నుంచి మెయిన్ అంగన్‌వాడీ టీచర్స్‌గా అప్‌గ్రేడ్ అయిన నాలుగు వేల మందికి ఎనిమిది నెలల పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని కోరింది. మహిళా శిశుసంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి అనితా రామచంద్రన్, ఐసీడీఎస్ డైరెక్టర్ కాంతివెస్లీకి బుధవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.సునీత, ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి, రాష్ట్ర కోశాధికారి పి.మంగ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పి.జయలక్ష్మి మాట్లాడుతూ.. అంగన్‌వాడీలకు సకాలంలో వేతనాలు రావడం లేదని, ఏ తేదీన అకౌంట్స్‌లో పడతాయో తెలియడం లేదని అన్నారు. సకాలంలో వేతనాలు రాకపోవడంతో కుటుంబ అవసరాల కోసం అప్పు చేసి బతకాల్సిన పరిస్థితి వస్తోందన్నారు. ప్రతినెలా ఒకటో తేదీనే వేతనాలు చెల్లించాలని అనేక విజ్ఞప్తులు చేసినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఐసీడీఎస్ ఏర్పడి 50 ఏండ్లు పూర్తయిందని, నేటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు టీచర్లు, హెల్పర్స్‌ను పర్మినెంట్ చేయడం లేదన్నారు. కనీసం వేతనం, చట్టబద్ధ సౌకర్యాలేవీ కల్పించకపోగా.. గౌరవ వేతనం మాత్రమే చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, ఈ పరిస్థితిలో వచ్చే అతి తక్కువ వేతనాలూ సకాలంలో రాకపోవడంతో అంగన్‌వాడీలు అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.



పోరాటాలతోనే.. మెయిన్ అంగన్‌వాడీలుగా..

రాష్ట్రంలో అనేక పోరాటాల ఫలితంగానే నాలుగు వేల మంది మినీ అంగన్‌వాడీ టీచర్లను 2024 జనవరి 1 నుంచి మెయిన్ అంగన్‌వాడీ టీచర్లుగా గుర్తిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని జయలక్ష్మి గుర్తుచేశారు. వారి బతుకులు ఇప్పటికైనా బాగుపడే అవకాశం లభించిందని, పెరిగిన వేతనం ఆర్థికంగా కుటుంబ అవసరాలకు ఎంతగానో తోడ్పడుతుందని సంతోషపడ్డారని, కానీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం వారికి నిరాశే మిగిల్చిందన్నారు. మార్చి నుంచి ఎనిమిది నెలల వేతనాలను పాత పద్ధతిలో సగమే చెల్లించారని, ఈ సమస్యను పరిష్కరించాలని అనేకసార్లు అధికారులకు, ఐసీడీఎస్ మంత్రికి వినతిపత్రాలు ఇచ్చినా ప్రభుత్వం పరిష్కరించలేదని తెలిపారు. అప్‌గ్రేడ్ టీచర్స్‌కు హెల్పర్స్‌ను నియమించాలని, మెయిన్ టీచర్స్‌గా గుర్తించి ఏడాది దాటినా ప్రభుత్వం ఇప్పటివరకు స్పందించకపోవడం శోచనీయమన్నారు. హెల్పర్స్, టీచర్స్‌గా రెండు పనులనూ ఒక్కరే చేసుకోవాలంటే పని భారం పెరుగుతోందన్నారు. పూర్తి వేతనం రాకపోవడం తోపాటు హెల్పర్స్ లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారని చెప్పారు. వీటితో పాటు రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో 14, 15 ఏండ్ల నుంచి ఖాళీ పోస్టులను భర్తీ చేయడం లేదని, దీని వల్ల ఐసీడీఎస్ సేవలన్నీ అస్తవ్యస్తంగా మారుతున్నాయని చెప్పారు. తక్షణమే ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

బిల్లులిచ్చేదాకా పోరాడుతాం..అరెస్టులకు భయపడం

- రాష్ట్ర ప్రభుత్వానికి మాజీ సర్పంచుల హెచ్చరిక
- సచివాలయ పరిసరాల్లో ఉరితాళ్లతో నిరసన
- అరెస్టు చేసి పీఎస్‌లకు తరలించిన పోలీసులు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను చెల్లించేదాకా ప్రభుత్వంపై పోరాడుతామనీ, అరెస్టులకు భయపడబోమని మాజీ సర్పంచులు స్పష్టం చేశారు. రాష్ట్ర సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయం పరిసరాల్లో మాజీ సర్పంచులు ఉరితాళ్లతో నిరసన తెలిపారు. వారిని పోలీసులు అరెస్టు చేసి చాంద్రాయన్‌గుట్ట, కంచన్‌బాగ్, సాయినాథ్ గంజ్ పీఎస్‌లకు తరలించారు. కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సుర్వి యాదయ్య గౌడ్, ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య, సహాయ కార్యదర్శి కేశబోయిన మల్లయ్య, నెమలి సుభాశ్‌గౌడ్, మెడబోయిన గణేశ్, బొల్లం శారద, బకీర్, బీరప్ప, బొమ్మరపు సురేశ్, బత్తిని తిరుమలేశ్, ఎలుగు సోమయ్య, వర్రె శ్రీనివాస్, దండబోయిన మల్లేశ్, లచ్చిరామ్ నాయక్, గానుగుపాడు శ్రీనివాస్, వెంకటరామిరెడ్డి, పాండురంగారెడ్డి, రవీందర్‌రెడ్డి, పద్మారెడ్డి పాల్గొన్నారు. నిరసన సందర్భంగా యాదయ్యగౌడ్ మాట్లాడుతూ.. 13 నెలలుగా అనేక రకాలుగా నిరసనలు, ధర్నాలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోక పోవడం దారుణమన్నారు. బిల్లులు రాక మాజీ సర్పంచులు ఆత్మహత్యలు చేసు కుంటుంటే ప్రభుత్వం కండ్లు మూసుకుని రాక్షసానందం పొందుతున్నదని విమర్శించారు. గాంధేయమార్గంలో నిరసనలు తెలుపుతున్నా అరెస్టులు ఏంటని ప్రశ్నించారు. తమ బిల్లులు చెల్లించిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్కలను కోరారు. మాజీ సర్పంచులను అరెస్టు చేయడాన్ని తప్పుబట్టారు.

అటవీ అనుమతులతో మట్టిరోడ్ల అభివృద్ధి

భవిష్యత్తులో బీటీకి ప్రణాళిక : మంత్రి కోమటిరెడ్డి ఆదేశం



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ప్రజాధనంతో నిర్మిస్తున్న రహదారుల నిర్మాణంలో ఎక్కడా రాజీలేదని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులను హెచ్చరించారు. నాణ్యతలేని పనులు చేస్తే వెంటనే పనులను రద్దు చేస్తామని ప్రకటించారు. అటవీ అనుమతులతో మట్టిరోడ్లను బీటీ రోడ్లుగా మార్చే ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. 'హ్యామ్' రోడ్ల నిర్మాణాలకు సమయం కావాలని అడిగిన కన్సల్టెంట్ల విజ్ఞప్తిని మంత్రి తిరస్కరించారు. ఒకవైపు ప్రజలు ఇబ్బందులు పడుతుండగా, మరోవైపు సంవత్సరాల తరబడి పనులు చేస్తామంటే ఎలా అని ప్రశ్నించారు. రోడ్డు ప్రమాదాల్లో జనం చనిపోతే ఎవరు బాధ్యత వహిస్తారని మంత్రి నిలదీశారు. ఏ రోడ్డు నిర్మాణమైనా రెండు, మూడు నెలల్లో ప్రారంభించేలా వేగంగా ముందుకు వెళ్లాలని ఆదేశించారు. హ్యామ్ రోడ్ల మంజూరు రాష్ట్ర పరిధిలోనే ఉన్న నేపథ్యంలో ఆర్అండ్‌బీ శాఖ వేగంగా అనుమతులు మంజూరు చేయాలని చెప్పారు. జిల్లా కలెక్టర్ స్థాయిలో స్థానిక ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను తీసుకొని ఎస్.ఈ, ఈఈతో పాటు ఇతర అధికారులను కలుపుకొని హ్యామ్ రోడ్లను ఎంపిక చేసే ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. దశాబ్దకాలంగా మరమ్మతులకు నోచుకోని రహదారులను తక్షణమే ఎస్టిమేట్లు సిద్ధం చేసి షార్ట్ టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని సూచించారు. ఇప్పటి వరకు 82 నియోజకవర్గాల్లో గుర్తించిన 1690.26 కిలోమీటర్ల రోడ్ల రిపేర్ల పనులను వెంటనే ప్రారంభించేలా టెండర్ల ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు చెప్పారు. సర్వీస్ రూల్స్ ప్రక్రియ పూర్తి చేసి ఇప్పటికే ఏఈఈలకు డీఈఈలుగా ప్రమోషన్లు ఇచ్చామన్నారు. ఈ నెలాఖరుకల్లా డీఈఈ, ఈఈ, ఎస్ఈలకు ప్రమోషన్లు ఇచ్చేలా కసరత్తు చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో ఆర్అండ్‌బీ ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్, ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన, సీఈ (అడ్మిన్) తిరుమల, సీఈ (స్టేట్ రోడ్స్) మోహన్ నాయక్, వివిధ జిల్లాల ఎస్ఈ లు, ఈఈ తదితర అధికారులు హాజరయ్యారు.

వామపక్ష వేదిక ఏర్పాటుకు కృషి చేస్తాం

మోడీ సర్కార్‌ది ముమ్మాటికీ పేదల వ్యతిరేక బడ్జెట్ | టీడబ్ల్యూజేఎఫ్, హెచ్‌యూజే మీట్ ది మీడియాలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

- వామపక్ష వేదిక ఏర్పాటుకు కృషి చేస్తాం
- ప్రజాఉద్యమాలతో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతాం
- స్థానిక ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ
- వామపక్ష పార్టీలున్న చోట పరస్పర సహకారం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణలో వామపక్షాల ఆధ్వర్యంలో ప్రత్యామ్నాయ వేదిక ఏర్పాటుకు కృషి చేస్తామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ప్రకటించారు. రాష్ట్రంలో ప్రజా ఉద్యమాలతో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతామని ఆశాభావం వ్యక్తం చేశారు. స్థానిక ఎన్నికల్లో ఒంటరిగానే పోటీచేస్తామనీ, అయితే, వామపక్ష పార్టీలు బలంగా ఉన్న చోట పరస్పర సహకారంతో ముందుకెళ్తామని స్పష్టం చేశారు. ప్రజల్లో రాజకీయ చైతన్యం తీసుకొచ్చి ధన, మద్య ప్రలోభాల రాజకీయాలను తిప్పికొడతామని నొక్కి చెప్పారు. కమ్యూనిస్టు పార్టీగా దేశంలోని ప్రతి ఒక్కరికీ ఉచిత విద్య, వైద్యం అందాలని తాము కోరుకుంటుంటే మోడీ సర్కారు మాత్రం ఆ రెండు రంగాలను పూర్తిగా కార్పొరేట్ల చేతుల్లో పెట్టే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్), హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్(హెచ్‌యూజే) సంయుక్త ఆధ్వర్యంలో మీట్ ది మీడియా కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి టీడబ్ల్యూజేఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎమ్ఎస్.హష్మీ సమన్వయకర్తగా వ్యవహరించారు. కార్యక్రమంలో టీడబ్ల్యూజేఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య, రాష్ట్ర కార్యదర్శులు చంద్రశేఖర్, సలీమా, గుడిగ రఘు, హెచ్‌యూజే అధ్యక్షులు అరుణ్‌కుమార్, కార్యదర్శి బి.జగదీశ్, కోశాధికారి రాజశేఖర్, నాయకులు విజయ, నాగవాణి, తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వెస్లీ మాట్లాడుతూ..కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతున్న ఫలితంగానే ఒక్కశాతం ఉన్న కార్పొరేట్ల చేతిలో 27 శాతం సంపద పోగైందని చెప్పారు. అదానీ, అంబానీ లాంటి వాళ్లకు లక్షల కోట్ల రూపాయల సంపదను అప్పనంగా కట్టబెడుతున్న తీరును ఎండగట్టారు. దేశంలో 50 శాతం ఉన్న పేదల చేతుల్లో కేవలం 13 శాతం సంపదే ఉందని చెప్పారు. దీంతో వారు రక్తహీనత, పేదరికం, నిరుద్యోగం, నిత్యావసర సరుకులు ధరలు, విద్య, వైద్యం, ఇండ్లలేమి, నిరుద్యోగం వంటి సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. గత పాలకులు, ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానాల వల్లనే మన దేశంలో ఈ అసమానతలున్నాయని నొక్కి చెప్పారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా మన దేశంలో కుల వివక్ష ఉందనీ, సామాజిక అసమానతలు వేల ఏండ్ల నుంచి కొనసాగుతున్నా వాటిని నిర్మూలించాలనే చిత్తశుద్ధి నేటి పాలకులకు లేదని విమర్శించారు. పైగా, నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ వివక్ష రూపాలను ప్రోత్సహిస్తున్న తీరును ఎండగట్టారు. కులవివక్ష సామాజిక అసమానతలకు దారితీస్తున్న వైనాన్ని సోదాహరణంగా వివరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి పొందుతున్న తీరును ఎండగట్టారు. మతోన్మాద రాజకీయాలు శ్రామిక వర్గ ఐక్యతకు, సామాజిక ఉద్యమాలకు, బడుగు, బలహీన వర్గాల పోరాటాలకు తీవ్ర ఆటంకంగా మారాయని వాపోయారు. ఈ తరుణంలో దేశంలోని లౌకిక శక్తులు ఐక్యం కావాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు.

ముమ్మాటికీ ప్రజా వ్యతిరేక బడ్జెట్

ఇటీవల కేంద్రం ప్రతిపాదించిన రూ.50.60 లక్షల కోట్ల బడ్జెట్‌లో 30 కోట్ల మంది ఉపాధి కూలీలకు రూ.85 వేల కోట్లే కేటాయించడమేంటని ప్రశ్నించారు. రూ.2.5 లక్షల కోట్లు కేటాయించాలనే డిమాండ్‌ను ఎందుకు పట్టించుకోలేదన్నారు. ఇలాంటి మోడీ సర్కారును పేదల వ్యతిరేక ప్రభుత్వమని కాకుండా ఇంకేమనాలి? అని ప్రశ్నించారు. దేశంలో అసంఘటిత కార్మికులు కనీస వేతనాలు పొందని పరిస్థితి ఉన్నా కనీస ప్రస్తావన లేదన్నారు. వ్యవసాయ రంగానికి రూ.10 వేల కోట్లను తగ్గించడమేంటని ప్రశ్నించారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ల చేతిలో పెట్టి రైతులను కూలీలుగా మార్చే కుట్రకు మోడీ సర్కారు పూనుకున్నదని విమర్శించారు. దేశ జనాభాలో 16 శాతం ఉన్న దళితులకు కేవలం ఐదు శాతం, ఏడు శాతమున్న ఎస్టీలకు కేవలం 2 శాతం నిధులు కేటాయించడమేంటని ప్రశ్నించారు. దేశంలో 50 శాతానికిపైగా జనాభాగా ఉన్న బీసీలకు బడ్జెట్‌లో సరైన కేటాయింపులు లేవన్నారు. మూడు, నాలుగు వేల కోట్ల రూపాయలతో మైనార్టీ సంక్షేమం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ముమ్మాటికీ ప్రజా వ్యతిరేక బడ్జెట్ అని చెబుతున్నానన్నారు. దేశంలో తాండవిస్తున్న నిరుద్యోగ సమస్య పరిష్కారం గురించి కేంద్ర ప్రభుత్వానికి ఆలోచనే లేదని విమర్శించారు. కేంద్ర బడ్జెట్ తెలంగాణ వ్యతిరేక బడ్జెట్ అని కూడా చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం పలు ప్రాజెక్టులు, విభజన హామీల కోసం రూ.1.63 లక్షల కోట్లను కావాలని అడిగితే చిల్లిగవ్వ కేటాయించలేదని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హామీలను విస్మరించడం వల్లనే ప్రజలు ఆ పార్టీని కాదని కాంగ్రెస్‌కు అవకాశమిచ్చారనీ, కాంగ్రెస్ కూడా అదే బాటలోనే నడుస్తున్నదని విమర్శించారు. ప్రతిపక్ష హోదాలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ మతోన్మాద రాజకీయాలపై తన వైఖరేంటో చెప్పాలని డిమాండ్ చేశారు.


విస్తృత పోరాటాల ద్వారా ప్రజలకు చేరువవుతాం



సీపీఐ(ఎం) విస్తరించడానికి బలమైన ఉద్యమాలే కీలకం కాబోతున్నాయన్నారు. విస్తృత పోరాటాల ద్వారా ప్రజలకు చేరువవుతామని చెప్పారు. వామపక్ష పార్టీల ఐక్యత తమకు తొలి ప్రాధాన్యమన్నారు. తాను సామాజిక సమీకరణాల రీత్యా ఈ పదవిలోకి రాలేదనీ, సీపీఐ(ఎం) మహాసభ ప్రతినిధులు ఏకగ్రీవంగా ఎన్నుకుంటే కార్యదర్శిని అయ్యానని విలేకర్లు అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. తమ పార్టీ మహాసభలో రైతులు, పేదలు, కూలీలు, కార్మికులకు మేలు జరిగేలా 49 అంశాలపై తీర్మానాలు చేశామనీ, ఆ దిశగానే పోరాటాలుంటాయని చెప్పారు. కనీస కూలి రూ.400 కోసం, 200 పనిదినాల అమలు కోసం కొట్లాడుతామని చెప్పారు. కనీస వేతనం రూ.26 వేల అమలు కోసం కార్యాచరణ తీసుకుని ముందుకెళ్తామన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలు చేస్తామని చెప్పారు. భూ అక్రమాలకు వ్యతిరేకంగా పోరాట కార్యాచరణ రూపొందించి...రాష్ట్రంలో 30 లక్షల మంది పేదలకు ఇండ్ల స్థలాలిచ్చే వరకూ వెనక్కి తగ్గబోమన్నారు. ఓట్లు, సీట్ల ఆధారంగా చూడకుండా ప్రజా ఉద్యమాల ద్వారా కమ్యూనిస్టుల గొప్పతనాన్ని చూడాలన్నారు. హక్కుల కోసం పోరాటాల్లో కలిసి వస్తున్న ప్రజలకు రాజకీయ చైతన్యం కల్పించడంలో కొంత వైఫల్యం ఉన్న మాట వాస్తవమేనని అంగీకరించారు. ఎన్నికల్లోనూ కమ్యూనిస్టుల వైపు ఉండేలా ప్రజల్లో చైతన్యం కల్పించడంపై దృష్టి సారిస్తామని నొక్కి చెప్పారు. తమతో కలిసివచ్చే మేధావులు, సామాజిక సంఘాల నేతలను కలుపుకుని ముందుకెళ్తామన్నారు. డబ్బు, మద్యం, ప్రలోభాలతో ఎన్నికలు జరుగుతు న్న కాలంలో ప్రజలకు మరింత చైతన్యం కల్పించాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. అసెంబ్లీలో ప్రజా సమస్యల మీద చర్చల కంటే వ్యక్తిగత దూషణలకు ప్రాధాన్యం ఇవ్వడంపై ఆందోళన వ్యక్తం చేశారు. దీనిని ప్రజలంతా గమనిస్తున్నారనీ, ప్రజాప్రతినిధులు తమ మాటతీరును మార్చుకోవాలని సూచించారు. బూర్జువా పార్టీలకు అధికార యావ తప్ప ప్రజా సమస్యల పరిష్కారం పట్ల దృష్టి సారించవని ఎత్తిచూపారు. స్థానిక సంస్థల్లో బీసీల కు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామనటాన్ని, ఎస్సీ వర్గీకరణను స్వాగతిస్తున్నామనీ, అయితే, జనాభా లెక్కల్లో మరింత స్పష్టత తీసుకొచ్చి 2021 జనాభా లెక్కల ప్రకారం అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ లెక్కల్లో బీసీ వివరాలు సరిగా లేకపోవడాన్ని తప్పుబట్టారు.

సంగమంలో ప్రధాని

పవిత్ర స్నానం ఆచరించిన మోడీ



ప్రయాగ్‌రాజ్ : ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రా జ్‌లో జరుగుతున్న మహాకుంభమేళా (2025) సందర్భంగా పవిత్ర స్నానాలు ఆచరించటానికి దేశ,విదేశాలనుంచి తరలివస్తున్నారు. బుధవారం ప్రధాని మోడీ కూడా సంగమంలో పవిత్ర స్నానం చేశారు. గతంలో ఎన్నికలు జరిగినపుడు హిమాలయాలు,ఇతర పుణ్యక్షేత్రాలకు వెళ్లి..ఫోటోలను అప్‌లోడ్ చేసిన సంగతి విదితమే. అయితే ఇపుడు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నపుడు..సంగంలో పవిత్రస్నానం చేయటం కూడా ..హిందూ ఓటర్లను ప్రభావితం చేయటానికేనని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

ఆదిలాబాద్ జిల్లాలో 37 డిగ్రీలు

- వచ్చే మూడ్రోజులు రెండు నుంచి మూడు డిగ్రీలు పెరిగే అవకాశం
- పగటిపూట ఎండ..రాత్రి చలి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో పగటిపూట ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. ఆదిలాబాద్, భద్రాచలంలలో బుధవారం అత్యధికంగా 37 డిగ్రీల చొప్పున గరిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. పగటిపూట ఎండతో పాటు ఉబ్బరం ఉంటున్నది. రాత్రి పూట చలి ఉంటున్నది. తెల్లవారుజామున పొగమంచు కమ్మేస్తున్నది. ఇలా ఏకకాలంలో భిన్నవాతావరణం కనిపిస్తున్నది. వచ్చే మూడు రోజుల పాటు రాష్ట్రంలో గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు రెండు నుంచి నాలుగు డిగ్రీల మేరకు పెరిగే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ శాఖ పేర్కొంది. రాష్ట్రంలో మూడు రోజుల పాటు వాతావరణం పొడిగా ఉండనున్నది.

బుధవారం అత్యధిక ఉష్ణోగ్రత నమోదైన ప్రాంతాలు	
ఆదిలాబాద్	37 డిగ్రీలు
భద్రాచలం	37 డిగ్రీలు
ఖమ్మం	36.6 డిగ్రీలు
మహబూబ్‌నగర్	36.3 డిగ్రీలు
మెదక్	35.6 డిగ్రీలు
హన్మకొండ	35.5 డిగ్రీలు
నిజామాబాద్	35.5 డిగ్రీలు

బేడీలతో గెంటేసిన ట్రంప్

- 105మంది భారతీయులతో అమృతసర్‌లో దిగిన విమానం
- అమెరికా అధ్యక్షుడి చర్యలపై పంజాబ్ సర్కార్ అసంతృప్తి



అమృతసర్ : వీసా గడువు ముగిసినా, చట్టబద్ధమైన పత్రాలు లేకుండా అమెరికాలో నివసిస్తున్న కొంతమంది భారతీయులను బేడీలు వేసి మరీ అమెరికా అధ్యక్షుడు గెంటేశారు. వలస భారతీయులను బలవంతంగా బంధించి.. తీసుకుని వచ్చిన అమెరికా మిలటరీ విమానం బుధవారం మధ్యాహ్నం అమృతసర్ అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగింది. మధ్యాహ్నం 1.55గంటలకు ల్యాండ్ అయిన ఈ విమానంలో తొలి విడతగా మొత్తంగా 105మంది భారతీయులు వచ్చారని అధికారులు తెలిపారు. వీరిలో 30మంది పంజాబ్, 33 మంది హర్యానా, మరో 33మంది గుజరాత్‌కు చెందినవారు వున్నారు.

మహారాష్ట్ర, యూపీల నుంచి ముగ్గురేసి చొప్పున, చండీగఢ్ నుంచి ఇద్దరు వున్నారని సంబంధిత వర్గాలు తెలిపా యి. వీరిలో మొత్తంగా 25మంది మహిళలు కాగా 12మంది మైనర్లు, అందరికన్నా అతి పిన్న వయస్కుడు నాలుగేండ్ల చిన్నారి అని ఆ వర్గాలు తెలిపాయి. 25ఏండ్లలోపు వయస్సున్నవారు 48మంది వున్నారు. టెక్సాస్ నుంచి బయలుదే రిన ఈ విమానంలో 11మంది విమాన సిబ్బంది వున్నారు. ఈ తరలింపు ప్రక్రియను పర్యవేక్షిస్తున్న 45మంది అమెరికా అధికారులు కూడా వున్నారు. కాగా కచ్చితంగా ఎంతమంది వచ్చారనే విషయమై ఇంతవరకు అధికారిక ప్రకటన లేదు. 205మంది భారతీయులను పంపిస్తున్నట్టు.. అమెరికా విమానంలో పంపినట్టు తొలుత వార్తలు వచ్చాయి. వెనక్కి పంపే ముందు ప్రతి ఒక్కరి రికార్డులను పరిశీలించినట్టు ఢిల్లీలోని అమెరికా ఎంబసీ అధికారులు తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని విమానాలు భారత్‌కు రానున్నాయని తెలిపారు.

కాగా అమెరికా విమానంలో వచ్చిన భారతీయుల కోసం విమానాశ్రయంలో కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు పంజాబ్ డీజీపీ గౌరవ్ యాదవ్ తెలిపారు. ఈ మొత్తం వ్యవహారంపై పంజాబ్ ఎన్ఆర్ఐ వ్యవహారాల మంత్రి కులదీప్ సింగ్ దలెవాల్ అసంతృప్తిని వ్యక్తం చేశారు. అమెరికా నిర్ణయాన్ని తప్పుబడుతూ ఈ రోజున ఇలా పంపిస్తున్న వీరందరూ ఆ దేశ ఆర్థిక వ్యవస్థకు ఎంతో కొంత దోహదపడినవారేనని, అటువంటి వారిని ఇలా తరలించడానికి బదులుగా అక్కడ శాశ్వత నివాసానికి అనుమతించి వుంటే బాగుండేదని వ్యాఖ్యానించారు. అమెరికా వెళ్ళిన భారతీయుల్లో చాలా మంది వర్క్ పర్మిట్లపైనే వెళతారని, కానీ ఆ పర్మిట్ల కాలపరిమితి ముగిసిపోయిన తర్వాత కూడా వుండడంతో వీరందరూ అక్రమంగా నివసించిన వారయ్యారని అన్నారు. కొంతమంది అక్రమంగా కూడా అమెరికాలోకి ప్రవేశించారన్నారు. అమెరికాలో నివసిస్తున్న పంజాబీల సమస్యలు, ఆందోళనలపై చర్చించేందుకు వచ్చే వారం విదేశాంగ మంత్రి జై శంకర్‌తో సమావేశం కావాలని భావిస్తున్నట్లు చెప్పారు. దాదాపు 7,25,000మంది భారతీయులు చట్టబద్ధమైన పత్రాలు లేకుండా అమెరికాలో నివసిస్తున్నట్లు ప్యూ రీసెర్చ్ సెంటర్ డేటా పేర్కొంది. మెక్సికో, ఎల్ సాల్వడార్ తర్వాత ఇలా అనధికారికంగా వున్నవారిలో భారత్ మూడవ స్థానంలో వుంది.

ట్రంప్ నిర్ణయంతో అమెరికా సాయానికి బ్రేక్

- యూఎస్ ఎయిడ్ సంస్థపై ఆంక్షలు
- నిలిచిపోయిన పలు ప్రాజెక్టుల పనులు
- కీలక దేశీయ రంగాలపై ప్రభావం





న్యూఢిల్లీ : అంతర్జాతీయ అభివృద్ధికి సంబంధించిన అమెరికా సంస్థ (యూఎస్ ఎయిడ్)ను స్తంభింపజేయాలని ట్రంప్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం భారత్‌కు అశనిపాతంగా మారింది. దేశంలో ఆరోగ్య రక్షణ, ఇతర ప్రాజెక్టుల పైన, భారత్‌తో కొనసాగుతున్న భాగస్వామ్యాల పైన ఈ నిర్ణయం ప్రభావం చూపే అవకాశం ఉంది. నూతన ప్రభుత్వ విధానానికి అనుగుణంగా అమెరికా విదేశీ సాయంపై మదింపు చేయాలని, దానిని పునర్వ్యవస్థీకరించాలని ట్రంప్ గత నెలలో ఎగ్జిక్యూటివ్ ఆదేశాలు జారీ చేశారు. విదేశీ సాయానికి 90 రోజుల విరామం ఇచ్చారు. దీనిపై స్పందించిన యూఎస్ ఎయిడ్.. మన దేశంలో వివిధ ప్రాజెక్టులకు సాయం అందిస్తున్న భాగస్వామ్య సంస్థలన్నింటికీ సమాచారం పంపుతూ తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకూ పనులు నిలిపివేయాలని ఆదేశించింది.

పనులు నిలిపివేయండి

భారత్‌లో పని చేస్తున్న తన భాగస్వాములకు యూఎస్ ఎయిడ్ ఆదేశాలు జారీ చేస్తూ ప్రాజెక్టులను నిలిపివేయాలని సూచించింది. 'పనుల నిలిపివేతను కొనసాగించాలి. ఆదేశాలు రద్దయ్యాయని ఒప్పంద అధికారి (యూఎస్ ఎయిడ్) లిఖితపూర్వకంగా నోటిఫికేషన్ ఇచ్చే వరకూ పనులు ప్రారంభించకూడదు' అని తెలిపింది.

ఉదత సాయమే అయినా...

గర్భిణులు-శిశు మరణాలు, టీబీ, హెచ్ఐవీ, కోవిడ్ తదితర ఆరోగ్య సంబంధమైన సవాళ్లను ఎదుర్కోవడంలో యూఎస్ ఎయిడ్ కేంద్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తోంది. 1990 నుండి మన దేశంలో 20 లక్షల మంది చిన్నారుల ప్రాణాలు కాపాడడంలో సాయపడింది. ఆ సంస్థ సాయంతోనే 25 వేల న్యుమోనియా, 14 వేల డయేరియా మరణాలను నివారించగలిగాము. టీబీ వ్యాధిని నివారించడంలో కూడా యూఎస్ ఎయిడ్ సాయం మరువలేనిది. 1995 నుండి హెచ్ఐవీ వ్యాధిని అరికట్టడంలో ప్రభుత్వం, పౌర సమాజంతో కలిసి యూఎస్ ఎయిడ్ పనిచేస్తోంది. దీంతో 2007 నుండి దేశంలో ఎయిడ్స్ ఇన్‌ఫెక్షన్లు 32 శాతం మేర తగ్గాయి. కోవిడ్ సమయంలో యూఎస్ ఎయిడ్ మన దేశానికి 13.1 మిలియన్ డాలర్ల సాయాన్ని ప్రకటించింది. కొన్ని వైద్య పరికరాలను కూడా అందజేసింది.

దేశంలోని 16 రాష్ట్రాల్లో తొమ్మిది భాషలను చదవడంలో విద్యార్థుల్లో నైపుణ్యాన్ని మెరుగుపరచేందుకు యూఎస్ ఎయిడ్, దాని భాగస్వాములు కృషి చేస్తున్నారు. బోధనా నైపుణ్యాన్ని మెరుగుపరచడానికి 61 వేల మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ భారత్ అభియాన్‌కు కూడా యూఎస్ ఎయిడ్ మద్దతు ఇస్తోంది. మూడు లక్షల మందికి మరుగుదొడ్ల సౌకర్యాన్ని కల్పించింది. యూఎస్ ఎయిడ్ మద్దతుతో సాంకేతికతను అందిపుచ్చుకొని 1.32 లక్షల మంది రైతులు అదనపు దిగుబడులు, ఆదాయాలను పొందారు.

అందుబాటులో లేని అమెరికా వెబ్‌సైట్లు

ఇదిలావుండగా ట్రంప్ ప్రభుత్వ నిర్ణయంతో యూఎస్ ఎయిడ్ సహా 350 అమెరికా సర్కారు వెబ్‌సైట్లు అందుబాటులో లేకుండా పోయాయి. వీటిలో రక్షణ, వాణిజ్యం, ఇంధనం, రవాణా, కార్మికులు, కేంద్ర ఇంటెలిజెన్స్ సంస్థ, సుప్రీంకోర్టు వంటి ప్రభుత్వ విభాగాలతో అనుసంధానించిన వెబ్‌సైట్లు కూడా ఉన్నాయి.

ప్రభావం తప్పదా?

యూఎస్ ఎయిడ్ మన దేశంలో 70 సంవత్సరాలకు పైగా పనిచేస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత్ బడ్జెట్ 600 బిలియన్ డాలర్లు కాగా యూఎస్ ఎయిడ్ ద్వారా మన దేశం 140 మిలియన్ డాలర్ల సాయం పొందింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో యుఎస్ ఎయిడ్ సంస్థ భారత ప్రభుత్వం-పౌర సమాజానికి 6.8 మిలియన్ డాలర్లు, ఆరోగ్యానికి 55 మిలియన్ డాలర్లు, పర్యావరణానికి 18 మిలియన్ డాలర్లు, సామాజిక మౌలిక సదుపాయాలకు 7.8 మిలియన్ డాలర్లు అందజేసిందని విదేశీ సాయానికి సంబంధించిన అమెరికా ప్రభుత్వ వెబ్‌సైట్ తెలిపింది. యూఎస్ ఎయిడ్ నుండి భారత్ పొందుతున్న సాయం స్వల్పమే అయినప్పటికీ ఇప్పుడది నిలిచిపోవడంతో ఆరోగ్య సంబంధమైన ప్రాజెక్టులపై ప్రభావం పడుతుంది. విద్య, వాతావరణ మార్పు తదితర రంగాలకు అందుతున్న సాయం కూడా కుంటుపడే అవకాశం ఉంది.

ట్రంప్, మస్క్ అక్కసు

'యూఎస్ ఎయిడ్‌కు సంబంధించిన అంశాలపై ట్రంప్‌తో వివరంగా చర్చించాను. సాయాన్ని నిలిపివేసేందుకు ఆయన అంగీకరించారు' అని టెస్లా అధిపతి, ట్రంప్ సన్నిహితుడు ఎలన్ మస్క్ తెలిపారు. యూఎస్ ఎయిడ్ అనేది ఓ నేరచరిత కలిగిన సంస్థ అని, అది కనుమరుగు కావాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. దేశాధ్యక్షుడు ట్రంప్ సైతం మీడియాతో ముచ్చటిస్తూ అది 'రాడికల్ వామపక్ష పిచ్చివాళ్ల గ్రూప్' అని ఎద్దేవా చేశారు. విదేశాలకు సాయం అందించాలన్న ఉద్దేశాన్ని ఇష్టపడతానని, అయితే వాళ్లు రాడికల్ వామపక్ష పిచ్చివాళ్లుగా మారారని ఆరోపించారు. సాయం అందించడం మంచిదే అయినా దానిని చేసే వారి గురించే ఆలోచించాల్సిన అవసరం ఉన్నదని వ్యాఖ్యానించారు.



వామ్మో..భౌ భౌ

పెరుగుతున్న కుక్క కాట్లు

ప్రతి గంటకూ 60 మంది చిన్నారులపై దాడి

బాధ్యత రాష్ట్రాలదే ! మేమేంచేస్తాం ?

న్యూఢిల్లీ : గత సంవత్సరంలో దేశంలో 22 లక్షల మంది కుక్క కాటుకు గురయ్యారు. కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ అలియాస్ లలన్ సింగ్ మంగళవారం లోక్‌సభకు ఈ విషయాన్ని తెలియజేశారు. 2024లో 21,95,122 కుక్క కాటు ఘటనలు చోటుచేసుకున్నాయని, 37 మంది ప్రాణాలు కోల్పోయారని ఆయన చెప్పారు. గత ఏడాది కోతులు సహా ఇతర జంతువుల దాడిలో 5,04,728 మంది గాయపడ్డారని, 11 మరణాలు సంభవించాయని వివరించారు. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు అందించిన వివరాల ప్రకారం కుక్క కాటుకు గురైన వారిలో 5,19,704 మంది పదిహేను సంవత్సరాల లోపు వయసున్న వారేనని అన్నారు. ఈ లెక్కన ప్రతి గంటకూ 60 మంది పిల్లలపై కుక్కలు దాడి చేస్తున్నాయని తెలిపారు. జంతువుల దాడులకు సంబంధించిన అంశం రాష్ట్రాల పరిధిలోనిదని అంటూ వీటిపై స్థానిక సంస్థలు చర్యలు తీసుకోవాలని చెప్పారు.


మరో ప్రశ్నకు మంత్రి లిఖితపూర్వక సమాధానమిస్తూ రాష్ట్రీయ కామధేను ఆయోగ్ చైర్మెన్ పదవి 2022 ఫిబ్రవరి నుంచి ఖాళీగానే ఉన్నదని తెలిపారు. దీని సిఫారసుల ఆధారంగా ఏ పథకాన్నీ అమలు చేయడం లేదని, కాబట్టి 2019 నుంచి దీనిపై ఖర్చే పెట్టలేదని వివరించారు.

నవతెలంగాణ

తాను నమ్మిన సత్యాన్ని ఆచరించలేకపోవటమే జీవిత వైఫల్యం - గౌతమ బుద్ధుడు

సంపాదకీయం

బీసీ రిజర్వేషన్లు



రాష్ట్ర అసెంబ్లీలో కులగణన నివేదిక ఆమోదం పొందింది. బీసీ రిజర్వేషన్ల తీర్మానాన్ని కేంద్రానికి సిఫారసు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభలో ప్రకటించారు. కాంగ్రెస్ కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం 42 శాతం రిజర్వేషన్లను అసెంబ్లీలో బిల్లుపెట్టి నేరుగా అమలుచేయాలని ప్రతిపక్షం డిమాండ్ చేసింది. సర్కారీ సామాజిక, ఆర్థిక, ఉపాధి, విద్య, రాజకీయ, కుల సర్వేకు అసెంబ్లీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన తరుణంలో రిజర్వేషన్లకు రాజ్యాంగ రక్షణ అవసరం.

తెలంగాణలో చేపట్టిన కులగణనను దేశవ్యాప్తంగా చేపట్టాలని సభ డిమాండ్ చేసింది. 'ఎందరో సీఎంలకు ఈ అవకాశం రాలేదు..నాకు వచ్చింది. ఫిబ్రవరి నాలుగును ఇక నుంచి సామాజిక న్యాయ దినోత్సవంగా నిర్వహిస్తాం' అని సీఎం ప్రకటించారు. రిజర్వేషన్లను వ్యతిరేకిస్తున్న బీజేపీ

ప్రస్తుత పరిస్థితుల్లో కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలుచేయాల్సిందేనని ప్రతిపక్షాలు పట్టుపడుతున్నాయి. నలభై రెండు శాతం రిజర్వేషన్లను ఉపకులాలవారీగా కల్పించి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని సర్కారుకు అల్టిమేటం ఇస్తున్నాయి. అలాకాకుండా పార్టీపరంగానే రిజర్వేషన్లు కల్పించేందుకు కాంగ్రెస్ పూనుకుంటే, తీవ్రస్థాయి పరిణామాలు ఎదుర్కొవాల్సి రావచ్చు. కులగణన చేశాం, క్యాబినెట్‌లో తీర్మానించాం, అసెంబ్లీలో ఆమోదించాం, ఇక తమ పని అయిపోందని రేవంత్ సర్కారు కనుక చేతులు దులుపుకోవాలని భావిస్తే తప్పులో కాలేసినట్టే.

కేంద్ర సర్కారు, దీనికి ఒప్పుకుంటుందా? ఇదొక ప్రశ్న. కాగా అసెంబ్లీలో తీర్మానం చేసి తప్పించుకునే ప్రయత్నం రేవంత్ సర్కారు చేస్తున్నదనే విమర్శలూ వెల్లువెత్తుతు న్నాయి. జనాభా లెక్కలపై అసెంబ్లీలో కేంద్రంలోని మోడీ సర్కారుపై సీఎం నిప్పులు చెరగడం చర్చనీయాంశ మవుతున్నది. 2011 జనాభా లెక్కలు తప్పితే, దేశంలో మరే అధికారిక లెక్కలూ లేవని ఆగ్రహం వ్యక్తంచేశారు కూడా. 2021లో జనాభా లెక్కలు సేకరించలేదనీ, అది బీసీల హక్కులకు నష్టం కాదా? అని ప్రశ్నిస్తున్నారు. గుజరాత్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు ప్రధానంగా ఓటరు జాబితాల ఆధారంగా బీసీ రిజర్వేషన్లను స్థిరీకరించాయి. అయితే ఓడిషా ప్రభుత్వం కమిషన్‌ను ఏర్పాటు చేసింది. బీహార్, కర్నాటక రాష్ట్రాలు మాత్రం కులసర్వే చేపట్టాయి.


స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లను రాజ్యాంగబద్ధంగా కల్పిస్తున్నారు. బీసీలకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలే కొన్ని ఇస్తున్నాయి. గతంలో లాటరీ పద్ధతిలో, ర్యాండమ్‌గా ఎంపిక చేసే తదితర అశాస్త్రీయ పద్ధతుల్లో రిజర్వేషన్లు అమలుచేస్తుండగా, ప్రతిసారి వాటిపై న్యాయ వివాదాలు తలెత్తడం పరిపాటైంది. ఈ రిజర్వేషన్లు కర్నాటకకు చెందిన కె.కృష్ణమూర్తి, మహారాష్ట్రకు చెందిన వికాస్‌రావు గవిళి కేసులో సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. ట్రిపుల్ 'టీ' పేరిట మార్గదర్శకాలిచ్చింది. మొదటిది ప్రతి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓబీసీ రిజర్వేషన్ల అమలు, ఫలితాలపై అధ్యయనం చేసేందుకు పూర్తిస్థాయి రాజ్యాంగబద్ధమైన డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలి. రెండోది జనాభా నిష్పత్తికి అనుగుణంగా రిజర్వేషన్లను స్థిరీకరించాలి, మూడోది రిజర్వేషన్లు కూడా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కలిపి మొత్తం యాభై శాతం మేరకు మించకూడదు. ఆ మార్గదర్శకాలను పాటించని ఏ రాష్ట్రంలోకూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓబీసీ రిజర్వేషన్లు అమలుచేయకూడదని సుప్రీంకోర్టు స్పష్టంగా తేల్చిచెప్పింది. ఈ నిబంధనలను పాటించని గుజరాత్, మహారాష్ట్రతోపాటు పలు రాష్ట్రాల్లో స్థానిక సంస్థల ఎన్నికలను సైతం దేశ అత్యున్నత న్యాయస్థానం రద్దుచేసింది. సిఫారసులు లేకుంటే బీసీ రిజర్వేషన్ స్థానాలన్నింటినీ జనరల్‌గా మార్చాలని ఆదేశించింది.

ప్రస్తుత పరిస్థితుల్లో కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాల్సిందేనని ప్రతిపక్షాలు పట్టుపడుతున్నాయి. నలభై రెండు శాతం రిజర్వేషన్లను ఉపకులాలవారీగా కల్పించి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని సర్కారుకు అల్టిమేటం ఇస్తున్నాయి. అలాకాకుండా పార్టీపరంగానే రిజర్వేషన్లు కల్పించేందుకు కాంగ్రెస్ పూనుకుంటే, తీవ్రస్థాయి పరిణామాలు ఎదుర్కొవాల్సి రావచ్చు. కులగణన చేశాం, క్యాబినెట్‌లో తీర్మానించాం, అసెంబ్లీలో ఆమోదించాం, ఇక తమ పని అయిపోందని రేవంత్ సర్కారు కనుక చేతులు దులుపుకోవాలని భావిస్తే తప్పులో కాలేసినట్టే. అసెంబ్లీలో చెప్పినట్టుగా అఖిలపక్షం నిర్వహించి, అవసరమైతే ఢిల్లీ తీసుకెళ్లి మోడీ సర్కారుపై ఒత్తిడి తేవాలి. మెడలు వంచైనా సరే రిజర్వేషన్లను జనం ముంగిళ్లకు చేర్చాలి. వాటికి రాజ్యాంగ రక్షణ ఉండేలా చూసుకోవాలి.

1948 జనగణన చట్టం ప్రకారం జనగణన, కులగణన చేసే అధికారం కేవలం కేంద్రానిదే. ఇటీవల బీహార్ సర్కారు చేపట్టిన కులగణన కోర్టుకెక్కడమే నిదర్శనం. కులగణన కమిషన్ వేసి లెక్కలు తీసిన తెలంగాణ ప్రభుత్వం, అసెంబ్లీలో బిల్లుపెట్టి నేరుగా రిజర్వేషన్లను అమలు చేయాలని సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నది. గత పదేండ్లలో పంపిన పలు తీర్మానాలను మోడీ సర్కారు తుంగలో తొక్కిన విషయాన్ని గుర్తుచేస్తున్నది.

విద్యా, ఉద్యోగాల్లో ఉన్న రిజర్వేషన్లను స్థానిక సంస్థల్లోనూ ప్రవేశపెట్టాలని చెబుతున్నది. రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్లో చేర్చి తమిళనాడు తరహాలో బీసీలకు రిజర్వేషన్లను తెలంగాణలోనూ అమలుచేసే వీలుంది.

హర్యానా గెలుపు వెనుక...



చాలామంది కుల పెద్దలు(ఖాప్ నాయకులు) అవినీతిపరులని, వారు కొత్త నాయకులను ఎదగనివ్వరని, హర్యానాలో బీజేపీ తిరిగి అధికారంలోకి రావడానికి అలాంటి నాయకులే కారణమని మేము ప్రజలతో జరిపిన సంభాషణ లలో తేలింది.హర్యానా ఎన్నికల ఫలితాలు అందరినీ ఆశ్చర్యపరిచాయి.రాష్ట్రంలో వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతులు, అగ్నిపథ్ పథకానికి సంబంధించి యువత, భారతీయ జనతా పార్టీ రాజకీయ నాయకుడి లైంగిక వేధింపుల ఆరోపణలపై మహిళా రెజ్లర్లు వరుసగా తీవ్రస్థాయిలో నిరసనలు తెలిపారు. ఈ నిరసనల నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓడిపోతుందని భావించారు. కానీ అన్ని అంచనాలకు భిన్నంగా బీజేపీ ఎన్నికల్లో గెలిచింది. ఈ నిరసనలు జాట్లలో మాత్రమే కేంద్రీకృతమై ఉన్నాయని అప్పుడు వాదించటం జరిగింది. ఈ వాదన ప్రకారం, ఇది ఎన్నికల్లో జాట్ వర్సెస్ నాన్-జాట్ ధ్రువణానికి(పోలరైజేషన్‌కి) దారితీసింది. ఈ విషయంలోని గతిశీలతను అర్థం చేసుకోవడానికి మేము హర్యానాను సందర్శించి, సింగు సరిహద్దులో జరిగిన రైతుల నిరసనల్లో చురుగ్గా పాల్గొన్న జాట్ రైతులను, ఇతర రైతు నాయకులను కలవాలని నిర్ణయించుకున్నాము.

చాలామంది జాట్ రైతులు జాట్ వర్సెస్ నాన్-జాట్ పోలరైజేషన్‌ని ఖండించలేదు. అయితే, బీజేపీ జాట్లను దుర్మార్గులుగా చిత్రించటంవల్లనే ఇది సాధ్యమైందని వారు భావిస్తున్నారు. గ్రామాల్లోని బీజేపీ, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) కార్యకర్తలు జాట్లకు, జాట్యేతరులకు మధ్య ఉండే చిన్న చిన్న రోజువారీ సమస్యలను ఘర్షణలుగా మార్చటాన్ని వారు గమనించారు. హిందూ-ముస్లింల మధ్య కూడా ఘర్షణలు ఇలాగే జరుగుతాయని, తప్పుడు సమాచారంతో మెజారిటీ సమాజం ప్రభావితమౌతుందని వారు ఇప్పుడు గ్రహించారు.

అన్ని కులాలు, వర్గాలు కలిసి జీవిస్తాయని మాతో మాట్లాడినవారిలో చాలా మంది చెప్పారు. జాట్లకు, దళితులకు కూడా దగ్గరి సంబంధాలు ఉన్నాయి. వారి మధ్య కులాంతర వివాహాలు జరిగిన సందర్భాలు కూడా ఉన్నాయి. "మేము కలిసి ఉన్నాము కానీ ఎన్నికల సమయంలో మేము విడిపోతాము" అని ప్రతిస్పందించినవారిలో ఒకరు అన్నారు. దానికి అక్కడ వున్న దళితులు అంగీకరించారు: "అవును. జాట్లు ఓటు వేసే పార్టీకి మేము ఓటు వేయము". నిత్య జీవితంలో పరస్పరం ఆధారపడటమనే పునాదిపై సాగే సామాజిక సహజీవనం అధికారం కోసం జరిగే పోరాటాలను, ఆధిపత్యం, వివక్షతలకు సంబంధించిన ఆందోళనలను నిర్మూలించజాలదనే వాస్తవం ఈ నిగూఢ అంశాన్ని వివరిస్తుంది.

రిజర్వేషన్ల ఉప-వర్గీకరణ తర్వాత చమార్లు కాని దళితులు, ఎక్కువగా వాల్మీకులు బీజేపీకి ఓటు వేశారని కూడా జాట్ రైతులు గమనించారు. దళితులు, ఓబిసిలలోనే కాకుండా జాట్లలో కూడా ఇటువంటి విభజనల వల్ల బీజేపీ ప్రయోజనం పొందుతుందనేది ఆసక్తికరమైన విషయం. అన్ని రాజకీయ పార్టీలు ఒక నిర్దిష్ట నియోజకవర్గంలో జాట్ అభ్యర్థులను నిలబెడితే, జాట్లు గోత్రాల వారీగా విడిపోతారు. ఇటీవలి ఎన్నికల్లో బీజేపీ ఈ విధంగా జాట్ ఓట్లలో ఒక భాగాన్ని పొందింది. ఎన్నికలకు ముందు బిపిఎల్ కార్డులను కూడా బీజేపీ ఉచితంగా పంపిణీ చేసింది. ఈ కార్డులను ముఖియా లనబడే కుల పెద్దల ఆదేశాలకు అనుగుణంగా పంపిణీ చేశారు. వీరిలో చాలామంది రాజకీయంగా బీజేపీతో సంబంధంలో ఉన్నారు. వీరు బీజేపీకి అనుకూలంగా ఉండటానికి ప్రోత్సహకాలు కొంతవరకు కారణం. దళితులు, ఓబిసిలు బీజేపీకి ఓటు వేయడం రాజకీయాల్లో మార్పుకు కారణం కాదని చాలామంది భావించారు.


రైతాంగ నిరసనల సమయంలో చురుకుగా పాల్గొన్న ఒక రైతు నాయకుడి నేతృత్వంలో జాట్లు నిర్వహించిన నిరసన ప్రదర్శనను మేము మరింత దూరం పయనించాక చూశాము. స్థానిక జాట్ కుటుంబానికి చెందిన ఇద్దరు సభ్యులను హత్య చేసిన కేసులో పోలీసులు ఎటువంటి చర్య తీసుకోకపోవడానికి వ్యతిరేకంగా ఈ నిరసన జరిగింది. ఈ హత్యలను ఒక దళిత యువకుడు చేశాడనే ఆరోపణ ఉంది. అయితే సదరు రైతు నాయకుడు, ఇతరులు దీనిని సామాజిక లేదా కుల సంఘర్షణగా చూడలేదు. అంతేకాకుండా బీజేపీకి ఓటు వేసిన దళితులు తమ తప్పును గ్రహించారని, భవిష్యత్తులో కొత్తగా జాట్-దళిత ఐక్యత ఉద్భవిస్తుందని ఆ రైతు నాయకుడు వాదించారు. అయితే, జాట్‌లు, ఓబీసీలు కలవడం కష్టమని, దానికి కారణం ఓబీసీలు జాట్ నాయకత్వాన్ని అంగీకరించ డానికి సిద్ధంగా లేరని ఆయన అన్నారు. సాపేక్షంగా సమాన స్థాయిగల కులాల కంటే అసమాన స్థాయిలోవున్న కులాలు ఒక కూటమిగా ఏర్పడటానికి అవకాశం ఎక్కువగా ఉంటుందనే సామాజిక కోణాన్ని ఈ అంశం లేవనెత్తుతుంది.

సర్ చోటూ రామ్ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఈ జాట్ రైతు నాయకుడి విశ్లేషణ నిజమేనేమో అనిపించింది.ఈ కార్యక్రమంలో ప్రముఖ జాట్ రాజకీయ నాయకులు, కులపెద్దలు మాత్రమే కాకుండా, బిఎఎమ్ సిఇఎఫ్‌కు చెందిన స్థానిక నాయకుడు కూడా కులఐక్యత గురించి అనర్గళంగా మాట్లాడారు. చాలామంది కులపెద్దలు (ఖాప్ నాయకులు) అవినీతిపరులని, వారు కొత్త నాయకులను ఎదగనివ్వరని, హర్యానాలో బీజేపీ తిరిగి అధికారంలోకి రావడానికి అలాంటి నాయకులే కారణమని మేము ప్రజలతో జరిపిన సంభాషణల్లో తేలింది.

(టెలిగ్రాఫ్ సౌజన్యంతో)

- అజయ్ గుడవర్తి, మహేష్ చౌదరి

పన్సారే హత్యకేసు : దర్యాప్తు తీరు



ఎస్. వినయ కుమార్
9989718311

'శివాజీ కౌన్ హోతా' పుస్తక రచయిత, హేతువాద ప్రచారకర్త, కార్మిక నాయకుడు గోవింద్ పన్సారే హత్య కేసు నిందితులకు గతవారం బొంబాయి హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఆ సందర్భంగా సింగిల్ బెంచి న్యాయమూర్తి చేసిన వ్యాఖ్య గమనించదగింది. 'ఈ కేసులో ఇప్పటికీ ప్రాసిక్యూషన్ తగిన సాక్ష్యాలను కోర్టుముందు ఉంచలేదు. కేసు ఇప్పట్లో ముగిసే సూచనలు లేవు. కనుక నేను బెయిల్ ఇసున్నాను' అని చెప్పారు. ఆ హత్యకేసులో పన్నెండుమందిపై కేసు బుక్కయింది. కాని పదేండ్లకాలంలో పదిమందినే అరెస్టు చేశారు. మరో ఇద్దరు ఇంకా పరారీలోనే ఉన్నారు. నరేంద్ర దబోల్కర్, కల్బుర్గి, గౌరి లంకేశ్ కేసుల్లో కూడా వీరే నిందితులు. 2015 ఫిబ్రవరి 16న మహారాష్ట్రలోని కొల్హాపూర్ నగరంలో 82ఏండ్ల పన్సారేతో పాటు ఆయన భార్య ఉమ పన్సారేపై ఇద్దరు దుండగులు కాల్పులు జరిపి పారిపోయారు. బుల్లెట్ గాయాలతో నాలుగు రోజుల అనంతరం పన్సారే అస్పత్రిలో మరణించారు. పన్సారే న్యాయవాది, సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేసిన వ్యక్తి. వ్యవసాయ కూలీ కుటుంబం నుండి వచ్చినవాడు. చదువు కోసం కొంతకాలం ఒక కళాశాలలో ప్యూన్‌గా పనిచేస్తూ ఉన్నత చదువులు చదువుకుని అదే కళాశాలలో కొద్దిరోజులు అధ్యాపకుడిగా పనిచేసిన మేధావి. కాగా కేసులోని నిందితులకు బెయిల్ ఇవ్వరాదని పన్సారే కోడలు పెట్టుకున్న పిటిషన్‌ను న్యాయమూర్తి తోసి పుచ్చారు.

అండర్ ట్రయల్స్ ఉన్న పదిమందిలో ఆరుగురికి న్యాయమూర్తి బెయిల్ ఇచ్చారు. మరో ఆరునెలల్లో దర్యాప్తు పూర్తవుతుందని, బెయిలివ్వొద్దని ప్రాసిక్యూషన్ చేసిన వాదనను న్యాయమూర్తి పట్టించుకోలేదు. ప్రధాన నిందితుడు వీరేంద్ర సిన్హ్ పెట్టుకున్న బెయిల్ పిటిషన్‌ను విచారణ కోసం న్యాయమూర్తి వాయిదా వేశారు. ఈ కేసు పరిష్కారం కావడం లేదు గనుక దర్యాప్తును 2022 ఆగస్టులో యాంటీ టెర్రిస్టు స్క్వాడ్‌కు అప్పగించారు అయినా కొలిక్కి రాలేదు. నిందితులకు శిక్షపడలేదు. నిందితుల్లో ఇద్దరిని ఉమ పన్సారే గుర్తుపట్టారు కూడా. బెయిల్ పొందిన ఆరుగురినీ కూడా 2018-19ల మధ్య మాత్రమే పోలీసులు అరెస్టు చేశారంటే వారు సాధారణ హంతకులు కాదని చాలా పెద్ద నెట్‌వర్క్‌గల వారని తెలిసిపోతోంది.

చత్రపతి శివాజీపై పన్సారే పరిశోధనలు చేసి ఒక పుస్తకం ప్రచురించాడు. దానికితోడు అనేక పట్టణాల్లో తిరుగుతూ, శివాజీపై ఉన్న మూఢనమ్మకాలను తొలగిస్తూ ప్రసంగాలు చేశాడు. దీన్ని జీర్ణించుకోలేని మతోన్మాదులు పన్సారేను పొట్టన పెట్టుకున్నారు. ముస్లింలపై విద్వేషం రగల్చాడని శివాజీని మత రాజకీయవాదులు ఉపయోగించు కున్నారు. ఇప్పటికీ అదే పనిచేస్తున్నారు. వారు అనుసరించిన ఎత్తుగడను పన్సారే పుస్తకం ఎండగట్టింది. ఆయ న్ను మట్టుబెట్టడం ద్వారా తమ ఎత్తుగడకు ఢోకా లేకుండా చేసుకోవచ్చని మతవాదులు భావించారు. కానీ వారు ఊహించిన దానికి భిన్నంగా జరిగింది. ఆయన మరణించాక ఆ పుస్తకం ఇంగ్లీషుతో సహా ఎనిమిది భాషల్లో వెలువడి కొన్ని మాసాల్లోనే లక్ష కాపీల వరకు అమ్ముడు పోయింది. శివాజీ 17వ శతాబ్దపు రాజే అయినా ఆయన చుట్టూ అల్లిన కథలు, నాటకాలు, మరాఠీ జానపద సాహిత్యం ఆయన్ని సజీవంగా ఉంచాయి. వాటిలో కల్పితాలే ఎక్కువ. మహారాష్ట్రతో పాటు ఆయన ప్రభావం తెలంగాణలోనూ, హిందీ రాష్ట్రాల్లోనూ కన్పిస్తుంది. తెలంగాణలోని చాలా పట్టణాల్లో హిందూ వాహిని పేర పెద్దపెద్ద విగ్రహాలు నెలకొల్పారు. ఏం చెప్పినా మహారాష్ట్రలో నేటికీ చెల్లుబాటు అవుతుంది. కనుక మతాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేసే శివసేనకు,బీజేపీకి శివాజీ మహదవకాశంగా కన్పించాడు. ప్రస్తుతం డిస్నీ హాట్ స్టార్ చానెల్‌లో శివాజీ ఖజానా చుట్టూ అల్లిన కట్టుకథతో 'షిలేదార్' అనే సీరియల్ స్ట్రీమ్ అవుతోంది. శివాజీని దాన్ని అడ్డుపెట్టుకొని మత భావనలు చెదరకుండా చూసే ప్రయత్నం ఆ సీరియల్‌లో కన్పిస్తుంది.

ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు, మూఢ నమ్మకాల వ్యాప్తికి సంబంధం ఉంది. కనుకే మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ప్రచారం చేసే బాధ్యతను కూడా కార్మిక నాయకుడైన పన్సారే చేపట్టారు. 1869లో శివాజీ పై జోతిరావు పూలే దీర్ఘకవిత (పోవడా) రాశారు. అందులో పురోహిత వర్గం కుయుక్తులకు, మహారాష్ట్ర ద్రోహులకు వ్యతిరేకంగా పోరాడిన యోధునిగా శివాజీని అభివర్ణించారు. రైతులకు శివాజీ చేసిన మేలేమిటో పూలే తన దీర్ఘకవితలో ప్రస్తావించారు. పూలే రచనలు కూడా శివాజీ పై పరిశోధనకు పన్సారే ప్రేరేపించాయి. శివాజీపై హిందూ మతవాదులు చేసే అన్వయం వాస్తవం కాదని పన్సారే ఎలుగెత్తి చాటారు. అందుకు ఆధారంగా శివాజీ తన సైనిక దళాలకు, శిస్తు వసూల్ అధికారులకు రాసిన లేఖలను ఉదహరించారు. ఔరంగజేబుపై శివాజీ చేసిన పోరాటం మతదృష్టితో చేసింది కాదు. మహారాష్ట్రను తన అధీనంలోకి తెచ్చుకోవాలని చక్రవర్తి ఔరంగజేబు ప్రయత్నించిన మాట నిజం. రాజ్య విస్తరణకు పూనుకోవడం రాజులందరూ చేసిన పనే. హైదరాబాదు (గోల్కొండ)ను ముస్లిం రాజే పాలిస్తున్నప్పటికీ దాన్ని కూడా ఔరంగజేబు తన అధీనంలోకి తెచ్చు కోవాలనుకొన్నాడు. హైదరాబాదుపై జరిపిన సుదీర్ఘ దండయాత్రలో రెండవసారి సఫలమయ్యాడు. కాని శివాజీపై ఔరంగజేబుకు పూర్తి విజయం లభించలేదు.

శివాజీ సైన్యంలోనూ, యంత్రాంగంలోనూ, కీలక పదవుల్లో ముస్లింలున్నారు. 1659లో ఔరంగజేబు దూతగా వచ్చిన కపటి అఫ్జల్‌ఖాన్‌ను శివాజీ చంపేశాడు. ఆ తర్వాత అఫ్జల్‌ఖాన్ శవాన్ని పూర్తి సైనిక లాంఛనాలతో ఖననం చేయించి సమాధి సంరక్షణ కోసం నిధులు మంజూరు చేశారు. ముస్లిం మత వ్యతిరేకే అయి ఉంటే ఆ పని చేసేవాడా? ఆ మతం శివాజీ పై దండయాత్ర కోసం హిందువైన రాజా జై సింగ్‌ను ఔరంగజేబు పంపారు. శివాజీ ఓటమి కోసం మహారాష్ట్ర బ్రాహ్మణులు జైసింగ్ చేత యజ్ఞం చేయించారు. నాజీల తరహాలో ఇతర మతస్థులపై శివాజీ నరమేధం సాగించలేదు. శివాజీని ఆదర్శంగా చెప్పుకునే మత పార్టీలు అందుకు భిన్నంగా వేలాది మందిని బలిగొన్న ఘటనలను మనం చూశాం.



శివాజీ సైన్యంలోనూ, యంత్రాంగంలోనూ, కీలక పదవుల్లో ముస్లింలున్నారు. 1659లో ఔరంగజేబు దూతగా వచ్చిన కపటి అఫ్జల్‌ఖాన్‌ను శివాజీ చంపేశాడు. ఆ తర్వాత అఫ్జల్‌ఖాన్ శవాన్ని పూర్తి సైనిక లాంఛనాలతో ఖననం చేయించి సమాధి సంరక్షణ కోసం నిధులు మంజూరు చేశారు. ముస్లిం మత వ్యతిరేకే అయి ఉంటే ఆ పని చేసేవాడా? ఆ మతం శివాజీ పై దండయాత్ర కోసం హిందువైన రాజా జై సింగ్‌ను ఔరంగజేబు పంపారు. శివాజీ ఓటమి కోసం మహారాష్ట్ర బ్రాహ్మణులు జైసింగ్ చేత యజ్ఞం చేయించారు. నాజీల తరహాలో ఇతర మతస్థులపై శివాజీ నరమేధం సాగించలేదు. శివాజీని ఆదర్శంగా చెప్పుకునే మత పార్టీలు అందుకు భిన్నంగా వేలాది మందిని బలిగొన్న ఘటనలను మనం చూశాం.

యూరోప్‌లో మాదిరిగా మత యుద్ధాలు భారతదేశంలో జరగలేదు. హిందు రాజుల దగ్గర కీలక స్థానాల్లో ముస్లింలు, ముస్లిం రాజుల దగ్గర కీలక స్థానాల్లో హిందువులు పనిచేశారు. మొఘల్, కుతుబ్ షాహిల, అసఫ్ జాహిల, బీజపూర్, శివాజీ ఎవరి చరిత్రను చూసినా ఈ విషయం కనపడుతుంది. మొగలు చక్రవర్తి నవరత్నాల్లో బీర్బల్, తాన్‌సేన్‌లు ఉన్నారు. ఆయన ఆర్థిక మంత్రి రాజా తోడర్ మల్, సైన్యాధ్యక్షుడూ పనిచేసినవాడు రాజామాన్ సింగ్, అతను అక్బర్ బావమరిది కూడా గోల్కొండ కుతుబ్‌షాహిల దగ్గర అక్కన, మాదనలు కీలక స్థానాల్లో ఉన్నారు. హైదరాబాదు అసఫ్ జాహీల దగ్గర రాజా కిషన్ ప్రసాద్ లాంటి వారు మంత్రిత్వం నెరిపారు. బీజాపూర్ సుల్తాన్ దగ్గర తమకు నెలవారి వేతనాలు సరిగ్గా అందడం లేదంటూ తన దగ్గరకు వచ్చిన వేయిమంది ముస్లిం పఠాన్లను శివాజీ తన సైన్యంలో చేర్చుకున్నారు. శివాజీ అనంతరం పేష్వాల పాలనలో కూడా వారి అంతఃపురం శనివార్‌వాడకు అఫ్ఘాన్‌గార్డులు కాపలా కాసేవారు. 1857లో ఝాన్సీరాణి కోటను చుట్టుముట్టిన కంపెనీ సైన్యానికి అఫ్ఘాన్ రక్షకదళం గట్టి ప్రతిఘటనను ఇచ్చింది. హిందూ, ముస్లిం రాజులు భారతీయ బ్రిటిష్ సైనికులు కలిసి తిరుగుబాటు చేశారు. ఆ మొదటి స్వాతంత్ర్య పోరాటానికి నామమాత్రంగానైనా సరే నాయకత్వం వహించినవాడు, చివరి మొగల్ చక్రవర్తి బహద్దూద్ షా జఫర్. ఆ తిరుగుబాటును అణిచేసిన ఇంగ్లీషు ప్రభుత్వం ఆయన్ని రంగూన్ జైల్లో బందీ చేసింది. ఆయన అక్కడే చనిపోయాడు. ఛత్రపతి శివాజీకి భవానిమాత ప్రత్యక్షమై ముస్లింలపై పోరాడేందుకు ఒక ఖడ్గం బహుకరించిందంటూ ఒక కట్టుకథ విస్తృత ప్రచారంలో ఉంది. నిజమేమిటంటే అది శివాజీకి పోర్చుగీసు వారు బహుకరించిన ఖడ్గమని, మ్యూజియంలో ఉన్న ఆ ఖడ్గంపై పోర్చుగీసు అక్షరాలున్నాయని పన్సారే ఎత్తిచూపారు. శివాజీ సైన్యంలో కనీసం పదమూడు మంది ముస్లిం సైనిక కమాండర్లు ఉండేవారు.

ఏ పరిస్థితుల్లో చేసినా శివాజీ తనరాజ్యంలో రైతులకు మేలుచేసే పలు చర్యలు చేపట్టారు. శిస్తు వసూల్ అధికారాలను ఫ్యూడల్ యంత్రాంగం నుండి తొలగించి అందుకు అధికారులను నియమించారు. పాటిల్, దేశ్‌ముఖ్, వతందార్, ఇనాందార్ల అధికారాలను కత్తిరించారు. కనుకనే కులీనులు శివాజీని రాజుగా గుర్తించలేదు.శూద్రకులాలు శివాజీ వెంట నిలబడ్డాయి. వారి మద్దతుతో ఆయన తన రాజ్యాన్ని విస్తరించారు. శివాజీ నెలకొల్పిన విధానాలను పేష్వాలు తమ పాలనలో కూల్చేశారు. గ్రామ పెత్తందార్లు తమ పెత్తనాన్ని పునరుద్ధరించుకున్నారు. శివాజీకి ఆనాడు మద్దతుగా నిల్చిన వారిని రాచిరంపాన పెట్టారు. ఓటమిపాలైన శత్రురాజ్యాల్లోని మహిళల పట్ల శివాజీ చూపిన గౌరవమర్యాదల్ని పన్సారే ఉదాహరణతో చెప్పారు.

రైతుల నుండి శిస్తు వసూల్ చేస్తున్నప్పుడు నడుచుకోవాల్సిన పద్ధతి గురించి 1671 సెప్టెంబర్ 6వ తేదిన శివాజీ తన సుబేదార్ ఒకరికి రాసిన ఒక లేఖ పూర్తి పాఠాన్ని పన్సారే తన పుస్తకంలో ప్రచురించారు. "అధికారులు ప్రతి గ్రామం వెళ్లాలి. గ్రామంలో కౌల్దార్లందరినీ ఒక చోటుకి రమ్మనాలి. కౌల్దారు ఎంత మానవశ్రమ సమకూర్చుకోగలడో, అతని సామర్థ్యం ఎంతో నిర్ధారించుకోవాలి. దాన్నిబట్టి భూమిని ఆ రైతుకు ఇవ్వాలి. రైతు దగ్గర ఎడ్లు లేకపోతే ఒక జత ఎడ్లు ఇప్పించాలి. ఆహారం కోసం తిండిగింజలు కొలవాలి. ఆ రూపంలో ప్రభుత్వం ఇచ్చిన వడ్డీలేని అప్పును రైతులు చెల్లించగల స్థితిలో ఉన్నప్పుడు తీసుకోవాలి. రైతు పంట నష్టపోతే ఆ యేడు శిస్తు రద్దుచేయాలి. అందుబాటులో ఉన్న భూమినంతా సేద్యం కిందికి తేవాలి.

సైనికాధికార్లకు శివాజీ 1673 మే 19న ఒక లేఖ రాశారు. రైతుల నుండి తిండిగింజలు, గుర్రాలకు గడ్డి బలవంతంగా లాక్కోరాదు. సైన్యానికి అవసరమైన తిండిగింజలు, గడ్డి, వంటచెరుకు, కూరగాయలు డబ్బులిచ్చి కొనాలి. వాటికి మేము మీకు కేటాయించిన ధనం సరిపోతుంది. పంటపొలాల గుండా గుర్రాలతో పంటల్ని నష్టపరచరాదు. నావికా దళానికి కావాల్సిన పనసకర్ర కోసం రైతు అంగీకారంతో డబ్బు చెల్లించాకే చెట్టుపై చేయివేయాలి. మనుస్మృతికి భిన్నంగా ఉన్నత కులాలవారు చేసిన నేరాలకు కూడా శివాజీ కఠిన శిక్షలు వేశారు.

ఈ బడ్జెట్‌తో పేదరికం లేని భారత్ సాధ్యమేనా?




బి. వెంకట్
9490098045

2025-26కుగాను ఇటీవల పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టిన కేంద్ర ఆర్థికశాఖా మంత్రి నిర్మలా సీతారామన్ తెలుగింటి కోడలు. ఆమె గురజాడ మాటల్ని ఉటంకిస్తూ ప్రసంగాన్ని ప్రారంభించారు. 'తిండి కలిగితే కండ కలదోయ్.. కండ కలవాడే మనిషోయ్' అన్నారు గురజాడ. మరి ఇంత గొప్ప నీతివాక్యాల్ని పలికిన మంత్రి కేటాయింపుల్లో దేశ ప్రజలకు ఏంచేశారు? వారి ఉపాధికి, సామాజిక అభివృద్ధికి ఎంత పెంచారు? ఆలోచించాల్సిన సయమమిది.ఈ బడ్జెట్ తీరూ తెన్నుల్ని పరిశీలిస్తే గనుక సంపన్నుల కోసమే అన్నట్టుగా ఉంది తప్ప పేదలకు ఒరగబెట్టిందేమీ లేదు. గతంతో పోల్చిచూస్తే బడ్జెట్ సైజు కాస్త పెరిగిందంతే. ప్రతి పద్దుకూ ఐదు శాతం కేటాయింపులు పెరిగితే.. పోయినసారి కేటాయింపులతో సమానంగా ఉంటుంది. ఉత్పత్తి వర్గాలైన గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు, వ్యవసాయ కార్మికులు, పట్టణ ప్రాంతాల్లోని అసంఘటిత కార్మికులు, కార్మికులు, సామాజికంగా దళితులు, గిరిజనులు, మైనార్టీలు, ఓబీసీలు, మహిళలకు కేటాయింపులు చాలా ముఖ్యం. వారిని అడ్రెస్ చేయకుండా ఎన్ని కేటాయింపులు చేసినా నిరుపయోగమే. ఎన్ని గొప్ప పదాలు పలికినా నిష్ప్రయోజనమే.

పేదలు కడుపు నిండా తినాలన్నా, కంటినిండా నిద్రపోవాలన్నా వారికి కావాల్సింది ఉపాధి. దానికి అధిక నిధులు కేటాయించాల్సింది పోయి గతేడాదిలాగే ఈ యేడూ నామమాత్రపు నిధులు విదిల్చారు. ఇలాగైతే వారికి తిండి ఎలా కలుగుతుంది?కండ ఎలా పెరుగుతుంది? తిండి,కండ పక్కనపెడితే పూర్తిగా బక్కచిక్కి చావకుంటే చాలు. ఉపాధి హామీకి గత బడ్జెట్లో రూ.86 వేల కోట్లు ఇవ్వగా సవరించిన దాంట్లో 86 వేల కోట్లే ఇచ్చారు. ఇప్పుడూ అంతే. ఐదు శాతం పెంచాలన్నా సుమారు రూ.90 వేల కోట్లు, కానీ అంతే ఉంచారు. వాస్తవానికి ఉపాధి హామీ చట్టం సక్రమంగా అమలు కావాలంటే కనీసం రూ.2.5 లక్షల కోట్లు అవసరం. అలా కేటాయిస్తే గనుక గ్రామీణ ప్రాంతాల నుంచి వలసలు తగ్గుతాయి. కొనుగోలు శక్తి పెరుగుతుంది.

ఉపాధి హామీ అంటే? మోడీ దృష్టిలో అదానీ,అంబానీ లాంటి కార్పొరేట్లకు ఉపాధి కల్పించ డం. పేదరికాన్ని నిర్మూలించాలంటే ఆహార భద్రతకు ఎక్కువ నిధులు కేటాయించాలి. 24 కోట్ల రేషన్‌కార్డుల్లో 84 కోట్ల మంది ఆహార భద్రత మీద ఆధారపడి జీవిస్తున్నారు. గతంలో రూ.2.70 లక్షల కోట్లు ఇచ్చారు. మోడీ ప్రభుత్వం క్రమంగా తగ్గిస్తూ తగ్గిస్తూ పోయినేడాది రూ.2.03 లక్షల కోట్లకు కుదించింది. సవరించిన అంచనాల్లో రూ.1.97 లక్షల కోట్లకు కుదించారు. ఇక అంతకంటే ఎక్కువ కేటాయించలేనని మోడీ సర్కార్ చెప్పేసింది. ఇప్పుడు రూ.2.04 లక్షల కోట్లు ఇచ్చేస్తున్నామని ప్రకటించింది. పేదరికం లేని భారతాన్ని ఎలా సృష్టిస్తారు?

దేశంలో 65 శాతం ప్రజలు గ్రామీణ ప్రాంతంలో ఉన్నారు. పోయిన ఏడాది గ్రామాలకు రూ.2.60 లక్షల కోట్లు కేటాయించింది. ఖర్చుపెట్టింది 1.90 లక్షల కోట్ల రూపాయలే. అంటే, రూ.75 వేల కోట్లను గ్రామాల అభివృద్ధికి ఇక ఖర్చు పెట్టలేమని పార్లమెంట్ సాక్షిగా మోడీ సర్కారు తెగించి చెప్పింది. వ్యాధులకు ప్రధాన కారణం తాగునీరు శుభ్రంగా లేకపోవడం, సరైన ఆహారం అందకపోవడమేనని ఐక్యరాజ్యసమితి ఘోషిస్తున్నది. పోయిన సంవత్సరం జల్ జీవన్ (రక్షిత తాగునీటి జలాల కోసం)కు రూ.70 వేల కోట్లు కేటాయించి..దాన్ని రూ.22 వేల కోట్లకు సవరించారు. 70 శాతం నిధులనే జల్‌జీవన్‌కు వాడారు. ఇప్పుడు రూ.65 వేల కోట్లు కేటాయిస్తున్నట్టు గొప్పగా చెప్పింది. పోయినసారే ఖర్చు పెట్టలేదు. ఈసారి ఏం ఖర్చు పెడుతుంది?



ఇంకా విచిత్రమైన, ఆందోళనకరమైన అంశాలేమిటంటే రైతులకు అత్యంత ముఖ్యమైనది యూరియా. పోయిన బడ్జెట్‌లో యూరియాకు రూ.1.19 లక్షల కోట్లు కేటాయించి రూ.1.18 లక్షల కోట్లను ఖర్చు చేసింది. ఇప్పుడు 1.18 లక్షల కోట్ల రూపాయలనే ప్రకటించింది. వ్యవసాయానికి సరిగ్గా నిధులు ప్రకటిస్తే రైతు బతుకుతాడు. ఈ ప్రభుత్వానికి అది ఇష్టం లేదు. రైతులు బతికితే కంపెనీలు వ్యవసాయంలోకి రావు. జీడీపీలో రూ.70 లక్షల కోట్ల రూపాయల విలువైన వ్యవసాయ రంగంపై అంబానీ, అదానీ లాంటి బహుళజాతి కంపెనీల దృష్టి పడింది. అందుకే ఫెర్టిలైజర్లకు ఇచ్చే నిధులను పెంచలేదు. రైతులు దివాళా తీస్తే కార్పొరేట్లు వ్యవసాయాన్ని కబ్జా చేయడం సుళువవుతందనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు కనిపిస్తున్నది. అందుకే వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు తగ్గించిందనే విషయం తేటతెల్లమవుతున్నది.

మూడో అంశం, సామాజిక న్యాయం. ఎవరు అవునన్నా, కాదన్నా మన దేశంలో కులవివక్ష ఉంది. మతపరమైన దాడులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఇవన్నీ నిర్మూలించాలనే విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత ఉండాలి. సంక్షేమానికి ప్రాధాన్యతనివ్వాలి. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రాధాన్యత కల్పించాలి. ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజనలో భాగంగా గ్రామీణ ప్రాంతాలకు రూ.54 వేల కోట్లు కేటాయిస్తే..సిమెంట్, ఐరన్ రేటు పెరిగిన నేపథ్యంలో అవి సరిపోవని నిరసనల ద్వారా తెలియజేశాము. అయినా, సర్కారుకు పట్టలేదు. రూ.32,426 కోట్లు అంటే దాదాపు 40 శాతం నిధులు కేటాయించిన దాంట్లో కత్తిరించి పడేసింది. ఇది అహంభావంతో కూడుకున్న చర్య కాదా? అర్బన్ ప్రాంతానికి సంబంధించి రూ.30 వేల కోట్లు ఇచ్చారు. ఖర్చు పెట్టింది రూ.13,672 కోట్లు మాత్రమే. 60 శాతానికిపైగా నిధులు ఖర్చు పెట్టలేదు. కాగితాల్లో ఇప్పుడుల ఇండ్లు కట్టుకునేందుకు రూ.60 వేలు ఇస్తామంటు న్నారు? ఏమనాలి ఈ ప్రభుత్వాన్ని? ఇండ్లు ఇవ్వలేని అసమర్థ ప్రభుత్వం అనొద్దా? గతేడాది ఆరోగ్యరంగానికి రూ.89 వేల కోట్లు కేటాయించి రూ.88 వేల కోట్లే ఖర్చు పెట్టారు. విద్యారంగానికి రూ.1.25 లక్షల కోట్లు కేటాయించి ఖర్చు పెట్టింది రూ.1.14 లక్షల కోట్లే. అంటే సవరించిన దాంట్లో ఎనిమిది శాతం తగ్గించింది. సాంఘిక సంక్షేమం పట్ల మరింత దుర్మార్గంగా వ్యవహరించింది.

ఈనాటికీ అంటరానితనం విలయతాండవం చేస్తున్నది. కులాంతర, మతాంతర వివాహాలు చేసుకున్నవారికి రక్షణ లేదు. దేశంలో కుల దురహంకార హత్యలు పెరగడమే దీనికి సజీవ సాక్ష్యం. ఈ పరిస్థితిని ఎదిరించే శక్తి రావాలంటే సామాజిక న్యాయం కీలకం. పోయినసారి రూ.52 వేల కోట్లు కేటాయించి..సవరణల్లో రూ.46 వేల కోట్లకు తగ్గించారు. అంటే 18 శాతం కుదించారు. కేటాయింపుల్లో పేపర్ల మీద బాగా చూపి గ్రామీణ ప్రాంతాలకు, సంక్షేమ రంగాలకు, సామాన్య ప్రజానీకానికి సంబంధించిన నిధుల్లో కేంద్రం నిర్దాక్షిణ్యంగా కోత పెడుతున్నదనేది ముమ్మాటికీ నిజం. రక్షణ శాఖకు పెంచింది. కార్పొరేట్లకు పన్నుల రాయితీ ఎక్కువగా ఇచ్చింది. కార్పొరేట్లకు సవరించిన అంశాల్లో పెంచుకుంటూ పోతున్నది. సామాజిక అంశాలకేమో క్రమేణా తగ్గిస్తూ వస్తున్నది. ప్రధానమంత్రి పేరుతో ఎస్సీ పిల్లల స్కాలర్‌షిప్పుకు పోయినసారి రూ.6,050 కోట్లు కేటాయిస్తే సరిపోవని స్పష్టంగా చెప్పాము. అందులో రూ.4,500 కోట్లు మాత్రమే ఖర్చుపెట్టారు. సవరించిన దాంట్లో 22 శాతం కోత పెట్టారు. ఎస్సీ, ఎస్టీ పిల్లలకు ఇది అన్యాయం చేయడం కాదా? ఆ పిల్లలు ఉన్నత చదువులు చదవొద్దనే కుట్ర దాని వెనుక ఉన్నట్టేగా? ఇది ఆధిపత్య కులాల బడ్జెట్ అని ఎందుకు అనకూడదు? ఇప్పుడు రూ.7 వేల కోట్లు ఇస్తామని గొప్పలు చెప్పుకుంటున్నారు. ఎస్టీ పిల్లలకు ఇచ్చింది రూ.4,300 కోట్లు. సరిపోవని వాదించినా ఖర్చు పెట్టింది రూ.3,630 కోట్లే. సవరణ పేరుతో మోడీ సర్కారు కోత కోస్తున్నదనే విషయం స్పష్టమవుతున్నది. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఎనిమిది కోట్ల మంది మూడేండ్లలోపు చిన్నారులున్నారు. కోటిమంది వరకు గర్భిణులున్నారు. తల్లికి పౌష్టికాహారం అందిస్తే పిల్లలు ఆరోగ్యంగా పుడతారనే ఉద్దేశంతోనే అంగన్‌వాడీ కేంద్రాలను పెట్టారు. పోషణ్-1, పోషణ్-2 రెండింటికీ బడ్జెట్‌లో కోశారు. గత బడ్జెట్‌లో వైబ్రెంట్ ఇండియా అనే పథకాన్ని పెట్టారు. రూ.1,000 కోట్లు కేటాయించి రూ.209 కోట్లు మాత్రమే ఖర్చుపెట్టారు. వైబ్రెంట్ ఇండియా అంటే ఇదేనా?

ఈ బడ్జెట్ ఆసాంతం పరిశీలిస్తే అంతా ఆకలిచావులను పెంచే బడ్జెట్. నిరుద్యోగాన్ని పెంచే బడ్జెట్. కొనుగోలు శక్తిని తగ్గించే బడ్జెట్. అసమానతలను పెంచే బడ్జెట్. వలసలను పెంచే బడ్జెట్. కార్పొరేట్లు తయారు చేస్తే ఆరెస్సెస్ డైరెక్షన్‌లో పార్లమెంట్‌లో చదివిన బడ్జెట్. అందుకే ప్రజాపోరాటాల ద్వారానే పాలకుల మెడలు వంచాలి. హక్కుల్ని, ఆర్థిక నిధుల్ని సాధించుకోవాలి.

గుమ్మడిదలలో డంపింగ్ యార్డ్ లొల్లి

- వేలమంది పోలీసుల పహారాలో అర్ధరాత్రి నుంచే పనులు ప్రారంభం
- రాత్రికి రాత్రే ప్రజల నిర్బంధం.. 144 సెక్షన్
- రాత్రి 12 గంటలకే బీఆర్ఎస్, బీజేపీ నాయకుల అరెస్టులు
- సెల్‌టవర్ ఎక్కి యువకుల నిరసన




నవతెలంగాణ-గుమ్మడిదల

సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం నల్లవల్లి పంచాయతీ పరిధిలోని ప్యారానగర్ భూముల్లో ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డును స్థానికులు పెద్ద ఎత్తున వ్యతిరేకిస్తున్నారు. పచ్చటి వ్యవసాయ పొలాలు, అడవితో ఆహ్లాదకరంగా ఉన్న ఈ ప్రాంతంలో.. హైదరాబాద్ నగర చెత్తను తీసుకువచ్చి కాలుష్యం చేయొద్దని ఇప్పటికే పలుమార్లు నిరసనలు, ఆందోళనలు చేపట్టారు. ఈ క్రమంలోనే మంగళవారం రాత్రి నుంచి వేల మంది పోలీసు బలగాల మధ్య డంపింగ్ యార్డు పనులను చేపట్టారు. సోమవారం అర్ధరాత్రి నుంచే స్థానికంగా ఉన్న గ్రామాలను ఎక్కడికక్కడ నిర్బంధించి.. బీఆర్ఎస్, బీజేపీ ముఖ్య నాయకులను అరెస్టు చేసి పనులు ప్రారంభించారు. ఈ పనుల గురించి తెలియడంతో స్థానిక ప్రజలు భగ్గుమన్నారు. పనులకు వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. అయితే గ్రామాల్లో 144 సెక్షన్ విధించి.. పోలీసు పహారా మధ్య. జీహెచ్ఎంసీ అధికారులు, అడిషనల్ కమిషనర్ రఘు ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్ రెడ్డితోపాటు పోలీస్ ఉన్నత స్థాయి అధికారుల పర్యవేక్షణలో పనులు చేపట్టారు.

గ్రామ సందర్శనకు వచ్చిన ఎమ్మెల్యేను అడ్డుకున్న పోలీసులు

బలవంతంగా డంపింగ్ యార్డు పనులు ప్రారంభించారన్న సమాచారంతో నల్లవల్లి గ్రామ ప్రజలను పరామర్శించేందుకు వచ్చిన నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డిని పోలీసులు అడ్డుకొని స్టేషన్‌కు తరలించారు. అంతకుముందు ఆమె మాట్లాడుతూ.. ఉన్నత న్యాయస్థానం స్టేటస్కో ఆదేశాలను ప్రభుత్వ పోలీసు యంత్రాంగం బేఖాతర్ చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో హైదరాబాద్ చెత్తను తీసుకువచ్చి అటవీ ప్రాంతం కలుషితం చేయడం సబబు కాదన్నారు. ఇక్కడి వ్యర్థాలు నర్సాపూర్ రాయరావ్ చెరువులోకి వచ్చి.. దాని కింది ఆయకట్టు వ్యవసాయ ఆధారిత ప్రాంతం మొత్తం కుప్పకూలిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే విషయమై పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడుతుండగా.. ప్రస్తుతం గ్రామంలో 144 సెక్షన్ అమల్లో ఉందంటూ ఏమైనా మాట్లాడాలంటే జిల్లా ఉన్నతాధికారులను కలిసి మాట్లాడండి అని చెప్పగా.. వినకపోవడంతో వెంటనే ఎమ్మెల్యేను కూడా అరెస్టు చేశారు. మాజీ జెడ్పీటీసీ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. ఈ పచ్చటి ప్రాంతాన్ని కాలుష్యం చేయొద్దని గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం దృష్టికి తీసుకుపోగా పనులు చేపట్టలేదన్నారు. కానీ నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేకంగా ఈ పనులు చేపడుతున్నదని తెలిపారు. ఇదే విషయమై మంత్రి దామోదర రాజనర్సింహను గుమ్మడిదల బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ కుమార్ గౌడ్, కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డిలతోపాటు పలువురు నాయకులు గతంలో కలిసినప్పుడు.. వ్యవసాయ భూములను కాపాడుకుంటామని హామీ ఇచ్చారన్నారు. అలాంటిది ఇప్పుడు ఈ పనులను చేపట్టడం వెనుక మతలబు ఏమున్నదని ప్రశ్నించారు. గుమ్మడిదల వ్యవసాయ ఆధారిత ప్రాంతమని, ఇక్కడి నుంచి హైదరాబాద్‌కు పాలు, పెరుగు, కూరగాయలు, వివిధ రకాల పంటలను రైతులు తీసుకెళ్తుంటారన్నారు. ఈ డంపింగ్ యార్డుతో వ్యవసాయం మొత్తం దెబ్బతిని రైతులు రోడ్డున పడుతారని ఆందోళన వ్యక్తం చేశారు.

సెల్‌టవర్ ఎక్కి యువకుల నిరసన

కొత్తపల్లి గ్రామానికి చెందిన సూరారం మహేష్, కొక్కొండ అశోక్, మాలోత్ రాజ్ అనే ముగ్గురు యువకులు టెలిఫోన్ సెల్ టవర్ ఎక్కి డంపింగ్ యార్డు పనులకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. వేల మంది పోలీసులతో డంపింగ్ యార్డ్‌ను ఎందుకు ఏర్పాటు చేస్తున్నారని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ యార్డుకు వ్యతిరేకంగా ప్రాణాలకు తెగించి పోరాటం చేస్తామని తెలిపారు. సంబంధిత పోలీసు అధికారులు వారితో మాట్లాడుతూ.. సామరస్యంగా సమస్యను పరిష్కరించుకో వాలని బుజ్జగించడంతో యువకులు సెల్ టవర్‌పై నుంచి దిగారు.

దశాబ్దాల ఎదురుచూపులకు తెరదించాం

(మొదటిపేజీ తరువాయి)

తామిచ్చిన హామీ ప్రకారమే, పక్కా ప్రణాళికతో ఈ రెండు కార్యక్రమాలు నిర్వహించామన్నారు. బుధవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి,ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కులగణనలో దాదాపు లక్షమంది ఉద్యోగులు పాల్గొన్నారని చెప్పారు. ప్రణాళికాశాఖ, ప్రజలు, మీడియా సహా అందరూ దీనికి పూర్తి సహాయ సహకారాలు అందించారన్నారు. కులగణన పూర్తి పారదర్శకంగా జరిగిందనీ, ఎవరెవరు దీనిలో పాల్గొనలేదో కొందరి ప్రముఖుల పేర్లను అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారని తెలిపారు. వ్యక్తిగత సమాచారం మినహా కులగణన జరిగిన తీరుపై పూర్తిస్థాయి సమాచారాన్ని ప్రజల ముందు పెడతామన్నారు. ప్రభుత్వం సామాజిక న్యాయానికి కట్టుబడి ఉన్నదని స్పష్టం చేశారు.

రేపటి నుంచి కుంభాభిషేక మహోత్సవం

- సరస్వతి పుష్కరాల ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ
- కలెక్టర్ రాహుల్‌శర్మకు ఆహ్వాన పత్రిక అందించిన ఈఓ మహేష్



నవతెలంగాణ-మహదేవపూర్

జయశంకర్-భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామంలోని కాళేశ్వర ముక్తేశ్వర ఆలయంలో ఈనెల 7,8,9 తేదీల్లో మూడు రోజులపాటు మహా కుంభాభిషేకాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ కార్యనిర్వాహణాధికారి మహేష్, ఆలయ అర్చకులు బుధవారం తెలిపారు. 1982లో శృంగేరి జగద్గురుతో కుంభాభిషేక మహోత్సవం జరిగిందని, 42ఏండ్ల తర్వాత మళ్లీ కుంభాభిషేకాన్ని జరుపుతున్నట్టు చెప్పారు. మూడు రోజులపాటు శత జిండీ యాగం, సహస్ర గడాభిషేకం, మహా రుద్రం నిర్వహిస్తున్నామని, సందర్శకులు భారీ సంఖ్యలో పాల్గొని దర్శించుకోవాలని అన్నారు. అన్నదానం కార్యక్రమాలు చేపడుతున్నట్టు చెప్పారు. కాళేశ్వరంలో జరగబోయే కుంభాభిషేకం, మహాశివరాత్రి, సరస్వతీ పుష్కరాల బందోబస్తు ఏర్పాట్లను బుధారం జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే పరిశీలించారు. మే నెలలో జరిగే సరస్వతీ పుష్కరాల్లో అధిక సంఖ్యలో ప్రజలు స్వామివారిని దర్శించుకుంటారని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తుగా బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. ఆలయ పరిసరాలు, మెయిన్ ఘాట్, వీఐపీ ఘాట్, బైపాస్ రోడ్డు ను కాటారం డీఎస్పీ రామ్మోహన్ రెడి, మహదేవపూర్ సీఐ రామచందరావు, కాళేశ్వరం ఎస్ఐ జి.తమాశరెడ్డి తో కలిసి పరిశీలించారు. వాహనాలకు సరైన పార్కింగ్ ఉండేలా, ట్రాఫిక్ జామ్ కాకుండా, ఎలాంటి ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే మహా కుంభాభిషేకం మహోత్సవాలకు జిల్లాకేంద్రంలోని ఐడీఓసీ కార్యా లయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మకు ఆహ్వాన పత్రికను ఆలయ ఈవో మహేష్ అందచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మహా కుంభాభిషేకం మహోత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరవుతారని, వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో జరిగే ఏర్పాట్లకు పూర్తి సహాయ సహకారాలు అందించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉంటుందన్నారు. ఆయనవెంట దేవస్థానం సిబ్బంది, తదితరులున్నారు.

గిరిజన సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

నేడు సీఎంతో ఎస్టీ ఎమ్మెల్యేల భేటీ



ఎస్టీ ఎమ్మెల్యేల సమావేశంలో మంత్రి సీతక్క

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం గిరిజన సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) చెప్పారు. గురువారం ఎస్టీ ఎమ్మెల్యేలంతా సీఎం ఎ.రేవంత్‌రెడ్డితో భేటీ కానున్నట్టు తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని మాసాబ్ ట్యాంక్‌లోని దామోదర సంజీవయ్య సంక్షేమ భవన్‌లో ఎస్టీ ఎమ్మెల్యేల సమావేశం నాలుగు గంటల పాటు జరిగింది. అందులో మంత్రి సీతక్క తో పాటు ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్, ఎమ్మెల్యేలు మురళీనాయక్, రామ్‌దాస్ నాయక్, వెడ్మ బొజ్జు, జారె ఆదినారాయణ, కోవా లక్ష్మి, అనిల్ జాదవ్, తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, బాలునాయక్, ట్రైకార్ చైర్మెన్ బెల్లయ్య నాయక్, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్, ఆ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అటవీ శాఖ అధికారులు ఆదివాసీలను గిరిజనులను ఇబ్బందులు పెడుతున్నారని ఎమ్మెల్యేలు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఏజెన్సీ ఏరియాలోనీ సాగు భూముల్లో బోర్లు వేయకుండా, పవర్ లైన్స్ రానీయకుండా అటవీ శాఖ అడ్డుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. ఫారెస్ట్ అధికారులు, గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో ఉమ్మడి సమావేశాన్ని ఏర్పాటు చేయించాలని విజ్ఞప్తి చేశారు. త్వరలో అటవీ శాఖ అధికారులతో సమావేశం ఏర్పాటు చేయించి సమస్యను పరిష్కరించేలా కృషి చేస్తానని మంత్రి సీతక్క హామీనిచ్చారు. ఎంపీ బలరాం నాయక్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నుంచి గిరిజనుల అభివృద్ధి కోసం అధిక నిధులు రప్పించేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం సీతక్క మాట్లాడుతూ పదేండ్లలో గత ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధి, సంక్షేమంపై నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. పోడు సమస్యలను పట్టించు కోలేదనీ, ఐటీడీఏలను బలహీనపరిచిందని చెప్పారు. ఇందిరా జలప్రభ వంటి పథకాలకు నీళ్ల కేటాయించకుండా నిర్వీర్యం చేసిందని విమర్శించారు. ఎస్టీ ఎమ్మెల్యేల సమావేశంలో చర్చించిన అంశాలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవల కోసం రూ. 2 కోట్లు కేటాయిస్తున్నామని మంత్రి సీతక్క ప్రకటించారు. ఈ నెల 15న ప్రతి గిరిజన పాఠశాలలోనూ, తండాల్లోనూ సేవాలాల్ జయంతి ఉత్సవాలను జరపాలని పిలుపు నిచ్చారు. ఎస్టీల సామాజిక ఆర్థిక స్థితుగతులపై అధికారులు నివేదిక సమర్పించాలని సూచించారు. ఆ నివేదిక ఆధారంగా బడ్జెట్‌లో ప్రత్యేక పథకాలు రూపొందిస్తామన్నారు. ఎస్టీ సంక్షేమ శాఖకు కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకో వాలని సూచించారు. గిరిజన ప్రాంతాల్లో, ఐటీడీఏ ఏరియాల్లో పనులు చేయని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గిరిజన పాఠశాలల్లో, వసతి గృహాల్లో తాగునీరు, టాయిలెట్ల నిర్మాణం, భవనాల నిర్మాణం కోసం రూ. 250 కోట్లు కేటాయిస్తున్నామని ప్రకటించారు. గిరిజన పాఠశాలల్లో ఉపాధ్యాయుల, హాస్టల్ సిబ్బంది ఖాళీల జాబితాను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. సీఎంతో చర్చించి ఆ పోస్టుల భర్తీ ప్రక్రియ మొదలుపెడతామన్నారు.

సమావేశంలో తీసుకున్న ముఖ్య నిర్ణయాలు

- మూడు ఎస్టీ కార్పొరేషన్లను బలోపేతం చేయాలి.
- ఐటీడీఏ పరిధిలోని 29 ప్రభుత్వ శాఖలను పటిష్ట పరచాలి.
- హైదరాబాదులో రెండు పోస్ట్ మెట్రిక్ గిరిజన హాస్టళ్ల నిర్మాణం చేపట్టాలి.
- ఎస్టీ విద్యార్థుల కోసం అదనంగా 250 ఓవర్సీస్ స్కాలర్షిప్‌లు మంజూరు చేయాలి.
- సేవాలాల్ జయంతి ఉత్సవాల కోసం జిల్లాలకు ప్రత్యేకాధికారులను కేటాయించాలి.
- ఎస్టీ ఎమ్మెల్యేలున్న నియోజకవర్గాల్లో గిరిజన సంక్షేమ భవన నిర్మాణం కోసం కోటి రూపాయల చొప్పున మంజూరు చేయాలి.
- ప్రతి ఐటీడీఏ పరిధిలో అదనంగా 10 నుంచి 15 వేల ఇందిరమ్మ ఇండ్ల ను మంజూరు చేయాలి.
- గిరిజన ప్రాంతాల్లో యూత్ ట్రైనింగ్ సెంటర్ల బలోపేతం కోసం చర్యలు తీసుకోవాలి.
- మైదాన ప్రాంతాల కోసం కొత్తగా ఐటీడీఏలను ఏర్పాటు చేయాలి.
- ఎస్టీ వసతిగృహాల్లో గీజర్లు, వాటర్ ఫిల్టర్లు ఏర్పాటు చేయాలి. అవసరమున్న మండలాల్లో ఆశ్రమ పాఠశాలలు పెట్టాలి.
- ఆశ్రమ పాఠశాలలను అప్‌గ్రేడ్ చేసి ఇంటర్మీడియట్ విద్యను బోధించాలి.
- ఇందిరమ్మ గిరి వికాసంను పునరుద్ధరించాలి.
- ఏజెన్సీ ప్రాంతాల్లో ఉపాధ్యాయ పోస్టులను గిరిజనుల తోనే భర్తీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలి. మాతృభాషలోనే బోధించేలా చర్యలు తీసుకోవాలి.
- ఏజెన్సీ ప్రాంతాల్లో కళాశాలలో రెగ్యులర్ టీచర్లను పని చేయాలి.

మోడల్ స్కూల్ టీచర్లకు 010 పద్దు ద్వారా వేతనాలొచ్చేలా కృషి

- పీఎంటీఏటీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణలో మంత్రులు కోమటిరెడ్డి, పొన్నం హామీ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు 010 పద్దు ద్వారా వేతనాలు ఇప్పించేలా కృషి చేస్తామని మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. బుధవారం హైదరాబాద్‌లో పీఎంటీఏటీఎస్ క్యాలెండర్‌ను వారు వేర్వేరుగా ఆవిష్కరించారు. మోడల్ స్కూల్ టీచర్లకు 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలనే దస్త్రం ఆర్థిక శాఖ వద్ద ఆగిపోయిందని పీఎంటీఏటీఎస్ రాష్ట్ర అధ్యక్షులు తరాల జగదీశ్ మంత్రుల దృష్టికి తెచ్చారు. వెంటనే వారు స్పందించి ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో మాట్లాడి సమస్య పరిష్కారమయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. నోషనల్ సర్వీసు దస్త్రం విద్యాశాఖ కార్యదర్శి వద్ద ఉందని పేర్కొన్నారు. పెండింగ్ బకాయిలకు బడ్జెట్‌ను మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఎంటీఏటీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనుముల పోచయ్య, కన్వీనర్ సయ్యద్ సలీం, కోశాధికారి స్వామి, టెక్నికల్ హెడ్ అనిల్‌కుమార్, నాయకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

టెట్‌లో తగ్గిన ఉత్తీర్ణత

- పేపర్-1లో 59.48 శాతం, పేపర్-2లో 31.21 శాతం అర్హత
- గతసారి కంటే పేపర్-1లో 7.65 శాతం, పేపర్-2లో 2.97 శాతం తగ్గుదల
- ఫలితాలు విడుదల చేసిన విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఫలితాలను బుధవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా విడుదల చేశారు. టెట్ ఫలితాల్లో గతసారి కంటే ఈసారి ఉత్తీర్ణత తగ్గింది. గతేడాది నవంబర్ నాలుగున టెట్ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. గతనెల రెండు నుంచి 20 వరకు ఆన్‌లైన్‌లో రాతపరీక్షలను నిర్వహించిన విషయం తెలిసిందే. టెట్‌కు 2,75,753 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. పేపర్-1ను ఎనిమిది విడతల్లో ఏడు భాషల్లో (తెలుగు, హిందీ, ఉర్దూ, కన్నడ, మరాఠీ, తమిళం, బెంగాలీ) నిర్వహించామని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పేపర్-2ను 12 విడతల్లో ఏడు భాషల్లో (తెలుగు, హిందీ, ఉర్దూ, కన్నడ, మరాఠీ, తమిళం, సంస్కృతం) నిర్వహించామని పేర్కొన్నారు. టెట్ పేపర్-1కు 94,327 మంది దరఖాస్తు చేయగా, 69,496 మంది పరీక్ష రాశారని వివరించారు. వారిలో 41,327 (59.48 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. పేపర్-2లో మ్యాథ్స్, సైన్స్ విభాగానికి 93,263 మంది, సోషల్ స్టడీస్ విభాగానికి 88,163 మంది కలిపి మొత్తం 1,81,426 మంది దరఖాస్తు చేస్తే, మ్యాథ్స్, సైన్స్‌కు 69,390 మంది, సోషల్ స్టడీస్‌కు 66,412 మంది కలిపి 1,35,802 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. వారిలో మ్యాథ్స్, సైన్స్‌కు 23,755 మంది, సోషల్ స్టడీస్‌కు 18,629 మంది కలిపి 42,384 (31.21 శాతం) మంది పరీక్ష రాశారని వివరించారు. పేపర్-1, పేపర్-2 కలిపి 2,75,753 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, 2,05,278 మంది రాతపరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. వారిలో 83,711 (30.36 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. గతేడాది మే 20 నుంచి జూన్ రెండు వరకు టెట్ పరీక్షలను నిర్వహించారు. జూన్ 12న ఫలితాలను విడుదల చేశారు. టెట్ పేపర్-1కు 99,958 మంది దరఖాస్తు చేయగా, 85,996 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వారిలో 57,725 (67.13 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. పేపర్-2కు 2,86,381 మంది దరఖాస్తు చేస్తే, 1,50,491 మంది పరీక్ష రాశారు. వారిలో 51,443 (34.18 శాతం) మంది ఉత్తీర్ణత పొందారు. గతసారి టెట్ ఫలితాలతో పోలిస్తే ఈసారి టెట్ ఫలితాల్లో ఉత్తీర్ణత తగ్గింది. పేపర్-1లో గతసారి 67.13 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా, ఈసారి 59.48 శాతం మంది ఉత్తీర్ణత పొందారు. అంటే గతసారి కంటే ఈసారి పేపర్-1లో 7.65 శాతం ఉత్తీర్ణత తగ్గింది. పేపర్-2లో గతసారి 34.18 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. ఈసారి పేపర్-2లో 31.21 శాతం మంది ఉత్తీర్ణత పొందారు. అంటే గతసారి కంటే ఈసారి పేపర్-2లో 2.97 శాతం మంది తగ్గారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ జాయింట్ సెక్రెటరీ హరిత, ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు. టెట్ ఫలితాల కోసం https://schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంటుంది.

టెట్-2024-2 ఫలితాలు

పేపర్	హాజరు	ఉత్తీర్ణత	శాతం
1	69,476	41,327	59.48
2 (మ్యాథ్స్, సైన్స్)	69,390	23,755	34.24
సోషల్ స్టడీస్	66,412	18,629	28.05
మొత్తం	1,35,802	42,384	31.21

టెట్‌ల ఉత్తీర్ణత వివరాలు

సంవత్సరం	పేపర్-1	పేపర్-2
2024-2	59.48	31.21
(2025, జనవరి 2 నుంచి 20 వరకు ఆన్‌లైన్‌లో నిర్వహణ)		
2024-1	67.13	34.18
(మే 20 నుంచి జూన్ 2 వరకు ఆన్‌లైన్‌లో నిర్వహణ)		
2023, సెప్టెంబర్ 15	36.89.	15.30
2022, జూన్ 12	32.68	49.64
2017, జులై 23	57.37	19.51
2016, మే 22	54.45	25.04
2014, మార్చి 16	73.92	32.32

ఎమ్మెల్సీ స్థానాల్లో ముగ్గురి నామినేషన్లు దాఖలు

నవతెలంగాణ-నల్లగొండ, కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధులు

వరంగల్ -ఖమ్మం- నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గం, మెదక్- నిజామాబాద్- కరీంనగర్- ఆదిలాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు సంబంధించి బుధవారం మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. నల్లగొండలో ఇద్దరు ఇద్దరు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్టు నల్లగొండ జిల్లా కలెక్టర్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి తెలిపారు. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలానికి చెందిన బంకరాజు స్వతంత్ర అభ్యర్థిగా ఒక సెట్ నామినేషన్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ తరపున మరో సెట్ నామినేషన్ వేసినట్టు చెప్పారు. నల్లగొండ చెందిన పన్నాల గోపాల్‌రెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారన్నారు.

మెదక్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఒక నామినేషన్ దాఖలైంది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి మంచిర్యాల జిల్లా జన్నారం మండలం దేవునిగూడకు చెందిన గవ్వల శ్రీకాంత్ నామినేషన్ వేశారు. ఇక్కడ మొత్తంగా బుధవారం వరకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి నలుగురు, గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ స్థానానికి 9 మంది నామినేషన్ వేశారు.

మట్టిపెళ్లలు పడి ముగ్గురు కూలీలు మృతి

- మరొకరికి గాయాలు
- ఎల్బీనగర్‌లో విషాద ఘటన



నవతెలంగాణ-హాయత్ నగర్

వారంతా అడ్డా కూలీలు.. రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబాలు వారివి. రోజు మాదిరిగానే నిర్మాణ రంగం పనికి వెళ్లారు. పని ప్రారంభించిన అరగంటకే ప్రమాదవశాత్తు ప్రహరీ కూలడంతో వారు విగతజీవులుగా మారారు. ఈ ఘటన హైదరాబాద్ ఎల్బీనగర్‌లో బుధవారం జరిగింది. ఎల్బీనగర్ పోలీసులు, తోటి కూలీలు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా కుంజర్ల మండలం మల్లుపల్లి గ్రామానికి చెందిన ఆలకుంట్ల వీరయ్య(50)కు ఇద్దరు కుమారులు. బతుకుదెరువు కోసం 5 సంవత్సరాల కిందట నగరానికి వలస వచ్చి పెద్ద అంబర్‌పేటలో కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నాడు. బుధవారం వీరయ్య చిన్న కొడుకు రాము(21), తన మేనల్లుడు ముద్దం వాసు(21)ను తీసుకుని ఓ బిల్డర్ ద్వారా ఫోన్‌లో సమాచారం తెలుసుకుని ఎల్బీనగర్‌లోని మన్సూరాబాద్ డివిజన్ పరిధి చంద్రపురి కాలనీలో పనికి వెళ్లారు. సుమారు 1000 చదరపు గజాల స్థలంలో జరుగుతున్న సెల్లార్ నిర్మాణానికి సంబంధించి కింది భాగంలో పీసీసీ కాంక్రీటు పనుల్లో వారు ముగ్గురు నిమగ్నమయ్యారు. అయితే ఒక్కసారిగా 60 అడుగుల ఎత్తు నుంచి మట్టిపెళ్లలు కూలిపోవడంతో మట్టి పెళ్లలు, రాళ్లు మీద పడటంతో ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందుకున్న పోలీసులు, డీఆర్ఎఫ్ టీమ్ అక్కడకు చేరుకుని మృతదేహాలను బయటకు తీశారు. ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. వారితోపాటు పనిచేస్తూ గాయపడిన నల్లగొండ జిల్లా చింతపల్లికి చెందిన భిక్షపతికి తీసుకెళ్లారు. కేసు దర్యాప్తులో ఉంది.

అనుమతి ఉంది : జోనల్ కమిషనర్

ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఘటన స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. మొత్తం 1000 చదరపు గజాల స్థలంలో రెండు సెల్లార్‌లు, గ్రౌండ్ ఫ్లోర్‌తోపాటు 4 అంతస్తుల నిర్మాణానికి జీహెచ్ఎంసీ నుంచి రమేష్ అనే వ్యక్తికి గత ఏడాది డిసెంబర్‌లో అనుమతులు మంజూరయ్యాయని తెలిపారు. అయితే, నిర్మాణం జరుగుతున్న సమయంలో సరైన రక్షణ చర్యలు, కూలీలకు రక్షణ పరికరాలు లేకపోవడంతో ఈ ప్రమాదంలో ప్రాణం కోల్పోయినట్టు తెలుస్తోందన్నారు. బాధిత కుటుంబాలకు నష్ట పరిహారం అందేలా చూస్తామని తెలిపారు. ఆయన వెంట స్థానిక కార్పొరేటర్ నర్సింహారెడ్డి ఉన్నారు.

రూ.25 లక్షల నష్టపరిహారం ఇవ్వాలి : ఎమ్మెల్యే

ఘటనా స్థలంలో ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పరిశీలించారు. కామినేని హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న భిక్షపతిని పరామర్శించారు. తదనంతరం ఆయన మాట్లాడుతూ.. మృతుల కుటుంబానికి రూ.25 లక్షలు, హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న వ్యక్తికి రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీహెచ్ఎంసీ అధికారులు కూడా యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సెల్లర్ నిర్మాణంలో ఎలాంటి నిబంధనలూ పాటించకుండా పనులు చేయిస్తున్నా అధికారులు పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

17.03 లక్షల మందికి లబ్ది

(మొదటిపేజీ తరువాయి)

చేశామని వివరించారు. వానాకాలం రికార్డు స్థాయిలో వరి ఉత్పత్తులను మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. యాసంగిలో 48.06 లక్షల మెట్రిక్ టన్నులు, రూ.10,547 కోట్లు ఉండగా, ఖరీఫ్‌లో 52.51 లక్షల మెట్రిక్ టన్నులు, రూ.12,178.97 కోట్లు చెల్లించామని తెలిపారు. సన్న ధాన్యానికి రూ. 500 బోనస్ ఇచ్చి కొన్న ప్రభుత్వం అందుకు రూ. 1154 కోట్లు ఖర్చు చేసిందని పేర్కొన్నారు. ఈ యాసంగికి కూడా సన్నాలకు బోనస్ కొనసాగించాలని ఆదేశించారు. పసుపు, మిరప పంటలకు మద్దతు ధర నిర్ణయించేందుకు కేంద్రానికి విజ్ఞప్తి చేశామని గుర్తు చేశారు. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా విత్తనాలు, ఎరువుల సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

ఓయూలో విద్యార్థుల రాస్తారోకో

- హాజరు శాతం మినహాయింపుతో పరీక్షకు అనుమతించాలని విజ్ఞప్తి



నవతెలంగాణ-ఓయూ

హాజరు శాతంతో పనిలేకుండా పరీక్ష ఫీజు చెల్లించే అవకాశం కల్పించాలని కోరుతూ హైదరాబాద్ ఓయూ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు బుధవారం ఆందోళన చేపట్టారు. అనంతరం ర్యాలీగా వెళ్లి రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. తక్షణమే విద్యార్థులందరికీ పరీక్ష ఫీజు చెల్లించే అవకాశం కల్పిస్తూ.. వెబ్‌సైట్‌ను ఓపెన్ చేయాలని కోరారు. అనంతరం వారు ప్రిన్సిపాల్ ప్రొ.కాశింతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. కనీస హాజరు శాతం ఉన్నవాళ్లకు అవకాశాన్ని కల్పించే ప్రయత్నం చేస్తామన్నారు. కనీస హాజరు శాతం లేని విద్యార్థులను ఎలా అనుమతివ్వాలని, దీనివల్ల ఇబ్బందులు ఎదురవుతాయని చెప్పారు. అస్సలు క్లాస్‌లకు రాని విద్యార్థులకు (0 శాతం హాజరు ఉన్నవారికి) బ్యాక్‌లాగ్‌లో పరీక్ష రాసే అవకాశాన్ని కల్పిస్తామని హామీనిచ్చారు. ఆ బ్యాక్‌లాగ్‌లో పరీక్ష రాసేవారిలో అత్యంత పేదలు ఉంటే పరీక్ష ఫీజును తానే స్వయంగా చెల్లిస్తానని హామీనిచ్చారు. దాంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

రొమ్ము క్యాన్సర్ కేసుల్లో హైదరాబాద్ టాప్

- ప్రతి లక్ష మందిలో 48 మందికి బ్రెస్ట్ క్యాన్సర్
- నిమ్స్ నివేదికలో వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్ ఆస్పత్రుల్లో నమోదైన క్యాన్సర్ కేసుల్లో రొమ్ము క్యాన్సర్ కేసులు అధికంగా ఉంటున్నాయి. తాజాగా నిమ్స్ విడుదల చేసిన ఒక నివేదికలో దేశంలోని వివిధ నగరాల్లోని క్యాన్సర్ ఆస్పత్రుల్లో నమోదవుతున్న వాటి వివరాలను వెల్లడించారు. 2014 నుంచి 2016 మధ్య గణాంకాలను చూస్తే ప్రతి లక్ష మందిలో 48 మందికి రొమ్ముక్యాన్సర్ ఉన్నట్టు బయటపడినట్టు నివేదిక తెలిపింది. ఆ తర్వాత స్థానాల్లోనూ దక్షిణ భారతదేశానికి చెందిన చెన్నై, బెంగుళూరు నగరాలుండటం గమనార్హం. కాగా హైదరాబాద్‌లోని క్యాన్సర్ నిర్ధారణ, చికిత్స అందుబాటులో ఉన్న 23 ప్రభుత్వ ప్రయివేటు ఆస్పత్రుల వద్ద నమోదు చేసిన వివరాలివి. మొత్తం అన్ని రకాల క్యాన్సర్ కేసులను పరిశీలిస్తే 2014లో 3,522 నమోదు కాగా 2015లో 3,667 బయటపడ్డాయి. మరుసటి ఏడాది అంటే 2016లో 4,407 కొత్త కేసులు రిజిస్టర్ అయ్యాయి. మూడేళ్లలో మొత్తం 11,596 క్యాన్సర్ కేసులు బయట పడగా, వారిలో పురుషులు 5,143 మంది ఉండగా, మహిళలు 6,453 మంది ఉన్నారు. క్యాన్సర్ బారిన పడిన మహిళల్లో క్యాన్సర్ రకాలను పరిగణనలోకి తీసుకుంటే 35.5 శాతం మంది బ్రెస్ట్ క్యాన్సర్‌కు గురైన వారు ఉన్నారు. మిగిలిన 64.5 శాతం మంది మహిళల్లో వివిధ రకాల క్యాన్సర్లను గుర్తించారు.



మతోన్మాదానికి వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమించాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

నవతెలంగాణ - ముషీరాబాద్

అసమానతలు, శ్రామికుల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతున్న మతోన్మాదానికి వ్యతిరేకంగా.. ఆత్మగౌరవం, సామాజిక న్యాయ సాధన కోసం లాల్, నీల్ శక్తులు ఐక్యంగా ఉద్యమించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ అధ్యక్షతన దళితుల సామాజిక, ఆర్థిక, రాజకీయ సాధికారతపై రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అణగారిన వర్గాల, శ్రామికుల, దళితుల మధ్య అనైక్యత రాకుండా విశాల ఐక్యత దృక్పథంతో సంఘటిత ఉద్యమం చేపట్టాలన్నారు. కావాల్సిన భూమి, వనరులు, బడ్జెట్‌లను సాధించుకోవాలన్నారు. కేంద్ర బడ్జెట్‌లో దళితులకు కనీసం 5శాతం నిధులు కేటాయించలేదన్నారు. అంబేద్కర్, రాజ్యాంగం మూలంగానే ప్రధాని కాగలిగానని చెబుతున్న మోడీ.. కొందరు అంబేద్కర్‌ను, రాజ్యాంగాన్ని అవమానపరుస్తున్నా నోరు మెదపడం లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలు ఆగ్రహంగా ఉన్నారని, తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. అణగారిన వర్గాల అంతిమ లక్ష్య సాధనకు.. మార్క్స్, పూలే, అంబేద్కర్ ఆశయ సాధన కోసం పాటుపడాలన్నారు. అనంతరం జాన్‌వెస్లీకి డీబీఎఫ్ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మానం చేశారు. కార్యక్రమంలో డీబీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు కొరివి వినయ్‌కుమార్, సీనియర్ దళిత నేత జేబీ రాజు, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు, జాతీయ అంబేద్కర్ సంస్థ నేత ఎం.నర్సింగరావు, ప్రొఫెసర్ తడ్క యాదగిరి, టీపీఎస్‌కే ప్రతినిధి రాములు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నేతలు వెంకట్రాములు, ప్రసాద్, పద్మ, డీబీఎఫ్ నేతలు పి.శంకర్, డి.సంజీవ్, పులి కల్పన, మెట్ల శంకర్, చుంచు రాజేందర్, దాసరి ఎగొండ స్వామి పాల్గొన్నారు.

హెచ్1బీ ఆటోరెన్యూవల్ రద్దు?

(మొదటిపేజీ తరువాయి)

విభాగం తీసుకువచ్చిన ఆ నిబంధన ఇమ్మిగ్రెంట్లు, శరణార్థులు, గ్రీన్‌కార్డు దారులు, హెచ్-1బీ, ఎల్-1 వీసాదారుల భాగస్వాములు ఇలా చాలామందికి వర్తిస్తుంది. ముఖ్యంగా అమెరికాలో వర్క్ వీసాలపై పనిచేసే భారతీయులకు ఇది చాలా ప్రయోజనకారిగా వుంది. వర్క్ పర్మిట్ల పునరుద్ధరణలో జాప్యం జరిగినా వాటిని ఈ నిబంధన పరిష్కరిస్తోంది. తాజాగా రిపబ్లికన్ సెనెటర్లు పెట్టిన తీర్మానంపై ట్రంప్ చర్యలు తీసుకుని ఆటో రెన్యువల్‌ను రద్దు చేసినట్టైతే అది భారతీయులకే ఆందోళన కలిగించే అంశం. అమెరికాలో 3,86,000మందికి హెచ్-1బి వీసాలు జారీ చేయగా వారిలో 72.3శాతం మంది భారతీయులే. 2022లో ఈ సంఖ్య 77శాతంగా వుంది. 2024లో అమెరికా పౌరసత్వం లేదా గ్రీన్ కార్డులు తీసుకున్న రెండో అతిపెద్ద గ్రూపు కూడా భారతీయులే. వీరి సంఖ్య 49,700గా వుంది.

కేంద్ర బడ్జెట్‌పై ప్రజాసంఘాల నిరసన

- దిష్టిబొమ్మలు, బడ్జెట్ ప్రతులు దహనం

నవతెలంగాణ- విలేకరులు

కేంద్ర బడ్జెట్ ప్రజావ్యతిరేకంగా ఉందని, గ్రామీణ అభివృద్ధికి తీవ్ర అన్యాయం చేశారని, రైతులకు కనీస మద్దతు ధర, రుణమాఫీ లేకుండా ఉందని ప్రజాసంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టి కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మలు, బడ్జెట్ ప్రతులను దహనం చేశాయి. కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిరసన ప్రదర్శన చేశారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ ధ్వర్యంలో నిరసన తెలిపారు. కుమురం భీం-ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లా కేంద్రాల్లో కేంద్ర ప్రభుత్వం, బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు.మ సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండల కేంద్రంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టి కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఖమ్మం అంబేద్కర్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. బడ్జెట్ పత్రులు దహనం చేశారు. తల్లాడ, పెనుబల్లిలో బడ్జెట్ పత్రులు దహనం చేశారు.

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి

- వార్డెన్ నిర్లక్ష్యమే కారణమని బాధితుల ఆందోళన
- జయశంకర్ జిల్లా మొగుళ్లపల్లి ఎస్సీ హాస్టల్లో ఘటన



(ఫైల్)

నవతెలంగాణ-మొగుళ్లపల్లి

ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి విద్యార్థి మృతిచెందిన సంఘటన జయశంకర్-భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలకేంద్రంలో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. టేకుమట్ల మండలం పంగిడిపల్లె గ్రామానికి చెందిన పురాణం సంతోష్(14) మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో ఉంటూ స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. మూడు రోజులుగా పాఠశాలకు వెళ్లకుండా హాస్టల్‌లోనే ఉంటున్నాడు. ఈ క్రమంలో మరో స్నేహితునితో కలిసి మండల శివారులోని చలి వాగులోకి స్నానం చేయడానికి ఈతకు వెళ్లారు. లోతు ప్రదేశంకు వెళ్లేసరికి ఈత రాక నీట మునిగి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వార్డెన్ నిర్లక్ష్యంతోనే తమ బిడ్డ చనిపోయాడని హాస్టల్ ముందు విద్యార్థి మృతదేహంతో ఆందోళన చేపట్టారు. చిట్యాల సీఐ మల్లేష్, ఎస్ఐ అశోక్ వారికి నచ్చ చెప్పి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చిట్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గతేడాది వరదలు వచ్చిన సమయంలో కొడుకును కాపాడబోయి తండ్రి చనిపోతే నేడు కొడుకు నీట మునిగి మృతిచెందడంతో గ్రామంలో విషాదం అలుముకుంది. కాగా ప్రభుత్వ ఎస్సీ, బీసీ హాస్టళ్లలో విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే సంతోష్ మృతి చెందాడని, ఇందుకు కారణమైన అధికారులు, హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకొని ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డీఎస్పీ మండల అధ్యక్షులు దూడపాక రాజు, ఉపాధ్యక్షులు బండారి కుమార్ డిమాండ్ చేశారు.

మాదిగలకు 11 శాతం రిజర్వేషన్ దక్కేవరకు పోరాటం

- మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మాదిగలకు 11 శాతం రిజర్వేషన్ దక్కేవరకు పోరాటం కొనసాగిస్తామని మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు హెచ్చరించారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేత డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌తో కలిసి ఆయన మీడియా సమావేశంలో పాల్గొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఉపకులాల మధ్య చిచ్చు రగిలించే ప్రయత్నం చేశారని విమర్శించారు. సుప్రీంకోర్టు తీర్పు తర్వాత కూడా అసెంబ్లీలో ఎదిగిన కులాలకే న్యాయం జరిగిందని తెలిపారు. డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీలు ఎస్సీ వర్గీకరణ చేయకుండా 20 ఏండ్లు నిర్లక్ష్యం చేశాయని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వ కాంట్రాక్టుల్లో, ఇతర ప్రభుత్వ పథకాల్లో వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కూలిన 'కార్మిక సౌధం'!

- చెదిరిన 'బిల్ట్' కూలీ జీవితం
- కార్మికులు మరణించినా.. ఇంకా అందని సాయం
- కమలాపురంలో నూతన ప్రాజెక్టు చేపట్టాలి : సీపీఐ(ఎం)



నవతెలంగాణ-మంగపేట

నగరబాట పట్టిన కార్మిక కుటుంబాలు

యాజమాన్య వైఖరితో వీధినపడ్డ కార్మికుల పరిస్థితి దయనీయమైన స్థితిలోకి వెళ్ళింది. కర్మాగారం మూతపడటం ఉన్న ఊర్లో పనులు దొరకకపోవడంతో అనేక కార్మిక కుటుంబాలు బతుకు పోరాటం సాగించేందుకు వరంగల్, హైదరాబాద్ వంటి నగరాల బాట పట్టాయి. ఈ క్రమంలో కొంతమంది కార్మికులు అనారోగ్యం పాలై మృతి చెందారు.

మూడు దశాబ్దాల వెలుగు అంతరించిపోయింది. వేల కార్మికుల ఆశలు ఆవిరైపోయాయి. మారుమూల పల్లెకు పట్టణం కళ తెచ్చిన ఆ కట్టడం నేడు నేల మట్టమైంది. వేలమంది జీవితాలను నిర్మించిన ఆ కార్మిక సౌధం కూలింది. ఉపాధి కేంద్రంగా నిత్య వసంతంలా వెలుగు వెలిగిన ఆ గ్రామం నేడు ఎండమావిగా ఎడారిలో మోడుగా మారి తన ఆనవాళ్లను కోల్పోయింది. ములుగు ప్రాంతం ప్రత్యేక జిల్లాగా ఏర్పడక ముందు నుంచి రాష్ట్ర ప్రజలకు సుపరిచితమవడానికి, ఈ జిల్లాలోని మారుమూల అటవీ గ్రామాలకు నాడే అంతో ఇంతో రహదారులు నిర్మించడానికి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రధాన కారణం బిల్ట్ కర్మాగారమే. ఎందరికో ఉపాధి మార్గాలను చూపించి నేడు తన ఉనికి లేకుండా కనుమరుగైన 'బిల్ట్ కర్మాగారం'పై నవతెలంగాణ ప్రత్యేక కథనం.

మంగపేట మండలం కమలాపురం గ్రామంలో ఏపీ రేయాన్స్ బిల్ట్ కర్మాగారం నిర్మాణం 1975లో ప్రారంభమై 1979లో పూర్తి చేసుకుంది. 1981 నుంచి ఉత్పత్తి ప్రారంభమై ఈ ప్రాంత ప్రజలకే కాక నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి వలస వచ్చిన ఎంతోమందికి ప్రధాన ఉపాధి కేంద్రంగా మారింది. ఈ కర్మాగారంలో ఉత్పత్తి అయిన పల్పుకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండటంతో మూడు దశాబ్దాల పాటు తిరుగులేకుండా ముందుకు సాగింది. ఈ దశలోనే బిల్ట్ యాజమాన్యం తమ అవసరాలకు అనుగుణంగా 680మంది రెగ్యులర్ కార్మికులతో పాటు 40మంది క్లరికల్ స్టాఫ్‌ను కూడా నియమించుకుంది. వీరితోపాటు 534 మంది కాంట్రాక్టు కార్మికులు, మరో 300 నుంచి 500 మంది నాన్ పీఎఫ్ కార్మికులను నియమించుకుంది. వీరు కాకుండా పరోక్షంగా ఈ ప్రాంతంలోని డ్రైవర్లకు, హోటళ్లకు, షాపులకు ఇలా వేలాదిమందికి ఉపాధినిచ్చింది. కమలాపురంలో మరో నూతన యూనిట్‌ను కూడా యాజమాన్యం నిర్మిస్తోందని ప్రచారం కూడా భారీగానే జరిగింది. 2011 మే 16వ తేదీన నాటి బిల్ట్ డీజీఎం రామకృష్ణ తన చాంబర్‌లోనే ఎన్‌కౌంటర్ కావడంతో క్రమంగా అంతర్జాతీయ మార్కెట్‌లో వచ్చిన మార్పులను సాకుగా చూపెడుతూ యాజమాన్యం బిల్ట్ కర్మాగారాన్ని షట్‌డౌన్ వైపుగా తీసుకువెళ్ళింది. 2014 ఏప్రిల్ 6వ తేదీన కర్మాగారాన్ని మూసివేసింది. యాజమాన్యం పర్మినెంట్ కార్మికులకు చేయవలసిన సెటిల్మెంట్లు చేయకుండానే కర్మాగారాన్ని షట్‌డౌన్ చేయడంతో కార్మికులందరూ సమ్మెకు దిగారు. ఎలాంటి ఫలితమూ జరగలేదు. దిక్కుతోచని కార్మికులు ఎన్సీఎల్టీ కోర్టును ఆశ్రయించగా 2015 డిసెంబర్ వరకు గ్రాట్యూటీ చెల్లించాలని తీర్పునిచ్చింది. కొంత గ్రాట్యూటీని కార్మికులకు చెల్లించిన కర్మాగారం ఆ తర్వాత వారందరినీ విస్మరించింది. కార్మిక చట్టాల ప్రకారం కర్మాగారం పనిచేసినా, చేయకపోయినా సంవత్సరంలో 15రోజుల చొప్పున ప్రతి రెగ్యులర్ కార్మికునికి గ్రాట్యూటీని చెల్లించాలి. అయితే యాజమాన్యం ఈ నిబంధనలను తుంగలో తొక్కి నేటి వరకు కూడా కార్మికులకు గ్రాట్యూటీ ఇవ్వలేదు. యాజమాన్యం కర్మాగారంలో పనిచేసిన సుమారు 37 మంది పర్మినెంట్ కార్మికులకు పూర్తిస్థాయిలో సెటిల్మెంట్ చేసిందని, మిగతా 683 మంది పర్మినెంట్ కార్మికులకు ఎలాంటి చెల్లింపులు చేయలేదని కార్మికులు చెబుతున్నారు.

కానరాని బిల్ట్ ఆనవాళ్లు

పిన్ క్విస్ట్ సంస్థతో బిల్ట్ యాజమాన్యం చేసుకున్న ఒప్పందం ప్రకారం కర్మాగారాన్ని ఆ సంస్థకు అప్పజెప్పడంతో వారు గత కొంతకాలంగా బిల్టులో కూల్చివేతలు ప్రారంభించారు. అనతి కాలంలోనే బిల్ట్‌కు సంబంధించిన అన్ని కట్టడాలను, మిషనరీలను తొలగించడంతో అక్కడ బిల్ట్ కర్మాగారం ఆనవాళ్ల లేకుండా పోయాయి.

కార్మికులకు న్యాయం చేయాలి

జాగటి చిన్న సీపీఐ(ఎం) మండల కార్యదర్శి



కార్మిక చట్టాలను పక్కాగా అమలు చేసి కార్మికులందరికీ న్యాయం జరిగే విధంగా ప్రభుత్వం ముందుండి చర్యలు తీసుకోవాలి. మృతి చెందిన కార్మిక కుటుంబాలకు తక్షణ సాయం అందేలా కృషి చేయాలి. నూతన కర్మాగారం ఏర్పాటులో రాష్ట్ర ప్రభుత్వం క్రియాశీలకంగా వ్యవహరించి ఈ ప్రాంతానికి పూర్వవైభవం తీసుకువచ్చే బాధ్యతను తీసుకోవాలి. కార్మికులకు యాజమాన్యం నుంచి అందవలసిన ఫలాలు పూర్తిగా అందేలా చర్యలు తీసుకొని కార్మికులకు భరోసా కలిగించాలి.

ప్రభుత్వం చొరవ చూపాలి



కర్మాగారాన్ని నమ్ముకుని జీవించిన కార్మికులకు న్యాయం చేయడంలో ప్రభుత్వాలు చొరవ చూపాలి. ఎన్నో ఏండ్లు కష్టపడి కర్మాగారం అభివృద్ధిలో తమ జీవితాలను ధారపోసిన కార్మికులను అకస్మాత్తుగా వీధిపాలు చేయడం తగదు. ఈ విషయంలో ప్రభుత్వాలు స్పందించి బిల్ట్ యాజమాన్యంతో చర్చలు జరిపి కార్మికులందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలి.

ఎన్ఎస్ ప్రసాద్, సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు

జాబ్ కార్డుల జారీ బంద్

(మొదటిపేజీ తరువాయి)

లాక్ చేసింది. దీంతో గ్రామాల్లో కొత్తగా జాబ్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకుంటే ఈజీఎస్ సిబ్బంది తీసుకోవడం లేదు. ప్రభుత్వం నుంచే బంద్ అయ్యిందని చెబుతున్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద లబ్ది పొందేందుకు చాలా మంది భూమిలేని పేదలు ఉపాధి కార్డుల కోసం దరఖాస్తు చేసేందుకు ఎదురు చూస్తున్నారు.

భూమిలేని పేదలు 5.80 లక్షల మందేనా

భూమిలేని పేదల సంఖ్యను ప్రభుత్వం తక్కువ చేసి చూపుతుందని విమర్శలున్నాయి. రాష్ట్రంలో ఉపాధి హామీ చట్టం కింద కోటీ 25 లక్షల మంది వరకు జాబ్ కార్డులుండి పనిచేస్తున్నారు. అనేక మంది వలసలు, ఇతర పనులు చేసే వాళ్లు జాబ్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోలేదు. పథకం ప్రారంభమైన 2005-06లో పేదలందరూ జాబ్‌కార్డులు పొందారు. ఆ తర్వాత పనులు చేయట్లేదన్న నెపంతో కేంద్ర ప్రభుత్వం జాబ్‌కార్డుల్ని రద్దు చేసింది. 2022-23 సంవత్సరంలోనే 86,17,887 మంది కూలీలు, 2023-24లో 68,86,532 మొత్తం 1.55 కోట్ల మంది కూలీల పేర్లను పథకం నుంచి తొలగించినట్టుగా కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేష్ పాసవన్ ఇటీవల లోక్‌సభలో ప్రకటించారు. ఆ మేరకు తెలంగాణలోనూ లక్షల సంఖ్యల్లో తొలగించారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రాష్ట్రంలో 580577 మంది పేదలను మాత్రమే అర్హులుగా గుర్తించింది. కోటీ 25 లక్షల మంది కూలీలు జాబ్ కార్డులుండి పనిచేస్తుండగా కొందర్ని మాత్రమే అర్హులుగా గుర్తించినట్టు చెబుతున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల్లోని పేదలకు సర్కారిచ్చిన ఇనాం, అసైన్డ్ భూములున్నాయి. వాటిని కుటుంబాల వారీగా పంచుకుంటే సెంట్, రెండు సెంట్లు మాత్రమే వచ్చింది. ధరణి రికార్డుల్లో ఉన్నందున అనర్హులంటున్నారు.

పట్టణ పేదలేం పాపం చేశారు..?

గ్రామీణ పేదలతో పాటు పట్టణ పేదలకూ భరోసా సాయం చేయాలనే డిమాండ్ పెరిగింది. ఇటీవల హైకోర్టును కూడా ఆశ్రయించారు. రాష్ట్రంలో వేల గ్రామాల్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో కలపడంతో ఉపాధి పనులు రద్దు చేశారు. ఈజీఎస్‌ను పట్టణాలకూ వర్తింపజేయాలని సీపీఐ(ఎం), వ్యవసాయ కార్మిక సంఘం ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తుంది. పట్టణీకరణ పేరిట మున్సిపాలిటీలు, కార్పొరేషన్లుగా విస్తరిస్తున్నా పాలకులు పేదలకు ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవట్లేదు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 17 మున్సిపాలిటీలున్నాయి. సంగారెడ్డి జిల్లాలో పటాన్‌చెరు ప్రాంతంలో రెండు కార్పొరేషన్ డివిజన్లు చేసి జీహెచ్ఎంసీలో కలిపారు. సుమారు 60 గ్రామాలు మున్సిపాలిటీల్లో కలిపి ఈజీఎస్ రద్దు చేశారు. పట్టణాల్లోనూ ఈజీఎస్ పనులు చూపి భరోసా ఇవ్వాలని పేదలు కోరుతున్నారు.

అర్హతలున్నా లబ్ది పొందలేని పేదలు

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి అర్హతలున్నా లబ్ది పొందలేకపోతున్న పేదలు లక్షల్లో ఉన్నారు. సంగారెడ్డి జిల్లాలో 24 మండలాల్లోని 24 గ్రామాల్లో 844 మందిని మాత్రమే ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు అర్హులుగా ఎంపిక చేసి రూ.6 వేల చొప్పున వేశారు. జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీలో 20 రోజులు పనిచేసి భూమిలేని పేదలు 22260 మందిని మాత్రమే అర్హులుగా తేల్చారు. ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి జాబ్ కార్డుదారుల ఆధార్ ద్వారా 20 రోజులు పనిచేసిన వారి వివరాలను భూ రికార్డులకు సంబంధించిన ధరణి వెబ్‌సైట్‌లో ఉన్న పట్టాదారుల వివరాలతో పోల్చి భూమిలేని వాళ్లను గుర్తించారు. మెదక్, సిద్దిపేట జిల్లాల్లోనూ మరో 30 వేల మందికి మాత్రమే లబ్ది చేకూరనుంది.

బీసీల జనాభాను తగ్గించామా?

- మీ లెక్కేంది...అందుకు ఆధారమేంది? : బీఆర్ఎస్, బీజేపీలకు టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ ప్రశ్న
- తప్పుడు ప్రచారం చేసి ప్రజలను గందరగోళ పరచొద్దు
- బీసీ, ఎస్సీల దశాబ్దాల కల సాకారమైందని వ్యాఖ్య



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీసీల జనాభాను రాష్ట్ర ప్రభుత్వం తగ్గించిందా? మీ లెక్కేంది? అందుకు సంబంధించిన మీ వద్ద ఉన్న ఆధారమేంది? అని టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ బీఆర్ఎస్, బీజేపీ పార్టీలను ప్రశ్నించారు. బీసీ, ఎస్సీల దశాబ్దాల కల సాకారమైందని చెప్పారు. అందువల్ల తప్పుడు ప్రచారం చేసి ప్రజలను గందగోళన పరచొద్దని విజ్ఞప్తి చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, ఈర్లపల్లి శంకర్, పార్టీ నాయకులు చరణ్‌కౌశిక్‌తో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రుల చొరవతో బీసీ కులగణన, ఎస్సీ వర్గకరణకు మోక్షం లభించిందన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత బీసీ కులగణన జరిగిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అనీ, బీహార్ లాంటి రాష్ట్రం కులగణన చేపట్టినా... అది కార్యరూపం దాల్చలేదన్నారు. కుల గణన సర్వేపై ప్రతిపక్షాలు విమర్శలకు బదులు సలహాలు, సూచనలు చేయాలని విజ్ఞప్తి చేశారు. బీసీ కులగణనపై ప్రతిపక్ష, స్వపక్ష నేతల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వంపై పెద్దఎత్తున విమర్శలు వస్తున్నాయన్నారు. బీసీల జనాభాను తగ్గించి చూపే ప్రయత్నం చేశారనడం సరైందికాదన్నారు. అన్ని అంశాలూ పరిగణనలోకి తీసుకుని పక్కాగా సర్వే చేసినట్టు చెప్పారు. 'ఏ లెక్కల ఆధారంగా కులగణన తప్పని అంటున్నారో ప్రతిపక్షాలు చెప్పాలి. మీరు చేస్తున్న ఆరోపణలకు ఆధారాలు చూపండి. రాజకీయ నాయకుల ఉచ్చులో బీసీ సంఘాలు, నాయకులు పడవద్దు' అని విజ్ఞప్తి చేశారు. బీసీలను అణగదొక్కిన పార్టీలు, నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. బీసీ లెక్కలు తగ్గాయంటూ మాట్లాడుతున్న వారికి ప్రామాణికమేంటని ప్రశ్నించారు. తప్పుడు మాటలతో బీసీలను ప్రతిపక్షాలు తప్పుదోవ పట్టిస్తున్నాయని విమర్శించారు. గత పదేండ్లలో బీసీలకు ఏం న్యాయం చేశారో బీఆర్ఎస్ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల్లో బీసీల జనాభా తగ్గించింది బీఆర్ఎస్ కాదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల ఆకాంక్ష నెరవేర్చ దంతో ప్రతిపక్షాలు కడుపుమంటతో అడ్డగోలుగా మాట్లాడుతున్నాయని విమర్శించారు. సమగ్ర కుటుంబ సర్వే మంచిదే అయితే దాన్ని ఎందుకు టేబుల్ చేయలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కులగణనపై ఎవరికైనా అనుమానాలు ఉంటే అన్ని విషయాలూ మాట్లాడుకుంటామని సూచించారు. కాంగ్రెస్ నేతలు ఎంత చిన్నవారైనా, పెద్దవారైనా పార్టీ క్రమశిక్షణకు లోబడే ఉండాలని సూచించారు. పార్టీ లైన్ దాటితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా కులగణనకు ఇంకా వివరాలు ఇవ్వకపోతే ఇప్పటికైనా ఇవ్వాలని కోరారు.

కబ్జాల నుంచి విముక్తి

రహదారులపై అడ్డుగోడలను తొలగించిన హైడ్రా



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ నగరంలోని పలు రహదారులకు అడ్డుగా నిర్మించిన ప్రహరీ గోడలను హైడ్రా బుధవారం తొలగించింది. ప్రహరీలు నిర్మించి తమ నివాస ప్రాంతాలకు వెళ్లే మార్గాలను మూసేస్తున్నారని కాలనీవాసుల నుంచి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాప్రా మున్సిపాలిటీలో రాకపోకలకు అడ్డుగా ఎన్ఆర్ఐ కాలనీ వారు నిర్మించిన ప్రహరీని హైడ్రా కూల్చివేసింది. దీంతో అక్కడి సీనియర్ సిటిజన్ కాలనీ, శాంతి విల్లాస్, లక్ష్మి విల్లాస్, గౌరీనాథ్‌పురం, వంపుగూడ కాలనీలకు రాకపోకలు సులభమయ్యాయి. దమ్మాయిగూడకు వెళ్లే ప్రధాన రహదారికి వెళ్లాలంటే ఇంతకు ముందు చుట్టూ తిరిగి దాదాపు మూడు కిలోమీటర్లు ప్రయాణించాల్సి వచ్చేదని, ఇప్పుడు 100 మీటర్లు ప్రయాణిస్తే సరిపోతుందని సీనియర్ సిటిజన్ కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేశారు. రహదారులకు అడ్డంగా నిర్మించిన ప్రహరీలను కూల్చిన చోట వెంటనే రోడ్లు వేస్తామని కాప్రా మున్సిపాలిటీ అధికారులు హామీ ఇచ్చినట్టు స్థానికులు తెలిపారు. మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని సైనిక్‌పురిలో ఆర్మీ ఆఫీసర్ల కాలనీకి అడ్డుగా నిర్మించిన 50 మీటర్ల ప్రహరీని కూడా హైడ్రా తొలగించి మార్గాన్ని ఏర్పాటు చేసింది. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం రాళ్లగూడ విలేజ్ వద్ద కూడా ఔటర్ రింగురోడ్డుకు చేరేందుకు వీలు లేకుండా రహదారులకు అడ్డంగా నిర్మించిన ప్రహరీని సైతం హైడ్రా తొలగించింది.

1200 గజాల స్థలాన్ని కాపాడిన హైడ్రా

మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని డిఫెన్స్ కాలనీలో సర్వే నంబరు 2181లో ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలం కబ్జా అయిందంటూ హైడ్రాకు ఫిర్యాదులు వచ్చాయి. దాదాపు 1200 గజాల స్థలాన్ని అక్కడ అసోసియేషన్ పెద్దలు ప్లాట్లుగా చేసి విక్రయించారంటూ స్థానికులు ఫిర్యాదు చేశారు. స్థానిక అధికారులతో కలిసి హైడ్రా అధికారులు అన్ని కోణాల్లో విచారించారు. ఐదు ప్లాట్‌లుగా చేసి కొన్నిటిని అమ్మగా, మరికొన్ని వారి ఆధీనంలో ఉన్నట్టు తేలింది. కబ్జాలను తొలగించి.. ప్రజావసరాలకు ఉద్దేశించిన జీహెచ్ఎంసీ ల్యాండ్‌గా పేర్కొంటూ హైడ్రా పేరిట బోర్డులు ఏర్పాటు చేశారు. కాపాడిన భూముల్లో తిరిగి అక్రమ నిర్మాణాలు చేపట్టినా, ప్రహరీలను తిరిగి నిర్మించినా కఠిన చర్యలు తీసుకుంటామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరించారు.



ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్ల వాటాల్లో మాదిగలకు అన్యాయం

- 11 శాతం రిజర్వేషన్లు దక్కాలి
- పున: పరిశీలించి న్యాయం చేయండి : ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ

నవతెలంగాణ-బంజారాహిల్స్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్ల వాటాల్లో మాదిగలకు అన్యాయం జరిగిందని ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ అన్నారు. మాదిగలకు 9 కాదు 11 శాతం రిజర్వేషన్లు దక్కాలన్నారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏండ్లుగా పోరాడుతూనే ఉన్నామని తెలిపారు. చాలా కమిషన్లు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా నివేదికలు ఇచ్చాయని గుర్తు చేశారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణ అమలు చేస్తున్నట్టు ప్రకటించడం పట్ల ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదులు చెప్పారు. అయితే వర్గీకరణ అశాస్త్రీయంగా ఉందన్నారు. వర్గీకరణ ద్వారా మాదిగలకు రావాల్సిన వాటా కంటే 2 శాతం తక్కువ రిజర్వేషన్లు వచ్చాయన్నారు. 15 లక్షల జనాభా ఉన్న మాలలకు 5 శాతం రిజర్వేషన్లు ఇచ్చారని, 32 లక్షల మంది ఉన్న మాదిగలకు ఏ ప్రాతిపదికన తీసుకున్నా 11 శాతం రావాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సర్దుబాటు చేసుకోవాలనడం సరికాదని, నిర్ణయాన్ని పున్హపరిశీలించి మాదిగలకు న్యాయం చేయాలని కోరారు.

జాతి కోసం కృషి చేయని మంత్రి దామోదర రాజనర్సింహ తమకెందుకని నిలదీశారు. వారి జాతి కోసం రిజర్వేషన్లు చేజారకుండా కృషి చేయడంలో ఎమ్మెల్యే వివేక్ సఫలమయ్యారని, తమ జాతి కోసం రిజర్వేషన్ల వాటాను సాధించడంలో దామోదర రాజనర్సింహ విఫలమయ్యారని చెప్పారు. ఆయనను తాము మంత్రిగా చూడటం లేదన్నారు. దామోదర ఎందుకు మౌనంగా ఉన్నారో చెపాలన్నారు. ఆయనను మాదిగలు ఎప్పటికీ క్షమించరని, మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. మాదిగ సామాజిక తరగతిలో ఇద్దరు ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు ఇవ్వాలని కోరారు. ఫిబ్రవరి 7న తలపెట్టిన వేల గొంతులు- లక్షల డప్పుల సాంస్కృతిక మహాప్రదర్శనను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. నూతన తేదీని త్వరలోనే ప్రకటిస్తామన్నారు. ఆ కార్యక్రమం స్థానంలో 15 రోజుల తర్వాత సాంస్కృతిక మహోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నేత వెంకటేష్, పృథ్వీ, నల్లగొండ గద్దర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలి

- డంపింగ్ యార్డు ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి మాజీ మంత్రి హరీశ్ రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సంగారెడ్డిలో అరెస్టు చేసిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేయడాన్ని ఖండించారు. సంగారెడ్డి జిల్లా నల్లవల్లి, ప్యారానగర్ గ్రామాల పరిధిలో జీహెచ్ఎంసీ డంపింగ్ యార్డ్ ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. యార్డు ఏర్పాటును వ్యతిరేకిస్తున్న స్థానిక ప్రజలు, రైతులకు మద్దతు తెలిపేందుకు వెళ్లిన నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత వాకిటి, సీనియర్ నాయకులు, కార్యకర్తలను అరెస్ట్ చేశారని తెలిపారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటు విషయంలో స్థానికుల అభిప్రాయాలను తుంగలో తొక్కుతూ, ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం సిగ్గుచేటని విమర్శించారు. రైతులు, స్థానికుల ఆవేదన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎందుకు అర్థం కావడం లేదు. ప్రజలను, ప్రజా ప్రతినిధులను అర్ధరాత్రి నుంచి ఎందుకు అక్రమ అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్లకు తరలిస్తున్నారు? అని ప్రశ్నించారు. గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి, ప్యారనగర్ గ్రామాల్లో 144 సెక్షన్ విధించి, భయానక వాతావరణ సృష్టించారు. అప్రకటిత ఎమర్జెన్సీని తలపిస్తున్నారు. ఇదేనా ఇందిరమ్మ రాజ్యం అంటే.? అని నిలదీశారు. రేవంత్ రెడ్డి పాలనలో ప్రజలు, ప్రజా ప్రతినిధులకు వారి అభిప్రాయాలను స్వేచ్ఛగా చెప్పుకునే హక్కే లేదా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పాఠశాల భవనంపై నుంచి దూకి విద్యార్థి ఆత్మహత్య

- రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో ఘటన :విద్యార్థి సంఘాల ఆందోళన

నవతెలంగాణ-షాద్ నగర్

ప్రిన్సిపాల్ తిట్టడంతో మనస్తాపానికి గురైన విద్యార్థి పాఠశాల భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని శాస్త్ర స్కూల్‌లో బుధవారం జరిగింది. విద్యార్థి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. షాద్‌నగర్ పట్టణంలోని మల్లికార్జున కాలానికి చెందిన నీరజ్ శాస్త్ర గ్లోబల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. మధ్యాహ్నం సమయంలో నీరజ్, మరో విద్యార్థి పాఠశాల బాల్కనీలో మాట్లాడుకుంటుండగా ప్రిన్సిపాల్ నరేందర్‌రాయ్ ఆఫీసులోకి పిలిచి మందలిచ్చారు. దాంతో మనస్తాపానికి గురైన నీరజ్ టాయిలెట్‌కు వెళ్తున్నట్టు చెప్పి.. అక్కడే భవనంపైకి ఎక్కి మొదటి అంతస్తు నుంచి దూకాడు. పాఠశాల సిబ్బంది వెంటనే ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్టు డాక్టర్లు తెలిపారు.

ఛత్తీస్‌ఘడ్ వాసి అదృశ్యం



నవతెలంగాణ-చంపాపేట్

ఛత్తీస్‌ఘడ్ వాసి అదృశ్యమైన ఘటన సైదాబాద్ పీఎస్ పరిధిలో చోటు చేసుకున్నది. ఎస్ఐ శివశంకర్ కథనం ప్రకారం.. ఛత్తీస్ ఘడ్, బోర్సీ జిల్లాలోని దీపారాకు చెందిన ఆత్మారామ్ సాహు తన కుటుంబ సభ్యులతోపాటు అతని తండ్రి సాహు బసంత్రామ్తో కలిసి వారం రోజుల కిందట సైదాబాద్ లక్ష్మీనగర్ కాలనీకి వచ్చాడు. ఆత్మారామ్ సాహు సాయిబాబా ఆలయం సమీపంలో నిర్మిస్తున్న అపార్టుమెంట్లో కూలీ పనిచేస్తుండటంతో అక్కడికే కుటుంబ సభ్యులను తీసుకొని వచ్చాడు. అపార్టుమెంట్ వద్దనే నివసిస్తున్నారు. సోమవారం సాహు బసంత్ రామ్ బయటకు వెళ్లాడు. రాత్రి వరకు తిరిగి రాక పోవటంతో అతని ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు గాలించిన ఫలితంలేదు. సెల్‌ఫోన్ లేకపోవటం, నగరానికి కొత్తకావడంతో ఎక్కడకు వెళ్లాడో తెలిక కుటుంబ సభ్యులు సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శివశంకర్ తెలిపారు.

గురుకుల ప్రవేశ దరఖాస్తులకు నేటి వరకు గడువు

నవతెలంగాణ- బడంగ్‌పేట్

తెలంగాణ రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ గురుకుల పాఠశాలలో ప్రవేశాలు పొందడానికి దరఖాస్తు చేసుకోవడానికి ఫిబ్రవరి 6(నేడు) వరకు గడువు పెంచారని రంగారెడ్డి జిల్లా బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్‌గుల్‌లోని కందుకూరు ఎస్సీ గురుకుల పాఠశాల/జూనియర్ కళాశాల(బాలుర)ప్రిన్సిపాల్ ఎస్.దానం బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో ఫిబ్రవరి 1వ తేదీ వరకు గడువు ఉండగా.. వరుస సెలవులు రావడంతో ఈ నెల 6వ తేదీ వరకు గడువు పెంచారని తెలిపారు. గురుకులాల్లో విద్యార్థులు 5వ తరగతి నుండి 9వ తరగతి వరకు విద్యను అభ్యసించే అవకాశం ఉందన్నారు. దరఖాస్తులు ఆన్ లైన్ ద్వారా సమర్పించడానికి ఆధార్ కార్డుతో పాటు బోనోఫైడ్, కులం, ఆదాయం, సర్టిఫికెట్లు, విద్యార్థి ఫోటో, ఫోన్ నెంబర్ అవసరమని తెలిపారు. దరఖాస్తు సమర్పించిన వెంటనే హాల్ టికెట్ డౌన్ లోడ్ చేసుకునే అవకాశం ఉందన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణకు బీఆర్ఎస్ వ్యతిరేకమా..?

కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ రావు



నవతెలంగాణ - ఎల్బీనగర్

ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం సై అంటే.. బీఆర్ఎస్ పార్టీ మద్దతు తెలపకుండా కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని అక్కసుతో వాక్ అవుట్ చేయడం దురదృష్టకరమని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు, యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి విష్ణు దాస్ వంశీ విమర్శించారు. ఈ సందర్భంగా వారు బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ.. దళితులకు రాబోయే కాలంలో ఆర్థిక, సామాజిక, విద్య, రాజకీయపరంగా ఏం చేస్తే బాగుంటుందో కేటీఆర్ ఆలోచన చేస్తారని భావిస్తున్నామని అన్నారు. కానీ అలా చేస్తారని అనుకోవడంలేదని, అందుకు నిన్నటి ఘటనే గుర్తు చేసిందన్నారు. పేదలు బాగుపడడం ఇష్టం లేకనే శాసనసభలో బీఆర్ఎస్ పార్టీ బహిష్కరించిందని ఆరోపించారు. వర్గీకరణతో పాటు కీలకమైన బీసీ కులగణనపై చర్చ జరుగుతుంటే, శాసనసభకు రండి అని సీఎం చెప్పినా కేసీఆర్ రాకపోవడం దురదృష్టకరమని అన్నారు. ఎందుకంటే బీఆర్ఎస్‌కు పేదలు బాగుపడడం ఇష్టం లేదని ఎద్దేవా చేశారు. తెలంగాణ వస్తే రాష్ట్రానికి దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని, బీసీలకు బీసీ బంధు అమలు చేస్తానని రకరకాలుగా మోసం చేశారని విమర్శించారు. తమ నాయకులు రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, ఇచ్చిన మాట ప్రకారం కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం కుల గణన చేయడమే కాక ఎస్సీ వర్గీకరణకు కూడా కాంగ్రెస్ పార్టీ స్వాగతం చెప్పిందని అన్నారు. మంత్రివర్గానికి యావత్ రాష్ట్రం అభినందనలు తెలియజేస్తుందని శ్రీనివాసరావు, విష్ణుదాస్ వంశీ తెలిపారు.



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ- బడంగ్‌పేట్

సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం అనుకూలంగా తీర్మానం చేసిందని మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బడంగ్‌పేట్ చౌరస్తాలో మహేశ్వరం నియోజకవర్గం ఎస్సీ సెల్ చైర్మెన్ క్యారంగారి శ్రీధర్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ బండారి మనోహర్, మహేశ్వరం నియోజకవర్గం మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సమత, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సుభాన్ యాదవ్, రాష్ట్ర నాయకులు బాలింగని జంగయ్య, మాజీ ఎంపీటీసీ జంగయ్య, నాయకులు ఎర్ర జైహింద్, రాళ్ళగూడెం శ్రీనివాస్ రెడ్డి, గట్టు బాలకృష్ణ, సీనియర్ నాయకులు పుట్టగల్ల జగన్, నాయకులు మదారి శ్రీనివాస్, కుమార్, నిరుడు శ్రీరాములు, ఉమేష్, గిరి ముదిరాజ్, తిరుమల్, భాను, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ వచ్చిందని భయపడొద్దు



కిమ్స్ హాస్పిటల్ ఆంకాలజీ వైద్యులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

క్యాన్సర్ వచ్చిందని ఎవరూ భయపడవద్దనీ, వారికి వైద్యంతో పాటు కుటుంబం, సమాజం ఇచ్చే మద్దత్తుతో కోలుకోవచ్చు అని కిమ్స్ కొండాపూర్ హాస్పిటల్ ఆంకాలజీ వైద్యులు డాక్టర్ జ్యోత్స్న, డాక్టర్ హర్ష తాళ్లూరి, డాక్టర్ రమ్య వెలివేరు అన్నారు. అంతర్జాతీయ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కిమ్స్ హాస్పిటల్ కొండాపూర్ వారు క్యాన్సర్ అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్యాన్సర్‌తో పోరాడి విజయం సాధించిన రోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడారు. మొదటి దశలోనే క్యాన్సర్‌ని గుర్తించడం ద్వారా చికిత్సల ద్వారా నయం చేయవచ్చన్నారు. క్యాన్సర్ అనగానే సహజంగా ప్రతి ఒక్కరూ భయపడుతారనీ, తమకు ప్రాణాంతక వ్యాధి సోకిందని మానసికంగా ఇబ్బందులకు గురవుతారన్నారనీ, నిజంగా రోగి మానసికంగా దృఢంగా ఉంటే ఎంతటి వ్యాధులకైనా చికిత్స చేయవచ్చని తెలిపారు.

క్యాన్సర్లలో అనేక రకాలు ఉన్నాయని తెలిపారు. మారుతున్న జీవనశైలి వల్ల అనేక రకాలైన వ్యాధులతో పాటు క్యాన్సర్లు అధికంగా వస్తున్నాయన్నారు. ఇప్పుడు ఆధునిక పద్ధతులు, సాంకేతికతో ముందస్తుగానే క్యాన్సర్లను గుర్తించగలుగుతన్నామని తెలిపారు. వాటికి తగిన చికిత్సలు కూడా అందుబాటులో ఉన్నాయని అన్నారు.

చెత్త రిక్షాలు అందజేత : కార్పొరేటర్



నవతెలంగాణ-చంపాపేట్

ప్రతి ఒక్కరూ చెత్తను చెత్త రిక్షాల్లోనే వేయాలని కార్పొరేటర్ శ్వేత మధుకర్ రెడ్డి అన్నారు. యాకుత్ పురా నియోజకవర్గం ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగ శ్వేత మధుకర్ రెడ్డి బుధవారం డివిజన్‌లోని జీహెచ్ఎంసీ శానిటేషన్ సిబ్బందికి నూతన స్వచ్ఛ రిక్షాలను అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. తడి, పొడి చెత్తను వేరు చేసి చెత్త రిక్షాల్లోనే వేయాలని సూచించారు. చుట్టూ ఉండే పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకున్నప్పుడే మనం ఆరోగ్యంగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఎస్ఎస్ ఫక్రుద్దీన్, ఎస్ఎస్ అర్జున్ నాయక్, జవాన్ కృష్ణ, రాము, రాజ్ కుమార్, గోపాల్, సత్యనారాయణ, అశోక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య





నవతెలంగాణ - మీర్‌పేట్

ఓ వ్యక్తి చెరువు కట్టపై ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మీర్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.. మీర్ పేట్ ఇన్‌స్పెక్టర్ కిసర నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం మీర్‌పేట్ పాత గ్రామానికి చెందిన ముక్కెర్ల వెంకటేష్ (50). వృత్తి ప్లంబర్ పని చేస్తున్నాడు. కొంత కాలంగా మద్యానికి బానిసై సుమారు నెల రోజుల నుండి మీర్ పేట్ మంత్రాల చెరువు కట్టపై తిరుతూ కనిపించడం జరిగిందని చుట్టు పక్కల ప్రజలు చెప్పారు. బుధవారం ఉదయం మంత్రాల చెరువు కట్టపై సులాబ్ కంప్లెక్స్ పక్కన సాయిబాబా టెంపుల్ ఎదురుగా చెట్టుకు ఉరివేసుకొని ఉండటం గమనించిన కొందరు.. మీర్ పేట్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు ఆయన మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అతని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చదువు, క్రీడల్లో రాణించేలా విద్యా బోధన



చైర్మెన్ గుమ్మికొండ

నవతెలంగాణ-హయత్‌నగర్

తమ పాఠశాలలో చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించేలా విద్యా బోధన ఉంటుందని నాగార్జున మాంటిసోరీ ఐఐటీ ఒలింపియాడ్ చైర్మెన్ గుమ్మికొండ విఠల్ రెడ్డి అన్నారు. స్కూల్ 13వ వార్షికోత్సవాన్ని మన్సూరాబాద్ లోని ఓ ఫంక్షన్ హాల్లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది పదవ తరగతి పరీక్షల్లో జీపీఏ 10పాయింట్లు సాధించిన 6 గురికి 10వేల రూపాయల చొప్పున బహుమతులు, మెమొంటో అందజేసినట్టు తెలిపారు. విద్యలో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా బోధన ఉంటుందన్నారు. విద్యతో పాటు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యత ఇస్తామని అన్నారు. ఇంట్లో ప్రతి తల్లిదండ్రులు విద్యార్థుల చదువులపై నిఘా ఉండాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ రజిని రెడ్డి, సీఏఓ శేషా రావు, అకాడమిక్ డీన్ రాజశేఖర్, పాఠశాల ప్రిన్సిపాల్ మురళి తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి ఏడాది జెలు శిక్ష

నవతెలంగాణ-హయత్ నగర్

ఓ మైనర్ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన కేసులో నిందితుడికి ఏడాది జైల్ శిక్ష విధించినట్లు సరూర్ నగర్ ఇన్‌స్పెక్టర్ సైది రెడ్డి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. బాలాజీ హిల్స్, మేడ్చల్ జిల్లాలో నివాసం ఉంటున్న జలపూర్ సాయి కిరణ్.. ప్రేమ పేరుతో ఓ మైనర్‌ను వేధిస్తూ, అసభ్యంగా ప్రవర్తించాడు. పోక్సో చట్టం ప్రకారం రంగారెడ్డి జిల్లా ఫాస్ట్ ట్రాక్ కోర్ట్ బుధవారం నిందితుడికి ఏడాది జైలు శిక్ష విధించడంతో పాటు 2వేల రూపాయల జరిమానా విధించింది. బాధిత బాలికకు రూ.50,000 ఇస్తున్నట్లు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సునీత తెలిపారు.

హయత్‌నగర్ ప్రభుత్వ కాలేజీలో

'యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్'

నవతెలంగాణ-హయత్‌నగర్

"యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్" అనే కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వం, కళాశాల విద్యాశాఖ ఆదేశానుసారం హయత్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డా. పి. సురేష్ బాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు సృజనాత్మక ఆలోచనలను పెంపొందించుకోవాలన్నారు. మంచి



ఆలోచనలు నూతన ఆవిష్కరణలకు తోడ్పడుతాయని, అలాగే వ్యాపార దృక్పథం ఉన్న ఆలోచనలు మనకు ఆదాయాన్ని కూడా సమకూరుస్తాయని చెప్పారు.ఈ యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ అనే కార్యక్రమంలో ఎక్కువ మంది భాగస్వాములు కావాలని సూచించారు. వైఎఫ్ఎస్ఐ కోఆర్డినేటర్ డా. ఇ. యాదగిరి రెడ్డి, వైఎఫ్ ఎస్ఐ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ గురించి, (ఐడియా) ఆలోచనల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వి. ఇందిరా, అకాడమిక్ కోఆర్డినేటర్ డా. బి. నరసింహ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. ఎస్. శారదా దేవి, టిఎస్‌కెసి మెంటార్ నాగరాజు, వెంకట్, విద్యార్థులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని

సెలవు దినంగా ప్రకటించాలి



సేవాలాల్ మహారాజ్ బంజారా సంఘం వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు కోర్ర మోతిలాల్ నాయక్

నవతెలంగాణ-చంపాపేట్

ఫిబ్రవరి 15న సంత్ సేవలాల్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడమే కాకుండా సెలవు దినంగా ప్రకటించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, సేవాలాల్ మహారాజ్ బంజారా సంఘం వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు కోర్ర మోతిలాల్ నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం ఐఎస్ సదన్ డివిజన్ పరిధి సింగరేణి కాలనీలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుగాలి ప్రజల జీవన అభివృద్ధి కోసం సేవాలాల్ మహారాజ్ ఎంతో కృషి చేశారని, వైద్యం లేని రోజుల్లో నాటు వైద్యం ద్వారా ప్రజలను రక్షించిన ఘనత ఆయనకు దక్కుతుందని కొనియాడారు. అందుకే ఆయన జయంతి నాడు సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యాకుత్ పురా నియోజకవర్గం సైదాబాద్ మండలం మహిళా అధ్యక్షురాలు రామావత్ సక్రి బాయి, సునీతా భాయి, బంగారు భాయి, భారత్ గోర్ బంజారా సేవ సమితి రాష్ట్ర మీడియా అధ్యక్షులు జర్నలిస్ట్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఓదార్పు



నవతెలంగాణ- బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ గుర్రంగూడకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పుట్టగల్ల భాస్కర్ భార్య పుట్టగళ్ళ తిరుమల మంగళవారం రాత్రి అనారోగ్యంతో ఆస్పత్రిలో మృతి చెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, బడంగ్‌పేట్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ చిగిరింత నర్సింహారెడ్డి బుధవారం గుర్రంగూడలోని మృతురాలి స్వగృహానికి ఆమె వెళ్లి మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత మృతురాలి కుటుంబాన్ని ఓదార్చి.. ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట మాజీ కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డి, నాయకులు గుణ్ణం లక్ష్మారెడ్డి, ఐలమని, లక్ష్మి నర్సమ్మ, దిండు శ్రీనివాస్ గౌడ్, సుర్వగంటి విజయ్, జెల్ల రమేశ్ గౌడ్, రాఘవేందర్ గౌడ్, శ్రీను తదితరులు ఉన్నారు.

హస్తినాపురాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యం



కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్

నవతెలంగాణ - హస్తినాపురం

హస్తినాపురం డివిజన్‌ను హైదరాబాద్ నగరంలో ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ అన్నారు. డివిజన్ పరిధిలోని ద్వారకా నగర్‌లో రూ.10లక్షల 50వేల జీహెచ్ఎంసీ నిధులతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను కాలనీ సంక్షేమ సంఘ సభ్యులు, సంబంధిత అధికారులతో కలిసి ఆమె బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయాల్సిన పరిస్థితులు వచ్చాయని, దీనికి ఓపెన్ జిమ్‌లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. చిన్న పిల్లలతో కలుపుకొని పెద్దవారి వరకు ఓపెన్ జిమ్ ఉపయోగించుకోవాలని కోరారు. డివిజన్లో ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, నరసింహారెడ్డి, దామోదర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, లక్ష్మారెడ్డి, శేఖర్ గౌడ్, లక్ష్మయ్య, సత్యనారాయణ, గోపిరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశ జనగణనలో కులగణన జరపాలి

బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి



నవతెలంగాణ- నాగోల్

దేశ జనగణనలో కులగణన జరపాలని డిమాండ్ చేస్తూ బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా ఉప్పల్ మండల తహసీల్దార్ వాణి రెడ్డికి బుధవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర సమితి పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాలు, మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాలు నిర్వహించి.. వినతి పత్రాలను అందజేసినట్టు పేర్కొన్నారు.

ఈ పార్లమెంటు సమావేశాల్లోనే బీసీలకు 50% చట్టసభల్లో రిజర్వేషన్లు బిల్లు పెట్టి అమలు పరచాలన్నారు. కేంద్ర క్యాబినెట్లో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, రెండు లక్షల కోట్లతో బీసీ సంక్షేమ అభివృద్ధి కోసం బడ్జెట్లో నిధులు కేటాయించాలని కోరారు. రాష్ట్రంలో బీసీ జనాభా ప్రతిపాదించిన స్థానిక సంస్థలు రిజర్వేషన్లు కల్పించిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సబ్సిడీ రుణాలు వృత్తిదారులకు అందిం చాలని, బీసీ అట్రాసిటీ చట్టాన్ని రూపొందించి అమలు చేయాలన్నారు. అన్ని జిల్లాల్లో బీసీ సంక్షేమ భవనాలు నిర్మించాలన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో దండు నిరంజన్, మల్లేష్ గౌడ్, గోరుగంటి కృష్ణ, రాసమల్లి రాజేందర్, జి.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అర్చన కాలనీలో సమస్యలు పరిష్కరించాలి

- మున్సిపల్ కమిషనర్‌కు కాలనీవాసుల వినతి



నవతెలంగాణ - మేడ్చల్

మేడ్చల్ మున్సిపాలిటీ పరిధి కిష్టాపూర్ 4వ వార్డు అర్చన కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం కాలనీ వాసులు మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కాలనీలో పూర్తి స్థాయిలో అండర్ గ్రౌండ్ డ్రయినేజీ, సీసీ రోడ్లు లేవని, దీంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అర్చన సేవ సమితి అసోసియేషన్ అధ్యక్షులు జనార్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షులు బుచ్చి రాములు, కోశాధికారి మన్మథరావు, కార్యవర్గ సభ్యులు కమలాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోటు ప్రమాదంలో మరణించిన వ్యక్తి కుటుంబానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పరామర్శ



నవతెలంగాణ-కీసర

జనవరి 26న నిర్వహించిన భారతమాతకు హారతి అనే కార్యక్రమంలో బోటు ప్రమాదంలో నాగారం మున్సిపాలిటీలో నివాసం ఉండే అజయ్ మరణించిన విషయం తెలిసిందే. కాగా మృతుడి కుటుంబాన్ని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. అజయ్ తీసుకురాలేను కానీ వారికి ఎటువంటి సహాయమైనా చేయడానికి ముందు ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ మాజీ చైర్మెన్ చంద్రారెడ్డి బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు విక్రం రెడ్డి , మాజీ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నపై రెడ్డి సంఘం ఫిర్యాదు



నవతెలంగాణ-కాప్రా

తీన్మార్ మల్లన్న రెడ్డిలపై అనుచిత వ్యాఖ్యలు చేసినందున కుషాయిగూడ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో రాధిక చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించి కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డి జేఏసీ కో కన్వీనర్ పైళ్ల హరినాథ్ రెడ్డి, బొజ్జ రాఘవరెడ్డి, కాసం మైపాల్ రెడ్డి, సుడిగు మహేందర్ రెడ్డి, సీఎస్ పద్మారెడ్డి, కుషాయిగూడ రెడ్డి సంఘం ప్రధాన కార్యదర్శి మొగిలి రాఘవరెడ్డి, ఉపాధ్యక్షులు బి. వెంకట నరసింహారెడ్డి, సామ వెంకట్ రెడ్డి, తోటకూర సురేష్ రెడ్డి, రావిపల్లి రవీందర్ రెడ్డి, హనుమంతరెడ్డి, రామచంద్రారెడ్డి ఎల్.యాదిరెడ్డి, గంగిరెడ్డి, వెంకట్ రెడ్డి, జగన్‌మోహన్ రెడ్డి, తదితరలున్నారు.

కుషాయిగూడ సీఐ భాస్కర్‌రెడ్డికి సన్మానం



నవతెలంగాణ-కాప్రా

కుషాయిగూడ పోలీస్ స్టేషన్ సీఐగా బాధ్యతలు తీసుకున్న భాస్కర్ రెడ్డిని, సబ్ ఇన్‌స్పెక్టర్ వెంకన్నలను డాక్టర్ ఏఎస్‌రావు నగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షురాలు తుమ్మల సంధ్యా నర్సిరెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఏఎస్‌రావు నగర్ డివిజన్ అధ్యక్షురాలు తుమ్మల సంధ్యా నర్సిరెడ్డి , మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి అంబటి వెంకటాచలం, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ జీవీఎస్ రావు, సంపత్ రావు, ఉమా శ్రీధర్, తుమ్మల నర్సిరెడ్డి తదితరులున్నారు.

దేశవ్యాప్తంగా జనగణన, కులగణన చేపట్టాలి



- బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర సమితి

నవతెలంగాణ-ఉప్పల్

దేశవ్యాప్తంగా జనగణన, కులగణన చెప్పట్టాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా మండల కార్యాలయాల ముందు ఆందోళన చేపట్టారు. అనంతరం ఉప్పల్ తహశీల్దార్ వాణిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బొడ్డుపల్లి కృష్ణ మాట్లాడుతూ.. దేశ జనగణలలో కులగణన జరపాలన్నారు. ఈ పార్లమెంటు సమావేశాల్లోనే బీసీలకు 50శాతం చట్టసభల్లో రిజర్వేషన్లు బిల్లు పెట్టి అమలు చేయాలన్నారు. కేంద్ర క్యాబినెట్‌లో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలన్నారు. రెండు లక్షల కోట్లతో బీసీ సంక్షేమ అభివృద్ధి కొరకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలన్నారు. రాష్ట్రంలో బీసీ జనాభా ప్రతిపాదించిన స్థానిక సంస్థలు రిజర్వేషన్లు కల్పించిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాని పేర్కొన్నారు. బడ్జెట్‌లో నిధులు జనాభా ప్రతిపాదికన కేటాయించాలని తెలిపారు. ఉపాధి, అభివృద్ధికి ఖర్చు చేయాలని చెప్పారు. సబ్సిడీ రుణాలు వృత్తిదారులకు అందించాలని డిమాండ్ చేశారు. బీసీ అట్రాసిటీ చట్టాన్ని రూపొందించి అమలు చేయాలన్నారు. అన్ని జిల్లాల్లో బీసీ సంక్షేమ భవన్‌లో నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో దండు నిరంజన్, మల్లేష్ గౌడ్, గోరుగంటి కృష్ణ, రాసమల్లి రాజేందర్, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యాతోనే అభివృద్ధి : గుమ్మడి హరిప్రసాద్



నవతెలంగాణ - చర్లపల్లి

విద్యార్థులందరూ బాగా చదివి ఉన్నత శిఖరాలను చేరు కోవాలని జర్నలిస్ట్ గుమ్మడి హరిప్రసాద్ కోరారు. తెలుగు నాడు సమితి అధ్యక్షులు గుమ్మడి హరిప్రసాద్ పుట్టిన రోజు సందర్భంగా చర్లపల్లి ఈసీ నగర్‌లో పీర్స్ అనాధాశ్ర మంలోని విద్యార్థుల మధ్య జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పిల్లల మధ్య కేక్ కట్ చేసి అన్నదానం నిర్వహించారు. అనాధ ఆశ్రమంలోని విద్యార్థుల కు కావాల్సిన స్కూల్ ఫీజులు, పుస్తకాలు అందించడానికి దాతలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీర్స్ అనాధాశ్రమం నిర్వాహకులు కుమార్, ధరణి దినపత్రిక ఎడిటర్ రోజారాణి, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పటేల్ నరసింహ, టిడబ్ల్యుజెఎఫ్ ఉప్పల్ నియోజకవర్గ అధ్యక్షులు గంగి కృష్ణ, కార్యదర్శి రామచంద్రమూర్తి, కోశాధికారి నరేష్, డి.కిరణ్ కుమార్ రావు, కుమారస్వామి తదితరులు హరిప్రసాద్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ప్రమాణాలు పాటించని పరిశ్రమలను మూసేయాలి



నవతెలంగాణ-కాప్రా

ప్రమాణాలు పాటించని పరిశ్రమలను మూసివేయాలని సీపీఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి జీ. దామోదర్ రెడ్డి డిమాండ్ చేశారు. చర్లపల్లి పారిశ్రామిక వాడలోని సర్వోదయ కెమికల్ ఫ్యాక్టరీలో జరిగిన అగ్నిప్రమాద ప్రదేశాన్ని బుధవారం సీపీఐ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా దామోదర్ రెడ్డి మాట్లాడుతూ..మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న రసాయనాలు ఉత్పత్తి చేసే పరిశ్రమల్లో యాజమాన్యాల నిర్లక్ష్యంతో తరచూ అగ్నిప్రమాదాలు సంభవిస్తున్నాయని అన్నారు. జీడిమెట్ల, బాలానగర్, బొల్లారం, చర్లపల్లి పారిశ్రామిక వాడల్లో గతంలో కంటే అగ్ని ప్రమాదాలు పెరుగుతున్నాయన్నారు. రసాయనాలు తయారు చేసేందుకు ఉపయోగించే రియాక్టర్లు, రసాయనాలను నిల్వ ఉంచే ట్యాంకర్లు పేలుతున్నా యాజమాన్యాలు నిర్లక్ష్యంచేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమలపై దృష్టి సారించాలన్నారు. పరిశ్రమలలో పని చేసే కార్మికుల భద్రతకు నిర్దిష్టమైన ప్రణాళికలు సిద్ధం చేయాలనిడిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్ రావు, సీపీఐ నేతలు నారా నర్సింహ, నర్సింగ్‌రావు, స్వామి దాస్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేంద్రం కార్మిక వ్యతిరేక విధానాలను వీడాలి





- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జే.చంద్రశేఖర్

నవతెలంగాణ-కాప్రా

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక రైతాంగ వ్యతిరేక విధానాలు రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జే.చంద్రశేఖర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ వైకరికి నిరసనగా కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈసీఐఎల్ కమలానగర్‌లోని సీఐటీయూ ఆఫీసు నుండి ఈసీఎల్ చౌరస్తా వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ నిరసన ర్యాలీలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జే.చంద్రశేఖర్, ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శంకర్రావు, టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు శివబాబు, సీఐటీయూ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి జి. శ్రీనివాసులు ఉపాధ్యక్షులు పి. గణేష్, బీవి సత్యనారాయణ కోశాధికారి ఉన్నికృష్ణ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి జే చంద్రశేఖర్ మాట్లాడుతూ.. మోడీ అధికారంలోకి వచ్చాక 44 కార్మిక చట్టాలను నాలుగు కోడులుగా చేశారని తెలిపారు. వీటిని వచ్చే ఏప్రిల్ ఒకటో తేదీ నుండి అమలు చేసే దానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. దీనివలన కార్మికులకు ఉద్యోగ భద్రత, బేరసారాల హక్కు కోల్పోయి ప్రమాదంలో పడే పరిస్థితి ఏర్పడుతుందని, కార్మికులను కట్టు బానిసలుగా చేసి ఎనిమిది గంటల పని దినాల స్థానంలో పది, పన్నెండు, పదహారు గంటల పని దినం తీసుకువచ్చి కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేసే పద్ధతిలో మోడీ విధానాలు ఉన్నాయన్నారు. ధరలను దృష్టిలో పెట్టుకొని కనీస వేతనం రూ.26వేలుగా నిర్ణయించాలని, స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించి ఈఎస్ఐ, పీఎఫ్ కనీస వేతనం ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు లక్ష్మీనారాయణ మేడ్చల్ జిల్లా ఆశా వర్కర్స్ ప్రధాన కార్యదర్శి రేవతి కళ్యాణి, సీఐటీయూ నాయకులు, ఏపీ రాకు ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కే.మణికంఠ, గండూరి ఫుడ్స్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జే.వెంకటేష్, హైక్ క్యూబ్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సంతోష్, ఫోమ్‌కట్ ఉపాధ్యక్షులు పి. కృష్ణారెడ్డి, కోదండ రాముడు,రాంబాబు మల్లికార్జున్ రెడ్డి, విజయ్, మన్మథరావు, సతీష్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

నేరేడ్‌మెట్‌లో..

కేంద్ర ప్రభుత్వ ప్రవేశపెట్టిన కార్మిక వ్యతిరేక బడ్జెట్‌కు నిరసనగా సీఐటీయూ జిల్లా నాయకులు, మల్కాజిగిరి మండల కార్యదర్శి బంగారు నర్సింగరావు, ఏఐటీయూ జిల్లా నాయకులు బి.కృష్ణమూర్తిల ఆధ్వర్యంలో బుధవారం మల్కాజిగిరిలోని సీఐటీయూ కార్యాలయం నుండి మల్కాజిగిరి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సామాన్య ప్రజానీకానికి, కార్మికులకు ఏమాత్రం ఉపయోగం లేదని, ఇది దేశాన్ని దోచుకుని కార్పొరేట్ సంస్థలకు, వ్యక్తులకు ఉపయోగపడే విధంగా ఉందన్నారు. 140 కోట్ల జనాభాలో నాలుగు కోట్ల మందికి మాత్రమే ఉపయోగపడే విధంగా బడ్జెట్ రూపకల్పన చేశారన్నారు. బడ్జెట్‌లో మధ్యతరగతి ప్రజలకు 12 లక్షల వరకు పన్ను మినహాయింపు వల్ల వారి జీవితాల్లో పెద్దగా మార్పు ఉండదని, ఉపాధి, ఉద్యోగ భద్రత లేకుండా నిత్యవసర వస్తువులు ధరలు తగ్గించకుండా వారికి ప్రయోజనం లేదన్నారు. పారిశ్రామిక రంగాలకు కేటాయింపులు లేవని విమర్శించారు. మేక్ ఇండియా, మేడిన్ ఇండియా ప్రస్తావనే లేదన్నారు. ఎల్ఐసీని 100శాతం ప్రయివేటు చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. రాష్ట్రాల అభివృద్ధికి కేంద్రం వివక్షత చూపుతుందన్నారు. కేంద్ర బడ్జెట్ ఎన్నికల బడ్జెట్‌గా ఓటు బ్యాంకు రాజకీయాలుగా మారిపోయిన పరిస్థితికి పాలకులు తెస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో లబ్దిపొందడానికే ఢిల్లీ, బీహార్ రాష్ట్రాలకు కేటాయింపులు జరిపారని చెప్పారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్రంలో ప్రతిపాదించిన రంగాలకు కేటాయింపులు జరగలేదన్నారు. విభజన హామీలు అమలు ప్రస్తావనే లేదని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక బడ్జెట్ అన్నారు. దీనికి నిరసనగా యావత్ ప్రజానీకం ఆందోళన చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మల్కాజిగిరి మండల కార్యదర్శి గుంటి లక్ష్మణ్,నాయకులు కృపాసాగర్, పెన్షనర్స్ అసోసియేషన్స్ నాయకులు నారాయణ రెడ్డి, సీఐటీయూ నాయకులు నాగరాజు, సుమిత్ర, ఏఐటీయూసీ జిల్లా నాయకులు బి కృష్ణమూర్తి, సయ్యద్ గౌస్, పి శంకర్, సీఐటీయూ మున్సిపల్ మండల కార్యదర్శి కే నాగరాజు, మహిళా సంఘం మండల అధ్యక్షురాలు సోమనపల్లి నాగమణి, నర్సింగరావు, భూమయ్య శ్రీనివాస్, మల్లికార్జున్, చిట్టి బాయ్, సుజాత, అలివేలు, మాధవి, లాలి, తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్‌లో..



బీజేపీ కేంద్ర ప్రభుత్వ కార్మిక- రైతాంగ-ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీఐటీయూ జిల్లా నాయకులు నరేష్ ఆధ్వర్యంలో బుధవారం మేడ్చల్ ఆర్టీసీ బస్సు డిపో నుండి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు మందాపురం నరేష్ మాట్లాడుతూ..కేంద్ర బడ్జెట్‌లో పెట్టుబడిదారులు, కార్పొరేట్ సంస్థలకు రాయితీలిచ్చి కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలకు తగిన బడ్జెట్ కేటాయించకుండా దేశ సంపదను లూటీ చేసే విధంగా ఉందన్నారు. గత బడ్జెట్ కంటే రూ.3 లక్షల కోట్లు ఈ బడ్జెట్‌లో అదనంగా కేటాయించినా జీడీపీలోటు 4.4శాతంగా చూపడం ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల్లో ఉపాధి కల్పన, కార్మిక భద్రతకు సంబంధించిన అంశాలు ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించకపో వడం అన్యాయమన్నారు. తెలంగాణ ఏర్పడ్డ 10ఏండ్ల తర్వాత కూడా విభజన హామీలను అమలు చేయకపోవడం ఏంటని ప్రశ్నించారు. వ్యవసాయ రంగానికి మొదటి ప్రాధాన్యతని చెప్పి బడ్జెట్‌లో కేటాయింపులు చేయకుండా రైతాంగాన్ని కేంద్ర బీజేపీ ప్రభుత్వం మరోసారి మోసగించిందని ఆరోపించారు. రైతు ఋణమాఫీ, ధరల స్థిరీకరణ, ఉపాధి హామీ పథకానికి నిధులు పెంపును విస్మరించిందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మేడ్చల్ మండల నాయకులు నర్సింగ్ రావు,కిరణ్, రోహిత్ యాదవ్, దేవేందర్, రమేష్, చింటూ, నర్సింహ, టీయూసీఐ నాయకులు మండల కార్యదర్శి ఖాజ, ఉపాధ్యక్షులు కృష్ణ, హలీమ్, నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో..

కేంద్రంలో బీజేపీ అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని బుధవారం ఉప్పల్ రింగ్ రోడ్డులో సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాలు, రైతు సంఘాలు, వ్యవసాయ కార్మికులు, ఆల్ ఇండియా కమిటీల పిలుపు మేరకు సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ ఏఐటీయూసీ జే. వెంకన్న, పరమేష్‌లు మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం కార్మిక రైతాంగ ప్రజా వ్యతిరేక విధానాలను, 4 లేబర్ కోడ్లను రద్దు చేయాలన్నారు. రైతులు పండించిన పంటకు కనీస మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఊర్మిళ, ఆంజనేయులు, వెంకటేష్, రవి, జే. పట్టాభిరామయ్య, నరసింహ, ఏఐటీయూసీ నాయకులు, జంగారెడ్డి, మధుసూదన్ రెడ్డి, టీయూసీఐ నాయకులు ఎండీ అష్రల్, మధు, సత్తయ్య, రామచంద్ర, నాగరాజ్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు. ఫిబ్రవరి 10వ తారీకు ఇందిరాపార్క్ దగ్గర జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపు ఇచ్చారు.



గ్రేవీ యార్డ్ సుందరీకరణకు చర్యలు

- కార్పొరేటర్ వై. ప్రేమ్‌కుమార్



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి సర్కిల్ ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని జెటిసి కోకోకోలా కంపెనీ వెనకాల ఉన్న ఉప్పరిగూడ లోఉన్న గ్రేవీ యార్డ్ సుందరీకరణకు తగిన చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ అన్నారు. బుధవారం గ్రేవీ యార్డ్ లో వేసిన సుమారు 12 పోల్స్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు ప్రహరీ గోడ గేటు ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ ను కోరగా, ప్రహరీ గోడ ఏర్పాటు కు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్ట్రీట్ లైట్ ఏఈ వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ అధ్యక్షులు ఉమేష్ సింగ్, కిషోర్, స్థానికులు నరేష్, దీపక్, కైలాష్, జైహింద్, గుమ్మడి, రాజసింగ్, సతీష్, చిన్న, వెంకట్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సఫిల్‌గూడ లేక్‌లో గేట్ పనులను పరిశీలన



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని సఫిల్ గూడ చెరువు వద్ద దాదాపు రూ.10 లక్షల వ్యయంతో జరుగుతున్న గేట్, ఫెన్సింగ్ పనులను బుధవారం మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పనులను పూర్తి చేసి ఆకతాయిలు లోపలకు రాకుండా చూడాలని, మహిళల కోసం టాయిలెట్స్ రిపేర్ చేసి పెట్టాలని, గుర్రపు డెక్క రాకుండా చర్యలు చెప్పట్టాలని కోరారు.

షీ టాయిలెట్స్, ఫాబ్రికేటెడ్ టాయిలెట్స్‌పై నిరసన

పలు చోట్ల నిరూపయోవంగా ఉన్న షీ, ఫాబ్రికేటెడ్ టాయిలెట్స్ పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. చెత్త పేరుకుపోయి, దోమలు తాండవం చేస్తున్నా మున్సిపల్ సిబ్బంది ఏం చేస్తున్నారని మండిపడ్డారు. వెంటనే మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ కమిషనర్‌కు ఫోన్ ద్వారా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ నవీన్, రమేష్, రవి, చైతన్య, రాజు పాల్గొన్నారు.

స్ఫూర్తి గ్రూప్‌లో గరికపాటి రాజారావు, షేక్ నాజర్ జయంతి



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో కమలానగర్ ఆఫీసులో ప్రముఖ ప్రజా కళాకారుడు గరికపాటి రాజారావు, బుర్రకథ పితామహుడు షేక్ నాజర్ జయంతుల సందర్భంగా సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు. ప్రారంభ సూచికగా గరికపాటి రాజారావు చిత్రపటానికి ప్రముఖ కళాకారుడు బొమ్మగాని రుక్కయ్య, ఈసీఐఎల్‌లో రిటైర్డ్ ఆఫీసర్ ఎం. భాస్కర్ రావు, షేక్ నాజర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా రుక్కయ్య మాట్లాడుతూ కళ కళ కోసం కాదు ప్రజల కోసం అని నినదించి ఆచరణలో చూపించిన ప్రజా కళాకారుడు గరికపాటి రాజారావు అన్నారు. అటు నాటక రంగాన్ని, ఇటు సినిమా రంగంలో తమ ముద్ర వేశారని చెప్పారు. తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా మొక్కవోని పోరాటాలు చేశారని అన్నారు. షేక్ నాజర్ పేద కుటుంబంలో పుట్టి బుర్రకథలు కొత్త వరవడిని సృష్టించిన మహనీయులను చెప్పారు. ఎం.భాస్కర్ రావు, కోమటి రవి, నారాయణరావు, శివరామకృష్ణ, గిరీష్ తదితరులు ప్రసంగించారు. అధ్యక్షులు గొడుగు యాదగిరిరావు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట కాలంలో నిర్బంధాలకు ఎదురొడ్డి ప్రజాకళలతో ప్రజలను చైతన్య పరిచిన గొప్ప మహానుభావులని కొనియాడారు. నాడు మతత్వానికి వ్యతిరేకంగా ప్రజలను ఐక్యపరిచి పోరాటాలు చేశారని చెప్పారు. నేడు మతోన్మాదంతో ప్రజల మధ్య చీలికలు తీసుకొస్తున్న తరుణంలో ఈ మహనీయులను తలుచుకొని వారి బాటలో నడవటం ఎంతో అవసరమన్నారు. అనంతరం సభ్యులందరూ మహనీయుల చిత్రపటాలకు పూలను వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎం.శ్రీనివాసరావు, ఉన్నికృష్ణన్, శోభ, శారద, గౌస్య, లక్ష్మయ్య, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

'సోషలిజం కోసం ఉద్యమిస్తాం'



నవతెలంగాణ-కాప్రా

స్వాతంత్రం, ప్రజాస్వామ్యం, సోషలిజం సాధించేవరకు ఉద్యమిస్తామని ఎస్ఎఫ్ఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్ అన్నారు. బుధవారం సౌత్ కమలానగర్ ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ కాప్రా మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్రం ప్రజాస్వామ్యం సోషలిజం అనే మూడు లక్షాలను సాధించే వరకు ఉద్యమిస్తామన్నారు. ఎస్ఎఫ్ఐ 1970లో పూరుడుపోసుకొని విద్యార్థుల సమస్యలపై నిరంతరం ఛాంపియన్‌గా పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. జవహర్లాల్ నెహ్రూ యూనివర్సిటీ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ లాంటి ఎన్నో యూనివర్సిటీలలో ఎస్ఎఫ్ఐ విజయ ఢంకా మోగిస్తుందన్నారు. దేశానికి ముప్పు లాంటి నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని, స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్ విడుదల చేయాలని పోరాడుతున్నామన్నారు. విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే కుట్రాలను తిప్పి కొడుతామని హెచ్చరించారు. కాప్రాలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల ఏర్పాటుకు పోరాడుతామన్నారు. చర్లపల్లి, కాప్రా, నాచారం లాంటి ఇండస్ట్రియల్ ఏరియాలో ఐటీఐ కళాశాల ఇవ్వకపోవడం సిగ్గుచేటు అన్నారు. అనంతరం కాప్రా మండల నూతన కమిటీ 19 మందితో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్యామ్ రావు, కార్యదర్శిగా అరుణ్ కుమార్, ఉపాధ్యక్షులుగా మనీష్, నిఖిల్, ప్రశాంత్, భాను, రోహిత్, బుజ్జి యాదవ్, సహాయ కార్యదర్శులుగా సాయి భార్గవ్, గుణ శ్యామ్, మహేష్, చెర్రీ, కమిటీ మెంబర్లుగా బంటి, బి.రోహిత్, ఉదయ్, గౌతమ్, యం. రోహిత్ విద్యార్థులు పాల్గొన్నారు.

అప్టోమెట్రిస్ట్, ఆప్టికల్‌షాప్‌ల
అసోసియేషన్ జిల్లా కమిటీ సమావేశం



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

అప్తాల్మిక్ అసిస్టెంట్, అప్టోమెట్రిస్ట్ అసోసియేషన్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మల్కాజిగిరి సర్కిల్ ఈస్ట్ ఆనందబాగ్‌లోని రిషి హాస్పిటల్‌లో ఆప్టోమెట్రిస్ట్ ఆప్టికల్‌షాప్‌ల సమస్యల పరిష్కారానికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆప్టోమెట్రిస్ట్, ఆప్టికల్ షాపుల సమస్యల గురించి, జిల్లాలోని ఆప్టికల్ షాపులన్నీ అసోసియేషన్‌లో చేరవల్సిందిగా కోరారు. అనంతరం రిషి హాస్పిటల్ చైర్మెన్ డాక్టర్ విజయ్ పాల్ మాట్లాడుతూ అసోసియేషన్‌కు కావాల్సిన సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు అజిత్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్, జిల్లా కోశాధికారి నరేష్ రెడ్డి, జిల్లా సంయుక్త కార్యదర్శి అనిత, కమిటీ సభ్యులు కిషోర్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ డప్పులతో భారీ ర్యాలీ

- కుల, ప్రజా సంఘాల మద్దతు



నవతెలంగాణ - జవహర్ నగర్

వేల గొంతులు, లక్ష డప్పుల కార్యక్రమంలో భాగంగా ఎమ్మార్పీఎస్ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి శివకుమార్ మాదిగ ఆధ్వర్యంలో జవహర్ నగర్ బాలాజీ నగర్ లోపెద్ద ఎత్తున దప్పులతో ర్యాలీ నిర్వహించారు. ఎమ్మార్పీఎస్‌కు మద్దతుగా పలు కుల సంఘాలు, ప్రజాసంఘాలు, ప్రజలు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, శంకర్ గౌడ్, కుతాడి శ్రీనివాస్ ఎరుకల, మాజి మేయర్ మేకల కావ్య చైతన్య మహిళా సంఘం ఆలూరి సావిత్రి, కుమార్, ప్రజా కళామండలి రాష్ట్ర అధ్యక్షులు జాన్, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు నర్సింగ్ రావు, జిట్ట శ్రీనివాస్ రెడ్డి, పలు సంఘాల నాయకులు వివిధ పార్టీల నాయకులు, ఎమ్మార్పీస్ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు, మహిళా సంఘాలు, ప్రజా ప్రతినిధులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

నవతెలంగాణ
నమ్మిన తెలుగు దినపత్రిక
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్
గురువారం | ఫిబ్రవరి 06, 2025 | www.navatelangana.com

అక్రమ నిర్మాణాలు కూల్చివేత..



నవతెలంగాణ-దుండిగల్

అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు కూల్చేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మండల పరిధిలోని గాగిల్లాపూర్ సర్వేనెంబర్214 లో పలు అక్రమ నిర్మాణాలు చేపట్టుచున్నారని ఫిర్యాదులు రావడంతో దుండిగల్ తహసిల్దార్ ఎండీ.సయ్యద్ మతిన్ ఆదేశాల మేరకు ఆర్‌ఐ.రవి నేతృత్వంలో.. సిబ్బందితో కలిసి నాలుగు చోట్ల కూల్చివేతలు చేపట్టారు. ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టితే ఉపేక్షించేది లేదన్నారు. అట్టి వారిపై కేసులు సైతం చేపట్టనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన బండి శ్యామ్ గౌడ్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని నగరంలోని సీఎం క్యాంపు కార్యాల యంలో మల్కాజిగిరి పార్లమెంట్ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు, అడ్వకేట్ బండి శ్యామ్ గౌడ్ బుధవారం కలిసి శాలువాతో సన్మానించారు. పార్టీ శ్రేయస్సు కోసం అంకితభావంతో పనిచేయాలని భవిష్యత్తులో మంచి రోజులు వస్తాయని సీఎం తెలిపారు.

వెల్లువలా వినతులు

- రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లకే దరఖాస్తులెక్కువ
- పంపిణీపై స్పష్టత లేదంటున్న అధికారులు
- సవాల్‌గా మారిన లబ్దిదారుల ఎంపిక



నవతెలంగాణ-సిటీబ్యూరో

అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామంటూ సర్కార్ ప్రకటనతో పేదల్లో ఆశలు రేకెత్తాయి. గత నెల 26న నాలుగు పథకాలకు శ్రీకారం చుట్టి, మొదటి రోజు ఎంపిక చేసిన లబ్దిదారులకు ప్రొసీడింగ్స్ సైతం అందజేశారు. మార్చి 31వ తేదీ వరకు ఈ నాలుగు పథకాలను అర్హులకు పూర్తిగా అందజేస్తామని చెప్పడంతో దరఖాస్తుల పరంపర కొనసాగుతూనే ఉంది. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల లక్షల్లో దరఖాస్తులు రావడంతో లబ్దిదారుల ఎంపిక సర్కార్‌కు కత్తి మీద సాములా మారింది. ఈ విషయమై దరఖాస్తుదారులకు అధికారులు సైతం స్పష్టత ఇవ్వలేక పోతున్నారు. కొందరికి వచ్చి మరికొందరికి పథకాలు అందకపోవడంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.

తహశీల్దార్, మున్సిపల్ కార్యాలయాల్లో దరఖాస్తులు

అర్హులందరికీ రేషన్ కార్డులు ఇస్తామంటూ మంత్రుల ప్రకటనతో నిత్యం వందల మంది తహశీల్దార్, మున్సిపల్ కార్యాలయాలకు వచ్చి దరఖాస్తు చేసుకుంటున్నారు. దరఖాస్తులు స్వీకరించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందే తప్పా కార్డుల పంపిణీపై స్పష్టత ఇవ్వలేదని సంబంధిత శాఖ అధికారులు వారికి నచ్చచెబుతున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ప్రజలు మండల కేంద్రాలకు వస్తుండటంతో ఇక్కడికి రావాల్సిన అవసరం లేదనీ, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో అందజేస్తే సరిపోతుందని సూచిస్తున్నారు.

రెండింటికే ఎక్కువ దరఖాస్తులు

ప్రభుత్వం నాలుగు సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు గ్రామ, వార్డు సభలు నిర్వహించగా, వాటిలో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లకే అధికంగా దరఖాస్తులు వచ్చాయి. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఇంతకుముందు ఇంటింటి సర్వేలో రేషన్ కార్డుల కోసం 34,719 దరఖాస్తులు అందగా, ఇటీవల నిర్వహించిన గ్రామ సభల్లో మరో 33,435 దరఖాస్తులు వచ్చాయి. ఇక పాత రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పుల కోసం 1,21,696 దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటికే జిల్లాలో 5 లక్షలకు పైగా రేషన్ కార్డులు ఉంటే కొత్తగా భారీగా దరఖాస్తులు రావడంతో వాటిని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం ప్రజా పాలనలో 1,43,257 దరఖాస్తులు అందగా, ఇటీవల నిర్వహించిన గ్రామ సభల్లో 27,086 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తులు ఎక్కువగా వస్తుండటంతో లబ్దిదారుల ఎంపిక తలనొప్పిగా మారింది. దీంతో క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

అవసరాలకు ఉపయోగపడుతాయని..

ప్రయివేటు హాస్పిటల్స్‌లో వైద్య సేవలు పొందాలంటే రేషన్ కార్డు ఉండాలని తెలుసుకున్న ప్రజలు వాటి కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. ఒకే ఇంట్లో తల్లి, తండ్రి, కుమారుడు, కోడలు ఉన్నా తాము విడివిడిగా ఉంటున్నామని ఆ దంపతులు దరఖాస్తు చేసుకుంటున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల కోసం రేషన్ కార్డును ఆదాయ ధ్రువీకరణ పత్రంగా పరిగణిస్తారన్న నమ్మకంతో దరఖాస్తు చేసుకుంటున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 351 గ్రామ, వార్డు సభలు నిర్వహించగా రేషన్ కార్డుల కోసం 33,435 దరఖాస్తులు వచ్చాయి.

స్పష్టత ఎవరికి లేదు

రేషన్ కార్డుల జారీపై ఆయోమయం నెలకొంది. సర్వే, గ్రామ సభలు, మ్యుటేషన్‌తో కలుపుకుని దాదాపు లక్షా 80వేల వరకు దరఖాస్తులు రావడంతో లబ్దిదారుల ఎంపిక సవాల్‌గా మారింది. క్షుణ్ణంగా పరిశీలిస్తుండంతో మరింత సమయం పట్టే అవకాశం కనిపిస్తోంది. దీంతో కార్డులు ఎప్పుడు జారీ చేస్తారో తమకూ తెలియదని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతమైతే దరఖాస్తులు స్వీకరించాలనే ఆదేశాలు ఉండటంతో గ్రామాల్లో, మున్సిపాలిటీల్లో స్వీకరిస్తున్నట్టు వారు చెబుతున్నారు. ఈ విషయమై తమకు కూడా ఆదేశాలేమీ రాలేదనీ, స్పష్టత ఇవ్వలేమని సంబంధిత అధికారులు చెబుతున్నారు. దీంతో దరఖాస్తుదారులకు ఏం సమాధానమివ్వాలో తెలియక అధికారులు సైతం చేతులెత్తేసే పరిస్థితి నెలకొంది.

'కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతులకు వ్యతిరేకి'



దుండిగల్‌లో...

నవతెలంగాణ-దుండిగల్

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా.. బుధవారం కుత్బుల్లాపూర్ నియోజక వర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి మండలం ప్రగతి నగర్, బాచుపల్లి మండల ఆఫీసు వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ మేడ్చల్ జిల్లా నాయకులు ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ సంపద సృష్టి కర్తలైన కార్మికలకు రైతులకు వ్యవసాయ కూలీలకు బడ్జెట్లో తగిన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్మిక వర్గాన్ని బానిసలుగా మార్చే 4 లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర నిర్ణయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర బడ్జెట్లో పెట్టుబడిదారులు, కార్పొరేట్స్ దేశ సంపదని, ప్రకృతి వనరులను లూటీ చేసే విధంగా కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టారని ఎద్దేవా చేశారు. పజల్లో చైతన్యాన్ని పెంపొందించి ప్రజా ఉద్యమాలు నిర్మించడంలో కార్మిక కర్షక వ్యవసాయ కూలీ సంఘాలు పని చేస్తాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూఏ నాయకులు జమీల్, వెంకటేష్, భాస్కర్, రమేష్, యాదయ్య, ఐఎన్‌టీయూసీ నాయకులు వి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్: కేంద్ర బీజేపీ ప్రభుత్వ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ కుత్బుల్లాపూర్ మండల్ షాపూర్ నగర్‌లో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు గుంజ శ్రీనివాస్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎండీ. యూసుఫ్, ఉమా మహేష్, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎర్ర.అశోక్, కీలుకానీ లక్ష్మణ్ పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దుచేసి, నాలుగు లేబర్ కోడ్స్‌ను అమలు చేసే, దానికోసం 2019లో వేతనాల కోడ్, 2020లో పారిశ్రామిక సంబంధాలు కోడ్, సామాజిక భద్రత కోడ్, వృత్తి భద్రత ఆరోగ్యం , నేచర్ ఆఫ్ వర్క్ కోడ్ తీసుకొచ్చింది. ఈ చట్టాలకు వ్యతిరేకంగా కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించిన కార్మిక హక్కులని కాల రాసి, కార్పొరేట్ సంస్థలకి కార్మికులని బానిసలుగా మార్చే కేంద్ర బీజేపీ ప్రభుత్వం లేబర్ కోడ్స్ రూపంలో అమలు చేయాలని చూస్తుందన్నారు. లేబర్ కోడ్స్ వల్ల కార్మికుల ప్రాణాలకే భద్రత లేకుండా పోవడంతో పాటు పిఎఫ్, ఈఎస్ఐ, బోనస్ కనీస వేత నాలు అమలు లాంటి ప్రాథమిక చట్టాల అమలు అధోగతి అయ్యే పరిస్థితి కార్మికుల హక్కులు కాలరాసే ఏ ప్రభుత్వమైనా తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ రాష్ట్ర నాయకులు గూడ ఐలయ్య, డేగల సతీష్ కుమార్, జనార్ధన్ ఏఐటీయూసీ నాయకులు శ్రీనివాస్ నరసింహ రెడ్డి అశోక్ రెడ్డి, సీఐటీయూ నాయకులు పసుల అంజయ్య, ఈ దేవదానం, కే.శీను, బి.సత్యం పాల్గొన్నారు.



కుత్బుల్లాపూర్‌లో...

జగద్గిరిగుట్ట: కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక బడ్జెట్, వ్యవసాయ రైతులకు 4 కోట్ల అమలుకు వ్యతిరేకంగా ఏఐటీయూసీ కేంద్ర సంఘం పిలుపుమేరకు కుత్బుల్లాపూర్ నియోజక వర్గం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి, జగద్గిరిగుట్ట చివరి బస్టాండ్‌లో బుధవారం నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మున్సిపల్ సంఘం ప్రధాన కార్యదర్శి కే.ఏసురత్నం హాజరై మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాల పట్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ గాలిలోని మేడల్లా ఉన్నాయని విమర్శించారు. కార్మిక, రైతుల వ్యతిరేక విధానాలతో పాలించే ప్రభుత్వాలు మనుగడ సాధించలేవని భవిష్యత్తులో బీజేపీకి మూల్యం చెల్లించక తప్పదని ఆయన వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు వి.హరినాధరావు,గౌరవ అధ్యక్షులు చల్లపల్లి రాములు, భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యదర్శి సాయిలు, కుత్బుల్లాపూర్ ప్రజానాట్య మండల అధ్యక్షులు డి.బాబు,జగద్గిరిగుట్ట భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యదర్శి ఓ.రాములు,సత్యమ్మ భవన నిర్మాణ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



జగద్గిరిగుట్టలో...

బాలానగర్: కూకట్‌పల్లి నియోజవర్గంలోని బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దాని పరిధిలో ఆశాలు, అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ ఆధ్వర్యంలో బుధవారం కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ను వ్యతిరేకిస్తూ కూకట్‌పల్లిలోని వై జంక్షన్‌లో ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ పాల్గొని ప్రసంగించారు. ఆయన మాట్లాడు తూ కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ బడా కార్పొరేట్లను కాపాడుకోవడం కోసం పెట్టిన బడ్జెట్ అని అన్నారు. ఈ నేపథ్యంలో బడ్జెట్‌లో స్కీం వర్కర్లల ప్రస్తావన లేకపోవడం బాధాకరమన్నారు. కరోనా మహమ్మారి సమయంలో ఆశాలు వారి ప్రాణాలను ఫణంగా పెట్టి కరోనా రోగులను కంటికి రెప్పలా కాపాడుకున్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే విద్య, వైద్యం అభివృద్ధిలోకి రావాలని, కానీ నేడు దేశంలో విద్య, వైద్యం వ్యాపారంగా మారిందన్నారు. బీజేపీ పాలిత రాష్టాలకు దాని అనుబంధ కూటమి ప్రభుత్వాలకు ఎక్కువ బడ్జెట్ లు కేటాయించడం, ప్రతి పక్ష ప్రభుత్వ రాష్ట్రా లకు బడ్జెట్‌లో మొండి చేయ్యి చూపించడం దేనికి సంకేతమని ప్రశ్నించారు.. రాష్ట్ర ప్రభుత్వం ఆశాలకు, అంగన్వాడీ టీచర్లలకు కనీస వేతనాలు అమలయ్యే బడ్జెట్ కేటాయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎం. శంకర్, అనిత, సబియా, సంతోష్ భాయ్, రేణుక, భాగ్యలక్ష్మి, దీప్తి, మంజుల, కరుణ, రవళి, కుమారి తదితరులు పాల్గొన్నారు.



బాలానగర్‌లో...



కూకట్‌పల్లి నియోజకవర్గంలోని బాలానగర్ డివిజన్ పరిధిలోనిశ్రీ శీ నగర్ మెయిన్ రోడ్డు దగ్గర సీఐటీయు, ఏఐటీయూసీల ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్ ప్రతులను తగులబెట్టారు. ఈ కార్యక్రమంలో బుధవారం సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్, సీఐటీయు నాయకులు ఎం.శంకర్, ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పి. శ్రీనివాస్, కూకట్ పల్లి కార్యదర్శి జి. కృష్ణలు నిరసనలో పాల్గొన్నారు. బాలానగర్‌లో...

ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలి

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఎస్సీ వర్గీకరణను తక్షణమే అమలు చేయాలని కోరుతూ.. కూకట్‌పల్లి వై జంక్షన్ వద్ద డప్పు కొడుతూ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే ఎస్సీ వర్గీకరణ చేయాలని తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు అని గుర్తు చేశారు. ఎస్సీ వర్గీకరణ ఆమోదించాలని కేసీఆర్ కేంద్ర ప్రభుత్వానికి కూడా వినతి పత్రాన్ని అందజేశారు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆమోదించి సంవత్సర కాలం అయినా రేవంత్ సర్కార్ అమలు చేయలేదు అని పేర్కొన్నారు. ఎప్పుడూ వర్గీకరణ బిల్లు అమలు చేస్తారో స్పష్టత ఇవ్వాలనీ ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, ఎంఆర్‌పిఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాలు పరిశీలన



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజక వర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన రోడ్డులో నీరు నిల్వ ఉండే ప్రాంతాలను బుధవారం మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకటేశ్వర్ నాయక్ పరిశీలించారు. దుండిగల్ మున్సిపల్ పరిధిలో అధిక వర్షాలకు నీళ్ల నిలబడే ప్రాంతాలన ముఖ్యంగా బహదూర్ పల్లి వైన్స్ దగ్గర, టెక్ మహీంద్రా దగ్గర, గండి మైసమ్మ చౌరస్తా, సారేగూడెం బస్ స్టాప్, గాగిల్లాపూర్ చైతన్య కాలనీ, బౌరంపేట మల్లంపేట, దుందిగల్ ఏరియాలలో తిరిగి పరిశీలించారు. రాబోవు రోజులలో ప్రజలు ఇబ్బంది పడకుండా, వాటర్ లాగిన్ ఏరియాలను ప్రణాళికలు రూపొందించాలని, పనులను చేపట్టాలని, మున్సిపల్ ఇంజనీర్‌కి సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ బి.సురేందర్ నాయక్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల్లేక ఇబ్బందులు



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మున్సిపాలిటీ 1 వార్డ్ ఎల్‌జి విస్టాస్ లేఔట్ ప్రిథ్వి, అద్విక్ అపార్ట్‌మెంట్స్ కాలనీలో మౌలిక సదుపాయాలు సరిగ్గా లేక తీవ్ర కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. గత రెండు రోజుల కిందిట నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కోలన్ హన్మంత్ రెడ్డిని కలిసి విన్నవించుకున్నారు. బుధవారం హనుమంతు రెడ్డి కాలనీకి వెళ్లి రోడ్లు పరిశీలించారు. సదరు కమిషనర్‌తో మాట్లాడి వీలైనంత త్వరలో సీసీ రోడ్డు, డ్రయినేజీ స్పెషల్ ఫండ్స్ ద్వారా వెయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి మున్సిపాలిటీ అధ్యక్షులు బైరి ప్రశాంత్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు జెమ్మి దేవేందర్, మాజీ ఉపసర్పంచ్ గోపాల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ శివ కుమార్ గౌడ్, ఆదిరెడ్డి మోహన్ రెడ్డి, జయభేరి గోపాల్ రెడ్డి, పూర్ణచందర్ రావు, ఉపేందర్ రెడ్డి, అంజి ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

కొలన్ హన్మంత్ రెడ్డిని కలిసిన సాయి లీల..

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ బి బ్లాక్ మహిళా జనరల్ సెక్రటరీగా గంధం సాయి లీలని నియమించిన సందర్భంగా.. బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని కలిశారు. అనంతరం హనుమంతు రెడ్డి శాల్వాతో సాయి లీలను సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసారు.య ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కోలన్ రాజశేఖర్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అరవింద్, కోలన్ జీవం రెడ్డి, రాజి రెడ్డి, ప్రశాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గడ్డం యుద్ధంరెడ్డికి నివాళి



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, 131 డివిజన్ కుత్బుల్లాపూర్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు గడ్డం రాజేందర్ రెడ్డి తండ్రి " గడ్డం యుద్ధం రెడ్డి " ప్రథమ వర్ధంతి సందర్భంగా.. వారి విగ్రహానికి పులా మాలవేసి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కోలన్ హన్మంత్ రెడ్డి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా గ్రంథాలయ చైర్మెన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మెన్ బొంగునూరి ప్రభాకర్రెడ్డి, కొంపల్లి మున్సిపాలిటీ అధ్యక్షులు బైరి ప్రశాంత్ గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్దనాల సంజీవరెడ్డి, కోలన్ రాజశేఖర్ రెడ్డి, కోలన్ వీరేందర్ రెడ్డి, కోలన్ జీవన్ రెడ్డి, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పార్శి ప్రకాష్ గుప్తా జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

మేడ్చల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ మాజీ అధ్యక్షులు, జగద్గిరిగుట్ట ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు, సంఘ సేవకులు పార్శి ప్రకాష్ గుప్తా 63వ జన్మదిన వేడుకలు జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి, జగద్గిరినగర్ ఆర్యవైశ్య సంఘ భవనంలో కుటుంబ సభ్యులు, వైశ్య సంఘం సభ్యులు, సన్నిహితుల మధ్య కేక్ కట్ చేసి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పలువురు పుష్పగుచ్ఛాలను అందజేస్తూ శాలువాతో సన్మానిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పార్శి ప్రకాష్ గుప్తా మాట్లాడుతూ తన జన్మదిన వేడుకలు ఇంతటి పండుగ వాతావరణంలో జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరు తనపై చూపిస్తున్న ఆధారాభిమానాన్ని జీవితాంతం మరిచిపోలేనన్నారు. భవిష్యత్తులో సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి తేరాల శ్రీనివాస్ గుప్తా, కోశాధికారి డి.అన్నయ్య గుప్తా, శ్రీ వాసవికి కన్యకా పరమేశ్వరి దేవాలయ చైర్మెన్ రేగురి ప్రవీణ్ గుప్తా, అధ్యక్షులు ఉప్పల రమేష్ గుప్తా, మాజీ అధ్యక్షులు వై.గౌరయ్య గుప్తా, సభ్యులు గోలి రాజయ్య గుప్తా, దామెర జగదీష్ గుప్తా, పబ్బా నరేష్ గుప్తా, ప్రమోద్‌తో పాటు మహిళ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రికి ఆహ్వానం



నవతెలంగాణ - ముషీరాబాద్/అంబర్‌పేట

And:

Sathivada Shilpa ...Respondent.

TO:- Sathivada Shilpa, D/o Sathivada Gopi, Door No. 30-5/1, Pandu basthi, Saibaba Nagar,IDA jeedimetla, Hyderabad, Pin-500055.Mobile No:6304227265

NOTICE

Please take notice that the petition filed by the petitioner against you for restitution of conjugal rights Under Section-13(1) (ia) (ib) of Hindu Marriage Act, which stands posted to 17-03-2025 for your appearance and notice to you . So you pleased attend on the said date at about 10-30AM ., before the above court by personally or through your agent, otherwise the matter will be decided in your absence.

Chigurupalli Rama Mohan,
Advocate
Srikakualam Town and District (A.P)
Cell:9440116221, 8341023288

SUMMON NOTICE BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR NALGONDA DISTRICT AT NALGONDA. A.A.C.F.NO. MNL/NLG/479 OF 2024

Between:-

M/s.KAPIL CHITS (Telangana) PVT.LTD.Choutuppal Branch, Represented by its Legal Officer Sri M.Narsimha Raju, S/o.Pichaiah R/o.Nalgonda town and District. ...Plaintiff/Disputant/Petitioner,

AND

1.Narla Snehith, S/o.Narsing Rao, Aged about: 27yrs, Occ: Pvt Employee, R/o.HNo.2-2-164, Azad Road, Bhongir Town, Yadadri Bhongiri (D)-508116.

2.Vankarla Machender, S/o. Buchaih, Aged about 49 years, Occ: Engieer Asst, R/o. 3-1-35, Islampura, Bhongir Town, Yadadri Bhongiri (D)-508116.

3.Ankarla Saranga Pani , S/o.Narayana, aged about 52years Occ: Record Asst,R/o. 3-6-31/32, Nehru Road, Bhongir Town, Yadadri Bhongiri (D)-508116.

4.Maya Dhasharata, S/o. Ramchandar, Aged about 51years, Occ: Business, R/o. 3-11-59, Vanjariwada, Bhongir Town, Yadadri Bhongiri (D)-508116.

5.Soulla Krishna, S/o.Ramaiah, Aged about 48 years, Occ: Business, R/o.4-1-49/50, Sri Sharani Agencies, Secunderabad.-500003

6.Narla Narsing Rao,S/o.Adavaiah, Aged about 64 years, Occ Business, R/o. 2-2-164, Azad Road, Bhongiri, Bhongir Town, Yadadri Bhongiri (D)-508116.

...Defendants/Opponents /Respondents.

Where As the above named disputant has made an application for reference of the dispute with regard to non payment of subscription u/s 32 of Chit Fund Act 1982, and Demand for consolidated payment of future subscriptions with interest U/s 33 of Chit Fund Act, 1982, for the chit series KTC01T05P Ticket No.34 Which was sanctioned bearing prior sanction order No.Vide PSC No.NG071220P216 and date on 07-12-2020 to be examined under the provisions of Section 64 of Chit Funds Act, 1982. As on the date of filing disputed Claim is Rs.3,33,743-00. You are hereby directed to appear before the Deputy Registrar of Chits/ Arbitrator, Nalgonda District Register Office Municipal Complex, Nalgonda town and District, in person duly on Dt.19-02-2025 At 11-00 A.M., in to show cause why the application should not be complied with that we may cause for to be done.. Please take notice that if no appearance is made on the above mentioned date and time and no counter is filed, the case will be disposed on its merits as exparte.

DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR
NALGONDA DISTRITCT
DISTRICT REGISTAR OFFICE
MUNCIPAL COMPLEX
NALGONDA.

BEFORE THE DYPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT : MAHABUBNAGAR Arbitration.No. 5 of 2024

Between:-

Margadarsi Chit Fund Pvt.Ltd ... Disputant

And

P. Narasimham and others ..... Opponents

To.

D.N. Venkateshwarlu S/o Babu, age 43 years, Occ: Senior Manager, C/o Brickwork Ratings India Pvt.Ltd., #408,IV Floor, Shangrila plaza, Opp:K.B.R Park, Banjara Hills, Hyderabad-500034. (Opponent No.4)

Whereas the Disputant has fild above Dispute against your and others for Recovery of money. The said Dispute stands posted on 22-02-2025 for your appearance. You are hereby directed to appear before the above Chit Registrar/Arbitrator by 11:00 AM, on the said date in person or throgh advocate, otherwise the matter will be decided on the material available on records.

//BY ORDER OF THE DYPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR//

K. PRATHAP KUMAR
B.Com, L.L.B
Krishna Nivas,
H.No. 1-4-130/A/7/B,
Kamalanehru Colony,
Bayamma Thota,
Mahabubnagar.
(Enrolement No.TS/1116/1988)

BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT RANGA REDDY DISTRICT, TELANGANA STATE. PRESENT: SRI.M.SANTHOSH. DISPUTE.NO. 360 OF 2024

M/S.DHANALAKSHMI SRINIVASAN CHIT FUNDS (TELANGANA) PRIVATE LLMITED, Dilskhnagar branch, ... Dispulant

Vs.

VADALA GOPINA1H CHARY & Others . ...Opponents

To

1. Mr.VADALA GOPINATH CHARY,S/o.V.NARSIMHA CHARY, Aged about 23Years., R/o.H.No.2-1-32, Plot.No.19, Navodaya Colony, Road.No.6, SBK Colony, Venture-ll, L.B.Ngar, Hyderabad.
2. Mrs.VADALA JYOTHI, W/O.V.NARSIMHA CHARY, Aged about 45 Years R/o.H.No.2-1-32, Plot.No.19, Navodaya Colony, Road.No.6, SBK Colony,Venture-II, L.B.Nagar, Hyderabad.
3. Mr.DIMMUGUDA VENKATESH, S/o.D.MUNU SWAMY, Aged about 47 Years,R/o.H.No.Qtr.No.C-30, G.S.I.Complex, Bandlaguda, Hyderabad-500068.
4. Mr.GADEPALLY YADAGIRI, S/o. G.SOMARAJ, Aged about 49 Years,R/o.H.No.10-4-38/ 38, Pochamma Basti, Masab Tank, Hyderabad-500008.
5. Mr.EATHARI VENKATESH, S/O. E.KRISHNA, Aged about 44 Years, R/o.H.No.Q.NO.C-58, A.G.Colony, Yousufguda, Hyderabad-500045.

Please take notice that the above dispute is filed against you for Recovery of Rs.3,83,900-00 Plus interest and other charges is posted to **25-02-2025** for your appearance before the office of the Deputy Registrar of Chits/ Arbitrator, Ranga Reddy District, at II Floor, Sony Complex, PrasbanthNagar, i.e., Kukatpally, Hyderabad-500072. At 11:30 A.M. If you fail to attend the office of Deputy Registrar of Chits/ Arbitrator on that day the matter will be heard and decided exparte.

(BY ORDER OF THE DY. REGISTRAR Of CHITS/ARBITRATOR)
V.SRINIVAS REDDY
COUNSEL FOR DISPUTANT

SUMMONS NOTICE BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS (O/o.DISTRICT REGISTRAR OF REGISTRATION OF CHITS), AT: NALGONDA DISTRICT. A.A.C.F.NO/MNL/ NLG/ 405 OF 2024

Between:

M/s.KAPIL CHITS (Telangana) PVT.LTD.,.SURYAPET Branch, Represented by itsLegal Officer, Sri M.Narsimha Raju ...DISPUTANT

V/s

1 Koragatla Rama Krishna, S/o. Tirapataiah, Age: 45 years, OCC: SGT at MPPS Siripuram, R/o.H. No.1-4-117, Kotturu, Nadigudem, Suuryapet District-508233, Cell:9440852842.

2 Gudepu Madhava Rao, S/o. Ragaiah, Age: 54 years, OCC: Police Head Constable, Chityala PS, R/o. H.No.11-145/18, Ambedkar colony, Kodada, Suryapet District-508206, Cell: 8309927217.

3 Kotha Koteswar, S/o. Danaiah, Age: 48 years, OCC: SGT at PS Narayanapuram, R/o.H.No.85, Maitrikuteer, Laxmareddy Palem, Hayathnagar, Hyderabad-500070, Cell: 9100179229 ......Opponents

Whereas the above named disputant has made an application for reference of dispute with regard to non payment of subscription U/s 32 of Chit Funds Act, 1982 and Demand for consolidated payment of future subscriptions with interest U/s 33 of Chit Fund Act 1982 for the chit Series KTS01T05P-33 which was sanctioned bearing Previous sanction Order No.NG221119P220 and Date on.22-11-2019 to be examined under the provisions of section 64 of Chit Funds Act 1982.As on the date of filing disputed claim is Rs.1,95,090/- you are hereby directed to appear before before Deputy Registrar of Chit/Arbitrator, Nalgonda District Registrar Office, Muncipal Complex, Nalgonda Town & District, in person or counsel duly on **19-02-2025** at 11.00 A.M in to show cause why th application should not be complied with that we may cause for to be done.Please take notice that if no appearance is made on the above mentioned date and time and no counter is filed. The case will be disposed on its merits as exparte.

DEPUTY REGISTRAR OF CHITS /ARBITRATIOR
NALGONDA DISTRICT
DISTRICT REGISTRAR OFFICE
MUNCIPAL COMPLEX,
NALGONDA.

PASSPORT MISSING

I, Golla. Syamala S/o Golla Yesu Dasu, C/o: Yesudasu 7-23 kondavari palem patha kaluva mogalturu mandalam Mogalthur West Godava ri Andhra Pradesh -534281

I have lost my Original **Passport No. CO.658044** at lost My Passport In Nampally RailWay Station Area on 05.02.2025., inspite of my best efforts I am unable to traced if eny body found Please Cell:9703168480

SUMMON NOTICE BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR NALGONDA DISTRICT AT NALGONDA. A.A.C.F.NO. MNL/NLG/ 471 OF 2024

Between:-

M/s. KAPIL CHITS (Telangana) PVT.LTD. Bhongir Branch, Represented by its Legal Officer Sri M.Narsimha Raju, S/o.Pichaiah R/o.Nalgonda town and District. ...Plaintiff/Disputant/Petitioner,

AND

1.Nakerakanti Sridhar, S/o. Devaiah, Aged About: 49 years, Occ:Teacher, R/o. Hno.11-14-510 /1, Sirinagar Colony, L.B.Nagar, Hyderabad.

2.Bangarapu Satyanarayana,S/o. Suryanarayana, aged About 54years, Occ: Teacher, R/o.H.No. 22-119/2, Seetharam Nagar, Huzurnagar (V & M), Suryapet (D),

3.Lakavath Malsur, S/o.Somla, Aged About 46 years, Occ: Teacher, R/o.H.No. 12-76/2/42, Raghavendra Nagar, Kalyanpuri, Uppal, Hyderabad

4.Gaddam Srinivas, S/o. Shambaiah, Aged About 45 years, Occ: Teacher, R/o. H.No. 3-21, Near Govt School, Chilpakunta (V), Nuthankal (M), Suryapet (D).

5.Palvai Veera Swamy, S/o. Yellaiah, Aged About 45years, Occ: Teacher, R/o.H.No. 161, Chandupatla (V),Suryapet (M &D).

...Defendants/Opponents /Respondents.

Where As the above named disputant has made an application for reference of the dispute with regard to non payment of subscription u/s 32 of Chit Fund Act 1982, and Demand for consolidated payment of future subscriptions with interest U/s 33 of Chit Fund Act, 1982, for the chit series TBGT02P Ticket No.17 Which was sanctioned bearing prior sanction order No. Vide PSC No. NG200919P177 and date on 20-09-2019 to be examined under the provisions of Section 64 of Chit Funds Act, 1982. As on the date of filing disputed Claim is Rs.1,95,718-00. You are hereby directed to appear before the Deputy Registrar of Chits/ Arbitrator, Nalgonda District Register Office Municipal Complex, Nalgonda town and District, in person duly on Dt. 19-02-2025 At 11-00 A.M., in to show cause why the application should not be complied with that we may cause for to be done.. Please take notice that if no appearance is made on the above mentioned date and time and no counter is filed, the case will be disposed on its merits as exparte.

DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR
NALGONDA DISTRITCT
DISTRICT REGISTAR OFFICE
MUNCIPAL COMPLEX
NALGONDA.

SUMMON NOTICE BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR NALGONDA DISTRICT AT NALGONDA. A.A.C.F.NO/MNL/ NLG/ 379 OF 2024

Between:-

M/s. KAPIL CHITS (TELANGANA) PVT. LTD. Bhongir Branch, Represented by its Legal Officer Sri M.Narsimha Raju, S/o. Pichaiah R/o.Nalgonda town and District. ...Plaintiff/Disputant/Petitioner,

AND

1. Boda Sai Ranjith Kumar, S/o. Srinivasulu, Aged about: 31 Years, OCC:Private Employee, R/o. H.No 1-150, Opp. Peerijadiguda Muncipal Office, Medipally, Medchal Dist, Telangana-500098.
2. Gillakathula Prameela, D/o. Ramulu, Aged about 53 Years, OCC: Medico Social Worker, R/o. 1-150, Plot No-44, Opp-Peerjadiguda Municipal Office, Medipally, Medchal, Telangana-500098.
3. Gaddam Padmavathi, D/o. Bheemaiah, Aged about 46 Years, OCC: Staff Nurse, R/o. 38-22/36, Shiva Nagar Colony, Sainikpuri, Malkajgiri,Hyderabad, Telangana-80.
4. Doddi Manga, D/o.Bhumaiah, Aged about 49 Years, OCC: Health Asst Multipurpose, R/o. 1-3-176/96, Tallabasthi, Karadiguda, Hyderabad, Telangana-500080

...Defendants/ Opponents/Respondents.

Where As the above named disputant has made an application for reference of the dispute with regard to non payment of subscription u/s 32 of Chit Fund Act 1982, and Demand for consolidated payment of future subscriptions with interest U/s 33 of Chit Fund Act, 1982, for the chit series TBGT06J Ticket No.25 Which was sanctioned bearing prior sanction order No. Vide PSC No. 224/ 2018 and date on 27-08-2018 to be examined under the provisions of Section 64 of Chit Funds Act, 1982. As on the date of filing disputed Claim is Rs.2,639-00. You are hereby directed to appear before the Deputy Registrar of Chits/Arbitrator, Nalgonda District Register Office Municipal Complex, Nalgonda town and District, in person duly on Dt. **19-02-2025** At 11-00 A.M., in to show cause why the application should not be complied with that we may cause for to be done.

Please take notice that if no appearance is made on the above mentioned date and time and no counter is filed, the case will be disposed on its merits as exparte.

DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR
NALGONDA DISTRITCT
DISTRICT REGISTAR OFFICE
MUNCIPAL COMPLEX
NALGONDA.

ట్రాఫిక్ కానిస్టేబుల్‌కు బంగారు పతకం



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

ఇటీవల కరీంనగర్‌లో జరిగిన తెలంగాణ పోలీస్-రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో, ఎస్సార్‌నగర్ ట్రాఫిక్ కానిస్టేబుల్ వినయ్, బాడీ బిల్డింగ్, ఆర్మ్ రెజ్లింగ్ అంశాలలో బంగారు, వెండి పతాకాలు సాధించాడు. అందుకు ఎస్సార్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సైదులు అభినందనలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఎస్సార్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తూ బంగారు వెండి పతకాలు సాధించటం ఎంతో శుభ పరిమాణం అన్నారు.

సీఐకు శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-చర్లపల్లి

కుషాయిగూడ పోలీస్ స్టేషన్ నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన భాస్కర్ రెడ్డిని కాంగ్రెస్ నేతలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులూ సీతారాం రెడ్డి, చర్లపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి వెంకట్ రెడ్డి, గోపాల్ యాదవ్, హీరాలాల్ నాయక్, కరీముల్లా, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు క్రాంతికుమార్, ఉప్పల్ యూత్ కాంగ్రెస్ నాయకులు నాగరాజు గౌడ్ పాల్గొన్నారు.

మార్కెట్‌ను పరిసరాల్లోనే ఏర్పాటు చేయాలి



- ఎమ్మెల్యే శ్రీ గణేష్‌ను కోరిన రైతుబజార్ రైతులు

నవతెలంగాణ-కంటోన్మెంట్

జూబ్లీ బస్ స్టేషన్ నుంచి తూంకుంట వరకు నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో భాగంగా అల్వాల్ రైతుబజార్ కూడా పోతుండడంతో అందులో కూరగాయలు విక్రయించుకునే రైతులు బుధవారం కంటోన్మెంట్ ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేశారు. అల్వాల్ రైతుబజార్ భూములు కూడా ప్రభుత్వం సేకరిస్తున్న నేపథ్యంలో తమకు మరోచోట మార్కెట్ కాంప్లెక్స్ నిర్మించాల్సిందిగా రైతులు కోరారు. మేడ్చల్-మల్కాజిగిరి, సిద్దిపేట, మెదక్, నల్గొండ జిల్లాల సరిహద్దు గ్రామాల చెందిన రైతులు ఈ మార్కెట్‌లో కూరగాయలు విక్రయిస్తుంటారు. చుట్టుపక్కల సరిహద్దు గ్రామాల నుంచి వచ్చి 30 ఏండ్లుగా కూరగాయలను పండించి అల్వాల్ రైతుబజార్‌లో వాటిని అమ్ముకుంటున్నారు. అల్వాల్ రైతు బజార్ బస్ స్టేషన్, రైల్వే స్టేషన్ దగ్గరగా ఉండటం వల్ల వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంది. ఈ నేపథ్యంలో రైతు బజార్‌లు దూరంగా మరోచోటికి మార్చకుండా ఆ పరిసర పాంతాల్లోనే ఏర్పాటు చేయవలసిందిగా ప్రభుత్వాన్ని కోరుతూ.. దాదాపు 1000 మంది రైతులు సంతకాలు చేసిన వినతి పత్రాన్ని ఎమ్మెల్యేకు ఇచ్చారు. సమస్య మంత్రి దృష్టికి తీసుకుపోయి పరీక్షించి పరిష్కరిస్తామని ఎమ్మెల్యే శ్రీ గణేష్ రైతులకు హామీ ఇచ్చారు.

జలమండలిలో 'జలగలు'

- అక్రమమార్గంలో ఆదాయం
- ఒకే నెంబర్‌తో 600ట్యాంకర్ల బుకింగ్
- కస్టమర్ల పేరుతో డొమిస్టిక్ దందా
- ట్యాంకర్ల అక్రమార్కులపై ఎండీ ప్రత్యేక నజర్



ఫైల్

నవతెలంగాణ-సిటీబ్యూరో

జలమండలిలో అక్రమార్కులు పేట్రేగిపోతున్నారు. ఒకే క్యాన్ నెంబర్‌తో వందల సంఖ్యలో డొమెస్టిక్ ట్యాంకర్లను బుక్‌చేసి రెట్టింపురేట్లకు అమ్ముకుంటూ దందా చేస్తున్నారు. ఒకటికాదు, రెండు కాదు ఒకే నెంబర్‌పై ఏకంగా ఒక ఏడాదిలో 600 ట్యాంకర్లను బుక్ చేసినట్టు అధికారులు గుర్తించారు. 40మంది 100కుపైగా ట్యాంకర్లను బుక్ చేసినట్టుతేలింది. నగరంలో తాగునీటి ట్యాంకర్ కావాలని కస్టమర్లు బుక్ చేస్తే డెలివరీ చేయాల్సిన ట్యాంకర్ల డ్రైవర్లు, యజమానులు తప్పుడు పద్ధతిలో ట్యాంకర్లు బుక్ చేసి రెట్టింపు రేట్లకు అమ్ముకుంటున్నారు.

డొమెస్టిక్ ట్యాంకర్లను బుక్ చేసి కమర్షియల్‌గా..

ప్రజలకు నీరు సరఫరా చేసే జలమండలిపై ఒక్కసారిగా ఒత్తిడి పెరుగుతోంది. వేసవి ప్రారంభంలో చిన్నపాటి ఒడుదొడుకులు ఎదుర్కొన్నా, తర్వాతి కాలంలో పుంజుకుని ప్రజలకు తాగునీటి సేవలందించేందుకు జలమండలి ప్రణాళిక రూపొందించుకుంది. అయితే వేసవిలో తాగునీటి డిమాండ్‌ను ఆసరాగా చేసుకుంటున్న ట్యాంకర్ల యజమానులు, డ్రైవర్లు ఇదే అదునుగా భావిస్తున్నారు. డొమెస్టిక్ ట్యాంకర్లను బుక్ చేసి కమర్షియల్‌గా విక్రయించి సులువుగా డబ్బులు సంపాదించాలని పథకం వేశారు. ఇందులో భాగంగా ట్యాంకర్ బుక్ చేసుకోలేని కన్జూమర్ అకౌంట్ నెంబర్(సీఏఎన్)లను గుర్తించి, వారి క్యాన్ నంబర్‌కు డ్రైవర్ల నెంబర్లు అనుసంధానం చేశారు. వారే డొమెస్టిక్ అవసరాల కోసం ట్యాంకర్లను విచ్చలవిడిగా బుక్ చేసి బ్లాక్‌లో విక్రయిస్తున్నారు. ఇలా ఓ క్యాన్ నెంబర్‌తో ఏకంగా 600 ట్యాంకర్లను బుక్ చేసినట్టు అధికారులు గుర్తించారు. మరో ట్యాంకర్ డ్రైవర్ 400, ఇంకొకరు 100, 200 ట్యాంకర్లను బుక్ చేశారు. గుట్టుచప్పుడు కాకుండా కొనసాగుతున్న దందాపై జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి ఆరా తీశారు. నీటిదందాపై మరింతలోతుగా విచారణ జరిపిస్తున్నారు. అవసరమైతే 'జలగల'పై విజిలెన్స్ ఎంక్వైరీ వేయనున్నట్టు సమాచారం.

అక్రమాలకు పాల్పడితే బ్లాక్ లిస్టే

జలమండలి ఐటీ వింగ్ అధికారులతో ఎండీ అశోక్ రెడ్డి సమీక్ష

జలమండలి ఐటీ వింగ్ అధికారులతో ఎండీ అశోక్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ సమీక్షలో ట్యాంకర్ మేనేజ్‌మెంట్‌పై చర్చించారు. ఈ సమీక్షలో గతేడాది కాలంలో అత్యధిక ట్యాంకర్లు బుక్ అయ్యాయని, ఇదే సమయంలో నలభైకి మందికి పైగా డ్రైవర్లు అక్రమాలకు పాల్పడ్డట్టు గుర్తించామని ఎండీ తెలిపారు. ఈ ఏడాది వేసని సమీపంలో ఉన్న నేపథ్యంలో, ఏ ట్యాంకర్ ఓనర్ అయినా, డ్రైవర్, అయినా అక్రమాలకు పాల్పడితే బ్లాక్ లిస్టులో పెట్టడమే కాకుండా కఠిన చర్యలు కూడా తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో పాటు గతేడాది అక్రమ పద్ధతిలో ట్యాంకర్లు బుక్ చేసిన మొబైల్ నెంబర్లు, క్యాన్ నంబర్లను బ్లాక్ చేయనున్నట్లు ఎండీ తెలిపారు. అత్యధికంగా ఒక్కో క్యాన్‌పై వంద ట్రిప్పులకు పైగా బుక్ చేసినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు పేర్కొన్నారు. ఇదే అంశంపై లోతుగా అధ్యయనం చేసి వివరాలు సేకరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈడీ మయాంక్ మిట్టల్, ఐటీ వింగ్ అధికారులు పాల్గొన్నారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే





నవతెలంగాణ-బేగంపేట్

అనారోగ్యం బారిన పడినప్పుడు ధైర్యంగా ఉండాలని, మెరుగైన వైద్యంతో తిరిగి సాధారణ జీవితం గడపొచ్చని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. బుధవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో సనత్‌నగర్, అమీర్‌పేట్‌లకు చెందిన ముగ్గురికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన0 రూ. 4.20 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. సనత్‌నగర్‌కు చెందిన చెంచు లక్ష్మీ వెన్నుముక సంబంధ సమస్యతో బాధపడుతుండగా చికిత్స కోసం రూ.2 లక్షలలు, అమీర్‌పేటలోని సుప్రభాత్ నగర్‌కు చెందిన గోపి గుండె చికిత్స కోసం రూ.1.10 లక్షలు, ఎస్సార్‌నగర్‌కు చెందిన రాథోడ్ ఉదయ్ సింగ్‌కు రూ.1.10 లక్షల ఆర్థిక సహాయాన్ని ఆయన చొరవతో మంజూరు కాగా, లబ్ధిదారుల కుటుంబాలకు ఎల్‌ఓసీలను అందజేశారు. ఆర్థిక సహాయం మంజూరు చేయించినందుకు లబ్ధిదారులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సనత్‌నగర్ కార్పొరేటర్ కొలన్ లక్ష్మీ, బీఆర్ఎస్ అధ్యక్షుడు కొలన్ బాల్ రెడ్డి, అమీర్ పేట డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నామన సంతోష్ మణి కుమార్, నాయకులు కూతురు నర్సింహ, గోపిలాల్ చౌహాన్, బలరాం, హరిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మెడికల్ హబ్‌గా హైదరాబాద్

- విద్య, వైద్యానికి ప్రభుత్వం పెద్ద పీట
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి





నవతెలంగాణ-బంజారాహిల్స్

విశ్వనగరంగా పేరుగాంచిన హైదరాబాద్ అంతర్జాతీయ మెడికల్ హబ్ అని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా వైద్యానికి పెద్ద పీట వేస్తున్నట్టు చెప్పారు. బుధవారం బంజారాహిల్స్ రోడ్డు నెంబర్ 12 లోని రెనోవా ఆస్పతిలో నూతనంగా ఏర్పాటు చేసిన "ఆర్థోపెటిక్ రోబెటిక్ సర్జరీ యంత్రాన్ని" ఆస్పత్రి ఎండి శ్రీధర్ పెద్దిరెడ్డి, ఆర్థోపెటిక్ నిపుణులు సుహాస్ మాసులోమనితో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరం హెల్త్ హబ్‌గా రూపుదిద్దుకుందని, ఇతర దేశాల రోగుల సైతం ఆధునిక వైద్య చికిత్స నిమిత్తం నగరానికి వస్తున్నారంటే ఇక్కడ సేవలు ఏ స్థాయిలో అందుతున్నాయో అర్థం చేసుకోవచ్చనని అన్నారు. వ్యాపార దృక్పథంతోనే కాక సేవా దృక్పథంతో వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆధునిక రోబోటిక్ యంత్రాన్ని ప్రవేశ పెట్టిన సందర్భంగా మొదటి మంద శస్త్ర చికిత్సలను ఉచితంగా అందించేందుకు ముందుకు రావడం అభినంద నీయమని అన్నారు. నగరాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ఫోర్త్ సిటీని అభివృద్ధి చేస్తున్నామని ఫోర్త్ సిటీలో ప్రయివేట్ సంస్థల సైతం భాగస్వామ్యం కావాలని కోరారు. ఆర్థోపెటిక్ నిపుణులు సుహాస్ మాట్లాడుతూ.. ఆర్థోపెడిక్ సమస్యలతో బాధపడుతున్న వారికి అత్యాధునిక వైద్య చికిత్సలు అందించే నిమిత్తం నూతన యంత్రాన్ని అందుబాటులోకి తెచ్చినట్టు సుహాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామ్ రెడ్డి, మహబూబాబాద్ ఎంపీ, బలరాం నాయక్, పాలకుర్తి పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, తెలంగాణ ఐడీసీఎల్ ఛైర్మెన్, విజయ్ బాబు, ఎండీ అండ్ సీఈవో, రెనోవా హాస్పిటల్స్, డా.శ్రీధర్ పెద్దిరెడ్డి, సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్, ఛైర్మెన్ కార్డియాక్ సైన్సెస్, డా.బి.కె.ఎస్.శాస్త్రి, చీఫ్ ఆఫ్ న్యూరాలజీ, పలువురు వైద్యులు, వైద్యేతర సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు



- సివిల్ సప్లై అధికారులతో అవగాహన కార్యక్రమంలో కోట నీలిమ

నవతెలంగాణ-బేగంపేట్

కాంగ్రెస్ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి డా.కోట నీలిమ ఆధ్వర్యంలో సివిల్ సప్లై అధికారులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోట నీలిమ మాట్లాడుతూ.. కుల గణన సమయంలో రేషన్ కార్డులు రాకపోయిన వారు నిరాశ చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. దిగువ మధ్యతరగతి వర్గానికి మాత్రమే రేషన్ కార్డులు మంజూరయ్యాయని, మిగతా అర్హులందరూ ప్రతి సోమవారం జరిగేయ ప్రజావాణి ద్వారా మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు అందుతుందని హామీ ఇస్తూ, ఈ ప్రక్రియలో ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే తమ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. అక్రమంగా డబ్బులు వసూలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఈ సమావేశంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలుడ పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీలో విలీనమైతేనే సమస్యలకు పరిష్కారం





- బస్తీ పర్యటనలో ఎమ్మెల్యే శ్రీగణేష్

నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ బోర్డు జీహెచ్‌ఎంసీలో విలీనం అయితేనే అన్ని సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు. బస్తీ పర్యటనలో భాగంగా ఎమ్మెల్యే బుధవారం బోయిన్‌పల్లి వార్డ్-1లోని లక్ష్మీ నర్సింహనగర్, బాపూజీనగర్‌లో పర్యటించి సమస్యలను పరిశీలించారు. ఎన్నో ఏండ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా డ్రయినేజీ, రోడ్లు, కరెంట్, తాగునీటి సమస్యలు ఎన్నో ఏండ్లుగా అపరిష్కృతంగా ఉన్నాయని వివరించారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను వివరించి వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అదేశించారు. ఈ సందర్భంగా ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. కంటోన్మెంట్ బోర్డు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉండడంతో సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపలేకపోతుందని, నిధుల కేటాయింపు కూడా సమస్యగా మారుతుందని, కంటోన్మెంట్ బోర్డు రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించాల్సిన సర్వీస్ ఛార్జీలను కూడా చెల్లించడం లేదని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కంటోన్మెంట్ బోర్డ్‌కు ఉన్న నామినేటెడ్ సభ్యుడు తన కబంధ హస్తాలలో పెట్టుకుని ఇక్కడ ప్రజలకు కనీస సౌకర్యాలను కూడా ఏర్పాటు చేయలేకపోతున్నారని విమర్శించారు, కంటోన్మెంట్ బోర్డు జీహెచ్‌ఎంసీలో విలీనం అయితేనే ఈ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని, తాను కూడా ఎమ్మెల్యేగా ప్రభుత్వం నుంచి నిధులను తీసుకువచ్చి బస్తీలను అభివృద్ధి చేయడానికి అవకాశం దొరుకుతుందని, ప్రజలు కూడా ఆలోచించి సహకరించాలని కోరారు. బస్తీ పర్యటనలో ఎమ్మెల్యే వెంట కంటోన్మెంట్ బోర్డ్ మాజీ వైస్ ఛైర్మెన్ జంపన ప్రతాప్, నాయకులు అజయ్ కుమార్, బోయిన్‌పల్లి మార్కెట్ యార్డ్ డైరెక్టర్ శరత్, బల్వంత్‌రెడ్డి, స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వివాహానికి హాజరుకావాలని కేటీఆర్‌కు ఆహ్వానం



నవతెలంగాణ-చర్లపల్లి

ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ చర్లపల్లి డివిజన్‌కి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పండాల శివకుమార్ గౌడ్ తన అన్న పాండాల నవీన్ కుమార్ గౌడ్ కొడుకు వివాహాని హాజరుకావాలని, మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఆహ్వాన పత్రికను బుధవారం బంజారాహిల్స్‌లోని కేటీఆర్ నివాసంలో అందజేశారు.

వర్గీకరణలో ఏ,బీ,సీ తోపాటు 'డీ' అవసరం ఉంది



- తెలంగాణ రాష్ట్ర జనసేన పార్టీ

నవతెలంగాణ-బంజారాహిల్స్

కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణలో కేటాయింపులు ఆమోదయోగ్యంగా లేవని, గతంలో ఉన్న ఏ.బీ.సీతోపాటు డీ కూడ అమలు చేయాలని జనసేన పార్టీ నాయకులు శ్రీనివాస్ అన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సైదులు, సాంబశివుడు, సాయి సాగర్, కృష్ణ నగేష్ జావీన్‌లతో కలిసి మాట్లాడారు.. గ్రూప్ ఏ లో సామాజికంగా ఆర్థికంగా వెనుకబడిన 15 కులాల వారికి కేవలం ఒక్క శాతం మాత్రమే రిజర్వేషన్ కేటాయించారని, గ్రూప్ బీ లో మధ్యస్థంగా లబ్ది పొందిన వారు 18 కులాలు ఉండగా 9 శాతం, మెరుగైన ప్రయోజనం పొందిన గ్రూప్ సీ లోని 26 కులాలకు మాత్రం ఐదు శాతం కేటాయించారని తెలిపారు. అత్యంత వెనుక బడిన గ్రూపు ఏ లో ఉన్న మాదిగలకు 9 నుంచి 11శాతం రిజర్వేషన్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఓయూలో సీఎం దిష్టిబొమ్మ దహనం



- ఫిబ్రవరి 4 బ్లాక్ డే : మాల విద్యార్థులు

నవతెలంగాణ-ఓయూ

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేసిన తీరు సరిగా లేదని ఆరోపిస్తూ బుధవారం తెలంగాణ మాల విద్యార్థి జేఏసీ మాదాసు రాహుల్ ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. వర్గీకరణ వల్ల మాలలు నష్టపోయారని మండిపడ్డారు. ఫిబ్రవరి 4, 2025ను మాలలు అందరూ బ్లాక్ డేగా ప్రకటిస్తున్నామని అన్నారు. మాలల జీవితాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చీకటి రోజు నింపిందని మండిపడ్డారు. మాలలు అందరూ ఇప్పటికైనా మేలుకోవాలని ఏ రాజకీయ పార్టీ మనకు అండగాలేదని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తడి గుడ్డతో మాలల గొంతు కోశారని మండిపడ్డారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో కాంగ్రెస్ పార్టీ మాల సామాజిక వర్గానికి ద్రోహం చేసిందని ఆరోపించారు. అసెంబ్లీలో హౌస్ కమిటీ వేయకుండా మాల, మాదిగ ప్రతినిధులను సంప్రదించకుండా వర్గీకరణ చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో భీమ్ మిషన్ ఆఫ్ ఇండియా వర్కింగ్ ప్రెసిడెంట్ మందాల భాస్కర్, అంసా ఓయూ అధ్యక్షుడు నామ సైదులు మాల విద్యార్థులు పాల్గొన్నారు.

బసవతారకంలో అవగాహన కార్యక్రమాలు

- బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ యాజమాన్యం





నవతెలంగాణ-బంజారాహిల్స్

ఫిబ్రవరి 4 ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఫిబ్రవరి నెలంతా పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్న బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం, హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను సుమారు రూ.4 వేల దాన్ని కేవలం 1500కే అందించడం, అవగాహన కలిపించడానికి ప్రత్యేక వాకథాన్ ప్రదర్శనలనూ బుధవారం బంజారా హిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిలో నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని క్యాన్సర్ పై పోరాటంలో 25 సంవత్సరములు పూర్తి చేసుకొంటున్న బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రిలో 28 వరకూ ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సీఈఓ డా.కె కృష్ణయ్య మాట్లాడుతూ.. క్యాన్సర్ వ్యాధిపై పేద ప్రజలకు సహాయం చేయడానికి వీలుగా నందమూరి తారక రామారావు పలు ఇతర దాతల సహకారంతో సంస్థను ఏర్పాటు చేశారన్నారు. ప్రతి ఏటా నిర్వహించే ఉచిత వ్యాధి నిర్ధారణ శిబిరంతో పాటు ఈ ఏడాది మహిళలలో ఎక్కువగా కనిపించే గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ (సర్వికల్ క్యాన్సర్) నివారణకు ఉపయోగపడే ప్రత్యేక వ్యాక్సిన్‌ను ఆడపిల్లలు, మహిళలకోసం అత్యంత తక్కువ ధరకు అంటే కేవలం రూ.1500లకు మాత్రమే అందిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో దాతలు, ప్రభుత్వం సహకారం అందిస్తే ఈ వ్యాక్సిన్‌ను ఉచితంగా అందించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ట్రస్టు బోర్డు సభ్యులు డా.రాఘవ రావు పోలవరపు మాట్లాడుతూ.. పేద ప్రజలకు క్యాన్సర్ చికిత్స అందించడానికి ఏర్పాటు చేసిన హాస్పిటల్ ప్రజలకు ఎన్నో సేవలు అందుబాటులోనికి తీసుకొని వచ్చామని తెలిపారు. అత్యంత అందుబాటైన ధరలలో అందించే ఈ చికిత్సను బయపడకుండా అపోహలు లేకుండా తీసుకోవాలని సూచించారు. తద్వారా క్యాన్సర్‌ను ఎదుర్కోవడానికి వీలవుతుందని స్పష్టం చేశారు. ఈ నెల 8న ప్రత్యేక వాకథాన్ కూడా హాస్పిటల్ నిర్వహిస్తోందన్నారు. ఈ వాకథాన్‌లో కూడా ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని హాస్పిటల్ యాజమాన్యం పిలుపునిచ్చింది. అంతే గాకుండా క్యాన్సర్‌పై హాస్పిటల్ జరుపుతున్న పోరాటాలకు తమ వంతు సహాయం ఇవ్వడానికి దాతలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమాలలో ఎండి డా.టియస్ రావు, సర్జికల్ ఆంకాలజిస్టు, డా.రాజగోపాలన్, ఎంఎస్ డా.ఫణికోటేశ్వర రావు, ఆసోసియేట్ డైరెక్టర్, డా.కల్పనా రఘునాద్, వైద్యులు, నర్సింగ్ కళాశాల అధ్యాపకులు, నర్సింగ్ కళాశాల విద్యార్థీ, విద్యార్థిణులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎగ్జామ్ వాయిదాకు విద్యార్థుల ధర్నా



నవతెలంగాణ-ఓయూ

సైన్స్ కాలేజ్ సెకండ్ ఇయర్ విద్యార్థులు, తమ మూడవ సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 17 నుంచి 27 వరకు నిర్వహించబోయే పరీక్షలు వాయిదాకై విద్యార్థులు బుధవారం ఓయూ పరిపాలనా భవన్ ఎదుట ధర్నా చేపట్టారు. నెట్ పరీక్ష 28న, ఉందని, దీనితో సెమిస్టర్ పరీక్షలును వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టారు. విషయం తెలుసుకున్న ఓయూ ఓఎస్డీ ప్రొ.జితేందర్ నాయక్ విద్యార్థులను పిలిపించి పరీక్షల వాయిదా విషయం వీసీతో మాట్లాడి ఏదో ఒక నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. విద్యార్థులు మాట్లాడుతూ.. మాకు పరీక్షలు వాయిదా గురుంచి ఏదో ఒకటి చెప్పాలని లేనిపక్షంలో ఎల్లుండి మళ్ళీ పరిపాలన భవనం ముందు ధర్నా చేస్తామని అన్నారు. అనంతరం ధర్నా విరమించుకున్నారు. కార్యక్రమంలో సైన్సు విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రేక్ ఫాస్ట్‌కు సూపర్ ఆప్షన్స్

బ్రేక్ ఫాస్ట్ అంటే అందరికీ గుర్తుకు వచ్చేవి ఇడ్లీ, ఉప్మా, దోశ, పూరీ... ఇవే. సాధారణంగా అన్ని ఇండ్లల్లో ఇవే ఉంటాయి. అయితే పిల్లలు ఏదైనా కొత్తగా కోరుకుంటారు. వాళ్ల కోసం హెల్దీగా ఏం చేయాలి అనే ఆలోచన రావడం సహజం. అలాంటి వారి కోసమే ఈ వెరైటీ హెల్దీ బ్రేక్ ఫాస్ట్‌లు. పిల్లలే కాదు ఇంటిల్లి పాదీ లొట్టలేసుకొని మరీ తినాల్సిందే. మరి అలాంటి బ్రేక్‌ఫాస్ట్‌లు ఏంటో, వాటిని ఎలా చేయాలో ఈరోజు తెలుసుకుందాం...



పోహా

కావాల్సిన పదార్థాలు: అటుకులు - ఒకటిన్నర కప్పు, నూనె - మూడు టేబుల్ స్పూన్లు, పల్లీలు - మూడు టేబుల్ స్పూన్లు, ఆవాలు - టీ స్పూన్, జీలకర్ర - టీ స్పూన్, ఎండు మిర్చి - రెండు, కరివేపాకు రెబ్బలు - రెండు, ఉల్లిగడ్డ తరుగు - పావు కప్పు, పచ్చిమిర్చి (సన్నని తరుగు) - రెండు,



క్యారట్ తరుగు - పావు కప్పు, కాప్సికం తరుగు - పావు కప్పు, టమాటా సన్నని తరుగు - పావు కప్పు, ఉప్పు - రుచికి సరిపడా, పసుపు - పావు టీ స్పూను, ఫ్రోజెన్ బఠాణీ - పావు కప్పు, మొలకలు - అర కప్పు, పంచదార - పావు టీ స్పూను, నీళ్లు - నాలుగు టేబుల్ స్పూన్లు, కొత్తిమీర - కొద్దిగా, నిమ్మరసం - టేబుల్ స్పూను.

తయారీ విధానం: ముందుగా అటుకులని జల్లించకుని నీళ్లతో తడిపి జల్లెడలో వదిలేయండి. తర్వాత స్టౌ ఆన్ చేసి నూనె వేడి చేసి అందులో పల్లీలు, ఆవాలు, జీలకర్ర, ఎండుమిర్చి వేసి కాసేపు వేగనివ్వాలి. అందులోనే ఉల్లిగడ్డ, పచ్చిమిర్చి తరుగు, కరివేపాకు వేసి వేయించుకోవాలి. ఉల్లిగడ్డ ఎర్రగా మారిన తర్వాత అందులో క్యారట్, కాప్సికం ముక్కలు వేసి మూడు నిమిషాలు మగ్గనివ్వాలి. తర్వాత బఠాణీ, మొలకలు, టమాటా ముక్కలు, ఉప్పు, పసుపు వేసి కలిపి మూతపెట్టి మరో మూడు నిమిషాలు ఉడికించుకోవాలి. ఇప్పుడు తడిపిన అటుకులు వేసి చిదిరిపోకుండా బాగా కలపాలి. ఆ తర్వాత పంచదార వేసి కలిపి మూకుడు అంచుల వెంట నీళ్ల పోసి కదపకుండా మూత పెట్టి మూడు నాలుగు నిమిషాలు ఆవిరి మీద ఉడికించుకోవాలి. మూత తీసి నిమ్మరసం, కాస్త కొత్తిమీర తరుగు వేసి కలిపి దింపేసుకుంటే హెల్దీ స్ప్రౌట్స్ పోహ రెడీ!

మరమరాల వడలు

కావాల్సిన పదార్థాలు: మరమరాలు - ఒకటిన్నర కప్పులు, ఉల్లిగడ్డ - ఒకటి, పచ్చిమిర్చి - రెండు, కరివేపాకు - రెండు రెమ్మలు, ఉప్పు- రుచికి సరిపడా, కారం - అర టీ స్పూను, గరం మసాలా - పావు టీ స్పూను, ధనియాల పొడి - పావు టీ స్పూను, జీలకర్ర పొడి - పావు టీ స్పూను, అల్లం పేస్టు - అర టేబుల్ స్పూను, బియ్యం పిండి - రెండు చెంచాలు, మైదా - రెండు చెంచాలు

తయారీ విధానం: ముందుగా మరమరాలను ఒక గిన్నెలోకి తీసుకుని అందులో నీళ్ల పోసి ఐదు నిమిషాలు పక్కకు పెట్టాలి. ఈ లోపు ఉల్లిగడ్డ,



కరివేపాకు, పచ్చిమిర్చిని సన్నగా కట్ చేసి పక్కకు పెట్టుకోవాలి. మరమరాలు నానిన తర్వాత నీళ్ల లేకుండా పిండుకుంటూ ఓ బౌల్‌లోకి తీసుకోవాలి. ఇలా మరమరాలను మొత్తం గిన్నెలోకి తీసుకోవాలి.

అందులోకి సన్నగా తరిగిన ఉల్లిగడ్డ, పచ్చిమిర్చి, కరివేపాకు తరుగు వేయాలి. అలాగే రుచికి సరిపడా ఉప్పు, కారం, గరం మసాలా, ధనియాల పొడి, జీలకర్ర పొడి, అల్లం వెల్లుల్లి పేస్టు, బియ్యప్పిండి, మైదా వేసుకోవాలి. మైదా ఇష్టం లేకపోతే దాని బదులు శనగపిండి వేసుకోవాలి. ఇలా వేసుకున్న తర్వాత మసాలాలు మొత్తం మరమరాలకు పట్టే విధంగా బాగా కలుపుకోవాలి. ఆ తర్వాత కొద్దికొద్దిగా నీళ్ల చిలకరించుకుంటూ మరమరాలను ముద్దగా వచ్చే వరకు కలుపుకోవాలి. అలా కలుపుకున్న తర్వాత మరమరాల మిశ్రమాన్ని కొంచెం తీసుకుని ఉండలాగ చేసి అరచేతిలో పెట్టి వడలుగా ఒత్తుకుని ఓ ప్లేట్‌లోకి తీసుకోవాలి. ఇలా మరమరాల మిశ్రమాన్ని మొత్తం వడలుగా ఒత్తుకోవాలి. ఇప్పుడు స్టవ్ ఆన్ చేసి కడాయి పెట్టి డీప్ ఫ్రైకి సరిపడా నూనె పోసుకోవాలి. నూనె బాగా కాలిన తర్వాత ముందే సిద్ధం చేసుకున్న వడలను నూనెలో వేసి మీడియం ఫ్లేమ్‌లో రెండు వైపులా ఎర్రగా కాల్చుకోవాలి. ఇలా తయారు చేసిన వడలన్నింటినీ నూనెలో వేసి కాల్చుకోవాలి. అంతే ఎంతో టేస్టీగా ఉండే మరమరాల వడలు రెడీ. కేవలం నిమిషాల్లోనే ప్రిపేర్ చేసుకునే ఈ వడలను ఏదైనా చట్నీతో లేదా విడిగా తిన్నా రుచిగా వుంటాయి. నచ్చితే మీరూ ట్రై చేసుకోండి.

ఓట్స్ పకోడీ

కావాల్సిన పదార్థాలు: గుప్పెడు - జీడిపప్పులు, ఒక కప్పు - ఓట్స్, రెండు - ఉల్లిగడ్డలు, పావు కప్పు - శనగపిండి, పావు కప్పు - బియ్యప్పిండి, మూడు - పచ్చిమిర్చి, గుప్పెడు - కరివేపాకు, కొద్దిగా - కొత్తిమీర తరుగు, అరటీస్పూన్ - గరంమసాలా, పావుటీస్పూన్ - పసుపు, తగినంత - కారం, కొద్దిగా - అల్లంవెల్లుల్లి పేస్ట్, రుచికి సరిపడా - ఉప్పు, నూనె - వేయించడానికి సరిపడా.



తయారీ విధానం: ఇందుకోసం ముందుగా ఒక గిన్నెలో ఓట్స్‌ను తీసుకొని అవి పూర్తిగా నిండిపోయేలా కాకుండా సగం వరకు మాత్రమే నీళ్ల పోసి కొద్దిసేపు నానబెట్టుకోవాలి. అవి నానేలోపు రెసిపీలోకి కావాల్సిన ఉల్లిగడ్డ, పచ్చిమిర్చిలను సన్నగా తరుక్కొని పక్కన పెట్టుకోవాలి. అలాగే జీడిపప్పు పలుకులు, కొత్తిమీర, కరివేపాకు సన్నగా కట్ చేసుకొని పక్కనుంచాలి. ఓట్స్ చక్కగా నాని మెత్తగా అయ్యాయనుకున్నాక నీళ్ల వడకట్టి వాటిని ఒక మిక్సింగ్ బౌల్‌లోకి తీసుకోవాలి. అందులో శనగపిండి, బియ్యప్పిండి యాడ్ చేసుకొని బాగా కలుపుకోవాలి. తర్వాత ముందుగా తరిగి పెట్టుకున్న సన్నని ఉల్లిగడ్డ, పచ్చి మిర్చి తరుగు వేసుకొని మరోసారి చక్కగా మిక్స్ చేసుకోవాలి. ఇప్పుడు ఉప్పు, సన్నగా తరుక్కున్న జీడిపప్పు పలుకులు, కొత్తిమీర, కరివేపాకు తరుగు, కారం, పసుపు, గరంమసాలా, అల్లంవెల్లుల్లి పేస్ట్ ఇలా మిగతా పదార్థాలన్నీ వేసుకొని అన్నీ కలిసేలా బాగా మిక్స్ చేసుకోవాలి. అవసరమైతే కొద్దిగా వాటర్ యాడ్ చేసుకొని పకోడీ పిండి మాదిరిగా కలుపుకొని పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు స్టౌపై పాన్ పెట్టుకొని ఆయిల్ వేసుకోవాలి. నూనె వేడయ్యాక ముందుగా కలిపి పెట్టుకున్న ఓట్స్ మిశ్రమాన్ని కొద్దికొద్దిగా తీసుకొని పకోడిల్లా వేసుకోవాలి. మీడియం ఫ్లేమ్ మీద అన్ని వైపులా పకోడీ చక్కగా కాలేంత వరకు వేయించుకోవాలి. ఎర్రగా వేగి, గోల్డెన్ కలర్‌లోకి వచ్చాయనుకున్నాక వాటిని తీసి టిష్యూ పేపర్ పరచిన ప్లేట్‌లో వేసుకోవాలి. ఇలా చేయడం ద్వారా టిష్యూ పేపర్ అదనపు నూనెను పీల్చేస్తుంది. ఆ తర్వాత వేడివేడిగా సర్వ్ చేసుకుంటే చాలు.

అరటి కోలా బాల్స్

కావాల్సిన పదార్థాలు: అరటికాయలు - రెండు, పల్లీలు - కప్పు, కొబ్బరి తురుము - పావు కప్పు, అల్లం - అంగుళం ముక్క, పచ్చిమిర్చి - రెండు, కారం - టేబుల్ స్పూను, పసుపు - పావు చెంచా, సోంపు - పావు చెంచా, ఇంగువ - చిటికెడు, సన్నని ఉల్లిగడ్డ తరుగు - ముప్పావు కప్పు, ఉప్పు - రుచికి సరిపడా, కొత్తిమీర తరుగు - చారెడు, కరివేపాకు - రెండు రెమ్మలు, నూనె - వేయించడానికి సరిపడా

తయారీ విధానం: ముందుగా అరటికాయల చివర్లు కట్ చేసుకొని మరీ మెత్తగా కాకుండా ఉడికించుకోవాలి. ఆ తర్వాత వాటిని చల్లార్చుకొని తొక్క తీసి తురుముకొని పక్కనుంచాలి. అలాగే ఉల్లిగడ్డలను సన్నగా తరుక్కొని రెడీగా ఉంచుకోవాలి. కొత్తిమీర, కరివేపాకుని సన్నగా కట్ చేసుకోవాలి. ఇప్పుడు స్టౌపై పాన్ పెట్టుకొని పల్లీలను వేసి వేయించుకొని పొట్టు తీసుకొని పక్కన పెట్టుకోవాలి. మిక్సీ జార్



తీసుకొని అందులో వేయించుకున్న పల్లీలు, పచ్చిమిర్చి, అల్లం, పసుపు, సోంపు, కారం, ఇంగువ, ఉప్పు వేసి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. తర్వాత వెడల్పాటి మిక్సింగ్ బౌల్ తీసుకొని అందులో మిక్సీ పట్టుకున్న పల్లీల మిశ్రమం, అరటికాయ తురుము, ఉల్లిగడ్డ తరుగు, కొత్తిమీర, కరివేపాకు తరుగు, కొబ్బరి తురుము వేసుకొని అన్నీ కలిసేలా ఒకసారి బాగా కలుపుకోవాలి. ఇందులో నుంచి కొద్దికొద్దిగా పిండిముద్దను తీసుకొని నిమ్మకాయంత సైజ్‌లో చిన్న చిన్న ఉండలు చేసుకోవాలి. ఇప్పుడు స్టౌపై కడాయి పెట్టుకొని ఆయిల్ వేసుకొని వేడి చేసుకోవాలి. నూనె వేడయ్యాక ఆ ఉండలను కాగుతున్న నూనెలో వేసి దోరగా వేయించుకోవాలి. అంతే ఘుమఘుమలాడే టేస్టీ అరటి కోలా బాల్స్ రెడీ. వీటిని చట్నీ లేదా సాస్‌తో తింటే సూపర్‌గా ఉంటాయి. ■

ఫోన్ చూస్తూ పడుకుంటున్నారా?

ఫోన్ మన జీవితంలో ఓ భాగమైపోయింది. ఉదయం లేచింది మొదలు.. రాత్రి పడుకునే వరకూ ఫోన్ చేతిలోనే ఉంటున్నది. ఇక పడుకునే ముందు కచ్చితంగా మొబైల్ చూస్తూ పడుకుంటున్నారు. ఇది సర్వసాధారణమైన ప్రక్రియగా మారిపోయింది. పిల్లల నుంచి పెద్దల వరకు పడుకునే ముందు కూడా ఫోన్ చేతిలో ఉండాల్సిందే. కొంతమంది మొబైల్ ఫోన్ పట్టుకుని అలానే నిద్రపోతారు. కొంతమంది అయితే తెల్లారేవరకు మొబైల్ చూసి తెల్లారిన తరువాత పడుకునే వారూ ఉన్నారంటే



ఆశ్చర్యపోనక్కరలేదు. పడుకునే ముందు ఎక్కువ సేపు ఫోన్ చూస్తే అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని ఇటీవల ఓ సర్వేలో తేలింది.

అధిక రక్తపోటు

చైనాలోని హెబీ మెడికల్ యూనివర్సిటీకి చెందిన రీసెర్చ్ టీమ్ జరిపిన ఈ స్టడీలో షాకింగ్ నిజాలు వెలుగులోకి వచ్చాయి. సాధారణంగా, పగటిపూట కంప్యూటర్ ముందు, టీవీ ముందు లేదా వీడియో గేమ్‌లు ఆడటం కంటే రాత్రి పడుకునే ముందు ఫోన్ చూస్తున్నప్పుడు రక్తపోటు ఎక్కువగా ఉంటుందని ఆ అధ్యయనంలో వెల్లడైంది. నిద్రపోతున్నప్పుడు రీల్స్ చూడటం యువకులలో హై బీపీకి కారణమవుతుందని పేర్కొన్నారు.

నిద్ర పట్టదు

రాత్రిపూట కళ్లపై ఎక్కువ నీలిరంగు లైట్లు పడటం వల్ల నిద్ర పట్టదు. దీనివల్ల శరీర బరువు పెరగడం, కంటి చూపు మందగించడం వంటి సమస్యలు వస్తాయి. అలాగే దీని వల్ల రక్తంలో గ్లూకోజ్ పెరగడం, యూరిక్ యాసిడ్ పెరగడం వంటి సమస్యలు వస్తాయని తెలిసింది.

అలాగే చిన్న పిల్లలు కూడా రాత్రి పడుకునే ముందు మొబైల్ చూడడం వల్ల వారి మెదడు పనితీరుపై ప్రభావం పడుతుందని, నరాలకు సంబంధించిన సమస్యలు వస్తాయని చెబుతున్నారు. అందుకే రాత్రి పడుకోవడానికి రెండు గంటల ముందే మొబైల్స్ బంద్ చేయడం మంచిది. ■

కులగణన సర్వే తప్పులతడక

(మొదటిపేజీ తరువాయి)

కమిషన్ జాబితా ప్రకారం 3.35 కోట్ల మంది ఓటర్లు, 18 ఏండ్లలోపు వారు 25 శాతం మందితో కలుపుకుంటే రాష్ట్ర జనాభా మొత్తం 4 కోట్లపైనే ఉంటుందని తెలిపారు. బీసీలపై కాంగ్రెస్ సర్కారు కుట్రకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ పోరాడుతుందని హెచ్చరించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ కులగణన నివేదిక బోగస్ అని విమర్శించారు. గతంలో బీసీ కమిషన్ ద్వారా కాకుండా ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ ద్వారా సర్వే చేయిస్తే కోర్టు కొట్టేసిందనీ, అదే తప్పును మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందని చెప్పారు. 40 శాతం బీసీలను మాయం చేసి 56 శాతంపైన ఉన్న వారిని 46 శాతంగా చూపించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రీ సర్వే చేయాలని డిమాండ్ చేశారు. బీసీలెవరూ సంబురాలు చేసుకోలేదనీ, గాంధీభవన్‌లోనే సంబురాలు చేసుకున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ అసెంబ్లీ విప్ కె.పి.వివేకానంద మాట్లాడుతూ ఫిబ్రవరి 4 బడుగు, బలహీన వర్గాలకు చీకటి రోజని విమర్శి ంచారు. మానసిక ఉన్మాదిలా ప్రవర్తించిన సీఎం రేవంత్ రెడ్డి నటనను ఎవరూ నమ్మలేదని కొట్టిపారేశారు. తమ అధినేత కేసీఆర్‌తో చర్చించి బీసీల కోసం ఉద్య మిస్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎల్.రమణ బీసీలకు 42 శాతం రిజ ర్వేషన్లకు చట్టబద్ధత కల్పించే వరకు కాంగ్రెస్‌ను విడిచిపెట్టేది లేదని హెచ్చరించారు.

కుల సర్వేను స్వాగతిస్తున్నాం : బీసీ కమిషన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి,రాజకీయ, కుల సర్వే- 2024 నివేదికను స్వాగతిస్తున్నామని బీసీ కమిషన్ తెలిపింది. ఈ మేరకు కమిషన్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్ర జనాభాలో 96.9 శాతం సర్వే జరిగిందనీ, 3,56,323 కుటుంబాలు సర్వేలో పాల్గొనలేదని పేర్కొంది. మొత్తంగా బీసీలు 56.66 గా ఉన్నట్టు ప్రభుత్వం ప్రకటించిన సర్వేలో తేలిందని వివరించింది.బీసీలు ఆశిస్తున్న 42 శాతం రిజర్వేషన్ల కంటే 14.33 శాతం ఎక్కువేనని పేర్కొంది. సర్వే రిపోర్ట్ అసెంబ్లీ ముందు పెట్టిన తర్వాత బీసీల సంఖ్య తక్కువా? ఎక్కువా? అనే తర్జనభజన కంటే ఏ విధంగా ఆశించిన మేరకు రిజర్వేషన్లు సాధించుకుందామనే విషయంపై దృష్టి పెట్టాలని కమిషన్ విజ్ఞప్తి చేసింది.

గాజాను స్వాధీనం చేసుకుంటాం

- ఆర్థికంగా అభివృద్ధి చేస్తామంటూ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు
- వేరే దేశాలకు వెళ్లి స్థిరపడాలంటూ సూచనలు
- సరైన ఆలోచనే అన్న నెతన్యాహు
- ఉలిక్కిపడిన మధ్య ప్రాచ్యం
- ఖండించిన హమాస్
- మా భూమి నుంచి మమ్మల్నెలా పంపిస్తారని ప్రశ్న

వాషింగ్టన్, గాజా : ఇజ్రాయిల్ దాడులతో చిన్నాభిన్నమైన గాజా ప్రాంతాన్ని అమెరికా స్వాధీనం చేసుకుంటుందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఆ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకుని, ఆర్థికంగా అభివృద్ధి చేస్తామని, అక్కడ అపరిమితమైన సంఖ్యలో ఉద్యోగాలను సృష్టిస్తామని, కొత్తగా ఇళ్లను నిర్మిస్తామని వెల్లడించారు. కాగా ట్రంప్ ప్రకటన చరిత్రను మారుస్తుందని నెతన్యాహు అభిప్రాయపడ్డారు.

వైట్‌హౌస్‌లో మంగళవారం ఇజ్రాయిల్ ప్రధాని



బెంజామిన్ నెతన్యాహుతో ట్రంప్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇజ్రాయెల్, గాజాల మధ్య నెలకొన్న తాజా పరిస్థితులపై ఇరువురు నేతలు చర్చించారు. అనంతరం ఇరువురు నేతలు సంయుక్త పత్రికా సమావేశంలో పాల్గొన్నారు. ఆ సందర్భంగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. గాజా ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని మాత్రమే ట్రంప్ చెప్పారు. అక్కడ నివసించడానికి ఎవరిని అనుమతిస్తారనే విషయాలు వెల్లడించలేదు. ప్రస్తుతం గాజాలో నివసిస్తున్న పాలస్తీనియన్లందరూ అక్కడ నుండి వెళ్ళిపోవాలని, మధ్య ప్రాచ్యంలోని ఇతర దేశాల్లో నివసించాలని అన్నారు. గాజాను తమ అధీనంలోకి తీసుకుని, దాడుల కారణంగా ధ్వంసమైన భవనాలన్నింటినీ కూల్చివేసి, పేలని బాంబులను నిర్వీర్యం చేసి, ఇతర ఆయుధాలను అక్కడ నుంచి తొలగించి, ఆ ప్రాంతాన్నంతా శుభ్రపరుస్తామని చెప్పారు. ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి అవసరమైన వాతావరణాన్ని సృష్టిస్తామన్నారు. అక్కడ నివసించేవారికి ఇండ్లు కూడా నిర్మిస్తామన్నారు. వారికి వేరే ప్రత్యామ్నాయం లేకనే పాలస్తీనియన్లు గాజాకు తిరిగి వెళ్లాలనుకుంటున్నారని అన్నారు. ప్రమాదకరంగా వున్న భవనాల్లో నివసిస్తూ, అనుక్షణమూ భయం, భయంగా బతుకు వెళ్లదీసే బదులు భద్రత వున్న ఇళ్ళల్లో, మంచి వాతావరణంలో వారు జీవించవచ్చని సూచించారు. గాజాకు అమెరికా బలగాలను పంపే అవకాశం వుందా అని ప్రశ్నించగా అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. గాజాను స్వాధీనం చేసుకోవడానికి ప్రణాళికలు రచిస్తున్నామని, భవిష్యత్‌లో మధ్యప్రాచ్యంలో పర్యటన సందర్భంగా గాజా, ఇజ్రాయిల్, సౌదీ అరేబియాలను సందర్శిస్తానని ట్రంప్ చెప్పారు. గాజా స్ట్రిప్‌ను మృత్యువు, విధ్వంసాలకు చిహ్నంగా ట్రంప్ అభివర్ణించారు. నరకానికి ప్రవేశద్వారంలా వుందన్నారు. అక్కడ నివసించడం ఏ మాత్రమూ సరికాదన్నారు.

సౌదీ వైఖరిలో మార్పు వుండదు

స్వతంత్ర పాలస్తీనా ఏర్పాటాలన్న తమ సుదీర్ఘ డిమాండ్‌లో ఎలాంటి మార్పు వుండదని, తమ వైఖరి చాలా దృఢంగా వుందని సౌదీ అరేబియా విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ మేరకు బుధవారం పదునైన పదజాలంతో కూడిన ప్రకటన జారీ చేసింది. స్వతంత్ర పాలస్తీనా ఏర్పాటు కోసం సౌదీ చేస్తున్న కృషి ఆగదని యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్ ప్రకటిం చారు. అది జరగకుండా ఇజ్రాయిల్‌తో దౌత్య సంబంధాలు ఏర్పాటు చేసుకోబోమని స్పష్టం చేశారు.

ఉలిక్కిపడిన మధ్య ప్రాచ్యం ! నిర్ద్వందంగా తిరస్కరించిన హమాస్

గాజా నుంచి బయటకు వెళ్ళి పాలస్తీనియన్లు నివాసం ఏర్పరచుకోవాలంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై మధ్య ప్రాచ్యం ఉలిక్కిపడింది. ఇప్పటికే గాజాలో నెలకొన్న పరిస్థితులపై మధ్య ప్రాచ్య దేశాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ట్రంప్ వ్యాఖ్యలు దిగ్భ్రాంతికి గురి చేశాయి. కాగా హమాస్, ట్రంప్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించింది. గాజాలో సాగిన ఊచకోతకు, విధ్వంసానికి ఇజ్రాయిల్‌ను బాధ్యురాలిని చేసి, శిక్షించడానికి బదులుగా ట్రంప్ ఈ రీతిలో మాట్లాడడం చాలా దారుణమని హమాస్ ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రస్తుత పరిస్థితుల్లో గందరగోళం సృష్టించడానికి ట్రంప్ ప్రయత్నిస్తున్నారని హమాస్ నేత సమీ అబు జుహ్రీ అన్నారు. ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు సృష్టించడానికే ట్రంప్ ఈ ప్రకటన చేశారని ఆయన విమర్శించారు.

చరిత్ర మారుతుందన్న నెతన్యాహు

ట్రంప్ ప్రతిపాదనపై నెతన్యాహు స్పందిస్తూ, దీనివల్ల చరిత్ర మారుతుందని భావిస్తున్నామని చెప్పారు. ఈ మార్గాన్ని అనుసరించడం సరైనదేనని భావిస్తున్నానన్నారు. గాజా మరోసారి ఇజ్రాయిల్‌కు ముప్పుగా మారరాదన్నది తమ లక్ష్యమని, ట్రంప్ దాన్ని మరింత పై స్థాయికి తీసుకెళుతున్నారని అన్నారు. అక్కడ నుండి మాపై చాలా దాడులు జరిగాయని, ఈ పరిస్థితుల్లో ట్రంప్ భిన్నంగా ఆలోచిస్తున్నారని అన్నారు. దీనిపై దృష్టి పెట్టాల్సి వుందన్నారు.

'రక్షణ'కే అధిక నిధులు

(మొదటిపేజీ తరువాయి)

పడుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి మరింత ఘోరంగా ఉంటోంది. అక్కడ మౌలిక సదుపాయాలు లేవు. కాలం చెల్లిన పాఠ్యాంశాలతోనే బోధన జరుగుతోంది. లక్షలాది మంది విద్యార్థుల విద్యా నాణ్యత దెబ్బతింటోంది.

విధానాలు ఘనం...అమలు పేలవం

గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య వ్యత్యాసం కొట్టొచ్చినట్లు కన్పిస్తోంది. దేశ జనాభాలో 70 శాతం మంది గ్రామాల్లోనే నివసిస్తున్నప్పటికీ వారికి 40 శాతం ఆస్పత్రి పడకలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. నర్సులు, రోగుల నిష్పత్తి కూడా 1:670గా ఉంది. సిఫార్సు చేసిన 1:300 కంటే ఇది చాలా తక్కువ. పేదలు, మధ్య తరగతి ప్రజలకు వైద్య సేవలు అందించాల్సిన ప్రభుత్వ దవాఖానాలు నిధులు, సిబ్బంది, మౌలిక సదుపాయాల కొరతను ఎదుర్కొంటున్నాయి. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆధునిక వైద్య పరికరాలు, తగినంత మంది సిబ్బంది ఉన్నప్పటికీ ఆరోగ్య సేవల ఖర్చు ఎక్కువ కావడంతో అవి లక్షలాది మందికి అందుబాటులో లేవు. దయనీయమైన పరిస్థితి ఏమిటంటే కేటాయించిన నిధులను కూడా ప్రభుత్వం పూర్తిగా వినియోగించుకోలేకపోతోంది. బడ్జెట్ అంచనాలతో పోలిస్తే వాస్తవ ఖర్చు తక్కువగా ఉంటోంది. విధానాలు ఘనంగానే ఉంటున్నా వాటి అమలు పేలవంగా ఉంటోంది. కేటాయింపులు కేవలం కాగితాలపై మాత్రమే కన్పిస్తున్నాయి.వాటి ఫలితాలు మాత్రం ఎక్కడా కన్పించడం లేదు. దేశంలో ఆరోగ్య రక్షణ కోసం ప్రజలు చేస్తున్న వ్యయంలో 62.6 శాతం వారి జేబుల నుండి వెచ్చిస్తున్నదే. ఇది ప్రపంచంలోనే అత్యధికం. దేశంలో పేదరికం పెరగడానికి వైద్య బిల్లులు ప్రధాన కారణంగా మారుతున్నాయి. సైన్యాన్ని ఆధునీకరిస్తున్న పాలకులు ఆస్పత్రులను ఎందుకు ఆధునీకరించడం లేదు? మౌలిక సదుపాయాల కల్పనలో ఎందుకు తాత్సారం చేస్తున్నారు?దేశం యొక్క బలాన్ని రక్షణ బడ్జెట్లను చూసో లేదా జీడీపీ గణాంకాలను చూసో అంచనా వేయలేమన్న విషయాన్ని ప్రజలందరూ గుర్తించాల్సి ఉంది. ప్రజల సామర్థ్యాన్ని బట్టే దానిని అంచనా వేయాల్సి ఉంటుంది. విద్య, ఆరోగ్య రంగాలకు పుష్కలంగా నిధులు కేటాయించి వాటిని సక్రమంగా ఖర్చు చేసినప్పుడే ప్రయోజనాలు పొందగలం. ప్రజలకు ఆరోగ్యం, నైపుణ్యం, సాధికారత కల్పించినప్పుడే దేశం సౌభాగ్యవంతం అవుతుంది.

దవాఖానాల్లో పడకల కొరత

ఇక ఆరోగ్య రంగం విషయానికి వస్తే దీనికి కేటాయింపులు పెరుగుతున్నాయన్న వాదనలో పాక్షికంగానే వాస్తవం ఉంది. 2015-16లో ఆరోగ్య రంగానికి రూ.33,152 కోట్లు కేటాయించగా 2025-26లో రూ.95,957 కోట్లు కేటాయించారు. అంటే వంద శాతానికి పైబడి పెరిగిందన్న మాట. అయితే క్షేత్ర స్థాయిలో పరిస్థితులు ఎలా ఉన్నాయి? కేటాయింపులు ఘనంగా ఉన్నప్పటికీ ఆస్పత్రుల్లో చాలినన్ని పడకలు లేవు. ప్రతి వెయ్యి మందికి కేవలం 1.4 పడకలు మాత్రమే ఉన్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సు చేసిన 3.5 పడకల కంటే ఇది బాగా తక్కువ. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పడకల పరిస్థితి మరీ ఘోరంగా ఉంది. ప్రతి వెయ్యి మందికీ అక్కడ 0,79 పడకలు మాత్రమే ఉన్నాయి. అంటే దేశానికి ఇంకా 24 లక్షల పడకలు అవసరం. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచన ప్రకారం వైద్యుడు, రోగుల నిష్పత్తి 1:1000 ఉండాల్సి ఉండగా అది 1:1511గా ఉంది.

ఢిల్లీ కింగ్ ఎవరు..?

(మొదటిపేజీ తరువాయి)

63.83 శాతం పోలింగ్ జరగగా, అత్యల్పంగా సౌత్ ఈస్ట్ ఢిల్లీలో 53.77 శాతం పోలింగ్ నమోదైంది. ఈస్ట్ ఢిల్లీలో 58.98 శాతం, న్యూఢిల్లీలో 54.37 శాతం, షాదారాలో 61.35 శాతం, సౌత్ ఢిల్లీలో 55.72 శాతం, నార్త్ ఢిల్లీలో 57.24 శాతం, వెస్ట్ ఢిల్లీలో 57.42 శాతం, సెంట్రల్ ఢిల్లీలో 55.24, సౌత్ వెస్ట్ ఢిల్లీలో 58.86 శాతం, నార్త్ వెస్ట్‌లో 58.05 శాతం పోలింగ్ జరిగింది. సీలంపూర్, జాంగ్‌పుర, కస్తూర్బా నగర్‌లో నకిలీ ఓట్లు పోలవుతున్నాయంటూ ఆరోపణలు రావడంతో అధికారులు, పోలీసు యంత్రాంగం అప్రమత్తమయ్యాయి. పార్టీల ఆరోపణలో ఎలాంటి వాస్తవం లేదని నిర్ధారించడం తో పరిస్థితి సద్దుమణిగింది.ఈ ఎన్నికల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా, కేంద్ర మంత్రులు ఎస్.జైశంకర్, హర్దీప్ సింగ్ పురి, ఢిల్లీ ముఖ్యమంత్రి అతిశీ, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, సీపీఐ(ఎం) సమన్వయకర్త ప్రకాశ్ కరత్, పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్, కాంగ్రెస్ సీనియర్ నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక తదితారులు ఓటు వేశారు.

కార్పొరేట్ అనుకూల కేంద్ర బడ్జెట్‌ను సవరించే వరకూ పోరాడుదాం

(మొదటిపేజీ తరువాయి)

సబ్సిడీలో కోత విధించొద్దనీ, రైతుల ఆత్మహత్యల నివారణకు చర్యలు చేపట్టాలనీ, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలనీ, వ్యవసాయ మార్కెట్ సవరణ ముసాయిదాను రద్దు చేయాలనీ, తెలంగాణ రాష్ట్రానికి విభజన హామీలను అమలు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ టీ.సాగర్, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్ రాములు, ఏఐటీయూసీ నాయకులు ప్రేమ్ పావని, ఐఎన్‌టీయూసీ నాయకులు నాగన్న గౌడ్, బీఆర్ఎస్కేవీ నాయకులు రాంబాబు, టీయూసీఐ నాయకులు సూర్యం, ఐఎఫ్టీయూ నాయకులు ఎం.శ్రీనివాస్, యూటీయూసీ నాయకులు భరత్, రైతు సంఘాల నాయకులు మామిడాల బిక్షపతి, భాస్కర్ మాట్లాడారు. 2025-26 కేంద్ర బడ్జెట్‌ను తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించాలని వారు పిలుపునిచ్చారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల్లో ఉపాధి కల్పన, కార్మిక భద్రతకు సంబంధించిన అంశాలు ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. విభజన హామీ చట్టంలోని అంశాలను తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ 11 సంవత్సరాల తర్వాత కూడా పరిష్కరించే చర్యలు తీసుకోక పోవడం మోసం చేయడమేనని అన్నారు. వ్యవసాయ రంగానికి మొదటి ప్రాధాన్యత అని చెప్పి బడ్జెట్ కేటాయింపులు ప్రకటించకుండా రైతాంగాన్ని కేంద్ర బీజేపీ ప్రభుత్వం మరోసారి మోసగించిందన్నారు. రైతు రుణమాఫీ పథకం, ధరల స్థిరీకరణ, ఉపాధి హామీ చట్టానికి నిధుల పెంపును విస్మరించిందని తప్పుపట్టారు. విద్యుత్‌రంగ సంస్కరణలతో వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు తీవ్ర హాని కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. బీమా రంగంలో ఎఫ్‌డీఐలు 74 శాతం నుంచి 100 శాతం పెంచడం జాతీయ బీమా సంస్థలను బలహీనం చేయడమే. ఆర్థిక సంస్కరణలు అమలు చేసే రాష్ట్రాలకే కేంద్రం సహకరిస్తామని బడ్జెట్‌లో ప్రకటించడం ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం. అణు ఇంధన సంస్థలను పూర్తిగా ప్రయివేటీకరించి, ఖనిజ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు కారుచౌకగా కట్టబెట్టేందుకు బరితెగించింది. కార్మికవర్గం సుదీర్ఘకాలం లేబర్ కోడ్‌ల రద్దుకు, కనీస వేతనం రూ.26 వేల డిమాండ్, స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించాలన్న డిమాండ్, అసంఘటిత కార్మికుల సంక్షేమం వంటి అంశాలను ఈ బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం కార్మిక వ్యతిరేక చర్య. వ్యవసాయ, పారిశ్రామిక సంక్షోభం, అధికస్థాయి నిరుద్యోగం, ఆహార ద్రవ్యోల్బణం, అసమానతలు, ప్రయివేటు పెట్టుబడుల పెంపు వంటి ఆర్థిక పరిస్థితుల నేపథ్యానికి అనుగుణంగా 2025-26 బడ్జెట్ రూపకల్పన చేయకపోవడం కొనుగోలు శక్తి క్షీణతకు దారితీస్తుంది. ఈ బడ్జెట్ సాధారణ ప్రజలు, కార్మికవర్గంపై రానున్న రోజుల్లో మరిన్ని భారాలు మోపి ఉపాధి కల్పన స్థాయిలను మరింత క్షీణింపజేస్తుంది. అదే సమయంలో సంపద పన్ను 3 శాతానికి తగ్గించి మధ్యతరగతిపై ఆదాయపు పన్ను విధింపు ధనవంతులకు లబ్ధి చేకూర్చడమే. పెన్షన్ రంగానికి నిధులు పెంచకపోవడం అన్యాయం అని వారు విమర్శించారు. స్థూలంగా 10 సంవత్సరాల బీజేపీ ప్రభుత్వ కార్పొరేట్ విధానాలు, సంపన్నుల ప్రయోజనాలే ప్రాధాన్యతనిచ్చి ప్రవేశపెట్టిన 2025-26 కేంద్ర బడ్జెట్‌ను సవరించే వరకు ఐక్యంగా పోరాడుదాం అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.వెంకటేష్, జయలక్ష్మి, ఈశ్వరరావు, కూరపాటి రమేష్, పద్మశ్రీ, రైతు సంఘం నాయకులు సంధ్య, వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు బి.ప్రసాద్, బొప్పని పద్మ, కార్మిక సంఘాల నాయకులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



'తండేల్' మ్యాజిక్‌ని మీరూ చూస్తారు

- నాగచైతన్య

'నాకు ఎప్పటి నుంచో రియల్ లైఫ్ స్టోరీస్ ఆధారంగా సినిమాలు చేయాలని ఉండేది. పైగా ఇది మన తెలుగోళ్ళ కథ. ఈ కథ నాకెంతో స్ఫూర్తిని ఇచ్చింది. రూటెడ్‌గా ఉండే కథలు చేయడానికి బాగా ఇష్టపడతాను. ఆ ఇష్టంతోనే చాలా కష్టమైనప్పటికీ 'తండేల్' చేశాను' అని హీరో నాగ చైతన్య చెప్పారు.

నాగచైతన్య, సాయి పల్లవి జంటగా నటించిన చిత్రం 'తండేల్'. చందూ మొండేటి దర్శకుడు. అల్లు అరవింద్ సమర్పణలో గీతాఆర్ట్స్ బ్యానర్‌పై బన్నీవాసు నిర్మించారు. ఈ చిత్రం ఈనెల 7న ప్రపంచ వ్యాప్తంగా భారీగా విడుదల కానుంది.

ఈ సందర్భంగా హీరో నాగచైతన్య బుధవారం మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

నా కెరీర్‌లో భారీ బడ్జెట్ సినిమా

నా కెరీర్‌లో ఇది బిగ్గెస్ట్ ప్రొడక్షన్, హై బడ్జెట్ మూవీ. అన్ని రకాలుగా బిగ్ స్పాన్ ఉంది. ఇప్పటికే సినిమా చూశాం. చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాం. సెకండ్ హాఫ్ అయితే యునానిమస్‌గా చాలా బాగా చెప్పారు. నాకు కూడా ఎమోషనల్ హై ఇచ్చింది. చివరి ముప్పై నిమిషాలు వెరీ శాటిస్ఫాక్షన్. క్లైమాక్స్ గ్రేట్ ఎమోషనల్ హై ఇస్తుంది.

ఆ ఛాన్స్ కనిపించింది..

ఈ కథలో రియల్ లైఫ్ క్యారెక్టర్ దొరికింది. యాక్టర్‌గా నెక్స్ట్ స్టెప్‌కి వెళ్ళే అవకాశం కనిపించింది. దాదాపు 8 నెలలు స్క్రిప్ట్, నా ట్రాన్స్‌ఫర్మేషన్ మీదే ఉన్నాను. శ్రీకాకుళం యాస కోసం శిక్షణ తీసుకున్నాను. నేను చేసిన రాజు పాత్ర ఓ ఫైటర్. జైల్లో ఉనప్పుడు బాధని ఓర్చుకొని తన వారికోసం ఎలా పోరాటం చేశాడు?, ఎలా బయటికి వచ్చాడనేది చాలా గొప్పగా ఉంటుంది. తన ప్రేమకథే తనకి బలాన్ని ఇస్తుంది. నటుడిగా నాకు బాగా సంతృప్తినిచ్చిన సినిమా. 'తండేల్' మ్యాజిక్‌ని మీరూ చూస్తారు (నవ్వుతూ).

నాకు డబుల్ ధమకా..

డైరెక్టర్ చందుతో నాకు ఇది మూడో సినిమా. నన్ను కొత్తగా ప్రజెంట్ చేయడానికి ప్రయత్నించాడు. ఇది అవుట్ అండ్ అవుట్ లవ్ స్టోరీ. లవ్ స్టోరీ వెనుక మిగతా లేయర్స్ ఆద్యంతం ఆసక్తికరంగా ఉంటాయి. సాయి పల్లవి ఫెంటాస్టిక్ యాక్టర్. క్యారెక్టర్‌ని డీప్‌గా అర్థం చేసుకుంటుంది. దేవిశ్రీ ఇచ్చిన పాటలన్నీ సూపర్ హిట్ అయ్యాయి. ఈ కథ గీతా ఆర్ట్స్‌లో ఉండటం, అరవింద్, బన్నీవాసుతో మళ్ళీ కలిసి పనిచేయడాన్ని డబుల్ ధమాకాగా ఫీలవుతున్నాను.

కథే హీరోగా సినిమాలు తీస్తా..



శింగనమల రమేష్‌బాబు

'నేనొక ఫిల్మ్ ఫైనాన్షియర్‌ని. సినిమా మీద ప్యాషన్‌తో నిర్మాతగా మారాను. అయితే మహాబలిపురంలో ఉన్న నా 10 ఎకరాల స్థలాన్ని ఒకరికి తెలియకుండా మరొకరికి.. ఇలా పలువురు వ్యక్తులకు అమ్మానని నాపై కేసు పెట్టారు. 14 ఏళ్ల పాటు న్యాయ పోరాటం చేశాను. అది తప్పుడు కేసు అని న్యాయస్థానం నన్ను నిర్దోషిగా తేల్చింది. తప్పుడు కేసులు కోర్టు ముందు నిలబడవు. నా న్యాయపోరాటం గెలిచింది' అని నిర్మాత శింగనమల రమేష్ బాబు అన్నారు. పవన్‌కళ్యాణ్, మహేష్‌బాబుతో 'కొమరంపులి', 'ఖలేజా' లాంటి భారీ బడ్జెట్ చిత్రాలను నిర్మించిన ఆయన ఓ కేసు నిమిత్తం 14 ఏళ్ల పాటు న్యాయ పోరాటం చేశారు. ఈ కేసును విచారించిన కోర్టు ఇటీవల ఆయన్ని నిర్దోషిగా తేల్చి, కేసు కొట్టి వేసింది. ఈ నేపథ్యంలో ఆయన బుధవారం మీడియాతో సంభాషించారు.

- నాపై కేసు పెట్టిన వారిపై నాకు ఎలాంటి కక్ష సాధింపులు లేవు. ఏదైనా న్యాయపరంగానే పోరాటం చేస్తా.
- సినిమా నాకు తల్లి లాంటిది. భవిష్యత్తులోనూ ఇదే రంగంలో కొనసాగుతా. నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారిద్దరూ హీరోలుగా చేశారు. హిట్స్ అందుకున్నారు. ఇప్పుడు డైరెక్షన్ చేయాలని అనుకుంటున్నారు. నేను కూడా మంచి కథాబలం ఉన్న సినిమాలను నిర్మాతగా నిర్మిస్తా. అలాగే ఇతర సినిమాలకు ఫైనాన్షియర్‌గానూ చేస్తాను.
- అప్పట్లో సినిమాలు ఆరు నెలలు లేదా సంవత్సరంలోగా పూర్తయ్యేవి. కానీ నా దురదృష్టం కొద్దీ నేను తెరకెక్కించిన రెండు పెద్ద హీరోల చిత్రాలు దాదాపు మూడేళ్ళ సమయం చిత్రీకరణలోనే గడిచిపోయింది. అందుకు చాలా కారణాలు ఉన్నాయి. ఆ రెండు చిత్రాలకు రూ.100 కోట్ల వరకూ నష్టపోయా.
- మేము సంపాదించింది ఫైనాన్స్ బిజినెస్ వల్లే. నాన్న నుంచి అది నాకు వచ్చింది. అయితే సినిమా మేకింగ్ అనేది ఎప్పటికీ ఓ జూదమే. ఆ గ్యాంబ్లింగ్ కారణంగానే నాకు రెండు సినిమాల్లో వందకోట్లు పోయింది. ఆ టైమ్‌లోనే కాదు జైలుకి వెళ్ళినప్పుడు కూడా ఏ హీరో కూడా నన్ను పలకరించలేదు. అయితే ప్రజెంట్ సినిమా నిర్మాణం బావుందని వింటున్నాను. నిర్మాతకు పది రూపాయలు మిగులుతాయని అంటున్నారు. అయితే 24 క్రాఫ్ట్స్ మన గ్రిప్‌లో ఉన్నప్పుడే సినిమా తీయాలి. ఇదే నా జర్నీలో నేర్చుకున్న గుణపాఠం. త్వరలో ఓ ప్రాజెక్ట్ అనౌన్స్‌మెంట్ ఉండే అవకాశం ఉంది.

నవచిత్రం

వైవిధ్య ప్రేమకథా చిత్రం

హీరో కావాలన్న తన తనయుడు మారిశెట్టి అఖిల్ కలను నెరవేరుస్తూ అనకాపల్లి జిల్లాకు చెందిన ప్రముఖ రాజకీయవేత్త, మారిశెట్టి శ్రీకాంత్ ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

భానుశ్రీ హీరోయిన్‌గా శ్రీధన్ దర్శకత్వంలో ఎ.కె.టెక్ మార్కెటింగ్ మూవీ క్రియేషన్స్ పతాకంపై తెరకెక్కుతున్న ఈ సినిమా చిత్రీకరణ మంగళవారం సాయంత్రం అనకాపల్లి జిల్లా, చోడవరం మండలంలోని నిర్మాత సొంత గ్రామమైన లక్ష్మీపురంలోని రామాలయంలో ప్రారంభమైంది.

ఈ చిత్ర ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత నట్టి కుమార్ క్లాప్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'అనకాపల్లి రాజకీయాలలో మంచి పేరున్న మారిశెట్టి శ్రీకాంత్ తన కుమారుడి ఆసక్తిని గమనించి, సినిమా నిర్మాణానికి పూనుకోవడం అభినందనీయం' అని అన్నారు.

'ఈ సినిమా చిత్రీకరణ అనకాపల్లి చుట్టు పక్కల ఐదు రోజులపాటు జరుగుతుంది. ఇందులో భాగంగా ఒక పాట, ఒక ఫైట్ చిత్రీకరణ జరుపుతాం. ఆ తర్వాత హైదరాబాద్, విశాఖపట్నం, అరకు తదితర ప్రదేశాలలో షూటింగ్ చేస్తాం. త్వరలోనే మరిన్ని వివరాలను తెలియజేస్తాం' అని నిర్మాత మారిశెట్టి శ్రీకాంత్ చెప్పారు.




మారిశెట్టి అఖిల్, భానుశ్రీ

హీరో మారిశెట్టి అఖిల్ మాట్లాడుతూ, 'మొదట్నుంచి నాకు సినిమా రంగమంటే ఎనలేని మక్కువ. హీరో కావాలన్న నా అభిరుచికి మా నాన్న మద్దతు పలికారు. దాంతో నా నటనకు మెరుగులు దిద్దుకునేందుకు అన్నపూర్ణ ఫిలిం యాక్టింగ్ స్కూల్‌లో నటనలో శిక్షణ పొందాను. తప్పకుండా ఈ తొలి చిత్రం నా కెరీర్‌ను మలుపు తిప్పుతుందని భావిస్తున్నాను. మంచి కథతో రూపొందుతున్న ఈచిత్రంలో నాపాత్ర చాలా వైవిధ్యంగా ఉంటుంది' అని అన్నారు.

దర్శకుడు శ్రీధన్ మాట్లాడుతూ, 'ఇదొక భిన్న ప్రేమకథా చిత్రం. హర్రర్, కామెడీ అంశాలతో దీన్ని తెరకెక్కించబోతున్నాం. కథానుగుణంగా ఈచిత్రాన్ని మా నిర్మాత ఎక్కడా రాజీపడకుండా నిర్మిస్తున్నారు. ఓ మంచి సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాం' అని తెలిపారు.

అన్నీ అవాస్తవాలే !


పేదరికంపై పస లేని ప్రభుత్వ వాదనలు



న్యూఢిల్లీ : 2022-23 సంవత్సరానికి సంబంధించి గత సంవత్సరం విడుదలైన కుటుంబ వినియోగ వ్యయ సర్వే (హెచ్‌సీఈఎస్) నివేదిక దేశంలోనెలకొన్న పేదరికంపై మరోసారి చర్చకు తెర లేపింది. నివేదిక విడుదల సందర్భంగా నిటి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రమణ్యం మాట్లాడుతూ జనాభాలో పేదరిక హెడ్‌కౌంట్ నిష్పత్తి బాగా తగ్గి 5 శాతంగా నమోదైందని చెప్పుకొచ్చారు. ద్రవ్యోల్బణానికి సంబంధించి సవరించిన 2011-12 దారిద్ర్య రేఖను ఆధారంగా చేసుకొని ఆయన ఈ వాదన చేశారు. ప్రభుత్వం అమలు చేసిన పలు సంక్షేమ పథకాలు, వేగవంతమైన ఆర్థిక వృద్ధిని దృష్టిలో పెట్టుకొని సుబ్రమణ్యం ఈ విజయాన్ని ఆపాదించుకున్నారు. అయితే రంగరాజన్ అనుసరించిన పద్ధతిని, 2022-23 హెసీఈఎస్ సమాచారాన్ని ఉపయోగించి సీఏ సేతు, ఎల్టీ అభినవ్ సూర్య, సీఏ రుతు ఓ విశ్లేషణ జరిపారు. దీని ప్రకారం భారతీయుల్లో 26.4 శాతం మంది దారిద్ర్యరేఖకు దిగువనే ఉన్నారు. ప్రభుత్వం చెబుతున్న దానికి, దీనికి మధ్య 21 పర్సంటేజ్ పాయింట్ల వ్యత్యాసం కన్పిస్తోంది.

ప్రభుత్వ వాదనలో కచ్చితత్వం ఏది?

తాజా విశ్లేషణ ప్రకారం దేశ జనాభాలో 27.4 శాతం మంది గ్రామీణ ప్రాంతా ల్లో ఉన్నారు. వీరి తలసరి ఆదాయం నెలకు రూ. 2,515గా నిర్ధారించారు. పట్టణ ప్రాంతాల్లో ఉండే 23.7 శాతం జనాభా తలసరి ఆదాయం రూ.3,639. ఇది దారిద్ర్యరేఖకు దిగువన ఉంది. పేదరికాన్ని దాదాపుగా నిర్మూలించామంటూ ప్రభుత్వం చెప్పుకుంటున్న గొప్పలకు ఇది విరుద్ధంగా ఉంది.



ప్రభుత్వ గణాంకాల కచ్చితత్వం, వాటి ఉద్దేశంపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పేదరికాన్ని అంచనా వేయడంలో వేర్వేరు పద్ధతు లను పాటించడం కూడా ఈ తేడాకు కారణంగా కన్పిస్తోంది. అయితే

కాలదోషం పట్టిన గణాంకాలతో కాకమ్మ కబుర్లు
తాజా నివేదికలో బయటపడ్డ బండారం

ఆహారేతర అత్యవసరాల వ్యయాన్ని...ముఖ్యంగా ఆరోగ్య రక్షణ, విద్య, గృహనిర్మాణం...పాత దారిద్ర్యరేఖలు గుర్తించలేకపోయాయి. దీనికి భిన్నంగా రంగరాజన్ పద్ధతి తాజా నిబంధనలను ఉపయోగించింది. అత్యవసరమైన ఆహారేతర ఖర్చులు సహా మరింత సవివరమైన వినియోగ వస్తువుల సమాచారాన్ని వాడుకుంది. దీంతో ప్రస్తుత వాస్తవికతలను కచితత్వంతో ప్రతిబింబించింది.

తప్పుల తడకగా టెండుల్కర్ నివేదిక

2009లో ఏర్పాటు చేసిన టెండుల్కర్ కమిటీ తలసరి వినియోగ వ్యయం ఆధారంగా పేదరికాన్ని అంచనా వేసింది. అయితే దారిద్ర్యరేఖలను బాగా తక్కువగా నిర్ధారించి విమర్శల పాలైంది. పేదరిక స్థాయిలను అది సరిగా ఊహించలేకపోయింది. ఈ లోపాలను రంగరాజన్ కమిటీ సరిదిద్దింది. ఈ కమిటీ 2014లో తన నివేదికను సమర్పించింది. పేదరికాన్ని నిర్వచించేందుకు అది ఓ కొత్త పద్ధతిని సూచించింది. ఆహార వినియోగం, అత్యవసర ఆహారేతర ఖర్చులు, ఇతర ఖర్చులు వంటి ప్రధానమైన మూడు అంశాలను అందులో చేర్చింది. టెండుల్కర్ కమిటీతో పోలిస్తే రంగరాజన్ కమిటీ అంచనాలు అధిక దారిద్ర్యరేఖను చూపాయి. 2011-12లో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారిని టెండుల్కర్ 21.9 శాతంగా చూపితే రంగరాజన్ 29.5 శాతంగా చూపారు. అయితే ఎన్ని సవరణలు చేసినప్పటికీ కేంద్ర ప్రభుత్వం రంగరాజన్ కమిటీ సిఫారసులను అధికారికంగా అమలు చేయలేదు. మరో సర్వే సమాచారం ఏదీ అందుబాటులో లేకపోవడంతో అప్పటి నుండీ పేదరిక అంచనాలు అలాగే ఉండిపోయాయి.

వాస్తవాలకు భిన్నంగా...

2011-12లో చివరిసారిగా వినియోగ వ్యయ సర్వే జరిగింది. అదే ఆ తర్వాతి పేదరిక అంచనాలకు, హెచ్‌సీఈఎస్ 22-23కి ప్రాతిపదిక అయింది. కాబట్టి పేదరికానికి సంబంధించిన హెడ్‌కౌంట్ నిష్పత్తులు వాస్తవాలకు దూరంగా ఉన్నాయి. హెచ్‌సీఈఎస్ 22-23 విడుదల తర్వాత ప్రభుత్వం చేసిన వాదనల్లో పస లేదని దీంతో అర్థమవుతోంది. వాస్తవానికి నిత్యావసర వస్తువులు, సేవల కోసం పేదలు అధిక వ్యయం చేస్తున్నారు. విద్య, ఆరోగ్యం, పారిశుధ్యం వంటి మౌలిక వసతులకూ దూరంగా ఉంటూ అసమానతల మధ్య జీవితాలు గడుపుతున్నారు. మరోవైపు ప్రజా పంపిణీ వ్యవస్థ వంటి కార్యక్రమాలు పేదరికాన్ని తగ్గించలేకపోయాయి. ఉదాహరణకు ఆరోగ్య విద్యా రంగాలను ప్రయివేటీకరించడంతో అవి పేదలకు భారంగా మారాయి. గ్రామీణ ప్రాంతాల్లో వేతనాలు స్థిరంగా ఉండిపోయాయి. అసంఘటిత రంగంలో ఆదాయాలు పడి పోయాయి. అనేక పరిశ్రమలు మూతపడ్డాయి.

మెరిసిన మోహిత్

హైదరాబాద్ : హైదరాబాద్‌కు చెందిన టీఎస్ఆర్ మోహిత్..దేశవాళీ టోర్నీ రంజీల్లో అదరగొట్టాడు. ప్రస్తుత సీజన్‌లో అరుణాచల్‌ప్రదేశ్ తరఫున బరిలోకి దిగిన మోహిత్ ఆఫ్‌స్పిన్ బౌలింగ్‌కు తోడు బ్యాటింగ్‌తో జట్టు విజయాల్లో కీలకంగా వ్యవహరించాడు. ఆఫ్ స్పిన్ మాయాజాలంతో ఈ సీజన్‌లో 16 వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. అహ్మదాబాద్ వేదికగా సిక్కింతో జరిగిన మ్యాచ్‌లో మోహిత్ 3/89, 6/38 అదుతే ప్రదర్శన కనబరిచి కెరీర్ బెస్ట్ నమోదు చేసుకున్నాడు. సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీలోనూ మోహిత్ సత్తాచాటాడు. మణిపూర్‌తో జరిగిన మ్యాచ్‌లో 18 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టాడు.



ఆటలు

బోణి కొట్టేదెవరో..!

- నేడు భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య తొలి వన్డే
- మధ్యాహ్నం 1.30 గంటల నుంచే



నాగ్‌పూర్ : భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య నాగ్‌పూర్ వేదికగా తొలి వన్డే జరగనుంది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా ఇంగ్లండ్‌తో జరిగే తొలి వన్డేలో ఛాంపియన్స్ ట్రోఫీలో ఆడే భారతజట్టు తలపడనుంది. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో నిరాశపరిచిన సీనియర్ ఆటగాళ్ల రోహిత్, కోహ్లిలకు ఈ సిరీస్ కీలకం కానుంది. స్వదేశీ పిచ్‌లపై సత్తా చాటి ఛాంపియన్స్ ట్రోఫీ బరిలోకి దిగాలని వీరు ఉవ్విళ్ళూరుతున్నారు. ఐసిసి వన్డే ప్రపంచకప్ తర్వాత ఆగస్టులో శ్రీలంకతో మూడు వన్డేల సిరీస్ ఆడేందుకు వెళ్లిన భారతజట్టులో ఉన్న కోహ్లి ఆ మూడు వన్డేల్లో కేవలం 58పరుగులు మాత్రమే కొట్టాడు. కెప్టెన్ రోహిత్ శర్మ మాత్రమే 157పరుగులే చేశాడు. పేస్ భారాన్ని జస్ప్రీత్ బుమ్రా స్థానంలో మహ్మద్ షమీ అందుకోనున్నాడు. అతడు దాదాపు 16నెలల తర్వాత వన్డేల్లో మళ్లీ పునరాగమనం చేయనున్నాడు. ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు టీమిండియాకు ఇదే ఆఖరి వన్డే సిరీస్ కావడంతో వీరి ప్రదర్శనపైనే అందరి దృష్టి నెలకొని ఉంది.

ఇంగ్లండ్ జట్టులో జో రూట్‌కు చోటు :

భారత్‌తో తొలి వన్డేకు ముందురోజే ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు(ఇసిబి) తమ తుది జట్టును బుధవారం ప్రకటించింది. జోస్ బట్లర్ కెప్టెన్‌గా ఎంపికవ్వగా.. మాజీ సారథి జో రూట్‌కు తొలి వన్డే జట్టులో చోటు దక్కింది. దీంతో అతడు దాదాపు 16 నెలల తర్వాత తొలిసారిగా వన్డే ఫార్మాట్ బరిలో దిగనున్నాడు. ఓపెనర్లుగా బెన్ డకెట్, ఫిల్ సాల్ట్ తమ స్థానాలను పదిలం చేసుకోగా.. జో రూట్ వన్‌డౌన్‌లో ఆడనున్నాడు. కెప్టెన్ బట్లర్ ఐదో స్థానంలో బ్యాటింగ్‌కు రానున్నాడు. ఆల్‌రౌండర్ల జాబితాలో లియామ్ లివింగ్‌స్టోన్-జాకొబ్ బెతెల్ జోడీ కొనసాగనుంది. బట్లర్ సారథ్యంలోని ఇంగ్లండ్ జట్టు గత రెండు వన్డే సిరీస్‌లను కోల్పోయింది. ఆస్ట్రేలియా, వెస్టిండీస్ జట్ల చేతిలో ఓటమిపాలైంది. పరిమిత ఓవర్ల క్రికెట్‌లోనూ ఇంగ్లండ్ హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన బ్రెండన్ మెకల్లమ్‌కు ఈ సిరీస్ కీలకం కానుంది.ఈ సిరీస్‌కు ముందు భారత్‌తో జరిగిన ఐదు టి20ల సిరీస్‌ను ఇంగ్లండ్ జట్టు 1-4తో కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఇంగ్లండ్ జట్టు కనీసం వన్డే సిరీస్‌లోనైనా సత్తా చాటాలన్న దృఢ నిశ్చయంతో బరిలోకి దిగుతోంది.

ఛాంపియన్స్ ట్రోఫీకి నితిన్ మీనన్ దూరం :

ఐసిసి ఎలైట్ ప్యానెల్ అంపైర్స్, భారత్‌కు చెందిన నితిన్ మీనన్ ఛాంపియన్ ట్రోఫీకి దూరమయ్యాడు. వ్యక్తిగత కారణాల రీత్యా తాను ఛాంపియన్స్ ట్రోఫీకి అందుబాటులో ఉండడం లేదని ట్విటర్ వేదికగా ఐసిసికి లేఖ రాశాడు. ఐసిసి 15మంది అధికారుల జాబితాను ప్రకటించగా.. అందులో 12మంది అంపైర్లు, ముగ్గురు రిఫరీలు ఉన్నారు. పాకిస్తాన్‌లోని కరాచీ, రావల్పిండి, లాహోర్ వేదికగా ఛాంపియన్స్ ట్రోఫీ జరగనుండగా.. భారత్ ఆడే మ్యాచ్‌లన్నీ దుబాయ్ వేదికగా జరగనున్నాయి. ఛాంపియన్స్ ట్రోఫీ ఫిబ్రవరి 19న జరిగే తొలి మ్యాచ్‌తో ప్రారంభమై.. మార్చి 9న జరిగే ఫైనల్ మ్యాచ్‌తో ముగియనుంది.



జట్లు(అంచనా) :

భారత్ : రోహిత్(కెప్టెన్), శుభ్‌మన్, కెఎల్ రాహుల్, కోహ్లి, పంత్(వికెట్ కీపర్), సుందర్/వరుణ్ చక్రవర్తి, శ్రేయస్, హార్దిక్, అక్షర్/జడేజా, షమీ, అర్ష్‌దీప్.

ఇంగ్లండ్ : బట్లర్(కెప్టెన్), డకెట్, సాల్ట్(వికెట్ కీపర్), రూట్, బ్రూక్, లివింగ్ స్టోన్, బెథెల్, కార్సే, ఆర్చర్, రషీద్, మహమూద్.

అభిషేక్, తిలక్ కెరీర్ బెస్ట్ ర్యాంక్

- బ్యాటర్ల జాబితాలో రెండు, మూడు స్థానాల్లోకి...
- ఐసీసీ టి20 ర్యాంకింగ్స్ విడుదల

దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసీసీ) ప్రకటించిన తాజా టి20 ర్యాంకింగ్స్‌లో భారత యువ బ్యాటర్ అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, కెరీర్‌లో తొలిసారిగా అత్యుత్తమ స్థానానికి ఎగబాకారు. ఇంగ్లండ్‌తో జరిగిన ఐదో టి20లో అభిషేక్ శర్మ సెంచరీ, రెండో టి20లో తిలక్ వర్మ అర్ధసెంచరీలతో రాణించారు. దాంతో అభిషేక్ శర్మ ఐసిసి ర్యాంకింగ్స్‌లో ఒకేసారి 38 స్థానాలు ఎగబాకి.. రెండో స్థానానికి చేరుకున్నాడు. అప్పటి వరకు ఆ స్థానంలో ఉన్న టీమిండియా బ్యాటర్ తిలక్ వర్మ మూడో స్థానానికి చేరుకున్నాడు. ఆస్ట్రేలియా బ్యాటర్ ట్రావిస్ హెడ్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

మేడారంలో ఘనంగా గుడి మెలిగే పండుగ

- మినీ జాతర పూజా కార్యక్రమాలు ప్రారంభం
- మేడారంలో సమ్మక్క, కన్నెపెల్లిలో సారలమ్మ ఆలయాలు శుద్ధి
- పూజారుల ప్రత్యేక పూజలు



నవతెలంగాణ- తాడ్వాయి

మేడారం మినీ జాతర ఉత్సవాలు ఊపందుకున్నాయి. ములుగు జిల్లా మేడారం, కన్నెపల్లి గ్రామాల్లో మినీ జాతరకు వారం ముందుగా నిర్వహించే గుడి మెలిగే పండుగ బుధవారం ఘనంగా నిర్వహించారు. పూజారుల సంఘం అధ్యక్షులు సిద్దబోయిన జగ్గారావు ఆధ్వర్యంలో పూజారులు మేడారం, కన్నెపల్లిలో సారలమ్మ ప్రధాన పూజారి కాక సారయ్య ఆధ్వర్యంలో పూజారులు వారి ఇండ్లను, దేవాలయాలను శుద్ధి చేసుకుని, అటవీ ప్రాంతానికి వెళ్లి గుట్ట గడ్డిని సేకరించి గుడిపై కప్పారు. అనంతరం గుళ్లల్లో మహిళలు రంగురంగుల ముగ్గులతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. గుడి మెలిగే పండగతో వనదేవతల మినీ జాతర ప్రారంభమైనట్టు పూజారులు భావిస్తారు. ఇప్పటినుంచి పూజారులు అత్యంత నియమనిష్టలు పాటిస్తారు. ఈ కార్యక్రమంలో సమ్మక్క ప్రధాన పూజారి సిద్దబోయిన మునేందర్, పూజారులు కొక్కెర కృష్ణయ్య, మల్లెల ముత్తయ్య, బొక్కెన్న, మహేష్, సిద్దబోయిన అరుణ్, సిద్దబోయిన పాపారావు, సిద్దబోయిన నితిన్, అభ్యుదయ సంఘం అధ్యక్షులు సిద్ధబోయిన బోజారావు, రానా రమేష్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సమ్మక్క పుట్టిన ఊరు బయ్యక్కపేట్‌లో..

ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని వనదేవత సమ్మక్క పుట్టిన ఊరు బయ్యక్కపేట్‌లో చందా వంశీయులైన(తలపతులు) సమ్మక్క పూజారులు బుధవారం ఘనంగా గుడి మెలిగే పండుగ నిర్వహించారు. పూజారుల సంఘం ప్రధాన కార్యదర్శి చందగోపాల్, సమ్మక్క ప్రధాన పూజారి చందా రఘుపతిరావు ఆధ్వర్యంలో చందా వంశీయులు ఉదయమే తలంటి స్నానాలు ఆచరించి నూతన వస్త్రాలు ధరించి, ఇండ్లు, గుడిని శుభ్రపరచారు. అటవీ ప్రాంతానికి వెళ్లి గుట్ట గడ్డిని సేకరించి గుడిపై కప్పారు. ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం సమ్మక్క గతంలో ఉన్న గుడిసెను నూతన పరికరాలతో మళ్ళీ నిర్మించారు. దాంతో బయ్యక్కపేట్‌లో కూడా మినీ జాతర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మేడారంలో లాగానే వారం ముందు నుండే ఈ గుడి మెలిగే పండుగ చేస్తారు. ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు బయ్యక్కపేట్‌లో ఘనంగా (మండే మెలిగే పండుగను) మినీ జాతరను నిర్వహించనున్నట్టు చందవంశీయులు తెలిపారు. సమ్మక్క పూజారులు తలపతులు చంద పరమయ్య, చంద్ర లక్ష్మణరావు, కృష్ణమూర్తి, చంద కళ్యాణ్ కుమార్, చంద గణేష్, మల్లెల సోమేష్, కోరం పాపారావు, పాయం వెంకటేశ్వర్లు, నాగులమ్మ పూజారి చందర్ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీలు, బీసీలు తగ్గి ఇతరులు ఎలా పెరిగారు?

- ఎమ్మెల్యే పాయల్ శంకర్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ఎస్సీలు, బీసీలు తగ్గి ఇతరులు ఎలా పెరిగారో రాష్ట్ర ప్రభుత్వం చెప్పాలని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ డిమాండ్ చేశారు. కులగణన నివేదిక ద్వారా బీసీలను మోసం చేసే ప్రయత్నంలో రేవంత్‌రెడ్డి సర్కారు ఉందని ఆరోపించారు. బుధవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కామారెడ్డి డిక్లరేషన్ పేరిట ఇచ్చిన మాటను కాంగ్రెస్ పార్టీ నిలబెట్టుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ సభ్యులంతా కలిసి బీసీ ఎమ్మెల్యే గొంతు నొక్కే ప్రయత్నం చేశారన్నారు. 2014 లో ఉన్న జనాభా కంటే ఇప్పుడు జనాభా తగ్గించి చూపారని విమర్శించారు. బీసీలు ఎలా తగ్గారు? ఏ జిల్లాలో తగ్గారు? అనే వివరాలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. తాము అడిగింది పర్సనల్ డేటా కాదు కదా? ఇవ్వడానికి ఉన్న ఇబ్బందులు ఏంటని ప్రశ్నించారు. ఎవరి లబ్ది కోసం బీసీ, ఎస్సీ జనాభాను తగ్గించి చూపారని నిలదీశారు.

సంగారెడ్డిని మరో జవహర్‌నగర్‌గా మార్చే కుట్ర

- బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులు కలిసి సంగారెడ్డిని మరో జవహర్ నగర్ గా మార్చే కుట్ర జరుగుతున్నదని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు చెప్పారు. జిన్నారం, పారానగర్ గ్రామాలో 150 ఎకరాల్లో డంపింగ్ యార్డు లు పెట్టాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని బీజేపీ ఆఫీసులో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇప్పటికే పరిశ్రమల వ్యర్థాలతో ప్రజలు సతమతమవుతున్నా రని చెప్పారు. గత కేసీఆర్ ప్రభుత్వమే చెత్త శుద్ధి కోసం150 ఎకరాలు కేటాయించిందని అధికారులు చెబుతున్నారనీ, ప్రస్తుత ప్రభుత్వం రాత్రికి రాత్రే డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేసే యత్నం చేస్తున్నదని విమర్శించారు. హైదరాబాద్ చెత్త అంతా పచ్చని పంట పొలాల్లోకి తెచ్చి వేస్తామంటే సహించేది లేదని హెచ్చరించారు. పంట పొలాలను డంపింగ్ యార్డుగా ఎలా చేస్తారని ప్రశ్నించారు. డంపింగ్ యార్డ్ పై ప్రభుత్వం స్పందించకపోతే ప్రత్యక్ష పోరాటాలకు దిగుతామని హెచ్చరించారు. సర్పంచులను, ప్రజా ప్రతినిధులను అరెస్టు చేయడాన్ని ఖండించారు. బైండోవర్ కేసులు, అరెస్టులకు భయపడబోమనీ, డంపింగ్ యార్డు ఏర్పాటును ఉపసంహరించే దాకా పోరాటం చేస్తామని ప్రకటించారు. ఇప్పటిదాకా అరెస్ట్ చేసిన వారందరినీ భేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో బీజేపీ గెలిచేందుకు అవకాశాలున్నాయని చెప్పారు. సర్వేలు ప్రామాణికం కాదన్నారు. కొండను తవ్వి ఎలుకను పట్టినట్టు కులగణన సర్వే ఉందని విమర్శించారు. బీసీలను మోసం చేసేందుకు కులగణన అన్నారు. 50 శాతం బీసీలున్నారని చెబుతున్న రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డిలు బీసీ నేతను ముఖ్యమంత్రిని చేస్తారా? అని సవాల్ విసిరారు. మంత్రుల్లో బీసీలు ఎంతమంది ఉన్నారు? మైనార్టీ నుంచి ఒక్కరైనా మంత్రి ఉన్నారా? కార్పొరేషన్ చైర్మెన్లలో బీసీలు ఎంతమంది ఉన్నారు? అని ప్రశ్నించారు.

మెజార్టీ యాదవులు బీజేపీలో ఉన్నా పదవులేవి?

- మేకల రాములు యాదవ్
- బీజేపీ ఆఫీస్ ముట్టడికి యత్నించిన యాదవ హక్కుల పోరాట సమితి
- పలువురిని అరెస్టు చేసిన పోలీసులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మెజార్టీ యాదవులు బీజేపీలోనే ఉన్నా ఒక్కరికి కూడా జిల్లా అధ్యక్ష పదవి ఎందుకివ్వలేదని జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి అధ్యక్షులు మేకల రాములు యాదవ్ ప్రశ్నించారు. రెడ్డిల పార్టీగా బీజేపీ మారిందని విమర్శించారు. అధ్యక్ష పదవుల ఎంపికలో యాదవులకు అన్యాయం చేయడాన్ని నిరసిస్తూ బుధవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడించేందుకు జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి ప్రయ్నతించింది. ఈ సందర్భంగా ముట్టడికి వచ్చిన పలువురిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా రాములు యాదవ్ మాట్లాడుతూ..బీజేపీ ప్రకటించిన 19 జిల్లాలో ఒక్క యాదవ సోదరుడు మీకు కనిపించలేదా? అని కిషన్‌రెడ్డిని ప్రశ్నించారు. గ్రేటర్ లో యాదవుల ప్రాబల్యం ఎక్కువనీ, హైదరాబాద్, రంగారెడ్డి అర్బన్ జిల్లాలకు యాదవ సోదరులకు ఎందుకు అవకాశం ఇవ్వలేదని నిలదీశారు. యాదవులకు పార్టీ పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వకుంటే బీజేపీ నేతలను ఎక్కడికక్కడ అడ్డుకుంటామనీ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడిస్తామని హెచ్చరించారు.

వడ్డీ రేట్లు తగ్గేనా..!

రెండేండ్లుగా రుణగ్రహీతల ఎదురుచూపులు

- ఆర్బీఐ ఎంపీసీ భేటీ ప్రారంభం
- రేపే కీలక ప్రకటన



న్యూఢిల్లీ : దేశంలో హెచ్చు వడ్డీ రేట్లతో గత రెండు, మూడేండ్లుగా రుణగ్రహీతలపై తీవ్ర భారం పడుతోంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్షా బుధవారం ప్రారంభమైంది. ఆర్బీఐ నూతన గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఆధ్వర్యంలో జరుగుతున్న తొలి మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ)లో అధిక వడ్డీ రేట్ల నుంచి ఉపశమనం కోసం ఖాతాదారులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. వడ్డీ రేట్లు తగ్గుతాయనే పలు అంచనాలు ఎంత వరకు నిజం అవుతాయో వేచి చూడాలి. 2024 డిసెంబర్‌లో శక్తికాంత స్థానంలో మల్హోత్రా ఆర్బీఐ 26వ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించారు. వచ్చే మూడేండ్ల పాటు ఆయన ఈ హోదాలో ఉండనున్నారు. మూడు రోజుల పాటు సాగనున్న ఎంపీసీ భేటీ శుక్రవారంతో ముగియనుంది. గడిచిన రెండేళ్లుగా ఒక్క సారి కూడా వడ్డీ రేట్లను మార్చకుండా 6.50 శాతం వద్దే కొనసాగిస్తున్నారు.

కరోనా కాలం 2020 మేలో ఆర్బీఐ చివరిసారిగా రెపో రేటును తగ్గించింది. ఆ తర్వాత దానిని 2023 ఫిబ్రవరి వరకు 250 బేసిస్ పాయింట్ల వరకు పెంచుతూ 6.5 శాతానికి చేర్చింది. కాగా.. ఇటీవల దేశంలో వినియోగం భారీగా పడిపోవడంతో కార్పొరేట్ల ఆదాయాలపై తీవ్ర ప్రభావం పడింది. దీంతో వినిమయ డిమాండ్‌ను పెంచడానికి బడ్జెట్‌లో ఆదాయపు పన్ను పరిమితిని రూ.12 లక్షలకు పెంచింది. ఈ క్రమంలోనే మందగమనంలో ఉన్న ఆర్థిక వ్యవస్థకు మద్దతును ఇవ్వడానికి ఈ దఫా వడ్డీ రేట్ల తగ్గింపు ఉండొచ్చని పరిశోధన సంస్థలు, రేటింగ్ ఏజెన్సీలు, ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. రుణాలపై భారాన్ని తగ్గించడం ద్వారా వ్యవస్థలోకి నగదు ప్రవాహాన్ని పెంచే అవకాశాలు మెండుగా ఉన్నాయి. తద్వారనైనా రుణ గ్రహీతలపై భారం తగ్గొచ్చు. మరోవైపు రిటైల్ ద్రవ్యోల్బణం 6 శాతం దిగువనే ఉండటంతో వడ్డీ రేట్ల తగ్గింపునకు ఆర్‌బిఐ మొగ్గు చూపొచ్చనే అభిప్రాయాలు వెలుపడుతున్నాయి.

2024 డిసెంబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం సూచీ 5.22 శాతంగా నమోదయ్యింది. మరోవైపు సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికంలో భారత జీడీపీ ఏకంగా 5.4 శాతానికి పతనమై.. రెండేండ్ల కనిష్టానికి దిగజారింది. ఇంతక్రితం జూన్ త్రైమాసికంలోనూ 6.7 శాతంగా చోటు చేసుకుంది. వృద్ధి మందగించిన నేపథ్యంలో ఈ దఫా వడ్డీ రేట్లతో 25 బేసిస్ పాయింట్లు తగ్గింపు ఉండొచ్చని బార్‌క్లేస్ ఇండియా చీఫ్ ఎకనామిస్ట్ ఆస్తా గుడ్వాని పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిస్థితుల్లో ద్రవ్యోల్బణం పెద్ద ఆందోళనకరంగా ఏమీ లేదన్నారు. ఆర్థిక వ్యవస్థకు ఉత్సాహాన్ని ఇవ్వడానికి వడ్డీ రేట్ల తగ్గింపు ఉండొచ్చని నైట్‌ఫ్రాంక్ ఇండియా సీఎండీ శిశిర్ బైజల్ అన్నారు. రేట్లు తగ్గించడం ద్వారా మధ్యస్థ కుటుంబాలకు నివాస కొనుగోళ్లు కొంత చౌకగా మారనున్నాయన్నారు.

కాంట్రాక్టర్లపై చర్యలెందుకు తీసుకోరు?

ఫ్రంట్‌లైన్ వర్కర్లకు జీతాల పెండింగ్‌పై మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా టీవీవీపీ ఆస్పత్రుల శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బందికి మూడు నెలలుగా జీతాలు చెల్లించని కాంట్రాక్టర్లపై చర్యలెందుకు తీసుకోవడం లేదని వైద్యారోగ్యశాఖ మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ప్రశ్నించారు. ఈ మేరకు బుధవారం ట్వీట్ చేశారు. ఫ్రంట్‌లైన్ వర్కర్లకు నెలల పాటు వేతనాలు చెల్లించకపోవడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగులకు సేవలు అందించడంలో ఎంతో ముఖ్యపాత్ర పోషించే ఫ్రంట్‌లైన్ వర్కర్లను వేతనాలు ఇవ్వకుండా నడిరోడ్డు మీదకు తీసుకువచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందని ఎద్దేవా చేశారు. నెల జీతం మీదనే పిల్లల చదువులు, ఇంటి కిరాయిలు చెల్లించుకునే కార్మికులు.. జీతాలు అందక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టెండర్ ప్రకారం జీతాలు ఇవ్వకుండా, పీఎఫ్ డబ్బులు జమ చేయకుండా కాంట్రాక్టర్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఫ్రంట్ లైన్ కార్మికులకు ఇంత అన్యాయం జరుగుతుంటే ప్రభుత్వంలో కదలిక లేకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఒకటో తేదీనే వేతనాలు ఇస్తున్నట్టు ప్రచారం చేసుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఈ చిరు ఉద్యోగుల ఆవేదన కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలనీ, ప్రతి నెల సకాలంలో జీతాలు ఇవ్వాలనీ, కాంట్రాక్టర్లు వేతనాల్లో కోత పెట్టకుండా నివారించాలని బీఆర్ఎస్ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రైతు భరోసాపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం

రైతు భరోసా విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తపుడు ప్రచారం చేస్తోందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఒక ప్రకటనలో విమర్శించారు. 2023 వానాకాలానికి సంబంధించి, బీఆర్ఎస్ ప్రభుత్వం ఎకరం లోపు ఉన్న రైతుల సంఖ్య 22,55,181గా గుర్తించి రైతుబంధు అందించగా, కాంగ్రెస్ ప్రభుత్వం 21,45,330 మందిని మాత్రమే గుర్తించిందని అన్నారు. ఎకరం లోపున్న 1,09,851 మంది రైతులకు కోత విధించిందని ఆరోపించారు. "రైతులందరికీ ఎకరాకు రూ.7,500 రైతు భరోసా ఇస్తామని ప్రకటించి, దాన్ని రూ. 6వేలకు కుదించారు. ఇప్పుడు ఎకరం లోపున్న రైతులకు మాత్రమే రైతు భరోసా అందించారు. రాష్ట్రంలో 68లక్షల మంది రైతులుంటే, 21,45,330 మందికి మాత్రమే చెల్లించారు. మిగతా 47 లక్షల మంది రైతుల ఎకౌంట్లలో డబ్బులు ఎప్పుడు జమచేస్తారో చెప్పాలి" అని హరీశ్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ 14నెలల పాలనలో 415పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ యాసంగికి ఎకరానికి ఇవ్వాల్సిన రూ. 7,500 కలుపుకొని మొత్తం ఒక్కో రైతుకు ఎకరానికి 17,500 చొప్పున ఈ ప్రభుత్వం బాకీ పడిందని గుర్తు చేశారు. కోత విధించిన లక్ష మంది రైతులతో పాటు, మిగతా రైతులందరికీ వెంటనే రైతు భరోసా అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

మాదిగలకు 11 శాతం రిజర్వేషన్ ఇవ్వాలి

- మాజీ డీప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మాదిగలకు 11 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని మాజీ డీప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాణిక్ రావు, బీఆర్ఎస్ నేతలు ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్, ఎర్రోళ్ల శ్రీనివాస్, బొమ్మెర రామమూర్తితో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు ఎంచుకున్న ప్రాతిపదిక ఏమిటని ప్రశ్నించారు. జనాభా ప్రకారం మాదిగలకు 11 శాతం రిజర్వేషన్ రావాలని చెప్పారు. అభివృద్ధి చెందిన కులాలను వెనుకబడిన కులాల జాబితాలో చేర్చారనీ, బుడగజంగాలను ఏ గ్రూప్‌లో కలిపి, నేతకాని సామజిక వర్గం వారిని సి గ్రూప్‌లో ఉంచారని తప్పుపట్టారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఎస్సి వర్గీకరణ కేటగిరీల్లో వివేక్ వెంకటస్వామి హస్తం ఉందని ఆరోపించారు. కాంగ్రెస్ జాతీయ నాయకులు, రాష్ట్ర నాయకులు ఖర్గే, కొప్పుల రాజు, భట్టి, వివేక్ వెంకటస్వామి లాబీయింగ్‌కు సీఎం రేవంత్ రెడ్డి లొంగారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి మాలలకు కొమ్ము కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సి వర్గీకరణలో మాదిగలకు ఇంకా న్యాయం జరగాల్సి ఉందన్నారు. ఎన్నో ఏళ్లుగా కులవివక్ష అనుభవించిన మాదిగలకు మంత్రి దామోదర రాజనర్సింహా అనుకూలంగా లేరన్నారు. ఆయా క్యాటగిరీల్లో ఉన్న కులాలపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు.

మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఊరట

- ఈ నెల12 వరకు అరెస్ట్ చేయొద్దని హైకోర్టు ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్ గౌడ్ చేసిన ఫిర్యాదు ఆధారంగా పెట్టిన కేసులో మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావుకు ఊరట లభించింది. ఈ నెల 12వ తేదీ వరకు అరెస్టు చేయవద్దని పోలీసులకు బుధవారం హైకోర్టు ఆదేశించింది. రాజకీయ కక్షతో చక్రధర్‌గౌడ్ ఫిర్యాదు చేస్తే ప్రాథమిక విచారణ చేయకుండానే పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారంటూ హరీష్ వేసిన పిటిషన్‌ను జస్టిస్ కె.లక్ష్మణ్ విచారించారు. పోలీసుల తరఫున సుప్రీంకోర్టు సీనియర్ లాయర్ వాదించనున్నారని, కేసును వాయిదా వేయాలని పీపీ కోరడంతో విచారణ వాయిదా వేశారు. అరెస్ట్ చేయరాదన్న గత ఉత్తర్వులను అప్పటి వరకు పొడిగిస్తున్నట్టు న్యాయమూర్తి ప్రకటించారు.

2014 సమగ్ర కుటుంబ సర్వేను బహిర్గతం చేయాలి : కుల నిర్మూలన వేదిక

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల సర్వే తప్పుల తడకని కుల నిర్మూలన వేదిక అధ్యక్షులు పావని నాగరాజు ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం చేసింది కరెక్టే అయితే ఎందుకు పబ్లిక్‌డొమైన్‌లో పెట్టడం లేదని ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ గణనను సైతం వెంటనే బహిర్గతం చేయాలని కోరారు. కోట్లాది రూపాయల ప్రజాధనం వెచ్చించి సర్వేలు నిర్వహించి వాటిని ఎందుకు దాచి పెడుతున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు.

వీధి కుక్కల కట్టడికి చర్యలు

- హైకోర్టులో ప్రభుత్వం నివేదిక

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

వీధి కుక్కల దాడులపై పత్రికల్లో వచ్చిన వార్తలను హైకోర్టు సుమోటో పిల్‌గా స్వీకరించి విచారణ చేస్తున్న కేసులో ప్రభుత్వం కౌంటర్ వేసింది. వీధి కుక్కల కట్టడికి చర్యలు తీసుకుంటున్నట్టు వివరించింది. 2022 నుంచి 2024 కాలంలో 3.34 లక్షల కుక్క కాటు ఘటనలు జరిగితే, అందులో జీహెచ్ఎంసీ, పరిసర జిల్లాల్లో 1.10 లక్షలున్నాయని తెలిపింది. 36 మంది మరణించినట్టు చెప్పింది. వీధి కుక్కల నియంత్రణ కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించినట్టు కోర్టుకు తెలిపింది. స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్, అవగాహన, సంక్షేమ కార్యక్రమలకు 2022 నుంచి 2024 డిసెంబరు వరకు రూ.29.67 కోట్లు కేటాయించగా, రూ.9.21 కోట్లు ఖర్చు అయిందని వివరించింది. మేరకు జీహెచ్ఎంసీ కమిషనర్ కోర్టుకు నివేదిక సమర్పించారు. విచారణ రెండు వారాలకు వాయిదా పడింది.

సమగ్ర కుటుంబ సర్వేపై సీఐడీ విచారణ జరిపించాలి

- సీఎం రేవంత్‌కు షబ్బీర్ అలీ లేఖ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీఆర్ఎస్ హయాంలో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేపై సీఐడీ విచారణ జరిపించాలని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. ఈమేరకు బుధవారం లేఖను మీడియాకు విడుదల చేశారు. 2014లో చేసిన సమగ్ర కుటుంబ సర్వేలో అవకతవకలు చోటు చేసుకున్నాయన్నాని పేర్కొన్నారు. వాటిపై దర్యాప్తు చేయించాలని కోరారు. ఆ సర్వే ద్వారా ప్రజలను తప్పుదారి పట్టించారని ఆరోపించారు. పదేండ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ సర్వేకు సంబంధించిన గణాంకాలను అధికారికంగా విడుదల చేయలేదని తెలిపారు. సమగ్ర కుటుంబ సర్వేలో దాదాపు నాలుగు లక్షల మంది సిబ్బంది పాల్గొన్నారు. ప్రజల ఆధార్ నంబర్లు, రేషన్ కార్డు వివరాలు, బ్యాంకు సమాచారం, ఎల్పీజీ కనెక్షన్లు, వాహన రిజిస్ట్రేషన్ల సమాచారం, ఇతర వ్యక్తిగత వివరాలతో కూడిన 94 అంశాలతో సమాచారం సేకరించారు. సర్వేకు రూ.100 కోట్లు ఖర్చు చేసినా, సర్వే నివేదికను మాత్రం అసెంబ్లీలో ప్రవేశపెట్టలేదు.తద్వారా ఆర్థికపరమైన దుర్వినియోగం జరిగింది. రాష్ట్ర ప్రజల సున్నితమైన డేటాను ప్రయివేటు సంస్థలకు విక్రయించి ఉండొచ్చు. ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేశారు. పౌరుల డేటాను ఇతరులకు బదిలీ చేసినట్టు అనుమానాలున్నాయి. దర్యాప్తు చేయిస్తే వాస్తవాలు బయటకు వస్తాయి' అని లేఖలో పేర్కొన్నారు.

మామిడి పూతపై మంచు తీవ్రత

పది రోజులుగా పెరిగిన మంచు ప్రభావం

కొన్ని చోట్ల తీవ్రత.. మరికొన్ని చోట్ల నిల్..

రాష్ట్రంలో 4 లక్షల ఎకరాల్లో మామిడి సాగు

అధిక తోటల్లో 30-35శాతం మాత్రమే పూత





నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో ప్రధాన ఉద్యాన పంట మామిడిపై మంచు తీవ్రత అధికంగా ఉంది. ప్రతియేటా డిసెంబర్ మూడోవారం, జనవరి తొలి, మలి వారాల నాటికి పూర్తిస్థాయిలో రావాల్సిన పూత ఈ ఏడాది ఆలస్యమవుతోంది. జనవరి, ఫిబ్రవరి నెలల్లో పిందెలు ఏర్పడి కాయలు కాయాల్సింది. మంచు ప్రభావం వల్ల చాలా చోట్ల ఆ పరిస్థితి కనిపించటం లేదు. వచ్చిన కొద్దిపాటి పూత కూడా పదిరోజులుగా కురుస్తున్న మంచుతో రాలుతోందని రైతులు వాపోతున్నారు. ఈ సీజన్‌లో అధిక వర్షాలు, రాత్రివేళల్లో చలితీవ్రత, తెగుళ్ల ప్రభావం వల్ల పూత ఆశించిన మేర రావడం లేదని ఉద్యాన అధికారులు చెబుతున్నారు. మంచు కారణంగా మామిడిని తేనె మంచు, బూడిద రంగు తెగులు, తామర తెగుళ్లు ఆశిస్తున్నాయి. అయితే, ముంచు ప్రభావం అన్నిచోట్ల ఒకే రకంగా లేదు. కొన్ని జిల్లాల్లో తీవ్రంగా. ఉండగా.. మరికొన్ని జిల్లాల్లో ఇప్పటివరకు ఆ ప్రభావం లేదు.

40 శాతం పంట రావటం కష్టమే..!

రాష్ట్రవ్యాప్తంగా 4 నుంచి 5 లక్షల ఎకరాల్లో మామిడి సాగవుతోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 50వేల ఎకరాల వరకు సాగు చేస్తున్నారు. ఖమ్మం జిల్లాలో 33వేల ఎకరాల్లో సేద్యంలో ఉంది. దీనిలో ఖమ్మం చుట్టుపక్కల మండలాలు రఘునాథపాలెం, ఖమ్మం అర్బన్, ఖమ్మం రూరల్, కూసుమంచి, చింతకాని తదితర ప్రాంతాల్లో 35శాతం వరకే పూత కనిపిస్తోంది. పెనుబల్లిలో కాత, పూత తక్కువగానే ఉండగా.. కల్లూరు డివిజన్‌లో ఒకింత పర్వాలేదనిపించేలా ఉంది. అయితే పది రోజులుగా కురుస్తున్న మంచుతో ఆ కొద్దిపాటి పూత కూడా రాలుతోంది. ఒక్కో చెట్టుకు ఆడ, మగ పూత ఉంటుంది. సుమారు పదివేల మగపూత ఉంటే ఒక్క ఆడపూత కాయగా మారుతుంది. మామిడి పంటకు మంచు వల్ల తెగుళ్లు సోకడంతో దిగుబడిపై ప్రభావం పడనుంది. ఈ ఏడాది 40శాతం పంట కూడా వచ్చే అవకాశాలు తక్కువేనని రైతాంగం అంటోంది.

సకాలంలో పూత వస్తేనే ఆశించిన దిగుబడి

మామిడి దిగుబడి ఆశాజనకంగా ఉండాలంటే పూత సకాలంలో రావటమే కీలకం. సాధారణంగా ముందుతేడాది బాగా కాపు వస్తే మరుసటి ఏడాది ఆ తోటలు పెద్దగా కాయవు. సకాలంలో పూత పూస్తే మార్చి చివరి నాటికి పంట వస్తే దిగుబడి, రేటు అధికంగా ఉంటుంది. టన్ను రూ.50వేల నుంచి రూ.75వేలు పలుకుతుంది. ఏప్రిల్‌లో దిగుబడి వస్తే రూ.15వేల నుంచి రూ.30వేలు, మేలో వస్తే మాత్రం రూ.8వేల నుంచి రూ.30వేలలోపే రేటు ఉంటుంది. ఈ ఏడాది పూతను బట్టి చూస్తే అధిక మొత్తం పంట మే నెలలోనే వచ్చే అవకాశం ఉందని రైతులంటున్నారు. 18నుంచి 25 ఏండ్ల వయసున్న మామిడి తోటల్లో ఎకరానికి 20-25 చెట్లు ఉంటాయి. అధిక సాంద్రత మామిడి తోటల్లో మాత్రం ఎకరానికి 250 చెట్ల వరకు పెంచుతారు. బాగా పండితే ఎకరానికి 4 నుంచి 5 టన్నుల దిగుబడి వస్తుంది. కానీ ఈ ఏడాది రెండు టన్నుల దిగుబడి వస్తే ఎక్కువని రైతాంగం చెబుతోంది. పూత దశల వారీగా వస్తుంది. మంచు ప్రభావంతో పిందె కట్టే దశలో పూత రాలుతుండటంతో రైతాంగం ఆందోళన చెందుతోంది. తెలంగాణలో అధికంగా బంగినపల్లి, చిన్నరసాలు, పెద్దరసాలు, తోతాపురి వంటి మామిడి రకాలు సాగు చేస్తారు.

పూత దశలో తోటలు..

ఉమ్మడి మెదక్ జిల్లాలో 40 వేల ఎకరాల్లో మామిడి తోటలున్నాయి. మెదక్ జిల్లాలో రామాయంపేట, నిజాంపేట్, నార్సింగ్, పాపన్న పేట, టెక్మాల్, చేగుంట, హవేలీ ఘనపూర్, తూప్రాన్, శివంపేట, సంగారెడ్డి జిల్లాలో కోహీర్, జహీరాబాద్, సంగారెడ్డి, అందోల్, సదాశివపేట, కంది, పుల్కల్, రాయికోడ్, హుస్నాబాద్, వర్గల్, చేర్యాల, గజ్వేల్, జగదే వ్ పూర్ వంటి ప్రాంతాల్లో మామిడి తోటలున్నాయి. ప్రస్తుతం పూత దశలో ఉన్నాయి. వాతావరణ మార్పుల వల్ల పూత రాలుతున్నది. మంచు వల్ల పూత నిలవడం లేదు. చెట్లపైనే మారిపోవడం, నేలరాలిపోవడం వల్ల కాత 25 శాతం పైనే దెబ్బతిననుంది. తామర, ఇతర పురుగుల వల్ల పూత ఉండటం లేదు. రైతులు పురుగు మందులు స్ప్రే చేసినా ఫలితం ఉండట్లేదు. కొన్ని తోటల్లో పూత ఆలస్యంగా వచ్చిందని రైతులు చెబుతున్నారు. వాతావరణం సహకరించకపోతే దిగుబడి బాగా తగ్గుతుందని అంటున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మామిడి పూత బాగానే ఉన్నా, పిందె రాలిపోతున్నది. జిల్లాలో దిగుబడి 3 మెట్రిక్ టన్నులు మాత్రమే ఉండనుంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రస్తుతానికి మామిడి పూతకు ఎక్కడా ఎలాంటి సమస్య కనిపించలేదు. కరీంనగర్ జిల్లాల్లో మామిడి పూత ఇప్పుడు ఇప్పుడే వస్తుంది. పెద్దగా సమస్య లేదని తోట యజమానులు అంటున్నారు.

మామిడి దిగుబడి మరింత తగ్గే చాన్స్..

ఈ ఏడాది మామిడి దిగుబడి, నాణ్యతపై తెగుళ్ల ప్రభావం అధికం ఉండనుంది. ఖమ్మం జిల్లాలో నాగార్జునసాగర్ ఆయకట్టులో ఎక్కువగా మామిడి చేస్తున్నారు. కాబట్టి కాయల్లో నీటిశాతం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల ఎక్కువ కాలం నిల్వ ఉండవని వ్యాపారులు భావిస్తారు. హైదరాబాద్ చుట్టు పక్కల ప్రాంతాల్లో బెట్ట పరిస్థితులు ఎక్కువగా ఉంటాయి కాబట్టి నీరుశాతం తక్కువగా ఉండి కాయలు ఎక్కువ కాలం నిల్వ ఉంటాయనే ప్రచారం ఉంది. ఈ కారణంతో ఎక్కువ మంది వ్యాపారులు అక్కడి పంటపై ఆసక్తి చూపుతున్నారు. హైదరాబాద్ పరిసరాల్లో పండే పంటను ముంబయి, చెన్నై, ఢిల్లీ, బెంగళూరు తదితర ప్రాంతాలకు ఎక్కువగా ఎగుమతి చేస్తారు. ఖమ్మం జిల్లా పంటను ఎక్కువగా మహారాష్ట్ర, పంజాబ్, హర్యానాకు చెందిన వ్యాపారులు కొనుగోలు చేస్తారు. అయితే ఈ ఏడాది పూత సకాలంలో రాకపోవడం, మంచు ప్రభావంతో తెగుళ్ల తీవ్రంగా ఉండటంతో ఏమేరకు వ్యాపారులు పంటపై ఆసక్తి చూపుతారనేది సందేహంగా ఉంది. ప్రతియేటా ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి రూ.400 కోట్లకు పైగా మామిడి వ్యాపారం సాగుతోంది. కానీ ప్రతికూల పరిస్థితుల కారణంగా ఈ ఏడాది రూ.200 కోట్ల పంట ఎగుమతి జరిగితే ఎక్కువని అంటున్నారు.

మంచుతో పూత రాలుతోంది..

ఈ ఏడాది పూత చాలా ఆలస్యంగా వచ్చింది. వారం, పదిరోజులుగా కురుస్తున్న మంచుతో తెగుళ్ల తీవ్రత అధికం అవుతోంది. మామిడి పూత బాగా రాలుతోంది. నేను 80 ఎకరాలు ఎకరం రూ.10వేల నుంచి రూ.25వేల వరకు వెచ్చించి కౌలుకు తీసుకున్నా. పరిస్థితులు చూస్తుంటే నష్టాలు వస్తాయేమోనని భయంగా ఉంది.

- కమల్‌షా, కౌలు రైతు, కల్లూరు, ఖమ్మం జిల్లా

35శాతం పూతే పూసింది..

ఈ ఏడాది మంచు ప్రభావంతో 35 శాతం పూతే పూసింది. కల్లూరు డివిజన్‌లో ఒకింత ఆశాజనకంగా పూసినా ఖమ్మం చుట్టుపక్కల ప్రాంతాల్లో మాత్రం బాగా పూత పూయటం తగ్గింది. మంచు, వర్షాల వల్ల పూత రావడం కూడా ఆలస్యమైంది. డిసెంబర్ నాటికి పూతతో చెట్లు కళకళలాడాల్సింది ఇప్పటికీ చాలా చోట్ల అనుకూలంగా పూత రావటం లేదు. మల్టీకే వంటి మందులు పిచికారీ చేయాలని రైతాంగానికి సూచిస్తున్నాం. పూత వచ్చేందుకు, తెగుళ్ల నివారణపై డిపార్ట్‌మెంట్ వైపు నుంచి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.

- మధుసూదన్, ఖమ్మం జిల్లా ఉద్యాన అధికారి

బిజినెస్



పసిడి డిమాండ్‌కు ధరల దెబ్బ

ఈ ఏడాది అమ్మకాలు తగ్గొచ్చు

డబ్ల్యూజీసీ అంచనా

ముంబయి : ఈ ఏడాది బంగారానికి డిమాండ్ తగ్గొచ్చని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ (డబ్ల్యూజీసీ) అంచనా వేసింది. ఇందుకు అధిక బంగారం ధరలే కారణమని డబ్ల్యూజీసి ఇండియా ప్రతినిధి సచిన్ జైన్ పేర్కొన్నారు. గతేడాది బంగారం వినియోగం తొమ్మిదేండ్ల గరిష్ట స్థాయికి చేరిందన్నారు. ఈ ఏడాది 700-800 మెట్రిక్ టన్నుల పసిడికి డిమాండ్ ఉండొచ్చన్నారు. గతేడాది ఇది 802.8 టన్నులుగా చోటు చేసుకుంది. 2015 తర్వాత ఇదే అత్యధిక అమ్మకాలన్నారు. రికార్డ్ స్థాయిలో పెరుగుతున్న బంగారం ధరలు మొదట ఆభరణాల వినియోగదారులను ప్రభావితం చేస్తాయన్నారు. వరుసగా పెరుగుతున్న ధరలు డిమాండ్‌ను దెబ్బతీయనున్నాయన్నారు. దేశీయంగా బుధవారం బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల పసిడి ధర రూ.84,399కి చేరింది. 2024లోని ధరతో పోల్చితే 21 శాతం పెరిగింది. అమెరికా టారిఫ్ యుద్ధ భయాలతో 2025లో ఇప్పటివరకు 10 శాతం ఎగిశాయి. ఆభరణాలను కొనుగోలు చేసే కుటుంబాలకు ఒక నిర్ణీత బడ్జెట్ ఉంటుందని, బంగారం ధరల పెరుగుదలతో సమానంగా వారి బడ్జెట్ పెరగదని సచిన్ జైన్ తెలిపారు. దేశంలోని మొత్తం బంగారం డిమాండ్‌లో ఆభరణాల వాటా దాదాపు 70 శాతంగా కాగా.. మిగితా 30 శాతం పెట్టుబడి డిమాండ్‌గా ఉంది.

కర్నాటక హైకోర్టుకు విజయ్ మాల్యా

బ్యాంక్ రికవరీ నివేదికలు ఇవ్వాలని

న్యూఢిల్లీ : భారత బ్యాంక్‌లకు వేల కోట్ల రూపాయలు ఎగవేసి 2016లో లండన్ పారిపోయిన కింగ్‌ఫిషర్ అధినేత విజయ్ మాల్యా తాజాగా కర్నాటక హైకోర్టును ఆశ్రయించారు. తాను బ్యాంకులకు చెల్లించిన రికవరీలకు సంబంధించి అకౌంట్ స్టేట్‌మెంట్లను అందించాలని పిటిషన్ దాఖలు చేశారు. తాను తీసుకున్న అప్పులకు మించి అనేక రెట్లు బ్యాంకులు తన నుంచి వసూలు చేశాయని కోర్టుకు తెలిపారు. అందుకు సంబంధించిన అకౌంట్ స్టేట్‌మెంట్లను అందించాలన్నారు. తనతో పాటు ప్రస్తుతం లిక్విడేషన్‌లో ఉన్న యూబీహెచ్ఎల్ తదితర సంస్థల నుంచి వసూలు చేసిన మొత్తాల వివరాలను కూడా కావాలని అడిగారు. దీనిపై న్యాయస్థానం విచారణకు తీసుకుంది. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ దాదాపు రూ.6,200 కోట్ల అప్పులు తీసుకుందని మాల్యా తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనికి సంబంధించి రూ.14,000 కోట్లను రికవరీ చేశారన్నారు. ఇదే విషయమై పార్లమెంట్‌లోనూ ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటన కూడా చేశారన్నారు. మాల్యాకు చెందిన రూ.14,131 కోట్ల విలువైన ఆస్తులను బ్యాంక్‌లు రికవరీ చేసినట్లు మంత్రి ప్రకటించిన విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. మాల్యా తీసుకున్న రుణంలో దాదాపు రూ.10,200 కోట్లు చెల్లించినట్లు రికవరీ అధికారులు కూడా పేర్కొన్నారన్నారు. దీనిపై స్పందించాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ), పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) సహా 10 బ్యాంక్‌లకు కోర్టు ఆదేశాలు జారీ చేస్తూ.. ఫిబ్రవరి 13 లోగా స్పందించాలని ఆదేశించింది.

బజాజ్ ఫిన్‌సర్వ్ 'మల్టీ క్యాప్ ఫండ్' ఆవిష్కరణ

ముంబయి : బజాజ్ ఫిన్‌సర్వ్ ఎఎంసీ కొత్తగా బజాజ్ ఫిన్‌సర్వ్ మల్టీ క్యాప్ ఫండ్‌ను ఆవిష్కరించినట్లు ప్రకటించింది, ఇది లార్జ్ క్యాప్, మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ స్టాక్‌లలో పెట్టుబడి పెట్టే ఓపెన్ ఎండ్ ఈక్విటీ స్కీమ్ అని పేర్కొంది. ఫిబ్రవరి 6 నుంచి ఫండ్ సబ్‌స్క్రిప్షన్ కోసం తెరువబడి.. 20తో ముగియనుందని తెలిపింది. ఆకర్షణీయమైన ధరలకు, వాటి అంతర్లీన విలువకు దిగువన అందుబాటులో ఉన్న కంపెనీలలో పెట్టుబడి పెట్టాలనే వ్యూహాన్ని ఉపయోగించనున్నట్టు ఆ సంస్థ సీఈఓ గణేష్ మోహన్ పేర్కొన్నారు. రాబడితో పాటు క్రమశిక్షణతో స్థిరమైన సంపదను అందించడానికి కట్టుబడి ఉన్నామన్నారు. ఇందులో కనిష్ట మొత్తం రూ.500 నుంచి పెట్టుబడిగా పెట్టొచ్చన్నారు.

ఎంజి సేవ 1.2 లక్షల మందికి మద్దతు

న్యూఢిల్లీ : జెఎస్‌డబ్ల్యు ఎంజి మోటార్ ఇండియా తన కీలక కార్యక్రమం ఎంజి సేవలో భాగంగా గతేడాది 1.2 లోల మందికి మద్దతును అందించినట్లు తెలిపింది. సామాజిక సేవలో భాగంగా 70 లక్షల మంది పైగా మహిళలు, బాలికలకు సాధికారత అందించినట్లు పేర్కొంది. విద్యా, వ్యక్తిగత వృద్ధి, వైద్యం తదితర విభాగాల్లో బలహీన వర్గాలకు మద్దతును అందించినట్లు వెల్లడించింది. మరింత ప్రభావవంతంగా సామాజిక సేవలను కొనసాగించనున్నట్లు ఆ సంస్థ పేర్కొంది.

ఎస్‌హెచ్‌జిబితో మారుతి సుజుకి జట్టు

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి తాజాగా సర్వ హర్యాణ గ్రామీణ బ్యాంక్ (ఎస్‌హెచ్‌జిబి)తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్టు ప్రకటించింది. ఈ ఒప్పందంలో భాగంగా తన వినియోగదారులకు సులభ ఫైనాన్సింగ్ పరిష్కారాలు లభించనున్నాయని ఆ కంపెనీ ప్రతినిధి పార్థో బెనర్జీ పేర్కొన్నారు.

ఎయిర్‌పోర్ట్‌లో ఎన్‌కామ్ ప్రైవ్ ఏర్పాటు

నవతెలంగాణ - హైదరాబాద్

రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎన్‌కామ్ ప్రైవ్‌ను ప్రారంభించినట్టు ప్రీమియం విమానాశ్రయ సేవలలో అగ్రగామి అయిన ఎన్‌కామ్ హాస్పిటాలిటీ తెలిపింది. అంతర్జాతీయ డిపార్చర్స్ టెర్మినల్ యొక్క మెజ్జనైన్ లెవల్ వద్ద వ్యూహాత్మకంగా ఉన్న ఈ ప్రీమియం లాంజ్ ప్రయాణికులకు ప్రయాణాలను ప్రారంభించే ముందు విశ్రాంతి తీసుకోవడానికి, రీచార్జి చేసుకోవడానికి, రిఫ్రెష్ కావడానికి, వైఫై పొందడానికి తదితర సౌకర్యవంతమైన ప్రీమియం వాతావరణాన్ని అందించనున్నట్టు ఆ సంస్థ సీఈఓ వికాస్ శర్మ తెలిపారు. 885 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఈ లాంజ్‌ను ఏర్పాటు చేశామన్నారు.

స్విగ్గీకి రూ.800 కోట్ల నష్టాలు

న్యూఢిల్లీ : ప్రముఖ ఫుడ్ డెలివరీ సంస్థ స్విగ్గీ నష్టాలు భారీగా పెరిగాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్ నుంచి డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో రూ.800 కోట్ల నికర నష్టాలు చవి చూసింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.524 కోట్ల నష్టాలు నమోదు చేసింది. క్విక్ కామర్స్ వ్యాపారంలో జొమాటో, జెప్టోలకు పోటీని ఇవ్వడానికి భారీగా వ్యయాలు చేయడంతో గడిచిన క్యూ3లో నష్టాలు పెరిగినట్లు తెలుస్తోంది. కంపెనీ రెవెన్యూ 31 శాతం పెరిగి రూ.3,993 కోట్లకు చేరింది. 2023-24 ఇదే క్యూ3లో రూ.3,049 కోట్ల రెవెన్యూ ప్రకటించింది. ఇదే సమయంలో రూ.3,700 కోట్లుగా ఉన్న వ్యయం.. గడిచిన క్యూ3లో రూ.4,898 కోట్లకు చేరింది.

చాట్‌జీపీటీకి దూరంగా ఉండాలి

ఉద్యోగులకు ఆర్థిక శాఖ సూచన

న్యూఢిల్లీ : కృత్రిమ మేధా (ఎఐ) వినియోగంపై అప్రమత్తంగా ఉండాలని కేంద్ర ఆర్థిక శాఖ ఉద్యోగులకు స్పష్టం చేసింది. ఓపెన్ ఏఐకి చెందిన చాట్‌జీపీటీ, డీప్‌సీక్ వంటి ఎఐ చాట్‌బాట్‌ల వినియోగానికి దూరంగా ఉండాలని సూచించినట్టు తెలుస్తోంది. భద్రత కారణాల నేపథ్యంలో దీనికి సంబంధించిన ఈ వారంలోనే ఈ అంతర్గత సూచనలు చేసినట్లు సమాచారం. చాట్‌జీపీటీకి భారత్ రెండో అతిపెద్ద మార్కెట్‌గా ఉందని మంగళవారం భారత్ పర్యటనకు వచ్చిన ఓపెన్ ఎఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్ పేర్కొన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌లో భారత్ లీడింగ్ పొజిషన్‌లో ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. చాట్‌జీపీటీని డీప్‌సీక్ కాపీ కొట్టిందన్నారు. ఆల్ట్‌మాన్ ప్రకటన వెలుపడి తర్వాత రోజే ఆర్థిక శాఖ తమ ఉద్యోగులకు ఇలాంటి సూచనలు చేయడం విశేషం.





నేరస్తులుగా చిత్రీకరిస్తూ, ప్రాథమిక హక్కులు ఉల్లంఘిస్తూ..

- అమెరికా ఇమ్మిగ్రేషన్ అధికారుల చర్యలపై మండిపడుతున్న ప్రజలు
- దేశవ్యాప్తంగా వెల్లువెత్తుతున్న నిరసనలు

అట్లాంటా : రెండోసారి అధికారంలోకి వచ్చిన వెంటనే అధ్యక్షుడు ట్రంప్ తీసుకుంటున్న చర్యలు, వాటిని అమలు చేస్తున్న తీరు పట్ల దేశవ్యాప్తంగా ప్రజల్లో తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. చట్టబద్ధమైన పత్రాలు లేకుండా దేశంలో నివసిస్తున్న వారిని అత్యంత అమానవీయంగా వారి స్వదేశాలకు పంపుతున్న తీరు పట్ల సర్వత్రా వ్యతిరేకత వెలువడుతోంది. సరైన పత్రాలు లేవని లేదా క్రిమినల్ నేరాల్లో దోషులనే ఆరోపణలతో ఫెడరల్ ఇమ్మిగ్రేషన్ అధికారులు చాలామందిని అరెస్టు చేస్తున్నారు. కానీ వారు నిజానికి ఎలాంటి నేరాల్లోనూ నిందితులు కాదు.

అధికారులు జరిపే దాడుల్లో రోజుకు దాదాపు 800 నుండి వెయ్యి మందిని అరెస్టు చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో మైగ్రెంట్లను నేరస్తులుగా చిత్రీకరిస్తున్నారని, వారి ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తున్నారంటూ ట్రంప్ ప్రభుత్వంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇమ్మిగ్రేషన్ కస్టమ్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసిఇ) సోషల్‌మీడియా వేదికల ద్వారా తన ఆపరేషన్ గురించి చెబుతున్న వాటికి వాస్తవిక పరిస్థితులకు అసలు పొంతన లేదని చెబుతున్నారు. తుపాకులను కలిగి వున్నారని, మాదకద్రవ్యాలు వున్నాయని, హత్యలకు, లైంగిక దాడులకు పాల్పడ్డారని ఇలా క్రిమినల్ నేరాల ఆరోపణలతో ఈ తరలింపు ప్రక్రియ సాగుతోంది.

గత వారం ఐసిఇ చేసిన అరెస్టులకు ఈ కేసులకు సంబంధమే లేదు. దీనిపై ఎన్‌బిసి న్యూస్ సోదాహరణలతో వార్తా కథనాలు అందచేసింది. ఎన్‌బిసి న్యూస్ ప్రకారం కేవలం 613 అరెస్టులు మాత్రమే క్రిమినల్ అరెస్టులుగా పరిగణించారని మిగిలిన 566మందిలో 47శాతం మంది సరైన పత్రాలు కూడా నివసిస్తున్నవారని ఆ నివేదిక పేర్కొంది.

కానీ వీరందరినీ కలిపి ఐసిఇ నిర్బంధ శిబిరాల్లో పెట్టి, ఆ తర్వాత వారిని వారి దేశాలకు అమానవీయ రీతిలో తరలిస్తున్నారని పేర్కొంది.

బీజేపీకే మొగ్గు

ఢిల్లీ ఎన్నికల ఫలితాలపై ఎగ్జిట్ పోల్స్



న్యూఢిల్లీ : ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందని కొన్ని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు బుధవారం నిర్వహించగా, వీటి ఫలితాలు ఈ నెల 8న ప్రకటించనున్నారు. ఈ నేపథ్యంలో పోలింగ్ సమయం ముగిసిన తరువాత అంటే బుధవారం సాయంత్రం పలు సంస్థలు తమ ఎగ్జిట్ పోల్స్‌ను విడుదల చేశాయి. ఇందులో ఎక్కువ ఎగ్జిట్ పోల్స్ స్వల్ప తేడాతో బీజేపీ విజయం సాధిస్తుందని వెల్లడించాయి. పీపుల్స్ పల్స్ బీజేపీకి 51 నుంచి 60 సీట్లు, ఆప్‌కు 10 నుంచి 19 సీట్లు వస్తాయని తెలిపింది. పీపుల్స్ ఇన్‌సైట్ బీజేపీ కి 40 నుంచి 44, ఆప్‌కి 25 నుంచి 29 సీట్లు వస్తాయని తెలిపింది.

పి-మార్క్ బీజేపీకి 39 నుంచి 49, ఆప్‌కు 21 నుంచి 31 సీట్లు వస్తాయని అంచనా వేసింది. జెవిసి ఎగ్జిట్ పోల్ బీజేపీకి 39 నుంచి 45, ఆప్‌కు 22 నుంచి 31 సీట్లు వస్తాయని తెలిపింది. చాణక్య స్ట్రాటజీస్ ఎగ్జిట్ పోల్ బీజేపీకి 39 నుంచి 44, ఆప్‌కు 25 నుంచి 28 సీట్లు వస్తాయని తెలిపింది.

అయితే రెండు సంస్థలు ఈ ఎన్నికల్లో ఆప్ విజయం సాధిస్తాయని అంచనా వేశాయి. వీ ప్రెసిడే ఆప్‌కు 46 నుంచి 52 సీట్లు, బీజేపీకి 18 నుంచి 23 సీట్లు వస్తాయని తెలిపింది. మైండ్ బ్రింక్ ఆప్‌కు 44 నుంచి 49 సీట్లు, బీజేపీకి 21 నుంచి 25 సీట్లు వస్తాయని అంచనా వేసింది.

కాగా, ఈ ఎగ్జిట్ పోల్స్‌ను ఆప్ తిరస్కరించింది. సర్వే సంస్థలు ఆప్ ప్రభుత్వ పనితీరును తక్కువగా అంచనా వేశారని విమర్శించింది. ఆప్ జాతీయ అధికార ప్రతినిధి రీనా గుప్తా మాట్లాడుతూ 'గతంలోనూ అంటే 2013, 2015, 2020ల్లోనూ మీరు ఏ ఎగ్జిట్ పోల్ చూసినా ఆప్‌నకు తక్కువ సీట్లు వస్తాయనే చెప్పారు. కానీ నిజమైన ఫలితాల్లో ఆప్‌కు అంతకంటే ఎక్కువ సీట్లు వచ్చాయి' అని తెలిపారు.

కాగా, మరో వైపు బీజేపీ ఈ ఎగ్జిట్ పోల్స్‌ను స్వాగతించింది. పోల్స్‌ను మార్పునకు సూచనగా పేర్కొంది.

ఉత్తరాఖండ్‌లో యూసీసీ అమలు





- 10 రోజుల్లో ఒక సహజీవనం నమోదు

డెహ్రాడూన్ : ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)ని ఉత్తరాఖండ్ ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన మొదటి 10 రోజుల్లో కేవలం ఒకే ఒక లివ్ ఇన్ రిలేషన్‌షిప్ (సహజీవనం) నమోదయింది. సహజీవనం చేస్తున్న జంటలకు నమోదు తప్పనిసరి అనే నిబంధన కారణంగా మొత్తంగా ఐదు దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు తెలిపారు. ఒక జంటకు రిజిస్ట్రేషన్ మంజూరు చేయబడిందని, మరో నాలుగు జంటలకు ధ్రువీకరణ జరుగుతోందని అధికారులు తెలిపారు. జనవరి 27న ఉత్తరాఖండ్‌లోని బీజేపీ ప్రభుత్వం యూసీసీని అమల్లోకి తీసుకొచ్చింది. దీంతో స్వతంత్ర భారత దేశంలో యూసీసీని అమల్లోకి తీసుకొచ్చిన మొదటి రాష్ట్రంగా ఉత్తరాఖండ్ నిలిచింది. కాగా, సహజీవనం చేస్తున్న జంటలకు నమోదు తప్పనిసరి అనే నిబంధన ఉన్నా.. తక్కువ దరఖాస్తులు రావడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజలు తమ వ్యక్తిగత సంబంధాల వివరాలను అధికారిక వేదికపై వెల్లడించడానికి సిద్ధంగా లేకపోవడమూ.. లేదా.. నమోదు చేసుకోని జంటలకు కఠినమైన శిక్షలు గురించి పూర్తిగా తెలియకపోవడమో కావచ్చు. అని కొంతమంది విశ్లేషకులు అంటున్నారు.

నిబంధనల ప్రకారం, సహజీవనం చేస్తున్న జంట తమ సంబంధం గురించి ఒక నెలలోపు సంబంధిత అధికారులకు నివేదిక సమర్పించకపోతే, వారికి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ద్వారా మూడు నెలల వరకు జైలు శిక్ష లేదా రూ. 10,000 వరకూ జరిమానా లేదా ఈ రెండూ విధిస్తారు.అలాగే, తప్పనిసరిగా సహజీవనాన్ని నమోదు చేసుకోవాలనే యూసీసీ నిబంధన ప్రజల గోప్యతా హక్కును ఉల్లంఘించడమేనని, ఇది ప్రజల 'బెడ్‌రూమ్‌లలోకి తొంగి చూసే' చర్యగా మరి కొంత మంది విమర్శిస్తున్నారు.

ఈయూతో కలిసి పనిచేస్తాం

అంతర్జాతీయ సవాళ్ల పరిష్కారానికి ఇదో మార్గం

సుముఖత వ్యక్తం చేసిన చైనా



బీజింగ్ : అంతర్జాతీయంగా ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడంలో ఇయుతో కలిసి పనిచేసేందుకు సుముఖంగా వున్నట్లు చైనా పేర్కొంది. సహకారాన్ని పెంచుకునేందుకు విశ్వసనీయమైన భాగస్వామిగా మారుతుందని ఆశిస్తున్నట్టు చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి లిన్ జియాన్ బుధవారం పేర్కొన్నారు. యురోపియన్ యూనియన్‌తో సంబంధాలకు చైనా గొప్ప ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. ఇప్పటికే చైనా, కెనడా, మెక్సికో దేశాల దిగుమతులపై అదనపు సుంకాలు విధించిన ట్రంప్ ఈయూ ఉత్పత్తులపై కూడా విధించే అవకాశాలు వున్నాయని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడితో చర్చలు జరపాలని భావిస్తున్నట్లు ఇయు వాణిజ్య చీఫ్ మంగళవారం తెలిపారు. అయితే ట్రంప్‌తో యురోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయన్ జరపబోయే చర్చలేవీ అంత సాఫీగా జరగకపోవచ్చని భావిస్తున్నారు. ట్రంప్ టారిఫ్‌ల బెదిరింపులతో ఇయు సంబంధాలు కొంత మేరా దెబ్బతింటున్న పరిస్థితుల్లో బీజింగ్, బ్రస్సెల్స్ మధ్య సంబంధాలపై పునరాలోచన చేయాలని ఉర్సులా వాన్ డెర్ లేయన్ వంటి వారు యోచిస్తున్నారు. రష్యాతో చైనా సంబంధాలు, వాణిజ్యపరమైన ఉద్రిక్తతల కారణంగా ఇయు, చైనా సంబంధాలు ఇబ్బందుల్లో పడ్డాయి.

ఈ నేపథ్యంలో మంగళవారం బ్రస్సెల్స్‌లో లేయన్ మాట్లాడుతూ, చైనాతో సంబంధాల్లో ముప్పును తగ్గించుకోవడానికే ఇయు చూస్తుందని చెప్పారు. పరస్పర ప్రయోజనాలతో పరిష్కారాలు కనుగొనడానికి అవకాశం వుందని చెప్పారు. వాణిజ్య, పెట్టుబడుల సంబంధాలను విస్తరించుకోవడానికి, ఒప్పందాలు కుదుర్చుకోవడానికి కూడా అవకాశాలు వున్నాయన్నారు. అయితే ఆ ఒప్పందాలు ఏమిటన్న వివరాలు ఆమె వెల్లడించలేదు. గతేడాది అక్టోబరులో చైనా తయారీ ఎలక్ట్రిక్ వాహనాలపై అప్పటికే వున్న సుంకాలకు అదనంగా ఇయు మరో 10శాతం సుంకాలు విధించింది. ఈ చర్యకు బీజింగ్ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. దీంతో బ్రాందీ వంటి కొన్ని ఈయూ ఉత్పత్తులు చైనా మార్కెట్‌లో ప్రవేశించడానికి అడ్డంకులను చైనా పెంచింది.



బీజేపీ-ఆర్ఎస్ఎస్ నుంచి రాజ్యాంగంపై దాడి : రాహుల్

పాట్నా : అంబేద్కర్ వంటి ప్రముఖ దళిత నాయకులపట్ల గౌరవం నటిస్తూ ప్రజల్ని మోసం చేస్తున్న బీజేపీ-ఆర్ఎస్ఎస్ కూటమి నుంచి రాజ్యాంగం దాడికి గురవుతోందని కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీ విమర్శించారు. ప్రముఖ దళిత స్వాతంత్ర్య సమరయోధుడు, కాంగ్రెస్ కార్యకర్త జగ్‌లాల్ చౌదరి జయంతి సందర్భంగా పాట్నాలో నిర్వహించిన కార్యక్రమంలో రాహుల్ గాంధీ ఈ విమర్శలు చేశారు. బుధవారం ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేసిన తరువాత, విమానంలో ఇక్కడకి చేరుకున్నట్టు రాహుల్ తెలిపారు. దళితులు, గిరిజనులు, బీసీలకు అన్ని రంగాల్లోనూ మెరుగైన ప్రాతినిధ్యం కల్పించాలని, కేవలం రాజకీయ ప్రాతినిధ్యం మాత్రమే సరిపోదని తెలిపారు. అధికార యంత్రాంగం, ప్రయివేటు రంగాల్లోనూ వీరు నాయకులుగా ఎదగాలని రాహుల్ పిలుపునిచ్చారు.

అలాగే, రాజ్యాంగం యొక్క పాకెట్ సైజు ఎడిషన్‌ను చూపిస్తూ 'ఇది అమలులో ఉన్నంత వరకు, దళితులు, సమాజంలోని ఇతర అణగారిన వర్గాలు మెరుగైన జీవితాన్ని ఆశించవచ్చు. బీజేపీ-ఆర్ఎస్ఎస్‌కు ఇది తెలుసు, కాబట్టి వారు రాజ్యాంగంపై దాడి చేస్తారు, కానీ బహిరంగంగా కాదు' అని రాహుల్ పేర్కొన్నారు.

'ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రాజ్యాంగం ముందు, అంబేద్కర్ విగ్రహం ముందు నమస్కరిస్తున్నట్టు మీరు చూడవచ్చు. అలాగే, కొంతమంది ఆర్ఎస్ఎస్ నాయకులు అంబేద్కర్‌కు భక్తి గీతాలు పాడటం కూడా చూడవచ్చు. అయితే వీరంతా అంబేద్కర్ ప్రతిపాదించిన ఆదర్శాలకు వ్యతిరేకంగా పనిచేస్తూ అలా నటిస్తారు' అని రాహుల్ విమర్శించారు.

మీడియా రంగంలో దళితుల సంఖ్య తక్కువగా ఉందని, అందుకే దళిత సమస్యలకు ప్రాముఖ్యత లభించదని తెలిపారు. అదేవిధంగా విద్యా రంగంలోనూ 'ప్రశ్నాపత్రాలు రూపొందించే స్థాయికి' దళితులు చేరుకోలేదని చెప్పారు. ఇక దేశంలోని బిలియనీర్లలో ఒక్క దళితుడు కూడా లేడని ప్రత్యేకంగా చెప్పనవసరంలేదని రాహుల్ అన్నారు. అణగారిన వర్గాలకు మెరుగైన భాగస్వామ్య దిశలో కుల గణన మొదటి అడుగు అని, కులగణనను కాంగ్రెస్ ముందుకు తీసుకెళుతుందని రాహుల్ ప్రకటించారు.

'మేక్ ఇన్ ఇండియా' విఫలమని మోడీ అంగీకరించాలి : రాహుల్ గాంధీ

మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం విఫలమని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అంగీకరించాలని కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు. ఇటీవల పార్లమెంట్‌లో ప్రధాని తన ప్రసంగంలో మేక్ ఇన్ ఇండియా గురించి ప్రస్తావించకపోవడాన్ని గుర్తు చేస్తూ ఈ రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'ప్రధానమంత్రి గారు, మీ ప్రసంగంలో మీరు 'మేక్ ఇన్ ఇండియా' గురించి కూడా ప్రస్తావించలేదు! 'మేక్ ఇన్ ఇండియా' మంచి కార్యక్రమం అయినప్పటికీ, అది విఫలమైందని మీరు అంగీకరించాలి. 2014లో జిడిపిలో 15.3 శాతంగా ఉన్న తయారీ రంగం ప్రస్తుతం 12.6 శాతానికి దిగజారింది.గత 60 సంవత్సరాలలో ఇది అత్యల్పం' అని పోస్ట్‌లో రాహుల్ తెలిపారు. దేశంలో యువతకు ఉద్యోగాలు చాలా అవసరమని, కానీ ఇటీవల కాలంలో ఏ ప్రభుత్వాలు (ఎన్డీఏ, యూపీఏ) కూడా ఈ సమస్యను తీర్చలేకపోయాయని రాహుల్ అంగీకరించారు. తయారీ రంగం వృద్ధికి ఎలక్ట్రిక్ మోటార్లు, బ్యాటరీలు, ఆప్టిక్స్, కృత్రిమ మేధస్సు వంటి నూతన సాంకేతికతలపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని రాహుల్ సూచించారు.

తయారీ రంగంలో చైనా మనకంటే 10 సంవత్సరాలు ముందుందని, మనకంటే బలమైన పారిశ్రామిక వ్యవస్థను కలిగిఉందని అన్నారు.



రోల్స్ రాయిస్ కొత్త కారు ఏ10.52 కోట్లు

న్యూఢిల్లీ : ప్రముఖ అత్యంత లగ్జరీ కార్ల తయారీ కంపెనీ రోల్స్-రాయిస్ తన ఘోస్ట్ సిరీస్2ను భారత మార్కెట్లోకి విడుదల చేసినట్లు తెలిసింది. బుధవారం ఆవిష్కరించిన ఈ వి12 లగ్జరీ సెడన్ కారు ఎక్స్ షోరూం ధరల శ్రేణిని రూ.8.95-10.52 కోట్లుగా నిర్ణయించింది. ఇది చెన్నై, న్యూఢిల్లీలో లభ్యం అవుతుందని ఆ కంపెనీ వెల్లడించింది.